పద్దెనిమిదవ జన్మదిన ప్రత్యేక సంచిక

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 18 సంచిక : 1 హైదరాబాద్ 222 జనవరి 2020 పేజీలు : 84 రు. 25

- 17 సంవత్సరాల ప్రయాణం - అభినందనలు
- పౌరసత్వ సవరణ చట్టం పూర్వాపరాలు
- నిర్భయ నుంచి దిశ దాకా - ఐదు వ్యాసాలు
- మూడు రాజధానుల ఆంధ్రప్రదేశ్
- సర్కెగూడ ఎన్‌కౌంటర్ వాస్తవాలు
- బకాయి ఎగవేతదారుల జాబితా
- సవాళ్లు మిగిల్చిన బ్రిటన్ ఎన్నికలు

17 సంవత్సరాలు
పూర్తి చేసుకొని
18వ సంవత్సరంలో
అడుగు పెడుతున్న
వీక్షణంకు
అభినందనలు
శుభాకాంక్షలు

చుక్కా రామయ్య

ముదునూరి భారతి

వకుళాభరణం రామకృష్ణ

జి. హరగోపాల్

కత్తి పద్మారావు

రంగనాయకమ్మ

కె. శివారెడ్డి

నందిని సిధారెడ్డి

కె. శ్రీనివాస్

కె. శ్రీనివాస్ రెడ్డి

ఎస్. వీరయ్య

కొండవీటి సత్యవతి

చాడ వెంకటరెడ్డి

తమ్మినేని వీరభద్రం

ఎం. కోదండరాం

కె. నాగేశ్వర్

కె.ఆర్. చౌదరి

దేవిప్రియ

కె. లక్ష్మినారాయణ

చల్లపల్లి స్వరూపరాణి

నాళేశ్వరం శంకరం

కాత్యాయనీ విద్మహే

వి.ఎస్. ప్రసాద్

రమా సుందరి

ఓల్గా

సజయ కాకర్ల

పద్మజా షా

కె.పి. సుబ్బారావు

ఇప్టూ ప్రసాద్

డేవిడ్

దుప్పల రవికుమార్

మహమూద్

అరవింద

పేజీ 17 - 26 ⇨

వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం

మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్స్‌లో వీక్షణం విడి(ప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	ఆబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్	కాచిగూడ, హైదరాబాద్	90004 13413
సహచర బుక్‌మార్క్	బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్	98483 48173
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్ హైదరాబాద్	9705055738
వెంకటేశ్వర బుక్‌స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్ హైదరాబాద్	040-66131071
ఫస్ట్ లక్కీ పాన్‌షాప్	విద్యానగర్ సిగ్నల్స్ హైదరాబాద్	9848672831
సుధాకర్ బుక్‌స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక హైదరాబాద్	9949337605
వెంకటేశ్వర బుక్‌స్టాల్	రామ్‌నగర్ గుండు హైదరాబాద్	9502964995
భవాని బుక్‌స్టాల్	శివం రోడ్ హైదరాబాద్	9849836996
శ్రీభవాని బుక్‌స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర) హైదరాబాద్	9640712555
ఓరియన్ బుక్‌స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర) హైదరాబాద్	7702535137
అరవింద్ బుక్ స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా) హైదరాబాద్	8977995537
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలయబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్పెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
శ్రీ లక్ష్మి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
మల్లిఖార్జున బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్మాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
రాజారెడ్డి బుక్‌స్టాల్	చందానగర్ బిఎచ్ఇఎల్	93466 07648
నవ తెలంగాణ బుక్ హౌస్	చిక్కడపల్లి, హైదరాబాద్	94900 99373
నవ తెలంగాణ బుక్ హౌస్	బాగ్‌లింగంపల్లి-సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్	94900 99378
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
అక్షర బుక్ వరల్డ్, ఎటిసి మార్కెటింగ్	న్యూ టౌన్, మహబూబ్‌నగర్	90102 10464
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
వినయ్ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల	94407 57503
పాండు బుక్‌స్టాల్, కూల్‌డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	79890 81728
రాజన్న బుక్ స్టాల్	హనుమకొండ చౌరస్తా	93955 07773
మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం	73825 60366
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
సురేష్ బుక్‌స్టాల్	శివాలయం వీధి, ప్రొద్దటూరు	81210 02112
క్రిసెంట్ న్యూస్ ఏజెన్సీ	కడప	98852 35846
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మైత్రీ బుక్‌హౌస్	మజీద్ వీధి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేశ్ బుక్‌సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేంద్ర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091
శ్రీదేవి సాయి కూల్‌డ్రింక్స్, కమ్యూనికేషన్స్	దేవి చౌక్, రాజమండ్రి	98489 84394
త్రినాథ్ పాన్ షాప్	మరిడి మహాలక్ష్మి టెంపుల్, రాజమండ్రి	99519 76044

పాఠకులకు, రచయితలకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు, న్యూస్ ఏజెంట్లకు

2020 నూతన సంవత్సర శుభాకాంక్షలు

222 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

జనవరి 2020
సంపుటి : 18
సంచిక : 1

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**

ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన కె. రవిచందర్, హైదరాబాద్ - రు. 10,000; శ్రేయోభిలాషులు, యుఎస్ఎ - రు. 14,000; నిరంజన్‌రెడ్డి వెన్నెల కళాశాల, భువనగిరి - రు. 10,000; సంతోషి శ్రీలయ రౌతు, ముంబై - రు. 2,000. మిత్రులకు కృతజ్ఞతలు - సం.

గత డిసెంబర్ సంచికలో గోవిందరాజు చక్రధర్ రాసిన వ్యాసం 'ఏ విలువలకీ ప్రస్థానం' చదివాను. విలువలకు తిలోదకాలు ఇస్తున్న ప్రస్తుత పత్రికా ప్రపంచం గురించి చాలా నిష్కర్షగా, ధైర్యంగా రాశారు. రెండు మూడు దశాబ్దాల కాలంగా 'ఫోర్త్ ఎస్టేట్' తన బాధ్యతను మరచిపోయి ఏదో ఒక వర్గానికి కొమ్ము కాస్తున్నారు అన్నది కాదనలేని నిజం. ఈ నేపథ్యంలో చక్రధర్ వ్యాసం ప్రత్యక్షర సత్యం. రాజకీయ వ్యవస్థ అది పాలక పక్షమైనా ప్రతిపక్షమైనా బాధ్యతాయుతంగా ప్రవర్తించేట్లు చేయటంలో పత్రికల, ఎలక్ట్రానిక్ మాధ్యమాల పాత్ర అతి ముఖ్యమైనది. దశాబ్దాల అనుభవం ఉన్న పాత్రికేయ ప్రముఖులు కూడా సంపాదకీయాల లోనూ, వార్తా విశ్లేషణల లోనూ ప్రదర్శిస్తున్న అవకాశవాద ధోరణిని వ్యక్తుల పేర్లతో సహా ఉదహరిస్తూ ఈ వ్యాసంలో చాలా నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా ఎండగట్టారు చక్రధర్. ఉద్యోగంలో అభివృద్ధి, జీవనోపాధి, ధనాదాయం ముఖ్యమే అయినా, ప్రభుత్వ పదవులకోసం ఏ ఎండకు ఆ గొడుగు పట్టే నైజం పత్రికారంగం వంటి బాధ్యతాయుత రంగాలలో వాంఛనీయం కాదు. ఈ విషయాలన్నీ బాగా తెలిసిన ఎందరో అనుభవజ్ఞులు, మేధావులు కూడా వినాయకుడి బొడ్లో వేలు పెట్టినట్లు గుటకలు మింగుతూ వూరుకుంటున్న తరుణంలో చక్రధర్ గారు పాత్రికేయుల బాధ్యతలను నిర్ద్వందంగా తెలియ జెప్పిన తీరు చాలా ప్రశంసనీయం. ఈ వ్యాసం ప్రచురించడం ద్వారా వీక్షణం పత్రిక కూడా తన ప్రత్యేకత నిలుపుకున్నదని అనిపించింది.

– డా. పి.వి. రామకుమార్
గుంటూరు

2019 డిసెంబర్ వీక్షణంలో గోవిందరాజు చక్రధర్ రాసిన 'ఏ విలువలకీ ప్రస్థానం?' వ్యాసం, పాలక పార్టీలకు బంట్లుగా తయారైన జర్నలిస్టుల మీద చూపిన ధర్మాగ్రహం. ఒక జర్నలిస్టు అయివుండి, మొహమాటం లేకుండా, ఖచ్చితత్వంతో, నిర్భయంగా, తగిన పోలికలతో రాయడం చాలా గొప్ప విషయం. వ్యక్తిగత సంబంధాల వల్ల గానీ, గతంలో తాము పొందిన సహాయల వల్ల గానీ, సందర్భం వచ్చినప్పుడు విమర్శించడానికి చాలా మంది జంకే ఈ రోజుల్లో, ఇలాంటి వ్యాసం ఉన్నతమైన విలువల కోసం ప్రయత్నించే అందరికీ ఎంతో ధైర్యాన్నీ, ప్రోత్సాహాన్నీ ఇస్తుంది.

ఒకప్పుడు న్యాయమైన ఉద్యమాలలో పాల్గొన్నవాళ్లూ, ప్రజల ప్రయోజనాలకు అనుకూలమైన రచనలు చేసిన వాళ్లూ, పదవుల కోసం పాలక పార్టీలకు బంట్లు కావడం గత కొన్నేళ్లుగా ఎక్కువవుతోంది. ఉదాహరణకి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమకాలంలో, ఫ్యూడల్ నిజాంను, కెసిఆర్ ప్రశంసించినప్పుడు, అతనితో తీవ్రంగా విభేదిస్తూ, "దొరా, నాతోటి గాదు!" అని అద్భుతంగా రాసిన వాళ్లు ఉన్నారు. ప్రజాస్వామిక తెలంగాణాకు కెసిఆర్ ప్రతినిధి కాదని ప్రకటించిన వాళ్లూ ఉన్నారు. కెసిఆర్ అధికారంలోకి రాగానే, అతని పంచన చేరడం ద్వారా, పదవులు సంపాదించారు. వాళ్లు రెండు నెలల పాటు ఆర్‌టిసి కార్మికులు సమ్మె చేస్తూ, నిర్బంధానికి గురి అవుతూ ఉంటే నోరు మెదప లేదు. అలాగే, ఇటీవల తెలంగాణాలో కొన్ని ప్రజా సంఘాల నాయకుల్నీ, కార్యకర్తల్నీ కెసిఆర్ ప్రభుత్వం అరెస్టులు చేసినప్పుడు కూడా ఖండించలేదు. వారి పదవుల్ని వదల లేదు. ఎంత పతనం? చక్రధర్ ప్రస్తావించిన ఆ 'ప్రముఖ' జర్నలిస్టులు కూడా ఈ కోవకే వస్తారు. చక్రధర్ అన్నట్టు, ఆ మేధావుల్లో, ఎవ్వరికీ ఆర్థిక సమస్యలు గానీ, పిల్లల బాధ్యతలు గానీ, డబ్బుకోసం ఇబ్బంది పడే దుస్థితి గానీ లేదు. (ఎంత ఇబ్బందులున్నా విలువల కోసం నిలబడాలనేది వేరే విషయం.) ఉద్యోగాలైతే తప్పదు. ఉదాహరణకి, దొంగ సారా తయారు చేయించే యజమాని దగ్గిర పని చేసే వ్యక్తి కార్మికుడే. శారీరక శ్రమల కార్మికుడు. అతని స్థాయికి అదే ఉద్యోగం దొరికింది. అలాగే, ఒక పెట్టుబడి దారుడు నడిపే పత్రికలో పని చేసే జర్నలిస్టులు కూడా శ్రామికులే. మేధా శ్రామికులు. అది ఒక జీవనోపాధి. అది కూడా దొరకని పరిస్థితిలో ఆ ఉద్యోగాల్లో ఉండడాన్ని సానుభూతితో అర్థం చేసుకోవచ్చు. సలహాదారులూ, ఛైర్మన్లూ అనే పదవులు అలాంటివి కావు. అలాంటి పదవుల్లో ఉన్నవాళ్లు తప్పనిసరిగా, ఆయా పాలక పార్టీలకు విధేయులుగా, ప్రజలకు ద్రోహం చేసే వారి బంట్లుగా ఉండాల్సి వస్తుంది.

గత జీవితంలో కొంతకాలమైనా అభ్యుదయం, విప్లవం అనే మాటలు వల్లించిన వాళ్లు, తర్వాత కాలంలో పూర్తిగా పాలక వర్గాల పంచన చేరితే, అమాయక జనాలలో ప్రమాదకరమైన భ్రమలకు కారకులవుతారు. ఇలాంటి పరిస్థితి గురించే మార్క్సు తన 'కాపిటల్' పుస్తకంలో ఇలా అంటాడు: "పాలక వర్గం, పాలిత వర్గపు మేధావుల్ని, ఎంత ఎక్కువగానైతే తనలో ఇముడ్చు కుంటుందో, అంత స్థిరం గానూ, అంత ప్రమాదకరం గానూ, దాని పాలన తయారవుతుంది." అయితే, చక్రధర్, గొప్ప సాహసంతో ఒక 'నిష్టుర సత్యం' అంటూ, పెంపుడు కుక్కల ఉదాహరణ ఇచ్చారు. ఉన్నత విలువల కోసం ప్రయత్నించే వారంతా చక్రధర్ గారి పక్షాన నిలవాలి.

– రంగనాయకమ్మ
హైదరాబాద్

వీక్షణం డిసెంబర్ 2019 సంచికలో గోవిందరాజు చక్రధర్ గారి వ్యాసం చూసి ఆశ్చర్యం కలిగింది. ఆ వ్యాసంలో రచయిత చర్చించిన విషయం చాలా అవసరమైనదే. ప్రజాజీవితంలో మేధావులుగా, రచయితలుగా, ప్రజా పక్షపాత వ్యాఖ్యాతలుగా పేరు తెచ్చుకున్నవారు ప్రభుత్వ పక్షంలోకి ఎందుకు పోతున్నారనేది తప్పకుండా ఆలోచించవలసిన అంశమే. ప్రత్యేకంగా ఈ వ్యాసంలో పేర్కొన్న ఇద్దరు వ్యక్తుల ప్రవర్తనను విమర్శించవలసిందే. కాని అసలు గోవిందరాజు చక్రధర్ అనే పేరు వీక్షణంలో కనబడడమే నా ఆశ్చర్యానికి కారణం. ఆయన ఇరవై ముప్పై సంవత్సరాలుగా జర్నలిస్టు వృత్తిలో ఉన్నవారే. సంఘ్ పరివార్ భావజాలానికి దగ్గరి వారని అందరికీ తెలుసు. సంఘ్ పరివార్ ఆధ్వర్యంలో నడిచిన జర్నలిస్టుల ట్రెయినింగ్ కాలేజికి ఆయన బాధ్యుడుగా కూడా పని చేశారని గుర్తు. మరి విషయం సరి అయినదే అయినా అది చెపుతున్న వారు ఎవరు, వారికి అది చెప్పే అర్హత, స్థానం ఉన్నాయా అని ఆలోచించనక్కర లేదా? అందులోనూ వీక్షణం వంటి పత్రిక అటువంటి విషయం ఆలోచించనక్కరలేదని అనుకుంటున్నదా?

– వి. వెంకటేశ్వర్లు
హైదరాబాద్

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

దేశానికిది సంఘ్ పరివార్‌ను ప్రతిఘటించే ఉత్సవ సందర్భం

వీక్షణం పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, హిందుత్వ ఫాసిజం కోరలు చాచి విస్తరిస్తున్న ఈ సమయంలో కాలండర్ మారిన సందర్భాలకూ శుభాకాంక్షలకూ ఔచిత్యం ఏమిటని అనిపించవచ్చు. కాని చార్లెస్ డికెన్స్ రెండు మహానగరాలు ప్రారంభంలో రాసినట్టు ఇది ఎంత విచారకరమైన, విషాదగ్రస్తమైన, నిరాశాజనకమైన వల్లకాటి అధ్వాన్న శకంగా కనబడుతున్నప్పటికీ, అదే సమయంలో ఇది ఒక ఉత్సాహభరితమైన, ఉత్తేజకరమైన, ఆశాసూచనలు వెల్లివిరుస్తున్న వైభవోజ్వల శకం కూడ. ప్రజావ్యతిరేక దుర్మార్గ శక్తుల దుందుడుకు వేగం ఎంత నిజమో, ప్రజా చైతన్య, సమీకరణ, ప్రతిఘటన సమరోత్సాహం కూడ అంతే నిజం. నిజంగానే గడిచిన ఐదు సంవత్సరాలు, మరీ ముఖ్యంగా గడిచిన సంవత్సరం ప్రపంచం మొత్తంగానూ, దేశంలోనూ, రాష్ట్రంలోనూ నిరాశాజనకమైన ప్రజావ్యతిరేక పరిణామాలెన్నో సంభవించాయి. అనేక దేశాలలో అభివృద్ధి నిరోధక శక్తులు అధికారానికి వచ్చాయి. అంతర్జాతీయంగా సామ్రాజ్యవాద శక్తులదే పైచేయి అయింది. నరేంద్ర మోడీ – అమిత్ షా ద్వయం మితిమీరిన ఆధిక్యతతో గద్దెనెక్కింది. అంతర్జాతీయంగానూ దేశీయంగానూ ఆర్థిక సంక్షోభం వడివడిగా పరుగెత్తుకొస్తున్నది. దేశంలోనూ, రాష్ట్రంలోనూ కనీస పౌర, ప్రజాస్వామిక హక్కుల మీద ఉక్కుపాదం అమలవుతున్నది. ఎటు చూస్తే అటు నిరాశ, అటు దుఃఖం. నిజమే. కాని, అదే సమయంలో అన్ని ఖండాలలోనూ అనేక దేశాలలో రాజధానీ నగరాలలో, కీలక స్థలాలలో లక్షలాదిగా ఉవ్వెత్తున లేచి నిలిచి అధికారాన్నీ అవ్యవస్థనూ ప్రశ్నిస్తున్న ప్రజా సమూహాలు, నాయకత్వం ఉన్నా లేకపోయినా, శాస్త్రీయ పథంలో అయినా కాకపోయినా వెల్లివిరుస్తున్న ధిక్కారం, చుట్టూ రాతి గోడలు కట్టి బంధించిన కొద్దీ ఎక్కడికక్కడ ఎప్పటికప్పుడు బండల మధ్య నుంచి తొంగిచూస్తున్న చిగుళ్ల స్వేచ్ఛాగీతాలు, అణచివేసిన కొద్దీ ఉక్కుపాదాలను పడదోస్తున్న చైతన్య సంకేతాలు, మహా విష సర్పాలను చుట్టుముడుతున్న చలిచీమల గుంపులు. ఆ నిరాశ ఎంత నిజమో, ఈ ఆశా అంతే నిజం.

ఇవ్వాళ్టికివాళ దేశం దృశ్యమే చూద్దాం. నిజమే, గత ఐదున్నర సంవత్సరాల్లో మోడీ–షాల రాజ్యం అప్రతిహతంగా సాగినట్టే కనిపించింది. విష విద్వేష రాజకీయాలు ప్రచారం చేసీ, ఆచరించీ, గుజరాత్ లో మూడు వేల మందిని ఊచకోత కోసీ కూడ అక్కడ మూడుసార్లు నెగ్గి, చివరికి దేశాధికారాన్నే ఒకసారి కాదు, రెండు సార్లు చేపట్టారు. మొదటి విడతలో పెద్దనోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను వంటి దుర్మార్గమైన విధానాలను దేశం మీద రుద్దారు. దేశ ప్రజలలో అత్యధిక సంఖ్యాకులైన పేద, మధ్యతరగతి వర్గాల మీద మాత్రమే కాక, చిన్న వ్యాపారుల మీద కూడ తీవ్రమైన ప్రభావం వేసిన ఈ తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా రావలసినంత నిరసన, ప్రతిఘటన రాలేదు. ఘర్ వాపసీ, లవ్ జిహాదీ, గోరక్షణ, భిన్నాభిప్రాయాల పట్ల, భిన్నత్వం పట్ల అసహనం హింసాత్మకంగా మారినా ప్రతిఘటన రాలేదు. తర్వాత ఎన్నికల అక్రమాలు సాగించి, మళ్లీ అధికారానికి వచ్చి ట్రిపుల్ తలాక్, అధికరణం 370 రద్దు, అయోధ్య తీర్పు వంటి ముస్లిం వ్యతిరేక చర్యలు ఒకటికి రెండు తీసుకున్నా ప్రతిఘటన విస్తరించలేదు. ఇరవయొకటో శతాబ్ది ఫాసిజం, బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం విస్తరణ నల్లేరు మీద బండి నడక లాగ సజావుగా సాగిపోతున్నదని అనిపించిన వాతావరణంలో పౌరసత్వ సవరణ బిల్లు వచ్చింది. సహజంగానే పార్లమెంటులో ఉన్న పశుబలం వల్ల చట్టమూ అయిపోయింది. అంతే. హఠాత్తుగా వాతావరణం మారిపోయింది. దేశం దేశమే అట్టడుగు నుంచి కదిలిపోయింది. 'కొన్నిసార్లు దశాబ్దాలలో ఏ మార్పులూ జరగవు, మరి కొన్ని సార్లు వారాల్లో దశాబ్దాలు జరిగిపోతాయి' అని లెనిన్ అన్నట్టు రెండువారాల్లో దేశం అంతకు ముందరి దేశంలా లేదు. పౌరసత్వ సవరణ చట్టం పట్ల, నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ పట్ల ఉన్న వ్యతిరేకత ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క విధంగా ఉండవచ్చు. అస్సాంలో, ఈశాన్య రాష్ట్రాల్లో, బెంగాల్‌లో ఉన్న వ్యతిరేకతకు ఒక ప్రాధాన్యత ఉండవచ్చు, ఇతర రాష్ట్రాల, సమూహాల దృష్టిలో దాని ప్రాధాన్యత మారవచ్చు, ఉవ్వెత్తున ఆందోళనకు దిగుతున్న విద్యార్థులు దాన్ని మరొకలా చూస్తుండవచ్చు. విభిన్న రాజకీయ పక్షాలు దాన్ని విభిన్నంగా చూస్తుండవచ్చు. కాని ఇది ఉద్యమ సందర్భం అనీ, సంఘ్ పరివార్ దౌష్ట్యాన్ని ప్రతిఘటించే సందర్భం అనీ దేశమంతా ఉమ్మడిగా, దృఢంగా అనుకుంటున్నదనేది వాస్తవం. దేశవ్యాప్తంగా అన్ని సమూహాల ప్రజలకూ ప్రభుత్వం మీద, పాలక పక్షం మీద, పాలక వర్గాల మీద ఉన్న అసంతృప్తి స్థాయీ, తీవ్రతా వేరు వేరు కావచ్చు. కాని ఆ అసంతృప్తిని వ్యక్తీకరించే అవకాశం ఒకటి వచ్చిందని వారందరూ గుర్తించారనేది వాస్తవం.

ఎంత విస్తృత ప్రజా సంచలనంలోనైనా ఏకసూత్రత ఉండదు, ఉండాలని ఆశించడమూ సరికాదు. వైవిధ్యభరితమైన అసంతృప్తులే ఏదో ఒక కనీస ఉమ్మడి కార్యక్రమ పునాది పైన ఏకమవుతాయి. ఆ భిన్న ప్రయోజనాల ఐక్యతనూ వైవిధ్యాన్నీ గుర్తించడమూ, వాటితో సక్రమంగా వ్యవహరించడమూ, ప్రత్యర్థి పక్షాలకు వ్యతిరేకంగా భిన్న సమూహాలనూ ప్రయోజనాలనూ సంఘటితం చేయడమూ ఆయా కాలాల చరిత్ర నిర్దేశించిన అవసరంగా ఉంటుంది. ఉమ్మడి ప్రజాసమూహాల నాయకత్వాలు ఆ పనిని నిర్వహించడంలో ఎంత సమ్యగ్ దృక్పథంతో వ్యవహరిస్తాయనేదే, తమ ఒంటెత్తు పోకడలను, సంకుచిత ధోరణులను ఎంతగా పక్కన పెడతాయనేదే ఆయా నాయకత్వాల పరిణతికి చిహ్నంగా ఉంటుంది.

ఇవాళ్టి దేశ వ్యాపిత ఆందోళనలు సాంప్రదాయిక పార్లమెంటరీ రాజకీయ పక్షాల అవగాహనాలోపాలను, ఆచరణ సంకోచాన్ని బహిర్గతం చేస్తున్నాయి. విద్యార్థి, యువజన, స్వచ్ఛంద సంస్థల, ప్రజా సంఘాల, మధ్యతరగతి విద్యావంతుల నాయకత్వమే ఇప్పటికి ఉద్యమాన్ని నడుపుతున్నది. ప్రజా అసంతృప్తికి మూలకారణమైన సంఘ్ పరివార్ దుర్మార్గాల పట్ల అవగాహన పెంచడం, సంఘ్ పరివార్ అబద్ధాల, విద్వేషాల రాజకీయాల అసలు రంగు బైట పెట్టి, వారిని ఒంటరి చేయడం ఈ ఉద్యమ లక్ష్యాలుగా మారవలసి ఉంది. ఉద్యమానికి మరింత ఎక్కువ ప్రజా స్వభావం, సమగ్ర, శాస్త్రీయ దృక్పథ మార్గదర్శకత్వం అందవలసి ఉంది. అవి జరిగినప్పుడే ఈ ఉద్యమం నడుమ తడబడి కదలి ముడుగక ముందుకు సాగగలుగుతుంది. ప్రజా రాజకీయాల లక్ష్యం దిశగా ముందడుగు వేయగలుగుతుంది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

'ఔనంటే కాదనిలే, కాదంటే ఔననిలే' దొరతనం

దొరతనం ఎంత తెలివైనదంటె దాని నోట్లె నుంచి ఔనౌను అని ఇనబడతన్నదంటె దాని కడుపుల కాదు కాదు అని కీకలు బెడుతున్నదన్నమాట. వందల ఏండ్ల నుంచి భూములు జాగలు జాయెదాదులు సంపాయించిన్రంటె తరాలు తరాలు కూసోని తిన్నా కరగని ఆస్తులు కూడబెట్టిన్రంటే ఉట్టి మాటలా మరి? నిజంగ తెలివి లేకపోయిన, ఆ దిక్కు దెశ లేని పైస తోని, తెలివున్నోన్ని కొనుక్కుంటరు. వాని తెలివి గుత్తకు దీస్కుంటరు. వేమన్న జెప్పలె, పసిడి గల్గువాని బానిస కొడుకులు అని. గట్ల. ఈ నెల్ల దొరవారు జేసిన రెండు తెలివిగల్ల పనులు జెప్త జూడు. అబ్బ దొర అవ్వల్ దర్జ పని జేసిందుర, అని నువ్వే అంటవు. ఒకటి, గా పిల్లను చెరిచి సంపిన పోరగాండ్లను పోలీసులతోటి సంపి పారేయించుడు. రెండోది, పువ్వు గుర్తోళ్లతోని ఆడొక్క తీర్గ ఈడొక్క తీర్గ చెంగడ బింగడ ఎగురుడు. ఎటుబోయి ఎటొచ్చినా ఎవ్వడెట్ల బోయినా దొరకే ఫాయిద దక్కాలె. ఎట్లున్నది జూడు కత. మొదాలు పాపం ఆ పిల్లను ఎవరు చెరిచి జంపిండ్రో గని పిడాత జంపిరా? మారె, కాలం పురాగ జెడిపోయింది, గట్ల రామసక్కని పిల్లను పొట్టన పెట్టుకునిరే అని ఆ నలుగురు పోరగాండ్లను అందరు తిట్టిరి. నిజంగ ఆ పాడు పని జేసింది ఆ పోరలో కాదో ఎవరు జూడొచ్చిండ్రు గని, పోలీసులు వాండ్లే వాండ్లే అంటె మనం గుడ వాండ్లే వాండ్లే అంటిమి. కని ఆ పిల్ల అవ్వ అయ్య ఆ నాత్రి ఎంత బతిలాడినా పోలీసులు రాలేదని, ఆ తల్లిదండ్రులే పోలీసు స్టేషను కు బోతె తప్పుడు మాటలు అన్నరని ఊరు కోడై కూసె. జనం పనిల పనిగ పోలీసులను గుడ మా చెడ్డ తిట్లు తిట్టిరి. దేశం దేశమంత గత్తరయిపాయె. మాట్లాడనోడు లేకపాయె. కని దొరవారు మాత్రం బెల్లం గడ్డ నోట్లె బెట్టుకున్నట్టు ఊ అనకపోయిరి, ఆ అనకపోయిరి. నాలుగు రోజులాగి, పోలీసులు ఆ పోరగాండ్లను దీస్కపోయి పిడాత జంపిరి. ఇది దొరవారి ఆలోచనే అని ఆయినె దగ్గరి తానా తందానా అనెటోళ్లు అనిరి. ఆయినె నోరిప్పకుండ ఉన్నడంటే పెద్ద ఇకుమతు జేస్తాండని తెలుసుకోవాలె అని కిందబడ్డా మీదనే అనిరి. ఔలే, దొరల రాజ్యంల కచ్చీర్లు అదాలతులు గవాయిలు రుజువులు ఏమి అక్కెర లేదు గద, కంటికి కన్ను పంటికి పన్ను అంతేగద. అదట్ల బోనీ గని, గదేందో తురుకోల్లందరిని ఎల్లగొట్టుటానికి ఢిల్లిల ఏదో ఇకుమతు జేస్తాండ్రట గద. గాడనేమో దొర అర్గీజు గుదరదు అని వోటు గుద్దిండట గద. తన వోటు లేకపోయినా పువ్వు గుర్తోల్ల ఆట నెగ్గుతదని తెలుసు గనుక ఆ ఆట ఆడిండని, లేకపోతే అటే వోటు గుద్దెటోడని మావోడంటాండు. సరె పోనీ ఆడ ఢిల్లిల గాయినె ఏమన్నడో పట్నంల గదే అనుటానికి జులూస్ దీస్తం అంటె పోలీసుల బెట్టి కొట్టిచ్చిండట గద, పట్టుకపోయి టేషన్ల బెట్టిపిచ్చిండట గద. అంటె దొర అటున్నట్టా, ఇటున్నట్టా? అరె ఏందిరా ఇది అని సోంచాయిస్తాంటెనె, దొర దాని మీద నేనే మీటింగం బెడ్త, పువ్వు గుర్తోల్లను నేనే తిడ్త గని, ఇంకొగడు తిట్టొద్దు అంటాండట గద. ఏందో అంత వడ్లు పెరుగు గలిపినట్టున్నది. పెరుగన్నం అనుకోని తినలేం. వడ్లు దీసేస్తె పెరుగు పనికి రాదు. రెంటికి రెండు ఖరాబు. దొర యవ్వారం గట్లనే ఉన్నది. పిల్లను చెరిచి జంపితె మాట్లాడడు. అరె, మాట్లాడ్తలేదురో అనుకుంటాంటె ఎవ్వడ్నో ఒకడ్ని పట్టుకొచ్చి చంపి పారేసి కత ఒడిసిపోయిందంటడు. పువ్వు గుర్తోడు అన్నాలం జేత్తాండురో అంటె ఔ నిచ్చుమే నేను గుడ ఖిలాఫ్ జేస్తాన అంటడు. మేం గుడ ఖిలాఫ్ జేస్తం నీ బాంచెన్ అంటె, చల్ నువ్వెంత నీ బిషాదెంత, పోలీసోల్లతోటి కొట్టిపిస్త, టేషన్ల నూకిపిస్త అంటడు. ఇంతకు దొర మన్సుల ఏమున్నదంటవ్? వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

అసలు సమస్యలను పక్కకు తోస్తున్న రాజధాని రచ్చ


ప్రజా పాలనా వ్యవహారాలను బహిరంగంగా చర్చించాలనీ, ప్రజా సమస్యల పరిష్కారాన్ని చర్చల ద్వారా మాత్రమే అన్వేషించాలనీ వ్యక్తీకరించే ప్రజాస్వామిక ఆకాంక్షలను పక్కదారి పట్టించడానికి పాలకులు కొత్త కొత్త వ్యూహాలు రచిస్తున్నారు. అసలు సమస్యలను నానబెట్టి, వాటి మీద అసలు చర్చకు అవకాశం ఇవ్వకపోవడం, ఆ స్థానంలో తక్కువ స్థాయి సమస్యలనో, అసలు లేని సమస్యలనో ముందుకు తెచ్చి వాటి మీద రచ్చకు అవకాశం ఇవ్వడం, తద్వారా ప్రజలను వేధిస్తున్న నిత్యజీవిత సమస్యల పైనుంచి దృష్టి మళ్లించడం పాలకులు ఒక కళగానే అభివృద్ధి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో అటువంటి తాజా రచ్చ మూడు రాజధానులు అనే పేరుతో ప్రారంభమయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన, పునర్వ్యవస్థీకరణ నాటి నుంచీ సాగుతున్న ఈ సమస్యలో ఆరు సంవత్సరాలకు పైగా పాలకులు చేయవలసిన పనులు చేయలేదు, ప్రజలను విశ్వాసంలోకి తీసుకుని చర్చించ లేదు, ప్రాంతీయ, కుల, వ్యాపార ప్రయోజనాలను రెచ్చగొడుతూ అసలు సమస్యను పక్కదారి పట్టించారు. రాష్ట్ర విభజన ప్రతిపాదనతో పాటే విభక్త ఆంధ్రప్రదేశ్‌కు ఒక కొత్త రాజధాని అవసరమనే ఆలోచనతోనే శివరామకృష్ణన్ కమిటీ ఏర్పాటైంది. కొంతలో కొంత మెరుగైన పరిశోధన, అన్వేషణ జరిపిన ఆ కమిటీ ఎనిమిది వేరువేరు స్థలాల అనుకూల, ప్రతికూల అంశాలను నమోదు చేసి నిర్ణయాన్ని ప్రభుత్వానికి వదిలింది. రాజధానిగా విజయవాడ సరైన స్థలం కాదని కూడ అభిప్రాయపడింది. అయినా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఒక సామాజిక వర్గపు రియల్ ఎస్టేట్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విజయవాడ-గుంటూరుల మధ్య అమరావతిని రాజధానిగా నిర్ధారించి, వేలాది ఎకరాల పంట భూములను రియల్ ఎస్టేట్‌గా మార్చింది. సింగపూర్, జపాన్ అని ప్రగల్భాలు పలికి చివరికి అమరావతిని పాలనా కేంద్రంగా గాని, అన్ని వసతులు గల పట్టణంగా గాని మార్చకుండానే అధికారం నుంచి దిగిపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తన ఆశ్రితుల రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం మాత్రమే కాదు, పాత రియల్ ఎస్టేట్ ప్రయోజనాలు పొందిన సామాజికవర్గాన్ని దెబ్బతీయడానికి కొత్త ప్రతిపాదనలు ముందుకు తెచ్చింది. ఆ క్రమంలో జిఎన్ రావు కమిటీని నియమించి, అధికార రాజధానిగా విశాఖపట్నం, న్యాయ రాజధానిగా కర్నూలు, చట్టసభ రాజధానిగా విజయవాడ అనే మూడు రాజధానుల ప్రతిపాదన చేసింది. ఇది వికేంద్రీకరణ అని కూడ సమర్థించు కుంటున్నది. తప్పనిసరిగా పాలనా వికేంద్రీకరణ అనేది ఆహ్వానించదగిన నిర్ణయమే. పైగా ఆంధ్రప్రదేశ్ విషయంలో అది 1937నాటి శ్రీబాగ్ ఒడంబడిక స్ఫూర్తికి అనుగుణమే. కాని అది సదాలోచనల ఫలితమా దురాలోచనల ఫలితమా, ప్రజా ప్రయోజనాలకు ఉపయోగకరమా కాదా ఆలోచించవలసి ఉంది. ఈ ప్రతిపాదన మీద రచ్చ మొదలు కాగానే, ప్రజల మధ్య చర్చకు అవకాశం ఇవ్వకుండా ఇప్పుడు బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ సలహా తీసుకోవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇంతకూ రాజధాని ప్రజల అవసరాల కోసమా లేక పాలకుల, పెట్టుబడిదారుల, రియల్ ఎస్టేట్ వ్యాపారుల, బహుళజాతి సంస్థల అవసరం కోసమా అని ప్రజలు నిలదీయవలసి ఉంది. వీ


బ్రిటన్ ఎన్నికల్లో జాన్సన్‌కు కలిసొచ్చిన బ్రెగ్జిట్

ఎ. నర్సింహా రెడ్డి


బూర్జువా పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లయిన బ్రిటన్ పార్లమెంట్‌కు నాలుగేళ్ల వ్యవధిలో మూడవసారి 2019 డిసెంబర్ 12న మధ్యంతర ఎన్నికలు జరిగాయి. ఒకనాడు ఇయు ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన బ్రిటన్ ఇవాళ ఇయు నుంచి నిష్క్రమణ కోసం ఉవ్విళ్లూరుతోంది. తాము అధికారంలోకి వస్తే జనవరి 31లోగా ఎట్టి పరిస్థితుల్లో బ్రెగ్జిట్ ప్రక్రియను పూర్తి చేస్తామని కన్జర్వేటివ్ పార్టీ ప్రకటించింది. పార్లమెంట్‌లోని 650 స్థానాల్లో ప్రధాని బోరిస్ జాన్సన్ నాయకత్వంలోని కన్సర్వేటివ్ పార్టీ 365 స్థానాలు సాధించగా, దాని ప్రధాన ప్రత్యర్థి కార్బిన్ సారథ్యంలోని లేబర్ పార్టీ కేవలం 203 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దేశం ఇయులోనే ఉండాలని బలంగా వాదించిన లిబరల్ డెమోక్రాట్లకు కేవలం 11 స్థానాలు మాత్రమే వచ్చాయి. స్కాటిష్ నేషనల్ పార్టీకి 48 స్థానాలు లభించాయి. తీవ్ర మితవాద బ్రెగ్జిట్ పార్టీ ఈ ఎన్నికల్లో సున్నా చుట్టింది. స్వేచ్ఛా వాణిజ్యాన్ని, కార్పొరేట్ల దోపిడీని తూర్పారబట్టిన లేబర్ పార్టీ వరుస నాలుగు ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ, ఇంతగా ఎన్నడూ చతికిలబడలేదు. జెరిమీ కోర్బిన్ వాదనలకు జేజేలు కొట్టిన ప్రజలు ఓటు విషయానికి వచ్చేసరికి ఇలా వ్యవహరించడం ఊహించని పరిణామమే. ట్రంప్, మోడీ వలె బోరిస్ జాన్సన్ పచ్చి మితవాది, జాత్యహంకారి. ఆయన తరచూ మహిళలను కించపరిచే వ్యాఖ్యానాలు చేయడం, ఇస్లాంను పెనుభూతంగా చూపడం, జాత్యహంకార వ్యాఖ్యలు చేయడం పరిపాటే. ప్రవాస భారతీయ ఓటర్లను ఆకట్టుకునేందుకు కన్జర్వేటివ్ పార్టీ అన్ని ప్రయత్నాలు చేసింది.

స్కాట్లాండ్ స్వాతంత్ర్య సాధన డిమాండ్‌కు అనుకూలమైన స్కాటిష్ నేషనల్ పార్టీ స్కాట్లాండ్‌లోని మొత్తం 59 సీట్లలో 48 కైవసం చేసుకున్నది. దీనితో స్కాట్లాండ్ స్వాతంత్ర్య డిమాండ్ మళ్లీ ముందుకొచ్చే అవకాశం కనిపిస్తున్నది. అలాగే ఉత్తర ఐర్లాండ్‌లో ఐర్లాండ్ ఐక్యతను కోరుకుంటున్న వర్గానికి అదనంగా 3 స్థానాలు లభించాయి. బ్రిటన్‌లో భాగంగా కొనసాగాలని కోరుకునే సభ్యుల సంఖ్య 10 నుంచి 8కి పడిపోయింది. దీంతో ఐరిష్ రిపబ్లిక్‌లో కలువాలనే ఉత్తర ఐర్లాండ్ వాదన బలపడవచ్చు. ఈ పరిణామాలు ముందుముందు జాన్సన్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే అవకాశమున్నది. జాన్సన్ బ్రిటన్‌ను ఇయు నుంచి బయటకు నడిపించినా దేశ సమైక్యతను కాపాడటం కష్టమే. ఇవాళ బ్రిటన్ ఆర్థికవ్యవస్థ అధ్వానంగా ఉంది. ఆర్థిక వ్యవస్థ దుస్థితికి 'బ్రెగ్జిట్ సైతం ఓ కారణం. దేశ వాణిజ్యంలో సగభాగం ఐరోపా సమాఖ్య దేశాలతోనే జరుగుతోంది. మెజారిటీ సాధించిన జాన్సన్ పరిపూర్తి చేయాల్సిన కర్తవ్యాలు సాధారణమైనవి కావు. సాధ్యమైనంత తక్కువ నష్టంతో ఇయు నుంచి బయటికి రావడం, సభ్య దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలు కుదుర్చుకోవడం రెండూ సంక్లిష్టమైనవే. ఇప్పటికిప్పుడు ఇయు నుంచి వైదొలగడం వల్ల దేశానికి కొన్ని ఇబ్బందులు తప్పవు. అంతర్జాతీయంగా బ్రిటన్ ఇప్పుడు పూర్తిగా ప్రాధాన్యం కోల్పోయింది. అమెరికాకు తోక దేశంగానే మిగిలిపోయింది. అంతర్జాతీయ వ్యవహారాల్లో చాలావరకు అగ్రరాజ్యానికి వంతపాడడం తప్ప దానికంటూ ప్రత్యేక విధానం లేదు. జాన్సన్ బహుముఖ సవాళ్లను ఎదుర్కొవాల్సి ఉంటుంది. వీ







❖ **దశరథరాజనందన చరిత్ర** – శతఘంటావధాన మరింగంటి సింగరాచార్య ప్రణీతం – పరిష్కర్త శ్రీరంగాచార్య – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 278 పేజీలు, 1/8 డెమీ, రు. 125



❖ **స్వీయ కవితానుజీవనమ్** – శిరుశినహళ్ కృష్ణమాచార్య శతావధాని – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 112 పేజీలు, 1/8 డెమీ, రు. 45




❖ **మెదక్ జిల్లా సాహిత్య చరిత్ర** – డా. బెల్లంకొండ సంపత్‌కుమార్ – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 88 పేజీలు, 1/8 డెమీ, రు. 40




❖ **మహామంత్రి మాదన్న** – కె.వి. భూపాలరావు – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 302 పేజీలు, 1/8 డెమీ, రు. 140


పై నాలుగు ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ, కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్ – 500004, ఫోన్ : 040–29703142



❖ **గతితార్కిక భౌతికవాద కోణం నుంచి పదార్థము – ప్రకృతి – పరమాత్మ** – (పదార్థమే యదార్థము) – పెండ్యాల లోకనాథం – 170 పేజీలు, 1/8 డెమీ, రు. 140, ప్రతులకు: పెండ్యాల సత్యనారాయణ, డోర్ నెం. 126–5–619, శివ గ్రీన్ వ్యాలీ రోడ్, అమరావతి రోడ్, గోరంట్ల, గుంటూరు–522034, ఫోన్ : 9866442034




❖ **తావో తె చింగ్** – లావో త్సు – అనువాదం దీవి సుబ్బారావు – 102 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్ – 500027, ఫోన్ : 9247471361




❖ **ఎర్రమట్టి గాజులు** – కవిత్వం – రేణుక అయోలా – బోధి ఫౌండేషన్ ప్రచురణ – 116 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: బోధి ఫౌండేషన్, కొత్తపేట్, హైదరాబాద్ – 500035, ఫోన్ : 9848254745, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో




❖ **మూల ఆదివాసుల జన్మహక్కు స్వయం పాలన** – ఆనంద్, సిపిఐ (ఎంఎల్) జనశక్తి – జాబాలి ప్రచురణలు – 68 పేజీలు, 1/8 డెమీ, రు.50, ప్రతులకు: జాబాలి ప్రచురణలు, ఇ.నెం. 16–9–569/10/1, ఓల్డ్ మలక్‌పేట, హైదరాబాద్ – 500036, ఫోన్ : 9948872190




❖ **పర్యావరణ కాలుష్యం ప్రమాదాలు** – డా. ఎస్. జనార్ధనాచారి – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ – 48 పేజీలు, 1/8 డెమీ, రు. 40



❖ **విశిష్ట మహిళామణులు** – టి. శాంతాభాస్కర్ – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ – 104 పేజీలు, 1/8 డెమీ, రు. 85




❖ **విచిత్ర ప్రకృతి** – వి.ఆర్. శాస్త్రి – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ– 116 పేజీలు, 1/8 డెమీ, రు. 90




❖ **దళితవాద వివాదాలు** – సంపాదకుడు డా. ఎస్.వి. సత్యనారాయణ – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ– 312 పేజీలు, 1/8 డెమీ, రు. 260

పై నాలుగు ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జిఎస్ఐ పోస్ట్, హైదరాబాద్ – 500068, ఫోన్: 040 – 29884453



❖ **దుర్గాపురం రోడ్** – దేశరాజు కవిత్వం – చాయ రిసోర్స్ సెంటర్ ప్రచురణ– 176 పేజీలు, 1/8 డెమీ, రు. 135, ప్రతులకు: అనల్ప బుక్ కంపెనీ, సికిందరాబాద్ – 500094, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో



❖ **మహాత్మాగాంధీ ముస్లిం సహచరులు – అనుచరులు** – సయ్యద్ నశీర్ అహమ్మద్ – ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్ ప్రచురణ – 32 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు: ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, ఫ్లాట్ నెం. సి–2, శ్రీరామ్ ఆర్కేడ్, అమరావతి రోడ్, ఉండవల్లి, గుంటూరు – 522501, ఫోన్ : 9440241727



❖ **పాలపిట్ట వినూత్న కథ** – కథల సంచిక – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 352 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, ఇ.నెం. 16–11–20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీమ్‌నగర్, మలక్‌పేట, హైదరాబాద్ – 500036, ఫోన్ : 040 – 27678430



❖ **సృష్టికేతనం** – కవిత్వం – శైలజామిత్ర – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 56 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: శైలజామిత్ర, ఫ్లాట్ నెం. 98, సౌజన్య అవెన్యూ, ఎస్.బి.ఐ. కాలనీ, గాంధీనగర్, హైదరాబాద్ – 500080

పద్దెనిమిది శిశిరాల ప్రజానుకూల వీక్షణం

మీ చేతుల్లో ఉన్న ఈ రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక వీక్షణం ఈ సంచికతో పదిహేడు సంవత్సరాలు పూర్తి చేసుకుని పద్దెనిమిదిలో అడుగుపెడుతున్నది. సాధారణ లోకజ్ఞానపు అర్థంలో చెప్పాలంటే మైనారిటీ తీరి మేజర్ అవుతున్నది. కౌమారం దాటి యవ్వనంలో ప్రవేశిస్తున్నది. పదిహేడు సంవత్సరాలు, ఏ నెల ఆగిపోతుందో అని సాగిన పదిహేడు శిశిరాలు. ఎటు నుంచి ఏ ఆటంకం వస్తుందో అని గడిచిన పదిహేడు గ్రీష్మాలు. ఏమైనా సరే ఆగిపోగూడదని ఎప్పటికప్పుడు చిగురించిన పదిహేడు వసంతాలు. ఈ ప్రజాగళం నిరంతరం కావాలని ఎప్పటికప్పుడు ఆదుకున్న జనస్నేహ హస్తాల పదిహేడు హర్ష వర్షాలు. అధిగమించి వచ్చాం పదిహేడు సంవత్సరాలు. 221 సంచికలు, ఐదు వందల పైన సంపాదకీయాలు. దాదాపు నాలుగు వందల అనువాద వ్యాసాలతో సహా నాలుగు వేల పైగా రచనలు. ఇదంతా పెద్ద విషయమేమీ కాకపోవచ్చు. ప్రజల సమాచార విశ్లేషణా అవసరాల మహా సముద్ర దాహార్తితో పోల్చినప్పుడు ఇక్కడ అందించగలిగినది రెండు వందల ఇరవై ఒక్క చుక్కల చలివేందిర మాత్రమే. ఇది ఇంకా అసంపూర్ణమైన, అసమగ్రమైన చిన్న ప్రయత్నం మాత్రమే. చిన్న ప్రయోగం మాత్రమే. ప్రజా ప్రత్యామ్నాయ సమాచార, విశ్లేషణా వేదికల సుదీర్ఘ చరిత్రలో చూసినప్పుడు ఇది ఇంకా నవజాత శిశువే. దీనిదింకా తప్పటడుగుల నడకే. కాని ఒక ఆలోచనగా కలగా మాత్రమే ఉన్నప్పటి నుంచీ, పుట్టి పెరుగుతూ కౌమారం దాటి యవ్వనంలో ప్రవేశిస్తున్న దాకా ఈ శిశువు అభివృద్ధిని అడుగడుగూ అణువణువూ ప్రతి నెలా ప్రతి సంవత్సరమూ చూసిన మాకు ఈ ప్రయత్నమే, ఇంతవరకు సాధించిన విజయమే, ఈ మాత్రం సాఫల్యమే గొప్ప ఆనందదాయకం. గర్వకారణం. ఈ సంతోషాన్ని మీతో పంచుకోవాలి. మేం సాగించిన రెండువందల నాలుగు నెలల, రెండు వందల ఇరవై ఒక్క సంచికల ప్రయాణం, ఈ మార్గంలో మేం ఎదుర్కొన్న ఆటంకాలు, పడిన ఆరాటాలు, పొందిన ఆగ్రహాలు, అనుభవించిన ఆనందాలు, నిరుత్సాహాలు, ఆదరణ, అసంతృప్తి, నిరాశ, సాధించిన స్వల్ప విజయాలు, పొందిన అపజయాలు, సాధించలేకపోయిన హృదయానికి దగ్గరి విషయాలు అన్నీ మీతో చెప్పుకోవాలి.

నూతన ఆర్థిక విధానాలు మొదలయ్యాక, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ లో ప్రపంచబ్యాంకు పాలన మొదలయ్యాక వాటి గురించి మాకు తోచిన పద్ధతిలో తెలుగులో అనేక దిన, వార, మాస పత్రికల్లో వ్యాఖ్యలూ వ్యాసాలూ రాస్తున్న నలుగురైదుగురి మనసుల్లో మెదిలిన తొలి ఆలోచన ఈ పత్రికకు బీజం. ఆ పత్రికల్లో వస్తున్నట్టు అనేక విషయాల్లో ఒకటిగా కాక, పూర్తిగా రాజకీయార్థిక విశ్లేషణకు మాత్రమే అంకితమైన పత్రిక ఉంటే బాగుంటుందని మాకు 2000–2001ల్లో అనిపించింది. ఆ ఆలోచనకు ప్రధాన భూమిక వి. హనుమంత రావు గారిది. అప్పటికి నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజాపక్ష పాత్రికేయుడిగా, మేధావిగా, ఆర్థిక విషయాల మీద ప్రత్యేకించి కృషి చేసిన ఆయన అంతకు ముందే ఆంధ్రప్రదేశ్ ఇయర్ బుక్, డేటా ఆంధ్రప్రదేశ్ పక్షపత్రిక వంటి ప్రయత్నాలు చేసి ఉన్నారు. నూతన ఆర్థిక విధానాల వాతావరణంలో ఇటువంటి పత్రిక అవసరం మరింత పెరుగుతున్నదని, ఒక చారిత్రక అవసరంగా ఈ పత్రిక రావాలని, ఇది పక్షపత్రికగా ఉండాలని ఆయన ఆశించారు. ఈ పత్రిక ప్రధాన బాధ్యత నేను తీసుకోవాలని ఆయన కోరారు. అప్పటికి ఎకనమిక్ టైమ్స్ ఉద్యోగం పోయి, పాక్షికంగా రెండు మూడు వెబ్ సైట్లకు పనిచేస్తున్న నేను అందుకు ఒప్పుకున్నాను. అటు ప్రధాన స్రవంతి పత్రికలలో పనిచేసిన అనుభవం, ఇటు ప్రత్యామ్నాయ పత్రికలతో సన్నిహిత సంబంధం వల్ల నేను తెలుగులో ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ లాగ, ఇంకా చెప్పాలంటే, అంతకన్న మెరుగ్గా ప్రజానుకూల, ప్రజాపక్ష దృక్పథంతో రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదిక ఒకటి రావాలని ఆలోచిస్తున్నాను. అలా హనుమంతరావుగారి ఆలోచనలు, నా ఆలోచనలు కలగలిసి ఈ పత్రికకు ఒక రూపం వచ్చింది. పదిహేనేళ్ల ముందు నేను విజయవాడలో మిత్రులతో కలిసి నడపడానికి ప్రయత్నించి, రెండు సంచికల కన్న ఎక్కువ తేలేకపోయిన సమీక్ష పేరుతోనే ఇది వస్తే బాగుంటుందని నేననుకున్నాను. రిజిస్ట్రేషన్ పరిమితుల దృష్ట్యా ముందు ప్రజాపక్ష చేర్చాం. నమూనా సంచిక నుంచి 2003 సెప్టెంబర్ 15 సంచిక వరకూ, అంటే 'వీక్షణం' పేరుకు రిజిస్ట్రేషన్ వచ్చేవరకూ ఈ పత్రిక 'ప్రజాపక్ష సమీక్ష' పేరుతోనే వచ్చింది.

హనుమంతరావు గారికి ఇష్టమైన 'సమతా పబ్లికేషన్స్' ప్రచురణగా, 'ఇది పాత్రికేయుల పత్రిక' అనే ఉపశీర్షికతో నమూనా సంచిక 'ప్రజాపక్ష సమీక్ష' 2002 సెప్టెంబర్‌లో వెలువడింది. ఆ సంచిక గౌరవ సంపాదకులుగా ఎబికె ప్రసాద్, సంపాదకులుగా వి. హనుమంతరావు, విద్యాభూషణ్, ఎన్ వేణుగోపాల్, డి పాపారావు పేర్లతో వెలువడింది. తర్వాత కొన్ని రోజులకే నాకు న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఉద్యోగం రావడంతో పత్రికకు నేను బైటి నుంచి సహాయం మాత్రమే చేయగల పరిస్థితి ఏర్పడి, నాపేరు సలహామండలి లోకి మారింది. 'ప్రజాపక్ష సమీక్ష' మొదటి సంచికను 2003 జనవరి 1న హైదరాబాద్ ఎన్ ఎస్ ఎస్ లో పత్రికా సమావేశంలో ఆవిష్కరించాం. గౌరవ సంపాదకులు ఎబికె ప్రసాద్, సంపాదకులు వి హనుమంతరావు, సలహామండలి ప్రొ. ఆర్‌విఆర్ చంద్రశేఖర రావు, ప్రొ. వకుళాభరణం రామకృష్ణ, ప్రొ. పి. నారాయణ రెడ్డి, డి పాపారావు, బి. సాంబశివరాజు, ఎన్ వేణుగోపాల్.

అప్పుడు ఇప్పటిలాగా ఎక్కువ రచనలు ఉండేవి కావు, పైగా నెలకు రెండు సంచికలు వెలువడే పక్షపత్రిక. రచనల కొరత, కంపోజింగ్, ప్రూఫ్ రీడింగ్, ప్రింటింగ్, ప్యాకింగ్, పోస్టింగ్... చాల ఒత్తిడి ఉండేది. హనుమంతరావుగారికి అప్పటికే 78 సంవత్సరాలు. తాను వయసుకూ శక్తికీ మించి కష్టపడడం మాత్రమే గాక చుట్టూ ఉన్నవాళ్లందరిమీద ఒత్తిడి పెట్టేవారు. ఆ రోజుల్లో కొంతకాలం సహాయ సంపాదకుడిగా

పనిచేసిన వీరారెడ్డి వచ్చి ఇండియన్ ఎక్స్ ప్రెస్ క్యాంటీన్ లో నా ఎదురుగా కూచుని, గబగబా సంపాదకీయాలు, వ్యాసాలు రాయించి తీసుకుపోయిన రోజులు నిన్ననో మొన్ననో గడిచినట్టున్నాయి. అలా రెండు సంవత్సరాలు హనుమంతరావు గారి ఇల్లే కార్యాలయంగా, ఒకే ఒక్క ఉద్యోగితో, కనీసం ముగ్గురి పార్ట్ టైమ్ సహకారంతో, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో పత్రిక నడిచింది. నిర్మాణం లేకుండా నడిచే పత్రికలన్నిటిలాగే ఆలస్యంగా రావడం, మధ్య మధ్య సంచికలు వదిలిపెట్టడం, సమన్వయం లేకపోవడం వంటి పొరపాట్లెన్నో దొర్లాయి.

అప్పటికే ఆరోగ్యం క్షీణిస్తున్న హనుమంతరావు గారు పత్రిక బాధ్యత పూర్తిగా తీసుకొమ్మని పదేపదే అడుగుతూ వచ్చారు. నాకు కూడ ప్రధాన స్రవంతి పత్రికలనుంచి వైదొలగి నా ఇష్టపూర్వకమైన, స్వచ్ఛందమైన ప్రజానుకూల పాత్రికేయ వృత్తిలో ఉండాలని కోరిక బలపడుతూ వచ్చింది. సరిగ్గా అప్పుడే ఒక ప్రజా ప్రత్యామ్నాయ పరిశోధనా సంస్థ ఏర్పాటు కోసం మిత్రులతో పంచుకుంటున్న ఆలోచనలు ఒక కార్యరూపం ధరించాయి. అలా 2004 డిసెంబర్‌లో నేను న్యూ ఇండియన్ ఎక్స్ ప్రెస్ వదిలేసి, రెండు మూడు నెలలలో ఆర్ ఎస్ రావు, ముదునూరి భారతి, కె ఆర్ చౌదరి, బి ఎస్ రాజు, పి అరవింద, వి హనుమంతరావులతో కలిసి సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్స్ (సిడిఆర్‌సి) అనే సంస్థను స్థాపించాను. నేను వర్కింగ్ ఎడిటర్‌గా, వీక్షణం సమతా పబ్లికేషన్స్ – సిడిఆర్‌సి సంయుక్త ప్రచురణగా మారింది.

అంతకుముందు రెండు దశాబ్దాలకు పైగా అటు ప్రత్యామ్నాయ పత్రికలతోనూ ఇటు ప్రధాన స్రవంతి పత్రికలతోనూ నా అనుబంధం నుంచి నేను నేర్చుకున్న పాఠం ఒకటుంది. పత్రిక అనేది క్రమబద్ధంగా, నిరంతరాయంగా నడవవలసిన పని. అందువల్ల దానికి సొంత, సుస్థిర నిర్మాణం, పూర్తికాలం కేటాయించగల నిర్వాహకులు, క్రమబద్ధమైన పనిపద్ధతులు ఉండాలి. పార్ట్ టైమ్ నిర్వాహకులతో, ఇతర పనులు కూడ పెట్టుకునేవారితో పత్రిక తేవచ్చుగాని క్రమబద్ధంగా, నిరంతరాయంగా తేవడం సాధ్యం కాదు. ఆ అవగాహన వల్ల వీక్షణంకు ఒక నిర్మాణాన్ని తయారు చేయడం మీద ఎక్కువ శ్రద్ధపెట్టాను. సిడిఆర్‌సి తరఫున ఆర్థిక వనరులు సమీకరించగలిగిన పనులు (పుస్తక ప్రచురణ, సర్వేలు, పరిశోధనలు) చేసి, వీక్షణంకు కావలసిన నిధులు సమకూర్చాలని అనుకున్నాం. 2006కు ఆంధ్రప్రదేశ్ ఏర్పడి యాభై సంవత్సరాలు నిండిన సందర్భంగా సిడిఆర్‌సి తరఫున ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే ఉద్గ్రంథం తెచ్చి, అప్పటికీ ఇప్పటికీ ఎవరూ చేయని పని చేశాం. ఆ పుస్తకం అమ్మకాలు వీక్షణాన్ని కొద్ది కాలం ఆదుకున్నాయి. అలాగే 2006-09 మధ్య నాలుగైదు సర్వేలు చేసి వీక్షణం నిర్వహణకు అవసరమైన కొన్ని నిధులు సమకూర్చుకున్నాం. సామాజిక శాస్త్ర సర్వేల గురించి, ఆ సర్వేలు సక్రమంగా చేస్తే సంస్థలకు రాగల రాబడి గురించి తెలియనివారు ఆ సర్వేల మీద అవాకులూ చవాకులూ అప్పుడు మాత్రమే కాదు, ఇప్పటికీ వాగుతూనే ఉన్నారు. కాని సంవత్సరానికి కనీసం మూడు లక్షల నుంచి ఐదు లక్షల లోటుతో నడుస్తున్న వీక్షణం ఐదారు సంవత్సరాలైనా ఒడిదుడుకులు లేకుండా నడవగలిగింది ఆ సర్వేల వల్లనే. 2009లో అనేక అంతర్గత, బాహ్య కారణాల వల్ల సిడిఆర్‌సి మూత బడడంతో వీక్షణంకు అటువంటి నిరంతరాయమైన వనరు కూడ కరువైపోయింది. ఆ తర్వాత వ్యాపార ప్రకటనలతో వచ్చే అరకొర వనరులు, వీక్షణం ఆగిపోగూడదని కోరుకునే దాతల విరాళాలు మాత్రమే వీక్షణంను బతికిస్తున్నాయి. వచ్చే నెల పత్రిక వెలువరించగలమా అనే సందేహపు కత్తి అంచుమీదనే గత నాలుగైదు సంవత్సరాలుగా పత్రిక నడుపుతున్నాం. ఏది ఏమైనా ఈ పదిహేడు సంవత్సరాలలో, పదిహేను సంవత్సరాలుగా సుస్థిరమైన నిర్మాణం, కచ్చితమైన పని పద్ధతులు రూపొందడం వల్లనే నాలుగైదు సందర్భాలలో సంపాదకుడికి, ఇతర నిర్వాహకులకు వ్యక్తిగత ఇబ్బందులు వచ్చినా వీక్షణం ఏ మాత్రం అంతరాయం లేకుండా, పత్రిక ఒక్క సంచిక కూడ ఆగకుండా, ప్రతి నెలా కచ్చితమైన తేదీల్లో వెలువడడం సాధ్యమయింది.

ఈ పదిహేడు సంవత్సరాల వీక్షణం చరిత్రను వెనక్కి తిరిగి ఆలోచిస్తే, కొన్ని గుర్తించదగిన లోపాలు ఉన్నప్పటికీ కొన్ని గణనీయమైన విజయాలు సాధించిందని మాకు గర్వంగా ఉంటుంది. ప్రజా ప్రత్యామ్నాయ రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా ఇది ప్రజలలో, పాఠకులలో చాల ఆదరణను చూరగొంది. ఆయా పార్టీలు, ప్రజాసంఘాలు నడిపే పత్రికలు మినహాయిస్తే ఇది దాదాపు ప్రతి ఒక్కరూ ఆదరించే ఏకైక రాజకీయార్థిక, సామాజిక పత్రికగా తయారయింది. ఈ పత్రికలో అచ్చవుతున్న వ్యాసాల పరిధి విశాలమైనదిగా అందరి ప్రశంసలనూ అందుకుంటున్నది. తెలుగులో ప్రగతిశీలమైన, నిశితమైన ఆలోచనలు చేసేవారూ, వ్యక్తీకరించేవారూ, ఆచరణలో పెట్టేవారూ అందరూ వీక్షణంను తమ కరదీపికగా భావిస్తున్నారు. అందువల్లనే అటు విద్యారంగంలో, ఇటు క్రియాశీల కార్యకర్తలలో వీక్షణం అభిమానాన్ని చూరగొన్నది.

"వీక్షణం శ్రేయోభిలాషులు, మిత్రులు పత్రిక అభివృద్ధి కోసం చాల సూచనలు చేస్తున్నారు. ఇది తెలుగు ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలా ఉండాలనే సూచనల నుంచి గ్రామీణ, స్థానిక పరిణామాల నివేదికగా, విశ్లేషణగా ఉండాలనే సూచనల వరకు చాల సూచనలు మాకందుతున్నాయి. ఇది కేవలం పైనుంచి చెప్పే పత్రికగానో, కిందినుంచి వినే పత్రికగానో మాత్రమే ఉండాలని మేం అనుకోవడం లేదు. ఈ రెండు వాహికల మేలు కలయికగా, తెలుగు సమాజం తన గురించీ, తన ఇరుగుపొరుగు పరిణామాల గురించీ చేసుకునే అన్వేషణకు అద్దం పట్టేదిగా ఉండాలని మా కోరిక" అని 2005 మే-జూన్ సంచిక సంపాదకీయంలో రాసిన మాటకు వీక్షణం అక్షరాలా కట్టుబడి ఉంది. పాఠకులకు ఏ అవగాహనలను అందించాలని తాననుకుంటున్నదో అవీ చెప్పింది. పాఠకుల నుంచి తానేమి వినాలనుకుంటున్నదో అవీ వింది. పత్రికకూ పాఠకులకూ మధ్య, రచయితలకూ పాఠకులకూ మధ్య, రచయితలకూ రచయితలకూ మధ్య, ఒక్క మాటలో తెలుగు సమాజానికి తనతో తనకు నిరంతర సంభాషణకు వీక్షణం వేదికగా నిలిచింది.

తొలిరోజుల్లో పక్షపత్రికగా 24 పేజీలు, మాసపత్రికగా 48 పేజీలు నింపడానికి ఇబ్బంది పడే స్థితి నుంచి ఇవాళ 64 పేజీల పత్రికను సునాయాసంగా తేవడం మాత్రమే కాక, వ్యాసాలు నిలువ ఉండే స్థితికి చేరుకున్నాం. తెలుగులో రాజకీయార్థిక, సామాజిక ఆలోచనాపరులైన రచయితలలో ప్రతిఒక్కరూ తమ రచనలను వీక్షణంకు పంపించారు. ఎంతోమంది రచయితలు తమ రచనలు వీక్షణంలోనే రావాలని

కోరుకుంటున్నారు. అలా ఈ పదిహేడు సంవత్సరాలలో అచ్చువేసిన నాలుగువేల రచనలతో కనీసం పదిహేను వందల మంది రచయితలకు వీక్షణం వేదిక కల్పించింది. ఆ పదిహేను వందల మందిలో కనీసం మూడు వందల మంది కొత్త రచయితలు. వీక్షణంలోనే తొలి రచన చేసి, ఆ తర్వాత వ్యాస రచయితలుగా స్థిరపడినవాళ్లు ఎందరో ఉన్నారు. అలాగే వీక్షణం మొదటినుంచీ పరిశోధక విద్యార్థులకు ప్రత్యేక స్థానం కల్పించింది. ఎం ఫిల్, పి ఎచ్ డి విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు తమ పరిశోధనా ఫలితాలను సమాజంతో పంచుకోవడానికి వీక్షణం వేదిక అయింది. పరిశోధక విద్యార్థులకు, అధ్యాపకులకు వృత్తి ఉద్యోగాలలో, పదోన్నతులలో ఉపయోగపడే (ఇంటర్నేషనల్ స్టాండర్డ్ సీరియల్ నంబర్) ఐఎస్ ఎస్ ఎన్ గుర్తింపు కూడ వీక్షణంకు వచ్చింది.

అలాగే వీక్షణం తెలుగులో సామాజిక శాస్త్ర వ్యాస రచనా ప్రక్రియను అభివృద్ధి చేసే కృషిలో భాగంగా వ్యాసరచనా అధ్యయన తరగతులు నిర్వహించింది. తెలుగు వ్యాసరచనా చరిత్ర, వ్యాసరచనా పరికరాలు, వ్యాసరచనలో సాధారణ పొరపాట్లు, వ్యాసరచనకు అవలంబించవలసిన పద్ధతులు ఒక తరగతిగా చెప్పి, కొన్నిడజన్ల మందికి వ్యాస రచనలో ఆసక్తి పెంపొందించింది. కనీసం ఇరవై మంది ఈ తరగతి ప్రభావంతో వ్యాస రచయితలుగా మారారు.

వీక్షణం నిర్వహించిన కార్యక్రమాలలో మరొక విశిష్టమైన అంశం రచయితల సమావేశాలు. పత్రికలకూ రచయితలకూ పాఠకులకూ మధ్య సన్నిహిత సంబంధాలు ఉండాలనీ, నిరంతర సంభాషణ జరుగుతుండా లనీ భావించిన వీక్షణం గత 2005 నుంచి పది సంవత్సరాల పాటు ప్రతి సంవత్సరం రచయితల సమావేశాలు నిర్వహించింది. హైదరాబాద్ లో మాత్రమే కాక గుంటూరు, ప్రొద్దుటూరు, మహబూబ్ నగర్ వంటి చోట్ల కూడ జరిగిన ఈ సమావేశాలలో రచయితలతో పాటు, పాఠకులు, అభిమానులు కూడ విరివిగా పాల్గొన్నారు. వీక్షణంలో వెలువడే రచనల మీద, వెలువడవలసిన అంశాల మీద, వీక్షణంను విస్తరించవలసిన అవసరం మీద ఆసక్తికరమైన చర్చ జరిగింది. విలువైన సూచనలు, సలహాలు అందాయి. అనివార్య ఆర్థిక, నిర్వహణాపరమైన కారణాల వల్ల గత మూడు నాలుగు సంవత్సరాలుగా ఈ రచయితల సమావేశం సంప్రదాయం ఆగిపోయింది. దాన్ని పునరుద్ధరించవలసే ఉంది.

వీక్షణం నిర్వహిస్తున్న అసాధారణమైన మరొక పని అసహజ మరణాల సూచి. 2006లో అప్పటి నిర్వాహకులు వై రామచంద్రం, డి వి రామకృష్ణారావుల పూనికతో, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఇరవై మంది మిత్రుల సహకారంతో తెలుగు సమాజంలో అసహజ మరణాల జాబితా తయారు చేసే పని వీక్షణం ప్రారంభించింది. ఆ పని గత పదమూడు సంవత్సరాలుగా నిరంతరంగా సాగుతూ ప్రస్తుతం ఎస్ వెంకటేష్ నిర్వహణలో, రెండు తెలుగు రాష్ట్రాల నుంచీ ఇరవై మంది మిత్రుల సహకారంతో సాగుతున్నది. అసహజ మరణాలను సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నంగా గుర్తిస్తూ ఆ చిహ్నాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని చేస్తున్న ఈ ప్రయత్నం ఆలోచనా ప్రేరకమైన ఎన్నో సామాజిక, రాజకీయార్థిక విషయాలను సూచిస్తున్నది.

అలాగే, తెలుగు పాఠకులకు అవసరమైన, తెలుగు పాఠకుల అవగాహనా పరిధిని పెంచే విశ్లేషణా వ్యాసాలను ఇంగ్లిషు నుంచి అనువదించి అచ్చువేసే పనికి వీక్షణం ఉద్దేశపూర్వకంగానే పూనుకున్నది. ఈ పదిహేడు సంవత్సరాలలో అటువంటి వ్యాసాలు రెండు వందలైనా ప్రచురణ అయి ఉంటాయి.

కొన్ని సంవత్సరాల కింది వరకూ వీక్షణం క్రమం తప్పకుండా నిర్వహించిన కార్యక్రమం ప్రతినెలా ఒక ప్రత్యేకమైన విషయం ఫోకస్ గా తీసుకుని దానిమీద నలుగురైదుగురు రచయితల వైవిధ్యపూరితమైన వ్యాసాలు ప్రచురించడం. ఆయా రచయితల నుంచి నిర్ణీత వ్యవధి లోపల వ్యాసాలు తెప్పించుకోవడంలో, నాణ్యత పాటించడంలో వచ్చిన ఇబ్బందుల వల్ల ఈ ఫోకస్ శీర్షిక ప్రస్తుతం ఆపివేశాం గాని, ఒక సమకాలీన అంశం మీద స్థూలంగా ప్రజానుకూల దృక్పథంలోనే ఎంత వైవిధ్యపూరితమైన ఆలోచనలుండే అవకాశం ఉందో దీనితో ప్రతినెలా తెలిసివచ్చేది. ఆ భిన్నాభిప్రాయాల ఛాయలన్నీ ఒక్కచోట దొరికి పాఠకుల అవగాహనా పరిధి పెరగడానికి అవకాశం వచ్చేది. ఇప్పటికీ కొన్ని సందర్భాలలో అటువంటి వైవిధ్యానికి చోటు దొరుకుతూనే ఉన్నది.

వీక్షణం తొలిరోజుల్లోనే ప్రచురణలు కూడ ప్రారంభించి ఒక దళారీ పశ్చాత్తాపం వంటి ముఖ్యమైన పుస్తకాలు ప్రచురించింది. అలాగే మాతృసంస్థ సిడిఆర్ సి ప్రచురించిన 50 ఇయర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌తో సహా ఎన్నో పుస్తకాలను పాఠకులకు అందజేసింది. వీక్షణం కార్యాలయంలో విభిన్న అంశాల మీద చర్చాగోష్ఠులు, సమావేశాలు నిర్వహించింది. కార్యాలయంలోనే కీలకాంశాలపై సంప్రదించడానికి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచింది.

ఫోకస్ ఒరవడిలోనే వీక్షణం భూసంస్కరణలు, నీటిపారుదల, ఎన్నికలు, విద్యుచ్ఛక్తి, ప్రాంతీయ అసమానతలు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వంటి కొన్ని అంశాల మీద ప్రత్యేక సంచికలు కూడ ప్రచురించింది. వీక్షణం ప్రచురించిన నాలుగు వేలకు పైగా వ్యాసాలు ప్రతి ఒక్కటీ విలువైనవే, ఏదో ఒక అర్థంలో ప్రత్యేకమైనవే. కాని ఇతర పత్రికలేవీ చేయని పని వీక్షణం సగర్వంగా చూపుకోదగిన పని రెవెన్యూ పాలన చరిత్ర, భూమి సమస్య, భూసంస్కరణలు, నిత్య జీవితంలో సామ్రాజ్యవాద దోపిడీ, స్వావలంబన, ప్రపంచీకరణ విధానాలు, అవినీతి, స్విస్ బ్యాంక్ ఖాతాలు, గ్రామ అధ్యయనాలు, భారత–చైనా యుద్ధం, కశ్మీర్, సంఘ్ పరివార్ వంటి అంశాల మీద ప్రచురించిన వ్యాసాలు.

అయితే ఈ కృషి అంతా వీక్షణం నిర్వాహకులుగా పేర్లు కనబడే ఒకరిద్దరు వ్యక్తులది మాత్రమే కాదు, మాకు సన్నిహితులూ, పరిచితులూ, అపరిచితులూ కూడ అయిన అసంఖ్యాక మిత్రుల సహాయ సహకారాలు లేకపోతే వీక్షణం ఇలా నిలదొక్కుకోగలిగి ఉండేదే కాదు. ఈ పదిహేడు సంవత్సరాల ప్రయాణంలో వేలాది మంది మిత్రులు వీక్షణంకు ఆదరాభిమానాలు అందించారు. వీక్షణాన్ని తమ కౌగిట్లోకి తీసుకున్నారు. వీక్షణం చదవడం, వీక్షణం గురించి మాట్లాడడం, వీక్షణంకు ఆర్థిక, హార్దిక సహకారం అందించడం, వీక్షణంకు ప్రకటనలు సంపాదించి పెట్టడం తమ బాధ్యత అనుకున్నారు. వారందరికీ పేరుపేరునా వీక్షణం తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నది. తెలంగాణ పల్లెల నుంచి పొట్ట చేతపట్టుకుని ముంబైకి వలసవెళ్లి అక్కడ కార్మికులుగా పనిచేస్తున్న యువకులు ప్రతినెలా క్రమం తప్పకుండా వీక్షణం చదువుతూ, చదివిస్తూ, చర్చిస్తూ ఉన్నారని విన్నప్పుడు మా పని సార్థకమయింద నిపిస్తుంది. మధ్యభారత అరణ్యాల నుంచీ, తూర్పుకనుమల నుంచీ

మహత్తర సామాజిక నిర్మాణ కృషిలో ఉన్నమిత్రులు వీక్షణంకు రచనలు పంపినా, వీక్షణంలో అచ్చయిన రచనల మీద తమ అభిప్రాయం తెలిపినా, వీక్షణంకు అక్కడి ఆదివాసుల పేరు మీద చందాలు వచ్చినా మా కళ్లు చెమ్మగిల్లుతాయి. సుదూరంగా పుణెలోనో, కోల్ కత్తాలోనో, చెన్నైలోనో ఉద్యోగం చేస్తున్న తెలుగు విద్యావంతులు, ఉద్యోగార్థం అమెరికా వెళ్లిన ప్రగతిశీల మిత్రులు, దేశవ్యాప్తంగా చెరసాలలలో చిక్కిన నిరపరాధులు, భవిష్యత్ సమాజ స్వాప్నికులు, రెండు రాష్ట్రాలలోనూ నలుమూలల నుంచి పాఠకులు, మంచిర్యాల, మిర్యాలగూడ, మహబూబ్ నగర్, సూర్యాపేట వంటిచోట్ల ఏర్పడిన వీక్షణం మిత్రబృందాలు మాతో ఫోన్ లోనో, ఉత్తరాలలోనో సంభాషించినప్పుడు, వీక్షణంపట్ల అభిమానాన్ని ప్రకటించినప్పుడు, మెరుగుదలకు సూచనలు చేస్తున్నప్పుడు మా కృషి వృథా పోవడం లేదనీ, దానికి విలువ ఉందనీ అనిపిస్తుంది. ఇదంతా ఒక ఎత్తయితే, రెండు రాష్ట్రాలలోనూ కనీసం రెండు డజన్ల మంది వయోధిక మిత్రుల, విశ్రాంత ఉద్యోగుల, ఉపాధ్యాయుల ప్రేమాదరాలను చూరగొనడం మరొక ఎత్తు. వారందరూ ఉద్యోగ విరమణ చేసి పది పదిహేను ఏళ్లయిన, అరవైలలో, డెబ్బైలలో ఉన్న వయోవృద్ధులు. కాని గొప్ప ఆశాజీవులుగా, నవయువకులుగా వారు వీక్షణం క్రమబద్ధంగా చదవడం, వీక్షణంకు రాయడం మాత్రమే కాదు, కాలికి బలపం కట్టుకుని తిరిగి చందాలు చేర్పిస్తున్నారు, వారిలో ఒక్కొక్కరూ వీక్షణంను కనీసం యాభై నుంచి వంద మంది కొత్త పాఠకులకు పరిచయం చేశారు. ఎందరో మహానుభావులు, అందరికీ మా వందనాలు.

వీక్షణం నిర్వహణను సమష్టి ప్రయత్నంగా మార్చడానికి, దీన్ని ఒకరో ఇద్దరో వ్యక్తుల నీడగా మార్చకుండా ఉండడానికి తొలిరోజుల నుంచీ ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తున్నాం. తొలిరోజుల్లో నిర్వాహక సిబ్బందితో పాటు సలహా మండలి, సిడిఆర్ సి నిర్వాహక మండలి ఉండేవి.

అనేక కారణాల వల్ల సలహా మండలి పని చేయకుండా పోగా, సిడిఆర్‌సి కూడ రద్దయిపోగా, జూన్ 2014 నుంచి వీక్షణం ఎడిటోరియల్ కలెక్టివ్ అనే సమష్టి నిర్మాణం వీక్షణం నిర్వహణా బాధ్యతలను చేపట్టింది. ప్రతి నెలా రచనల ఎంపిక, అవసరమైన విషయాల మీద రచనలు చేయించడం, చేయడం, పత్రిక నిర్వహణకు సంబంధించిన అన్ని విషయాలనూ సమష్టిగా చర్చించి, నిర్ణయాలు తీసుకుని అమలు చేయడం ఈ కలెక్టివ్ బాధ్యతలు. ప్రస్తుతం ఈ కలెక్టివ్‌లో బిఎస్ రాజు, ఎ నర్సింహారెడ్డి, బి రామకృష్ణ, వై భాస్కర్, కె బాల్ రెడ్డి, ఎ రాజేంద్రబాబు, బైరెడ్డి సతీష్, డా. ఎ పున్నయ్య, వై రామచంద్రం ఉన్నారు.

తొలి సంవత్సరాలలో వీక్షణం సలహామండలిగా పనిచేసిన ప్రొ. ఆర్.వి.ఆర్. చంద్రశేఖరరావు, ప్రొ. వకుళాభరణం రామకృష్ణ, ప్రొ. పి. నారాయణ రెడ్డి, డి పాపారావు, బి. సాంబశివరాజు, ప్రొ. చక్రధరరావు, కాత్యాయనిల తోడ్పాటు లేకపోతే వీక్షణం ఇవాళ ఉన్న స్థితికి చేరి ఉండేది కాదు. వారి సహకారాన్ని సవినయంగా గుర్తు చేసుకుంటున్నాం. వీక్షణం నిర్మాణంలో ఆయా సమయాలలో కొద్దికాలమో, ఎక్కువకాలమో పనిచేసిన ప్రశాంత్, ఎం విద్యాభూషణ్, ఇప్ప వీరారెడ్డి, కొణతం దిలీప్, ఎ సునీత, ఎం మమత, కిశోర్ కుమార్, కె రమ, పి అనల, భాగ్యలక్ష్మి, రమేశ్, గాయత్రి, ఫణీంద్ర, డి వి రామకృష్ణా రావు, ఎ మల్లేష్, ప్రస్తుతం వీక్షణం నిర్వహణలో భాగస్వాములయిన వై రామచంద్రం, సి రాజశేఖర్, సి వెంకటేష్ తమ శక్తిసామర్థ్యాలను వీక్షణం కోసం వెచ్చించి ప్రజలకూ వీక్షణంగా వారధిగా నిలిచారు, నిలుస్తున్నారు.

సహజంగానే ఈ పదిహేడేళ్ల ప్రయాణమంతా నల్లేరు మీద బండినడక కాదు, అన్నీ విజయాలతోనే సాగలేదు. ఎన్నో అపజయాలూ ఇబ్బందులూ అనుభవిస్తూ, అధిగమిస్తూ, అధిగమించడానికి ప్రయత్నిస్తూ సాగిన ప్రయాణమిది. రచనలోనూ, ఆర్థిక పుష్టిలోనూ, నిర్వహణలోనూ వీక్షణం నిత్య సమస్యలను ఎదుర్కొంటూనే ముందుకు సాగింది, సాగుతున్నది.

ఇదివరకే చెప్పినట్టు మాకు చాల విరివిగా రచనలు వస్తున్నప్పటికీ, ఎంతో మంది రచయితలు చాల ఉదారంగా మాకు రచనలు పంపుతున్నప్పటికీ, ఇవాళ్టి సామాజిక సందర్భానికి అవసరమైన రచనలకు, వస్తున్న రచనలకు మధ్య తేడా ఉంటున్నది. ప్రతి నెలా చివరివారంలో మరుసటి నెల సంచిక పోస్ట్ చేసి, తర్వాతి సంచికకు ఏ రచనలు ఉండాలని సంపాదకవర్గ సమావేశం జరుపుకుంటున్నప్పుడు ఆ నెలలో జరిగిన ఘటనలు, పరిణామాలు మేమంటే మేమని తోసుకొస్తాయి. వాటి మీద కనీస సమాచార నివేదికలైనా ఉండవలసి ఉంటుంది. ఆ ఘటనలను, పరిణామాలను ప్రాతిపదికగా తీసుకుని రాయవలసిన సైద్ధాంతిక, విశ్లేషణా వ్యాసాలుంటాయి. అవికాక, నిర్ణీత కాలవ్యవధి లేని పరిశోధనా వ్యాసాలు, దృక్పథ వివరణా వ్యాసాలు ఎప్పుడూ ఉంటాయి. ఇవన్నీ రాయడానికి తగినంతమంది రచయితలు లేరు. సంఖ్యలో ఉన్నా, ఆయా విషయాల మీద సాధికార అవగాహన ఉన్నవాళ్ల సంఖ్య తక్కువ. అలాంటివాళ్లు ఉన్నా వారు ఇతరంగా అనేక పనుల్లో కార్యమగ్నులై ఉంటారు గనుక సమయం పాటించి అడిగిన తేదీ లోపల ఇవ్వలేరు. మొత్తంగా నెల తిరిగేసరికి అంత ముఖ్యమైన, అత్యవసరమైన విషయాలలో కొన్నిటి మీద రచనలు లేకుండానే పత్రిక వెలువడవలసి వస్తుంది. ఇదీ సాధారణ పరిస్థితి. మనలో ప్రతి ఒక్కరూ ఆలోచించడం, రాయడం, జరిగిన, జరుగుతున్న ప్రతి విషయం మీదా తమ స్పందన వ్యక్తీకరించాలని అనుకునేంతవరకూ ఈ పరిస్థితి మారదు.

అలాగే వీక్షణం రచయితల్లో మహిళల సంఖ్య తక్కువగా ఉంటున్నది. ఎంత ప్రయత్నించినా వీక్షణం కలెక్టివ్‌లోకి సగం సంఖ్యలో కాదు గదా, ఒకరిద్దరినైనా మహిళలను చేర్చుకోలేకపోయాం. కార్మిక రంగం గురించి, వ్యవసాయం గురించి, ఆదివాసుల గురించి, శాస్త్రవిజ్ఞానం గురించి రావలసినన్ని వ్యాసాలు రావడం లేదు. అనువాదాలు కూడ ఉండవలసినన్ని ఉండడం లేదు. ఎంత ప్రయత్నించినా పుస్తక సమీక్ష, పుస్తక పరిచయం శీర్షికలు నిర్వహించలేక పోతున్నాం. ఈ కొరతలన్నీ కూడ పాఠకుల, అభిమానుల ఇతోధిక భాగస్వామ్యం వల్ల మాత్రమే తీరగలవు.

రచనా సమస్య కన్న మించినది ఆర్థిక పుష్టి సమస్య. "ఈ పత్రిక వెనుక డబ్బుమూటలు లేవు. నయాపైసా పెట్టుబడి పెట్టలేదు కాబట్టి ప్రతిఫలాన్ని కోరుకోవడం లేదు. ప్రత్యామ్నాయ విధానాలు, ఆచరణే దేశానికి, ప్రజలకు విముక్తి కలిగిస్తాయనే విశ్వాసమే, మా మేధస్సే మా పెట్టుబడి. చందాదారులే మా పోషకులు... ఈ పత్రికను ప్రారంభించడమే మా వంతు. దాన్ని పెంచి, పోషించాల్సింది పాఠకులే. మీ రచనలు, ఆర్థిక సహాయమే మా ఊపిరి" అని పత్రిక ప్రారంభ సంచిక సంపాదకీయంలో హనుమంతరావు గారు రాశారు. ఇవాళ్టికీ అదే పరిస్థితి.

నిజానికి ప్రత్యామ్నాయ పత్రికలన్నిటి ఆర్థిక పరిస్థితీ ఇదే. చాల

ప్రత్యామ్నాయ పత్రికలు ఆలస్యంగా వెలువడడం, మధ్యమధ్య కొన్ని సంచికలు వదిలేయడం, అర్ధాంతరంగా ఆగిపోవడం ఆర్థిక కారణాల వల్లనే. కాని ఎన్ని ఇబ్బందులు పడవలసి వచ్చినా సరే, వీక్షణం ఒక్క సంచిక కూడ ఆగిపోగూడదు, ఆలస్యం కాగూడదు అనే పట్టుదల వల్ల, ఒక నిర్మాణాన్ని ఏర్పాటు చేసుకోవడం వల్ల వీక్షణానికి ఖర్చు మరింత పెరిగింది. పత్రిక ఉత్పత్తి వ్యయం పెరిగిపోయింది. ఆ ఉత్పత్తి వ్యయాన్నంతా చందాదారుల మీద, విడిప్రతి కొనుగోలుదారుల మీద వేయడం తలకు మించిన భారమవుతుంది. ఆ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడానికి నిర్మాణం తగ్గిస్తే పత్రిక ఉనికే ప్రమాదంలో పడుతుంది. అందువల్ల ఉత్పత్తి వ్యయంలో కొంతభాగాన్ని మిత్రుల నుంచి విరాళాల రూపంలో, వ్యాపార ప్రకటనల, అభినందన ప్రకటనల రూపంలో సేకరించక తప్పదు.

ప్రత్యామ్నాయ సంస్థలన్నీ విరాళాల కోసం ఆ దాతల మీదనే ఆధారపడడం వల్ల వారి మీద కూడ ఒత్తిడి పెరుగుతున్నది. అందువల్ల ప్రధాన స్రవంతి వార్తాపత్రికల లాగనే ప్రకటనల మీద దృష్టి పెట్టాలని వీక్షణం భావించింది. ప్రకటనలు వేసినంత మాత్రాన తన అభిప్రాయాలలో రాజీపడనక్కరలేదు. ఇంతవరకూ వీక్షణం అలా ఎప్పుడూ రాజీ పడలేదు. ప్రభుత్వ ప్రకటనలు ప్రజాధనమే గనుక, చిన్న పత్రికలకు తప్పనిసరిగా కొంత భాగం కేటాయించాలని చిన్నపత్రికలు ఎంతోకాలం పోరాడి, ఒక హక్కుగా దాన్ని సంపాదించుకున్నాయి. అవి కూడ నిబంధనల ప్రకారం ప్రతి నెలా ఒకటి రావలసి ఉన్నా వీక్షణంకు తొలి పది సంవత్సరాల్లో ఏడాదికి ఎనిమిదికి మించి రాలేదు. ఆ తర్వాత మూడు నాలుగు సంవత్సరాలు తెలంగాణ ఉద్యమం వల్ల అన్ని చిన్నపత్రికలకూ ప్రకటనలు మరింత తగ్గిపోయాయి. ఇక తెలంగాణ వచ్చిన తర్వాత వీక్షణం పట్ల తెలంగాణ పాలకుల కన్నెర్ర వల్ల ఏడాదికి ఒకటి రెండు ప్రకటనలు ఇవ్వడమే గగనంగా ఉంటున్నది. ఇక స్వతంత్ర, ప్రైవేట్ సంస్థల ప్రకటనలు తప్ప మరొక అవకాశం లేదు. అవి కూడ రావలసినన్ని రావడం లేదు. అవి కూడ లేకుండా పూర్తిగా చందాలతో, విరాళాలతో పత్రిక నడపగలిగిన స్థితి వస్తే సంతోషం. కాని ఇప్పటికైతే ఆ ఆదర్శవంతమైన స్థితి కనుచూపు మేరలో లేదు. కొనుగోలుశక్తి, అదనపు వనరులు తక్కువగా ఉన్న మన సమాజంలో మాత్రమే కాదు, ప్రపంచమంతా ప్రత్యామ్నాయ సమాచార వాహికల పరిస్థితి ఇదే.

ఇక, తగినంతమంది సిబ్బంది లేకపోవడం, అందువల్ల పత్రిక నాణ్యతలో లోపాలు, సర్క్యులేషన్ లోపాలు వంటి నిర్వహణా సమస్యలను కూడ వీక్షణం ఇప్పటికీ ఎదుర్కొంటూనే ఉన్నది.

ఈ సమస్యల వల్ల వీక్షణం చేయవలసిన పనులెన్నో చేయలేక పోయింది. చేయగలిగీ, చేయాలని అనుకునీ కూడ ఈ కారణాల వల్ల చేయలేకపోయిన పనులూ కొన్ని ఉన్నాయి. ఈ సమస్యలను మెల్లమెల్లగా అధిగమిస్తూ చేయవలసిన, చేయగలిగిన, చేయాలనుకుంటున్న పనులు భవిష్యత్తులో మరింత సమర్థంగా చేయగలమనే ఆశిస్తున్నాం.

అయితే వీక్షణం ఎంచుకున్న దృక్పథం, కార్యక్షేత్రం, ఆచరణ, విలువలు ప్రత్యామ్నాయమైనవి. అవి ఈ సమాజంలో అనివార్యంగా. సహజంగా ఆటంకాలను ఎదుర్కొంటూ, అధిగమిస్తూ సాగవలసిందే. ఆ సమస్యలు ఎప్పటికప్పుడు పాఠకులతో, మిత్రులతో పంచుకొని, అధిగమించే అవకాశాలను కనిపెట్టడమే వీక్షణం చేస్తూ వస్తున్న పని. పది కాలాలు అలాగే గడిచాయి, మిత్రుల సహకారమే మరొక పదికాలాల జీవితం ఇస్తుందని మా ఆశ, మా నమ్మకం.

అవును, వీక్షణం ఇంకా పదికాలాల పాటు నిలిచి ఉండాలనీ, తాను చేయవలసిన పని ఉన్నదనీ, పెరుగుతున్నదనీ భావిస్తున్నది. నిజంగా ఇవాళ నెలకొని ఉన్న రాజకీయార్థిక, సామాజిక పరిస్థితులు, రోజు రోజూ జరుగుతున్న పరిణామాలు వీక్షణం వంటి పత్రిక అవసరాన్ని మరింత పెంచుతున్నాయి, వేనోళ్ల చాటుతున్నాయి. ఒకవైపు చిల్లర వర్తకంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అనుమతితో సహా అతి భయంకరమైన ప్రజావ్యతిరేక ప్రపంచీకరణ విధానాలను ప్రవేశపెడుతున్న, దేశ వనరులను బహుళజాతి సంస్థలకు అప్పగించి, ప్రజల జీవనాన్ని అల్లకల్లోలం చేస్తున్న పాలకపక్షం, ప్రజల గురించి ఎంత మాత్రం పట్టించుకోని నామమాత్ర ప్రతిపక్షాలు, నరహంతకుడు నరేంద్ర మోడీ రెండో సారి కూడ కేంద్ర ప్రభుత్వ అధికారానికి రావడం, హిందూ బ్రాహ్మణీయ మతోన్మాద భావజాలం, కుల అంతరాలు, వివక్షా దుర్మార్గాల ఆచారాలు పెచ్చరిల్లుతుండడం, నిజమైన ప్రజా ప్రత్యామ్నాయం కోసం పోరాడుతున్న ప్రజలపై, ప్రజా ఉద్యమంపై అమానుష హంతక దాడులు... ఈ దుస్సహ, దుర్భర వర్తమానంలో వీక్షణం చేయవలసిన పని చాల ఉంది. నానాటికీ పెరుగుతున్నది. ఇటువంటి అనేకానేక అంశాల మీద ప్రజలలో అవగాహన కలిగించడం, ఆ అవగాహన ఎటువంటి శాస్త్రీయ, నిర్మాణ చైతన్యంగా మారవలసి ఉన్నదో చూపడం, ప్రజా ప్రత్యామ్నాయ నిర్మాణంలో తన వంతు పాత్ర నిర్వహించడం వీక్షణం సంకల్పశుద్ధితో ఎంచుకుంటున్న పనులు.

సమాజం శకలాలు శకలాలుగా విడిపోయి, ఎవరి గూట్లో వాళ్లే ఉంటూ, ఎవరి అవగాహన వాళ్లే తమలో తామే చదువుకుంటూ, పక్కవారి అవగాహన ఏమిటో తెలుసుకోవాలనే ఆసక్తి కూడ లేనంత ఏకేశ్వరోపాసనలో ఉన్నప్పుడు అందరికీ అవసరమైన చైతన్యాన్ని, అందరూ చదవవలసిన విశాల అవగాహనలను, అందరూ పాల్గొనవలసిన ఆచరణను పైకెత్తి చూపదలచిన వీక్షణం పని ఇంకా ఇంకా విస్తరిస్తున్నది.

ఇలా విస్తరిస్తున్న బృహత్తర కర్తవ్యాన్ని సక్రమంగా నెరవేర్చాలంటే వీక్షణం ఇంకా స్థిరంగా రావాలి. ఇంకా బలంగా రావాలి. ఇంకా లోతుగా రావాలి. అంటే రచనలోనూ, ఆర్థిక నిర్వహణలోనూ, రోజువారీ నిర్వహణలోనూ సమస్యలను అధిగమించాలి. ఇంకా ఎక్కువ మంది భాగస్వామ్యంతో వెలువడాలి. అంటే వీక్షణం పాఠకులలో ప్రతి ఒక్కరూ మరొకరికి దీన్ని పరిచయం చేయాలి. చందాదారులు ప్రతి ఒక్కరూ మరొక్క చందాదారునైనా చేర్పించాలి. ప్రతి గ్రామానికీ పట్టణానికీ వీక్షణం చేరేలా చూడాలి. వీక్షణ సుస్థిర అభివృద్ధికి అవసరమైన వనరులను సమకూర్చాలి. తాము ఇవ్వగలిగిన విరాళం ఎంత చిన్నదైనా సరే ఇవ్వాలి. మిత్రులతో ఇప్పించాలి. వ్యాపార, అభినందన ప్రకటనలు సేకరించాలి.

వీక్షణం ప్రజల పత్రిక. ప్రజల కోసం వీక్షణం మరి పదికాలాల పాటు కొనసాగవలసి ఉంది. ప్రజలే వీక్షణాన్ని పది కాలాలపాటు నిలుపుకోవాలి.

- ఎన్. వేణుగోపాల్

(పది సంవత్సరాలు నిండిన సందర్భంగా పంచుకున్న విషయాలనే మరొకసారి పంచుకోవలసి వచ్చినందుకు విచారిస్తూ...) వీ

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ - సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 120
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
ప్రపంచీకరణ ప్రాభవంలో...	విద్యాభూషణ్	120
మార్క్స్ రాసిన పెట్టుబడి	డేవిడ్ స్మిత్, ఫిల్ ఇవాన్స్	200

తెలంగాణ

తెలంగాణార్థం	ఎన్. వేణుగోపాల్	150
లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120
సమగ్ర తెలంగాణ	వీక్షణం ప్రచురణ	295
ఎవరికోసం మల్లన్నసాగర్?	తెలంగాణ ఆత్మగౌరవ వేదిక	20
మానని గాయాలు	తెలంగాణ విద్యావంతుల వేదిక	100

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
ప్రకృతీ - పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం - సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మనుషులు చేసిన దేవుళ్లు	కొడవటిగంటి రోహిణీప్రసాద్	120
అణువుల శక్తి	కొడవటిగంటి రోహిణీప్రసాద్	150
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80
శాస్త్రీయ విద్యా విధానం	ఆకుల భూమయ్య	30

కులం-మతం

జెండర్ కులం	ఉమా చక్రవర్తి	150
బొజ్జా తారకం నీలిజెండా వ్యాసాలు	హెచ్.బి.టి	250
ఇది రిజర్వేషన్ల దేశం	బొజ్జా తారకం	150
అంటరాని తనం ఇంకానా?	బొజ్జా తారకం	50
పంచతంత్రం	బొజ్జా తారకం	200
కులం వర్గం	బొజ్జా తారకం	60
చరిత్ర మార్చిన మనిషి	బొజ్జా తారకం	150
శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	150
గులాంగిరి	జోతిబా పూలే	60
కుల నిర్మూలన	అంబేద్కర్	60
శూద్రులు - ఆర్యులు	అంబేద్కర్	20
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	30
వెలివాడల వెతలు	కుల నిర్మూలన ప్రచురణ	100

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్స్ పెట్టుబడి రచనా క్రమం	విరసం ప్రచురణ	50

చరిత్ర-జీవిత చరిత్ర

గోదావరి వచ్చినపుడు	ఆర్. ఉమామహేశ్వరి	280
హైదరాబాద్ స్వాతంత్ర్య సంరంభం	ఎన్. వేణుగోపాల్	25
పద్య సాహిత్యం:సంఘ చరిత్ర	బూదరాజు రామకృష్ణ	25
నగరంలో కర్ఫ్యూ	మలుపు ప్రచురణ	75
నరమేధాలూ నియోగాలూ	బి. విజయభారతి	250
జీనా హైతో మర్‌నా సీకో	కాత్యాయని	100
పరిమళించిన మానవత్వం	ప్రొ. జి. హరగోపాల్	120
సన్నిహితుల జ్ఞాపకాలలో అంబేద్కర్	హెచ్‌బిటి	200
మా జ్ఞాపకాల్లో కెవిఆర్	వకుళాభరణం లలిత	80
భారత చరిత్ర అధ్యయానికి ఒక పరిచయం	డి.డి. కోసంబి	250
భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	70
భగవద్గీత చారిత్రక పరిణామం	డి.డి. కొశాంబి	20
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	100
టిపు సుల్తాన్	యార్లగడ్డ నిర్మల	150
నా మాటే తుపాకి తూటా	విమల, కాత్యాయని	120
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	100
ఇండియాలో దాగిన హిందుస్థాన్	పెరి ఆండర్‌సన్	150
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	120
చేగువేరా	కాత్యాయని	120
మహాత్మా జ్యోతిరావ్ పూలే	ధనుంజయ్ కీర్	100
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40
తలపుల తోవ	షౌకత్ కైఫీ	100
కశ్మీర్‌లో నిషిద్ధ రాత్రి	బషారత్ పీర్	170

సాహిత్య విమర్శ - వ్యాసాలు

కవిత్వంతో ములాఖాత్	ఎన్. వేణుగోపాల్	120
సాహిత్య వ్యాసాలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ రచనలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ సాహిత్య సర్వస్వం-1	విరసం ప్రచురణ	270
మహోదయం	కె.వి.ఆర్.	200
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-2	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-3	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సామాజిక వ్యాసాలు	కె.వి.ఆర్.	300
కెవిఆర్ కవిత్వం	కె.వి.ఆర్. శారదాంబ కమిటీ	200
అల్లంరాజయ్య కథలు పరిశీలన	ఎస్. నీళాదేవి	75
సహచరులు	వరవరరావు	100

విప్లవోద్యమం

తత్వశాస్త్ర దారిద్ర్యం	కార్ల్ మార్క్స్	150
తలకిందుల లోకం	మనీషా సేఠి	150
ప్రశ్నలు అలాగే ఉన్నాయి	ఎం. రాఘవాచారి	150
సముద్ర స్వరం	పాలమూరు అధ్యయన వేదిక	150
వ్యక్తిత్వమే కవిత్వం	మలుపు ప్రచురణ	100
మంద్రస్థాయి యుద్ధం	విరసం ప్రచురణ	100
జగిత్యాల జంగల్‌మహల్-1	విరసం ప్రచురణ	75
జగిత్యాల జంగల్‌మహల్-2	విరసం ప్రచురణ	100
నేటి రాయలసీమ	విరసం ప్రచురణ	100
దండకారణ్యంలో గ్రీన్‌హంట్	విరసం ప్రచురణ	60
మావో రచనలు - 1	విరసం ప్రచురణ	170
మావో రచనలు - 2	విరసం ప్రచురణ	220
30 ఇయర్స్ దండకారణ్య కల్చరల్ మూవ్‌మెంట్	ఎన్.ఎం. చేతనా	250
సంకెళ్ల సవ్వడి	అరుణ్ ఫరేరా	150
మలుపు తిప్పిన మహా ఉద్యమం	విరసం ప్రచురణ	60
బోల్షివిక్ పార్టీ చరిత్ర	విరసం ప్రచురణ	250
ఆవాజ్	విరసం ప్రచురణ	65
మెరిసే అక్షరాల వెనుక	సృజన ప్రచురణ	30
నక్సల్బరీ ఒక ఊరు మాత్రమే కాదు	విరసం ప్రచురణ	80
పికెఎం ప్రభాకర్ రచనలు	విరసం ప్రచురణ	70
కార్మికవర్గ విప్లవం-విప్లవ ద్రోహి కౌట్స్కీ	విరసం ప్రచురణ	60
భీమా కోరేగాం 12 - వివి	స్వేచ్ఛా సాహితి ప్రచురణ	50
యుద్ధం స్త్రీ ప్రకృతికి విరుద్ధం	ఎస్.అలెక్సీయెచ్	100
రగుతులున్న అడవి	నందినీ సుందర్	290


కథ - నవల

మేరువు	విరసం ప్రచురణ	90
మానధనులు	హూవర్డ్ ఫాస్ట్	150
దండకారణ్య కథలు (2005-2012)	విరసం ప్రచురణ	100
వసంతగీతం	అల్లం రాజయ్య	250
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	150
వనవాసి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	120
నేల నాగలి - మూడెద్దులు	బొజ్జా తారకం	25
దళితులు - రాజ్యం	బొజ్జాతారకం	25
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	120
బీజభూమి	వరవరరావు	100
మరల సేద్యానికి	శివరామ కారంత్	150
అభాగ్యజీవులు	ఫ్రాంజ్ ఫనాన్	170
నిషిధ	నల్లూరి రుక్మిణి	180
మాటిగరి	గుగి వా థియోంగో	120
మట్టికాళ్ల మహారాక్షసి	గుగి వా థియోంగో	200
బందీ	గుగి వా థియోంగో	200
నేను చావును నిరాకరిస్తున్నాను	జి.ఎన్. సాయిబాబా	125

డివిడి

వీక్షణం (2003 - 2018)	400
సృజన (1966-1992)	240
అరుణతార (1970-2013)	125
'ఓయు'ద్ధకాండ	100

ప్రజానుకూల పత్రికా రచనలో పదిహేడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వీక్షణంకు అభినందనలు. మరింత విస్తరించాలని శుభాకాంక్షలు.



చుక్కా రామయ్య
ప్రముఖ విద్యావేత్త, రచయిత

ఈ మార్కెట్ యుగంలో పత్రికలూ, వెబ్‌సైట్లూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. సమాచార సాంకేతిక విప్లవం విస్తరిస్తున్నకొద్దీ సమాచారానికి కొదవ లేకపోయినా నేటి సమాజానికి ఫేక్ న్యూస్ పెను సవాల్‌గా మారిపోయింది. దీంతో సగటు పాఠకుడు సరైన సమాచారం ఎక్కడ దొరుకుతుందనే మీమాంసలో ఎదుర్కొంటున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో సామాజిక సమస్యలకు కచ్చితమైన పరిష్కారాలు చూపే ఓ లైట్‌హౌస్‌లా.. సరైన కోణంలో నిపుణుల విశ్లేషణలను అందిస్తూ ప్రజలకు మార్గదర్శనం చేసే 'వీక్షణం' లాంటి పత్రికల అవసరం ఎంతో ఉంది. ఊహించని రాజకీయ పరిస్థితులతో ఏర్పడుతున్న కొత్త వ్యవస్థల్లో ప్రజల వైపు నిలబడి వారి తరఫున మాట్లాడటం చాలా కష్టమైన పని. రాజకీయ వ్యవస్థల్లో మార్పులతో పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు వస్తున్న తరుణంలో పత్రికలను సిద్ధాంతం ప్రకారం నడపడం ఆయా యాజమాన్యాలకు కత్తిమీద సాములా మారింది. గత 17 ఏళ్లుగా 'వీక్షణం' తనదైన శైలిలో సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాల్లో వేలాది వ్యాసాలు ప్రచురించి తన ప్రత్యేకతను నిలబెట్టుకోవడమే కాకుండా.. పాఠకుల గుండెల్లో తనదైన ముద్రను వేసుకుంది. ప్రభుత్వాల వైఖరితో పత్రికల మనుగడకే సవాల్ ఎదురవుతున్న కాలంలో వాటికి ఎదురీది ముందుకెళ్లడం ఎంతో కష్టం. కానీ, 'వీక్షణం' అలాంటి పరిస్థితులను తట్టుకొని ఓ సైద్ధాంతిక లక్ష్యంతో, పాత్రికేయ విలువలతో ముందుకెళ్తోంది గనకే ప్రజలు దాన్ని ఆదరిస్తున్నారు. నేటి సమాజంలో ఇలాంటి పత్రికలు మనకు చాలా అరుదుగా కనిపిస్తాయి. 'ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' మ్యాగజీన్ ప్రమాణాల తరహాలోనే 'వీక్షణం' మాస పత్రికను నడిపిస్తున్న వేణుగోపాల్‌కు అభినందనలు. సామాజిక సమస్యలపై ముక్కుసూటిగా ప్రజల పక్షాన నిలబడే పత్రికలకు అనేక ఇబ్బందులు వస్తుంటాయి. గతంలో హన్మంతరావు గారు కూడా అలాంటి ఎన్నో గడ్డు పరిస్థితులను ఎదుర్కొని ఈ పత్రికను సమర్థంగా నడిపించారు. 'వీక్షణం' ఏ లక్ష్యంతో ఏర్పడిందో దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నాను. దేశాన్ని అనేక సమస్యలు పీడిస్తున్న పరిస్థితుల్లో 18వ వసంతంలోకి అడుగుడు పెడుతున్న 'వీక్షణం' పై సామాన్యుడిని మరింత చైతన్య పరిచే బాధ్యత పెరిగింది. ఆ దిశగా ముందుకెళ్లాలని మనవి.



ముదునూరి భారతి
సామాజిక శాస్త్రవేత్త
రచయిత

వీక్షణం తెలుగులో ప్రచురితమవుతూ, పాఠకుల ఆలోచనలను ప్రభావితం చేసే ఏకైక రాజకీయ, ఆర్థిక, సామాజిక మాస పత్రికగా గుర్తించవచ్చును. సాధారణంగా పాలకుల దృష్టికోణం నుండి సమాజంలో పరిష్కారం కోరుకుంటూ ముందుకు వస్తున్న సమస్యలు, వార్తా విశేషాలను ప్రజలకు అందిస్తాయి. మరి వీక్షణం ప్రత్యేకత ఏమిటి? ఇది ప్రజల దృష్టికోణంతో సమాజంలో తలెత్తిన సమస్యలను విశ్లేషణాత్మకంగా వివరించడమే కాకుండా ఒక ప్రత్యామ్నాయ దృక్పథంతో సమస్యలకు ఒక పరిష్కారాన్ని సూచిస్తుంది. ఈ కారణంగా పాలకవర్గాల రాజకీయాలను విమర్శిస్తూనే, సమస్యల పరిష్కారానికి చేసే ప్రజా ఉద్యమాలు 'వీక్షణం'లో సెంటర్ స్టేజ్‌లో ఉంటాయి. ఇదే 'వీక్షణం' ఐడెంటిటీ అయింది. ఇదే కారణంగా చాలా మందికి అభిమాన పత్రిక కూడా అయింది. సామాజిక చైతన్యంతో రచయితలు రాసే ఎన్నో వ్యాసాలు ఈ పత్రికలో అచ్చయ్యాయి. దీని వలసన పాఠకులకు సమాజంలోని సమస్యల గురించిన అవగాహన వస్తుంది. ప్రజల దృష్టికోణం వీక్షణంలో ప్రతిఫలిస్తుంది. అంటే మరి వీక్షణం దృష్టికోణం ఏమిటి అనే ప్రశ్న వస్తుంది. దీనిని పత్రికలోని సంపాదకీయాలు శక్తివంతంగా ప్రతిఫలిస్తాయి. వీటికి తోడు పత్రికలో సిద్ధాంతపరమైన వ్యాసాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ సమయంలో భిన్న అభిప్రాయాలతో వ్యాసాలు వీక్షణంలో రావడం ఈ పత్రిక పరిణతికి ఒక ఉదాహరణ.

సంపాదకులు 'వీక్షణం' పత్రిక తేవడంతో సరిపెట్టుకోక, సమాజంలో ముఖ్యమైన సమస్యల మీద సదస్సులు జరుపుతూ వాటికో స్పష్టత తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. అంతే కాకుండా ముఖ్యమైన సమస్యల మీద కొన్ని పుస్తకాలకు పబ్లిషర్‌గా వ్యవహరించింది.

పత్రిక నడపడంలో ఆర్థిక సమస్యలు ఎదురైనప్పటికీ అభిమానుల సహకారంతో పత్రిక ప్రతినెలా క్రమం తప్పకుండా వస్తూనే ఉంది. ప్రస్తుత సందర్భంలో సమాజంలో పరిష్కారం కోరి ఎన్నో సమస్యలు ముందుకు వచ్చి సమాజం సంక్షోభంలో ఉన్న తరుణంలో వీక్షణం భాధ్యత మరింత ఎక్కువవుతుంది. దానిని సమర్థవంతంగా నిర్వహించడానికి పాఠకుల సహకారంతో అవసరం అవుతుంది.

17 సంవత్సరాలు పూర్తిచేసుకున్న 'వీక్షణం' కి జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ, ఇంకా ఇలాంటి ఎన్నో జన్మదినాలు జరుపుకోవాలని కోరుకుంటూ...



వకుళాభరణం రామకృష్ణ
చరిత్రకారులు, రచయిత

వీక్షణం పత్రిక చిరస్థాయిగా కొనసాగాలి. పదిహేడు సంవత్సరాల క్రితం 'వీక్షణం' పత్రిక ప్రారంభోత్సవానికి ప్రముఖ సంపాదకులు, పెద్దలు, శ్రీయుతులు వి. హనుమంతరావు గారు (వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) పిలవగా వెళ్లాను. నిరాడంబర సభ. యాభైకి మించి ప్రేక్షకులు లేరు. పత్రికను ప్రారంభించడానికి ఆహ్వానించిన పెద్దలు కారణాంతరాల వల్ల రాలేకపోయారు. హనుమంతరావు గారు నన్ను మాట్లాడమన్నారు. నేనొక్కటే చెప్పాను. 'వీక్షణం' తెలుగులో ఎకనిక్ అండ్ పొలిటికల్ వీక్లీ (ఇపిడబ్ల్యు) నమూనాలో వెలువడాలని అభిలషించాను. హనుమంతరావు గారు ఆ దిశలో నడిపారు. ఆ తర్వాత, సంపాదకత్వ బాధ్యతలు స్వీకరించిన మిత్రుడు ఎన్. వేణుగోపాల్ క్రమం తప్పకుండా, మడిమ తిప్పకుండా, ప్రజల నాడిని పట్టుకొని, చక్కని విశ్లేషణలతో సమర్థవంతంగా నడుపుతూ ఉన్నాడు. ఎన్నోసార్లు మేము పత్రిక ఎదుర్కొంటున్న సమస్యలను గూర్చి మాట్లాడుకొన్నాం. పత్రిక నడిచే తీరును సమీక్షించడాన్ని ప్రాంతీయాలవారీ సమావేశాలు నిర్వహించి, అభిప్రాయాలను సేకరించడం 'వీక్షణం' ప్రత్యేకత. నికార్సయిన రాజకీయ, ఆర్థిక, సామాజిక, వైజ్ఞానిక పత్రికను నడిపిస్తున్న వేణుగోపాల్, ఎడిటోరియల్ కలెక్టివ్ సభ్యులు అభినందనీయులు.



జి. హరగోపాల్
సామాజిక శాస్త్రవేత్త,
రచయిత

తెలుగు ప్రజల ఇ.పి.డబ్లు వీక్షణంకి 17 ఏళ్లు అన్నప్పుడు, అంటే ఒక సామాజిక విశ్లేషణాత్మక మాస పత్రిక ఒక దశాబ్దంన్నర కాలం దాటేసిన మేధో కృషిని నిరాఘాటంగా కొనసాగించడం అంటే సాధారణ విషయం కాదు అని అనిపించింది. ఈ పత్రిక ఏదో ఉబుసుపోక పత్రిక కాదు. ఇది ఒక ప్రాపంచిక దృక్పథానికి కట్టుబడి పాఠకులకు నిరంతరంగా చైతన్యశీలురను చేసే కృషి చేస్తున్నది. ఇవాళ ప్రచురణా రంగం, దాదాపు ఫేక్ న్యూస్ అనే విషవలయంలో పడిపోయింది. ప్రజలు పుకార్లని, తప్పుడు సమాచారాన్ని, వాస్తవాల వక్రీకరణను సునాయసంగా నమ్మేస్తున్న కాలమిది. వాస్తవాలను తెలుసుకుందాం అనే పట్టింపులేదు. ఈ ధోరణే ఫాసిస్టు శక్తులకు ఊపునిస్తున్నది. ఇలాంటి చారిత్రక సందర్భంలో, సంక్షుభిత కాలంలో ఒక మాస పత్రిక ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ఘటనల మీద ప్రామాణికమైన వ్యాసాలు అందించి తెలుగు సమాజ మేధో స్థాయిని పడిపోకుండా కాపాడడమే కాక సమకాలీన సమస్యల మీద సమగ్రమైన, లోతైన విశ్లేషణలను, వివరాలను తెలుగు పాఠకులకు అందిస్తూ ఆ స్థాయిని పెంచుతున్నది. నడుస్తున్న చరిత్ర గమనానికి అద్దంపడుతూ, సమాజాన్ని సజీవంగా ఉండేలా కాపాడుతున్నది. వీక్షణం పత్రిక చదివిన తరువాత సమాచార పరంగా, మేధో పరంగా ఎంతో ప్రయోజనం కలిగిందన్న భావన నాకు చాలాసార్లు కలిగింది. దేశ స్థాయిలో దాదాపు ఐదు దశాబ్దాలుగా ఇ.పి.డబ్లు. నిర్వహించిన అమోఘమైన పాత్ర, (ఆ స్థాయిలో కాకపోయినా) ఆ స్థాయితో పోల్చదగినదిగా వీక్షణం నిలుస్తుంది.



కత్తి పద్మారావు
దళిత ఉద్యమ నాయకులు
కవి, రచయిత

బహుముఖంగా వీక్షిస్తున్న వీక్షణం. వీక్షణం మాసపత్రిక 17 సంవత్సరాలు పూర్తిచేసుకుని 18 సంవత్సరాల్లోకి అడుగు పెట్టడాన్ని స్వాగతిస్తున్నాను. ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక, తాత్విక, విద్య, సాంస్కృతిక అంశాలను లోతైన విశ్లేషణలతో ప్రజల ముందుకు తెచ్చింది. మేధావులు, ఆలోచనాపరులు వివిధ ఉద్యమ నాయకులు, కార్యకర్తలు ఈ 17 సంవత్సరాలుగా పత్రికను అధ్యయనం చేస్తున్నారు. దీన్ని నడుపుతున్న ఎన్. వేణుగోపాల్ డి.డి. కోశాంబి పుస్తకాన్ని అనువాదం చేసిన మేధావి. వీక్షణంలో వచ్చే వ్యాసాల్లో గణంకాలు, దృక్పథం, విశ్లేషణ సమాచారం సప్రమాణంగా ఉంటాయి. దీనిలో రచయితలుగా ఎద్యుకేట్ చేసిన దాంట్లో వి. హనుమంతరావు ఎంతో ఆర్థిక సమాచారాన్ని ఇచ్చేవారు. అలాంటి వ్యక్తి మరణించడం బాధాకరం, ఆయన లేకపోవడం పత్రికా రంగానికి ఒక లోటు. ఇంకా అనేక మంది రచయితలు భారతదేశ వర్తమానాన్ని విశ్లేంచడమే కాక భవిష్యత్‌కు కూడా మార్గాన్ని నిర్దేశించారు. నాకు కూడా వీక్షణం అంబేద్కర్ ఆలోచనలను వీక్షణం పాఠకులకు చేరడానికి అవకాశం కల్పించింది. సుమారు 60 వ్యాసాలు రాశాను. నా పుస్తకాలు కూడా ఎంతో అభిమానంతో వీక్షణంలో ప్రకటించి ప్రజల్లోకి వెళ్లడానికి తోడ్పడింది. ప్రధానంగా ఎంతో మంది రచయితల పుస్తకాలను మేధావుల దృష్టికి తీసుకెళ్లింది. ముఖ్యంగా కొడవటిగంటి కుటుంబరావు వాల్యూమ్స్, కె.వి. రమణారెడ్డి సంపుటాలు, త్రిపురనేని మధుసూదనరావు రచనలు ఇలా అమరులైన మేధావుల కృషిని, అక్షరబద్ధం చేసిన గ్రంథాలను మనకు పరిచయం చేసింది. వీక్షణం సుమారు ఒక దశాబ్దంగా దళిత దృక్పథం ఉన్న వ్యాసాల్ని ప్రచురించింది. స్త్రీవాద దృక్పథం ఉన్న వ్యాసాల్ని విశ్లేషణాత్మకంగా ప్రచురించింది. కులాధిపత్య భావజాలాన్ని వ్యతిరేకించే సాంఘిక సంస్కర్తల గురించి ప్రచురించింది. వీక్షణం బహుముఖంగా వీక్షించిందనే చెప్పాలి. కొన్నిసార్లు చర్చా వేదికలు కూడా నిర్వహించింది. ముఖ్యంగా గతితార్కిక భౌతికవాదాన్ని భిన్న కోణాల్లో ప్రజలకు అందించింది. భూమిని గురించిన వివరాలు, భూ పోరాటాలకు సంబంధించిన సమాచారం ప్రజాస్వామ్య లౌకికవాద భావజాలలకు వేదికగా నిలిచింది. ఒక పత్రికగా 17 సంవత్సరాలు నడపడం అసమాన్యమైన విషయం. వీక్షణం సంపాదక వర్గాన్ని, భౌతిక, బౌద్ధిక శ్రమను తెలియజేస్తూ ఒక అర్ధ శతాబ్దం ఈ పత్రిక నడుస్తుందని ఆశిస్తున్నాను.




'వీక్షణం' పత్రికని నేను మొదటి నించీ చదవ లేదు. గత కొన్నేళ్లుగా, దీనిలో వచ్చిన వ్యాసాలు కొన్ని పూర్తిగానూ, కొన్ని అసంపూర్తిగానూ, చదివాను. కారణం : విషయాలు తెలుసుకోవల్సినవే అయినా, ఆ వ్యాసాలు తేలిగ్గా అర్థమయ్యేట్టు లేక పోవడమే. వీక్షణం పాఠకుల్లో, నాకు తెలిసిన వాళ్లు చెప్పిన దాని సారాంశం ఏమిటంటే, 'రాజకీయ, ఆర్థిక సమస్యల గురించి తెలుసుకోవాలనే ఉత్సాహంతో చదవడం మొదలు పెడితే, అనేక సార్లు ముందుకు సాగలేక, పేజీలు తిరగేసి ఊరుకున్నాం' – అని! ఈ సమస్య గురించి, పత్రికకి వ్యాసాలు రాసే వాళ్లు, 'ఎలా రాస్తే' పాఠకులు తేలిగ్గా అర్థం చేసుకోగలరో, బాగా ఆలోచించాలి. రాజకీయ, ఆర్థిక విషయాలు చర్చించే ఏ పత్రికైనా అవసరమే. వీక్షణం కూడా కొనసాగుతూనే ఉండాలి.

రంగనాయకమ్మ
రచయిత, మార్క్స్ 'కాపిటల్' పరిచయకర్త



'వీక్షణం' ప్రతిపక్షపాత్ర నిర్వహిస్తోంది. డిసెంటింగ్ వాయిస్‌కి వేదిక కల్పిస్తోంది. భారతదేశ రాజకీయ, సాంస్కృతిక, సామాజిక పరిస్తితులపై గొప్ప విశ్లేషణాత్మక వ్యాసాలు వస్తున్నాయి. సామాన్య పాఠకులకవి గొప్ప అవగాహనను ఇస్తాయి. ఒకరకంగా చాలా ఎడ్యుకేటివ్‌గా ఉంటుంది. మామూలు పాఠకుడికి సాంస్కృతిక కళారంగం మీద కచ్చితమైన ప్రజాభిప్రాయం ఏర్పడడానికి దోహదం చేస్తుంది. సంపాదకున్ని, యాజమాన్యాన్ని అభినందిస్తున్నాను. ఇలాగే ప్రజాస్వామిక విలువలకు కట్టుబడి పనిచేయాలని కోరుకుంటూ... ఇట్లు వీక్షణం పాఠకుడు

కె. శివారెడ్డి
కవి



రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల నిరంతర విశ్లేషణల పదిహేడేండ్ల ప్రతిబింబం వీక్షణం. సరైన సమాచారం, లోతయిన అవగాహన, ప్రజా ప్రయోజన లక్ష్యం వీక్షణం ప్రతి పేజీలో గుర్తించవచ్చు. ప్రాంతీయ పరిస్థితులు, జాతీయ పరిణామాలు, అంతర్జాతీయ ప్రభావాల అధ్యయనాలు ఆలోచనలకు పదును పెడతాయి. రెండు దశాబ్దాల ప్రపంచ పరిణామాల్ని వీక్షణం విశ్లేషించింది. పరిశోధకులెందరికో ఆధారంగా నిలిచింది. ప్రజాస్వామిక భావనలను సమున్నతంగా సజీవంగా నిలిపింది. అన్ని కాల పరీక్షలను తట్టుకొని వీక్షణం నిలబడాలి, కలెబడాలి. వీక్షణం బృందానికి అభినందనలు.

నందిని సిధారెడ్డి
కవి,
తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు



ఇంగ్లిష్‌లో 'ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ', సెమినార్, 'ఫ్రాంటియర్' వంటి పత్రికల కోవన చేర్చదగ్గ తెలుగు పత్రిక 'వీక్షణం'. ప్రఖ్యాత పాత్రికేయులు, ఆర్థిక విశ్లేషకులు కీర్తిశేషులు వి. హనుమంతరావు స్థాపించిన పత్రిక అది. అభివృద్ధి క్రమాన్ని, విధానాలను, సామాజికార్థిక అంశాలను లోతుగా, విద్యాస్థాయిలో విశ్లేషిస్తూ తెలుగునాట వామపక్ష, విప్లవ, దళిత, ప్రజాతంత్ర వర్గాలన్నిటికీ వేదికగా ఉంటున్నది. వీక్షణమూ దాని సంపాదకుడూ కూడా తెలంగాణ ఉద్యమానికి అపారమైన దోహదం చేసినవారు. ఆలోచనలను బతకనివ్వండి. తెలంగాణ కూడా ఒకనాడు ఆలోచనే. అది వ్యాప్తి చెందిన తరువాతనే ఒక ఉద్యమమైంది. ఆ చరిత్ర మరిచిపోయి, ఆలోచనా రంగంలో పనిచేస్తున్న వారికి సంకెళ్లు బిగించాలనుకోవడం తప్పు చాలా పెద్ద తప్పు వెంటనే సరిదిద్దుకోండి.

కె. శ్రీనివాస్
రచయిత,
సంపాదకులు, ఆంధ్రజ్యోతి దినపత్రిక



కె. శ్రీనివాస్ రెడ్డి
జర్నలిస్ట్ ఉద్యమ నాయకులు
సంపాదకులు, ప్రజాపక్షం

వీక్షణం పత్రిక 17 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నా హార్దిక శుభాకాంక్షలు. పత్రికలు నడపడం నేటి పరిస్థితుల్లో ఎంత కష్టతరమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అలాంటిది ఒక వర్గ దృక్పథంతో, శ్రామికవర్గ చైతన్యానికి తోడ్పడే పత్రిక 'వీక్షణం' మంచి పరిశోధనాత్మక వ్యాసాలతో ఇంతకాలం నిరాటంకంగా కొనసాగించడం పట్ల వీక్షణం సంపాదకులు వేణును వారి సహచరులను మనసారా అభినందిస్తున్నాను. 'వీక్షణం' రెఫరెన్స్ పుస్తకం. వీక్షణం ప్రత్యామ్నాయ రాజకీయ సిద్ధాంతాలకు ప్రతీక.



ఎస్. వీరయ్య
సంపాదకులు,
నవ తెలంగాణ


వీక్షణం మాస పత్రిక 18 ఏట అడుగు పెడుతున్న సందర్భంగా దాని నిర్వాహకులకు, సంపాదక వర్గానికి అభినందనలు. ఒక మాస పత్రిక, ప్రజలకి అంకితమై నడిచే పత్రిక నిరాఘాటంగా 17 ఏండ్లుగా ప్రచురించడం సాధారణ విషయం కాదు. జీవితమంతా ప్రజలకోసమే కలం పట్టిన వి. హనుమంతరావు స్థాపించి నడిపించిన పత్రిక వీక్షణం. ఆయన తదనంతరం అంతే పట్టుదలతో ఎన్. వేణుగోపాల్ పత్రిక నిర్వహించడం అభినందనీయం. ప్రజల కోసం రాజకీయా, ఆర్థిక, సామాజిక పత్రిక నడపడం అంత సులభం కాదు. ఆర్థిక సమస్యలతో పాటు రాజకీయ వత్తిడలను అధిగమించి పత్రిక నడపడం చిన్న విషయం కాదు. సంక్లిష్టమైన సమకాలీన పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి పత్రికల ప్రాధాన్యత మరింత పెరిగింది. వామపక్ష ఉద్యమం బలోపేతం చేయడం, ప్రజలను చైతన్య పరచడం ఉద్యమబాట పట్టించడంలో పత్రికల పాత్ర గొప్పది. ఈ పాత్ర నిర్వహించడం సహించలేని పాలక వర్గాలు కుట్రలూ, కుతంత్రాల మధ్య పత్రిక నిలదొక్కుకోవాల్సిన సందర్భమిది. భవిష్యత్తులో అవంతరాలను అధిగమిస్తూ వీక్షణం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ...



కొండవీటి సత్యవతి
సంపాదకురాలు,
స్త్రీవాద పత్రిక భూమిక

వీక్షణం సంపాదకులకు నమస్కారం. పదిహేడవ పుట్టిన రోజును జరుపుకుంటున్న వీక్షణం, రాజకీయార్థిక, సామాజిక మాస పత్రికకు అభినందనలు. పదిహేడు సంవత్సరాల క్రితం వి. హనుమంతరావు గారు వ్యవస్థాపక సంపాదకులుగా ప్రారంభమైన వీక్షణం తెలుగులో వస్తున్న ఒకే ఒక్క సీరియస్, నిబద్ధత కలిగిన పత్రికగా నేను భావిస్తాను. దేశంలోను, అంతర్జాతీయంగాను జరిగే రాజకీయ, ఆర్థిక పరిణామాలను నిశితంగా గమనించడంతో పాటు వాటి తాలూకూ విశ్లేషణాత్మక వ్యాసాలు క్రమం తప్పకుండా ప్రచురిస్తుంది వీక్షణం. ఇంగ్లీష్‌లో వచ్చే 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' అనేకానేక అంశాల మీద లోతైన విశ్లేషణలతో వ్యాసాలు ప్రచురించినట్లే తెలుగులో 'వీక్షణం' ఆ పనిని విజయవంతంగా చేస్తోంది. వ్యవస్థాపక సంపాదకులు వి. హనుమంతరావు గారు చాలా ఆత్మీయంగా మాట్లాడేవారు. చాలా సార్లు వారు 'భూమిక'కు వ్యాసాలు పంపించేవారు. స్త్రీల అంశాలకు సంబంధించిన వ్యాసాలు 'భూమిక'లో వస్తే బావుంటుందమ్మా అనేవారు.

ఈనాటి రాజకీయ, ఆర్థిక, సామాజిక సంక్షోభాల నేపథ్యంలో 'వీక్షణం' లాంటి పత్రికల అవసరం ఎంతో ఉంది. వీక్షణం మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని కోరుకుంటూ, సంపాదకుడు ఎన్. వేణుగోపాల్‌కు అభినందనలు, హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.



చాడ వెంకటరెడ్డి
సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

వీక్షణం వార పత్రిక 17 వసంతాలు విజయవంతంగా ముగించుకొని 18 ఏట అడుగిడుతున్న సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. వీక్షణం పత్రికంటేనే సామాజిక స్పృహ కలిగిన ప్రత్యేక తరహా పత్రిక. సాంఘీక దురాచారాలు, సామాజిక దుర్మార్గాలు, సబ్బండ వర్ణాల ప్రజల జీవన ప్రమాణాలు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ, మానవ విలువలను నిలబెట్టడం, పౌరహక్కులకు భంగం కలిగినప్పుడల్లా స్పందించే ప్రజాపక్షం వీక్షణం. సామాజిక చైతన్యానికి నిలువుటద్దం వీక్షణం. ప్రతి ఒక్కరికి అర్థమయ్యే, సరళమైన భాషలో అందుబాటులో ఉంటున్న వీక్షణానికి చేయూతనివ్వాలి. వీక్షణం పత్రిక మూడు పూవులు, ఆరు కాయలుగా విలసిల్లాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. అభినందనలతో...

'వీక్షణం' పత్రిక 17 సంవత్సరాలు జయప్రదంగా పూర్తిజేసుకుని, 18వ వసంతంలోకి అడుగిడుతున్న శుభ సందర్భంలో పత్రిక యాజమాన్యాకి, సిబ్బందికి అభినందనలు. పాలక వర్గాలు, దోపిడీ శక్తులు కొత్త, కొత్త రూపాలలో మోసపూరిత నినాదాలతో, ఉద్వేగాలు, సెంటిమెంట్ల చాటున ప్రజలను పీల్చి పిప్పిజేస్తున్న కాలం ఇది. మతోన్మాదం, ఆర్థికదోపిడీ, కర్కశత్వం తారస్థాయికి జేరిన విషమ పరిస్థితుల్లో ఈ ప్రజాకంటక పాలనల గుట్టువిప్పి ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పి, చైతన్యం రగిలించవలసిన శక్తుల అవసరం నేడెంతో ఉంది. ఈ మహాయజ్ఞంలో 'కలం' శక్తులు నిర్వహించాల్సిన పాత్ర అతి కీలకమైంది. కానీ కలాలకు కార్పొరేట్లు 'రేట్లు' నిర్ణయించి తమలో కలిపేసుకుంటున్న దుస్థితి మనం చూస్తున్నాం. ఇలాంటి తరుణంలో 17 సంవత్సరాలుగా నిర్భయంగా, నిజాయితీగా ప్రజల పక్షాన నిలబడే ప్రయత్నంజేస్తూ రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలపై వాస్తవ విశ్లేషణలతో, పదునైన వ్యాఖ్యలతో ప్రజాదరణ పొందుతున్న వీక్షణం విజయయాత్ర అప్రతిహతంగా ముందుకు, మరింత ముందుకు సాగాలని మనస్పూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. పత్రిక ఎడిటర్, ప్రియ మిత్రులు వేణుగోపాల్ గారికి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను.



తమ్మినేని వీరభద్రం
సిపిఐ(ఎం)
తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

వీక్షణం వర్ధిల్లాలి!

రాజకీయాలు వ్యాపారంగా మారిన తరువాత, మీడియా కొత్త అవతారం ఎత్తిన ఈ రోజుల్లో సమాచారం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను, సాధనాలను వెతుక్కోవలసి వస్తున్నది. అట్లాంటి ప్రత్యామ్నాయ సమాచార మాధ్యమంగా వీక్షణం పత్రిక వచ్చి 17 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు సంతోషంగా ఉన్నది. 18వ పుట్టిన రోజు సందర్భంగా వీక్షణం పత్రిక సంపాదకులకు, నిర్వాహకులకు, పాఠకులకు శుభాకాంక్షలు. ఉన్నత ప్రమాణాలు పాటించి రాసిన వ్యాసాలతో ఇప్పటికి 220 సంచికలు రావడం చాలా గొప్ప విషయం.

అక్షరాస్యతా శాతం పెరిగింది, డిగ్రీ పూర్తి చేసిన వాళ్లు బోలెడు మంది ఉన్నా మన దగ్గర రాసేవాళ్లు తక్కువ. రాయగల శక్తి ఉన్న జర్నలిస్టులు, అధ్యాపకులు వృత్తి అవసరాలకు పరిమితమైపోతుంటారు. వీరిద్దరు కాక బయట రాయగలిగే వారు చాలా తక్కువ. వారి వెంటపడి సకాలంలో వ్యాసాలు సేకరించి, సంచికను సకాలంలో వెలువరించడం ఎంత కష్టమో! అట్లాంటి పనిని 17 ఏళ్ల పాటు చేయగలిగారంటే నిర్వాహకులను, సంపాదకులను అభినందించక తప్పదు.



ఎం. కోదండరాం
సామాజిక శాస్త్రవేత్త,
తెలంగాణ జనసమితి
నాయకులు

ఇక ప్రత్యామ్నాయ మీడియా ఎదుర్కొనే రెండవ సమస్య, ముద్రణ, నిర్వాహణకు అవసరమయ్యే నిధుల సేకరణ, ప్రతి సంచిక ముద్రణకు పోతున్నప్పుడు జోలెపట్టి తిరిగి డబ్బులు అడుక్కోవలసి ఉంటది. వీక్షణం వంటి పత్రిక నడిపే వాళ్లకు బయట ఇంకొక జీవితం ఉండదు. ఆ పత్రికకే జీవితం అంకితమైపోతది. అట్లా కొందరు, మనకొరకు మంచి వ్యాసాలను తేవడానికి జీవితాన్ని త్యాగం చేయడం వల్లనే వీక్షణం వంటి పత్రికలు నడుస్తున్నాయి. వేల కోట్ల ప్రజా ధనాన్ని కొల్లగొట్టడానికి రాజకీయాధికారం సాధనంగా మారిన నేటి కాలంలో, ఆ అధికారాన్ని నెలబెట్టడానికి కావలసిన మాయాజాలాన్ని సృష్టించడమే పత్రికల పనిగా మారింది. ఈ రోజుల్లో ఉద్వేగాలను రెచ్చగొట్టి అధికారాన్ని పదిల పరుచుకోవడానికి కావలసిన మార్మికతను పత్రికలు ప్రచారం చేస్తున్నాయి. నేటి వార్తా పత్రికల్లో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియదు. ఏది వాస్తవమో, ఏది కట్టుకథో అర్థం కాదు. ఈ పరిస్థితుల్లో పాలను, నీళ్లను వేరుచేసినట్లు వాస్తవాలను ప్రచార ఆర్భాటాల నుండి వేరుచేసి ప్రజల ముందుకు తేవడం చాలా అవసరం. ఆ ప్రయత్నం జరుగకుండా ప్రజా ధనాన్ని కొల్లగొట్టే రాజకీయాలు అంతం కావు. ప్రజలకు రాజకీయాల్లో అర్థవంతమైన భాగస్వామ్యాన్ని పెంచుకోవడం సాధ్యం కాదు. సమాజాన్ని ప్రజాస్వామికీకరించడానికి వాస్తవాలను చెప్పి, ప్రజలను చైతన్య పరచగల పత్రికలు చాలా అవసరం. అప్పటిదాకా ఎంత కష్టమైనా 'వీక్షణం' పత్రికను నడిపంచాలని కోరుతున్నా. అందుకు పాఠకులు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇంటర్‌నెట్ యుగంలో, టెలివిజన్ ప్రపంచంలో పత్రిక నడపడం చాలా కష్టంతో కూడుకున్న పని. అందులో మాస పత్రికలు మరీ కష్టం. ఇలాంటి ఇబ్బందుల్ని తట్టుకొని 17 సంవత్సరాల పాటు నిర్విరామంగా వీక్షణాన్ని ప్రచురిస్తున్నందుకు హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. తెలుగు నాట ఇన్ని పత్రికలు ఉండగా ఇంకో పత్రిక ఎందుకు? అనే ప్రశ్న ఎప్పుడూ ఉంటుంది. కాని సమకాలీన అంశాలను ప్రజల దృక్పథంతో వీక్షించడం వల్లనే వీక్షణం పాఠకుల ఆదరణను పొందగలిగింది. సమాజంలో ఆధిపత్య వర్గాల ఆలోచనలను జనంపై రుద్దేందుకు సమస్త శక్తులుకల పత్రికా రంగం ఉన్న రోజుల్లో సామాన్యుడి గొంతుకగా ప్రత్యామ్నాయ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లడం నిజంగా ఒక సాహసమే. ఇలాంటి సాహసాన్ని చేసిన వీక్షణం యాజమాన్యాన్ని, సిబ్బందిని అభినందిస్తున్నాను. రాబోయే కాలంలో ఆధునిక సాంకేతిక హంగులను కూడా సమకూర్చుకొని సమాజ మార్పుకు మరింత సమర్థవంతంగా వీక్షణం పునరంకితం కాగలదనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాను.



కె. నాగేశ్వర్
విశ్లేషకులు, అధ్యాపకులు,
ఉస్మానియా విశ్వవిద్యాలయం

వీక్షణం పదిహేడేళ్ల ప్రయాణం



కె.ఆర్. చౌదరి
వ్యవసాయ అర్థశాస్త్రవేత్త, రచయిత

వీక్షణం పత్రిక వచ్చి 17 సంవత్సరాలు పూర్తయింది. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి, ఇక్కట్లకులోనై పత్రిక నిరాఘాటంగా వస్తున్నది. 18వ సంవత్సరంలోకి అడుగుపెట్టబోతోంది. ఇందుకు ప్రధాన కారణం వేణు సిబ్బంది అని చెప్పక తప్పదు. వాళ్ల నిష్ఠతో, శ్రమతో ఈ పత్రిక నడుస్తున్నది.

రాజకీయ, సామాజిక, సాంస్కృతిక విషయాలపైన అనేక విశ్లేషణలు ఈ పత్రికలో వచ్చాయి. అవి ఎంతో ప్రామాణికమైనవి. ఇది వేలాది మందికి విజ్ఞానాన్ని, స్ఫూర్తిని పంచింది. వీక్షణం ఇలాగే కొనసాగాల్సిన అవసరం ఉంది. పత్రికను బతికించుకోవాలి. ఇప్పటికీ, అనేక ఒడుదొడుకులకు లోనై ఉంది. కాబట్టి తెలుగు ప్రజానీకం దీన్ని ఆదుకోవాలి. ఇలాగే పత్రికను కొనసాగించడానికి పత్రిక సంపాదకులు వేణు గారు సిబ్బంది తమ పూర్తి సహకారాలు అందిస్తారని ఆశిస్తున్నాను.



దేవిప్రియ
కవి, జర్నలిస్ట్

వీక్షణం ఒక శాశ్వత వ్యవస్థ కావాలి. వీక్షణం వార పత్రికగా రావాలనేది నా ఆకాంక్ష. మాస పత్రికగానే మనుగడకోసం తన్నుకులాడుతున్న పత్రికకి అది ఎట్లా సాధ్యం అనే ప్రశ్న పదేళ్లుగా వింటున్నాను. వీక్షణం ఆర్థిక స్థితిగతుల గురించి, యథార్థ స్థితి గురించి మాట్లాడి, దీనిని పటిష్టపరిచే మార్గాలను అన్వేషించడానికి ప్రజాస్వామిక వాదులలోని వనరు వర్గాల మిత్రులతో, శ్రేయోభిలాషులతో ఒక సమావేశం నిర్వహించాలని నేను రెండు మూడు సార్లు వేణుకి సూచించాను. అటువంటిది ఏదైనా జరిగిందో లేదో నాకు తెలియదు.

ఈ సందర్భంలో 'వీక్షణం' పత్రికల్లో వస్తున్న అంశాల నాణ్యతకంటే, పత్రికను సంరక్షించుకోవడం, అభివృద్ధి చేసుకోవడం ఎట్లా అన్నదే ముఖ్యంగా చర్చకు రావాలని నేననుకుంటున్నాను. సిపిఎం, సిపిఐ వంటి పార్టీలు నడిపే 'మార్క్సిస్టు' వంటి పత్రికలకు ఆయా పార్టీల ఆర్థిక వనరుల అండ ఉంటుంది. మనం కూడా 'వీక్షణం' కోసం అటువంటి 'శాశ్వత' వ్యవస్థని ఏర్పాటు చేయగలగాలనేది నా ప్రగాఢ వాంఛ. నిఖిల్ చక్రవర్తి ప్రారంభించిన 'మెయిన్‌స్ట్రీమ్'కు సంస్థాపర నమూనా, 'ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లి'ని ప్రచురిస్తున్న సమీక్ష ట్రస్ట్ నమూనా ఏమిటో అధ్యయనం చేసి మనం 'వీక్షణం' కోసం గట్టి ఆర్థిక పునాదిని నిర్మించలేమా? ముందు ఒక వంద మంది వీక్షణం అభిమానులను గుర్తించి, ఒక సమావేశం నిర్వహించే బాధ్యతని వేణుగోపాల్, మలుపు బాల్‌రెడ్డి వంటి కార్యశూరులు స్వీకరిస్తే సంతోషిస్తాను.

వీక్షణం తన ప్రజా పాత్రికేయ స్వభావాన్ని ఇలాగే కాపాడుకుంటూ, విశ్లేషణలనీ, పఠనీయతనీ, ప్రజెంటేషన్‌నీ మెరుగుపరుచుకుంటూ, నిరంతరంగా, సజీవంగా కొనసాగాలని కోరుకుంటున్నాను. వేణుగోపాల్ బృందాన్ని గుండెలకి హత్తుకుంటున్నాను.



కె. లక్ష్మినారాయణ
అధ్యాపకులు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

దేశంలో ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ లాగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపైన ప్రజల పక్షాన నిలబడి సమాచారం, విశ్లేషణలు అందించే పత్రిక లేదని నేను అనుకుంటూ ఉండేవాన్ని. 'వీక్షణం' పత్రిక రావడంతో ఆ లోటు చాలా వరకు పూర్తి అయ్యింది. వచ్చే జనవరి సంచికతో పద్దెనిమిదో సంవత్సరంలో అడుగు పెడుతున్నది. ఈ కాలంలో వీక్షణం ఉమ్మడి రాష్ట్రానికి ఆ తర్వాత ఏర్పడిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అనే రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు వివిధ అశాలపై విశ్లేషణలను అందిస్తూ గణనీయమైన కృషి చేస్తున్నది. ఈ కృషిని రెండు రంగాలలో చూడవచ్చు.

ఒకటి ప్రజా సంఘాలలో, సామాజిక సంఘాలలో పనిచేస్తున్న సభ్యులకు, నాయకులకు ప్రజా సమస్యలపై, ప్రభుత్వ విధానాలపై సమాచారం, నిజనిజాలు, విశ్లేషణలు అందిస్తున్నది. పరిశోధనలు చేసి రాసిన వ్యాసాలు కూడా ఎక్కువ సంఖ్యలోనే వస్తున్నాయి. దీనివలన ఉద్యమకారుల, వివిధ ప్రజా సమూహాల దగ్గరకు వెళ్లి కదిలించడానికి ఉపయోగపడుతున్నది. రెండవది వీక్షణంకి ఐఎస్ఎస్ఎన్ నంబరు రావడం వలన కాలేజీల్లో, యూనివర్సిటీలలో బోధించే అధ్యాపకులకు, పరిశోధక విద్యార్థులకు కూడా ఉపయోగకరంగా ఉన్నది. వీక్షణంలో వ్యాసాలు ప్రచురించుకుంటే వారు ఉద్యోగాలకు అప్లై చేసుకోవడానికి, ప్రమోషన్లు పొందడానికి ఉపయోగపడుతున్నది. రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై ప్రజల వైపు నిలబడి విశ్లేషణలు అందిస్తున్న 'వీక్షణం' పత్రిక నిరంతరంగా, నిరాటకంగా కొనసాగాలని కోరుకుంటున్నాను.

తెలుగులో ఒక మంచి సీరియస్ పత్రిక అంటే అందరికీ గుర్తుకొచ్చే పేరు 'వీక్షణం'. సమకాలీన సామాజిక, రాజకీయ అంశాలపై నిష్పక్షపాతమైన విశ్లేషణ అందించడంలో 'వీక్షణం' పత్రిక ఎప్పుడూ ముందు ఉంటుంది. బాగా పేరున్న రచయితల నుంచి అప్పుడే రాస్తున్నవారి వరకు ఎవరి వ్యాసం ఆలోచనాత్మకంగా ఉన్నా దాన్ని వీక్షణం ప్రచురిస్తుంది. తెలుగులో రాజకీయ, సామాజిక పత్రికలు తగ్గిపోతున్న సందర్భంలో వీక్షణం ఒక సీరియస్ మాగజైన్‌గా వస్తు చదువరికి వివిధ వర్తమాన విషయాల పట్ల ఒక పాజిటివ్ దృక్పథాన్ని అందిస్తుంది. ఆన్ లైన్ పత్రికల ధాటిని, సామాజిక మాధ్యమాల హోరునీ తట్టుకుని ఈ రోజుల్లో ఇటువంటి పత్రికలు నడపడం కొంత సవాలే, అయినప్పటికీ పదిహేడు సంవత్సరాలుగా ఈ పత్రికను ఆపకుండా తీసుకొస్తున్న పత్రిక ఎడిటర్, యాజమాన్యంకి అభినందనలు.



చల్లపల్లి స్వరూపరాణి
రచయిత, అధ్యాపకులు,
నాగార్జున విశ్వవిద్యాలయం

జాతీయ, అంతర్జాతీయ రాజకీయార్థిక పరిణామాల పైన, దేశీయ ప్రభుత్వ విధానాల పైన ప్రజా ప్రయోజనాల కోణం నుండి ఆలోచించేందుకు, అవగాహన పెంచుకునేందుకు అవసరమైన సమాచార విశ్లేషణలకు అచ్చమైన మూల వనరు 'వీక్షణం' పత్రిక. ప్రజాస్వామ్యంలో ప్రజలను చైతన్యపరిచే బాధ్యత పత్రికలది అని నమ్మి ఆ దిశగా నిర్వహించబడుతున్న వీక్షణం ప్రజా ఉద్యమాలకు నోరు ఇయ్యడంలోనూ ముందున్నది. ప్రపంచం, ప్రత్యేకించి భారతీయ సమాజం అనేక సంక్లిష్ట, సంఘర్షణాత్మక రాజకీయార్థిక సందర్భాలలోకి ప్రవేశించిన కొత్త సహస్రాబ్ది ప్రారంభంలో ఏర్పడిన ఈ పత్రిక ఈ కాలానికి అవసరమైన ఆలోచనలను వ్యాపింపచేస్తూ సాగించిన పదిహేడేళ్ల ప్రయాణం అభినందించదగినది.

ప్రతికూల పరిస్థితులలోనూ ఈ స్ఫూర్తిని ఇంతకంటే అభివృద్ధి కరంగా ముందుకు తీసుకుపోయే నిబద్ధత ఎడిటోరియల్ కలెక్టివ్‌కు ఇబ్బడి ముబ్బడి కావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలతో.




కాత్యాయనీ విద్మహే
తెలుగు అధ్యాపకులు,
రచయిత

వీక్షణం నా సహచరుడు. దమ్ము, ధైర్యం, సాహసం లక్ష్యం గల మాస పత్రిక వీక్షణం. ఇది ప్రజల పత్రిక. చైతన్య సంపదకు ప్రతీక. ప్రజల మనోభావాలను తీర్చిదిద్దే పత్రిక. ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిని – ఆధిపత్య పాలకులు, పాలక వర్గాలు, సంపన్న మదాంధులు ఎలా కాజేస్తున్నారో ఈ పత్రిక విప్పిచెబుతుంది. దీనికి ఒక నిర్దిష్ట స్వభావం, తాత్విక చింతన ఉంది. ప్రజల్ని మేల్కొలుపుతూ, తాను మెలకువగా ఉంటూ ప్రాంతీయ తాత్వాక చింతనతో పాటు, అంతర్జాతీయ అవగాహనను బలంగా, గాఢంగా నెమరువేసుకునేట్లు శ్రమిస్తుంది. కుల, మతాల ఆధిపత్య ధోరణులను ఖండిస్తుంది. పేదల, నిరుపేదల దయనీయ జీవన విధానాలను మన మనసుకు నేర్పుతుంది. ఈ ప్రజల ఆరాధ్య పత్రికకు వ్యాపార గుణం లేదు. ఇది ఎలా బతుకుతుందో, ప్రజల మనోభావాల్ని ఎలా బతికిస్తుందోనన్న ఆందోళన నాకుండేది. ఆర్థిక సమస్యల వల్ల ఎన్ని పత్రికలు ఆత్మహత్య చేసుకోలేదు. తమ కాళ్ల మీద తాము ప్రజలు నడిచే విధంగా వీక్షణం శ్రమిస్తూ వస్తుంది కానీ, దాని కాళ్లు ఆర్థిక వనరులు లేక ఎక్కడ ఇరిగి పోతాయోనన్న భయం నాకుండేది. సమస్త ఆర్థిక, రాజకీయ, సామాజిక ఆధిపత్యాల డొల్లతనాలను ఈ పత్రిక విశ్లేషించినంతగా మరో పత్రిక విశ్లేషించ లేదు. ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ పరిణామాలను, పెట్టుబడిదారుల శ్రమ దోపిడీలను, పాలక హింసను హేతుబద్ధంగా సహేతుకంగా ప్రజల ముందు ఉంచింది. వీక్షణం వీక్షణమే. దానితో సమానమైన పత్రిక మరొకటి లేదు. దాని నడక ప్రజల నడక. ప్రజల్ని నడిపించే వారి నడక. దాని వ్యక్తిత్వం ప్రజల వ్యక్తిత్వమే. ప్రజల్ని నడిపించేవారి వ్యక్తిత్వమే. ఇంచుమించుగా మాధ్యమాలన్నీ సంపన్నుల, వ్యాపారస్తుల జేబురుమాలుగా మారిన సందర్భంలో వీక్షణం ప్రజల పక్షాన నిలబడి, వారి గొంతులో గొంతవుతున్నదుకు, వాళ్ల దుఃఖంలో భాగం పంచుకుంటున్నందుకు అభినందనలు. వ్యాపార మాధ్యమాలు ఎన్ని విధాల కొమ్ములు కాస్తున్నాయో, వాళ్ల సర్క్యులేషన్స్ కోసం ఎన్ని విధాల గిల్లుతున్నాయో పుల్లలు పెడుతున్నాయో, ప్రజల మనోభావాల్ని పక్కదారులు పట్టిస్తున్నాయో మనకు తెలుసు. అన్ని ఆధిపత్యాల్ని ప్రశ్నించే మాధ్యమాలే ఆధిపత్య పోరులో తలమునకలు వేస్తున్న తరుణంలో ప్రజల్ని ఉద్యమ బాట పట్టేటట్లు ప్రజాస్వామిక పోరాటాలు చేయదానికి పూనుకునేట్లు చేస్తున్న వీక్షణం సంపాదకులు ఎన్. వేణుగోపాల్, రామచంద్రం, ఇరుగు–పొరుగు, రాజశేఖర్ భూగోళం, వెంకటేష్ అసహజ మరణాల సూచితో పాటు సంపాదకీయాలు, సంపాదకీయ వ్యాఖ్యలు, చర్చలు, రాజకీయ, సామాజిక, ఆర్థిక విశ్లేషణలు ప్రజలకు, బుద్ధిజీవులకు, సృజనాత్మక సాహిత్య, సాంస్కృతిక, కళా సృజన కారులకు ఓ తల్లి పాత్ర పోషిస్తున్నందుకు అభినందన. వీక్షణం పత్రిక కాదు నా సహచరుడు.



నాళేశ్వరం శంకరం
కవి, తెలంగాణ రచయిత
సంఘం అధ్యక్షులు



వి.ఎస్. ప్రసాద్
సామాజిక శాస్త్రవేత్త

గత 17 సంవత్సరాలుగా రాజకీయార్థిక, సామాజిక పరిస్థితులను, మార్పులను చారిత్రక ప్రజాస్వామిక దృక్పథంతో తెలుగు పాఠకులకు విశ్లేషణాత్మకంగా వివరిస్తున్నందుకు వీక్షణంను అభినందిస్తున్నాను. నేను ఎన్నో సంవత్సరాలుగా వీక్షణంను చదువుతున్నాను. సామాజిక శాస్త్ర విద్యార్థిగా, అధ్యాపకుడిగా సామాజిక గమనాన్ని సామాన్యుని దృక్పథం నుండి అర్థం చేసుకోవడానికి వీక్షణంలోని వ్యాసాలు ఎంతో ఉపయోగ పడుతున్నాయి. సామాన్యుని గళంగా ఉండే పత్రికలంటే పాలకులకు ఎప్పుడూ అసహనమే. నేటి విపరీత పరిస్థితులలో పాలకుల ఈ అసహనం ఇంకా ఎక్కువగా కనబడుతోంది. అందుకే వీక్షణంపై అనేక నిర్బంధాలు, అసత్య ఆరోపణలు. నేటి పరిస్థితులలో ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే వారందరూ నిర్భయంగా, ప్రత్యామ్నాయ భావాలను ప్రచురించే వీక్షణం లాంటి పత్రికలను కాపాడుకోవాలి.



రమా సుందరి
మాతృక సంపాదకవర్గ సభ్యులు

ప్రజాపక్ష పత్రికలకు ప్రతి పత్రిక గండాన్ని దాటడం ఒక పెద్ద పర్వతారోహణం లాంటిది. ఆర్థిక వనరుల కొరత ఒక్కటే కాదు. విషయ ప్రాధాన్యతలను ఎంచుకోవడం, ఆయా సంగతులను హిమ నది అడుగు అంత స్పష్టంగా తయారు చేసి పాఠకుల చెంతకు చేర్చడం చిన్న విషయం కాదు. ఈ నూతన ఆర్థిక విధానాల, హిందూ ఫాసిస్ట్ యుగంలో ఇది మరీ కష్టతరమైన విషయం. ఈ కష్టాన్ని వీక్షణం పత్రిక 17 సంవత్సరాలుగా ఈదడం అభినందనీయం. అట్ట దగ్గర నిరాడంబరంగా కనిపించే ఈ పత్రిక, సారంతో ఉన్నతమైనది.

ఈ పదిహేడు సంవత్సరాల కాలంలో అంతర్జాతీయంగా వచ్చిన పెను మార్పులు, భారతదేశంలో వాటి ప్రతిఫలనాలను అద్భుతంగా రికార్డ్ చేసింది వీక్షణం. వీక్షణం రచయితలకు ఉన్న నిబద్ధత, పత్రిక సంపాదకవర్గానికి ఉన్న సిద్ధాంత పట్టు ఈ పని ఆగకుండా జరగడానికి దోహదపడి ఉండాలి. వీక్షణం పత్రిక తన నాణ్యతలోనే కాదు, పత్రిక నడపడంలో ఉన్న అవరోధాలను దాటడంలో ఎన్నో ప్రత్యామ్నాయ పత్రికలకు ఆదర్శం అయ్యింది. నకిలీ వార్తలు, గ్లోబల్ ప్రచారాలకు నెలవుగా మారి; అధికార రాజకీయ పార్టీ బాకాలుగా ప్రధాన స్రవంతి పత్రికలు మారుతున్న కాలంలో – వీక్షణం లాంటి పత్రిక ప్రజా పక్షపాతిగా తన చారిత్రక కర్తవ్యాన్ని నెరవేరుస్తుంది.



ఓల్గా
రచయిత

వీక్షణం పత్రిక క్రమం తప్పకుండా చదివే పాఠకులలో నేనూ ఉన్నాను. అనేక ఆర్థిక, రాజకీయ విషయాలలోని ఎన్నో సంక్లిష్టతలను విప్పిచెప్పే ఏకైక పత్రిక వీక్షణం. సాంఘిక సమస్యలను ఎలా అర్థం చేసుకోవాలో ఆ చూపును కలిగిన పత్రిక. ఇంగ్లిష్‌లో వచ్చే ఇ.పి.డబ్ల్యుతో పోల్చగలిగిన పత్రిక. భిన్నాభిప్రాయాలకు చోటు ఇస్తూనే పాఠకులకు వాస్తవాలను అర్థం చేయించే నేర్పు మొదటి నుంచి పత్రిక అలవరుచుకుంది. జాతీయ, అంతర్జాతీయ విషయ పరిజ్ఞానానికి ఆధారపడదగిన పత్రిక.

ఐతే ఒకోసారి వ్యాసాలు మరింత సులభంగా, రీడబిలిటీతో ఉంటే బాగుండుననిపిస్తుంది. విషయంలో క్లిష్టత భాషలో ప్రతిఫలించ నీయకూడదు. అనవసర వాదోపవాదాలకు అమూల్యమైన స్పేస్‌ని వృథా చేయకూడదని అనిపించే సందర్భాలు ఉన్నాయి. వాటిని భవిష్యత్తులో నివారించవచ్చు. పదిహేడు సంవత్సరాల వీక్షణానికి అభినందనలు. మరిన్ని సంవత్సరాల సామాజిక సేవలో ముందుకు పోవాలని కోరుతూ...



సజయ కాకర్ల
విశ్లేషకులు, జర్నలిస్ట్

చరిత్ర అంటే గతమే కాదు. చరిత్ర అంటే వర్తమానం, భవిష్యత్తు కూడా. ఈ మూడింటినీ సమన్వయం చేసుకుంటూ ప్రజల పక్షాన నిలబడి బలమైన రాజకీయ విశ్లేషణను అందించే పత్రికగా, ప్రజల గొంతుగా నిలబడిన పత్రికగా ఎన్నో ఒడిదుడుకులు ఎదురవుతున్నప్పటికీ నిబ్బరంగా విలువలతో నిలబడిన పత్రిక వీక్షణం. స్థానికం నుంచీ దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిణామాలపై అధ్యయనంతో కూడిన విశ్లేషణాత్మక వ్యాసాలను తెలుగు సమాజానికి ఎప్పటికప్పుడు అందిస్తూ వచ్చింది వీక్షణం పత్రిక. ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కదను తొక్కిన ఉద్యమాలకు వారధిగా, సునిసితమైన రాజకీయ విశ్లేషణలను నిజాయితీగా అందించిన పత్రిక వీక్షణం. ఈ గమనంలో నేనూ ఒక రచయితగా భాగస్వామిగా ఉన్నందుకు, ఇన్నేళ్ల వీక్షణం ప్రయాణంతో కలిసి నడుస్తున్నందుకు నేను చాలా గర్వ పడుతున్నాను.

ఇప్పుడు 17 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వీక్షణం పునాది బృందానికి, సంపాదక వర్గానికి, రచయితలకు, పాఠకులకు అభినందనలు తెలియజేస్తూ పత్రిక మనుగడ కోసం మన వంతు సహకారం ఎలా అందించగలుగుతామో ఆలోచిద్దాం. ఆ వైపుగా కృషి చేద్దాం.



పద్మజా షా
విశ్రాంత ఆచార్యులు,
జర్నలిజం శాఖ,
ఉస్మానియా విశ్వవిద్యాలయం

తమ పాఠకుల కోసం ఒక న్యాయబద్ధమైన భవిష్యత్తును సాధించాలనే ఆశయానికి లోతుగా కట్టుబడిన సంపాదకుడి, సంపాదకవర్గపు మార్గదర్శకత్వంలో, పోషణలో వీక్షణం పది హేడు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ శతాబ్ది తొలిరోజుల్లో పుట్టిన వీక్షణం అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ రాజకీయాల్లో అత్యంత నాటకీయమైన మార్పులకు సాక్షిగా నిలిచింది. సాంకేతిక విధానంలో మార్పులు, ముఖ్యంగా అంతర్జాతీయ సమాచార సంబంధాల సాధనాలను మార్చివేసిన మార్పులు, ఇరవయో శతాబ్దపు నిశ్చల నిశ్చితాలనూ, విశ్వాసాలనూ పూర్తిగా కూలదోశాయి. ఈ అన్ని పరిణామాల పట్లా తెలుగు పాఠకులకు సమాచారం, విశ్లేషణ, అవగాహన అందించాలనే తన లక్ష్యాలకు అనుగుణంగా అవిశ్రాంతంగా పనిచేసింది. ఈ పత్రిక ప్రకటించిన సునిశితమైన సాంస్కృతిక, సాహిత్యపరమైన విమర్శ సమకాలీన చర్చలను బలోపేతం చేసింది. మంచి పరిశోధనతో కూడిన సమాచారం కావాలనుకునే తెలుగు పాఠకులకు వీక్షణం సంతృప్తికరమైన ఆహారాన్ని అందించింది. భవిష్యత్తు తరాలకు కూడ వీక్షణం ఒక సాధికారికమైన చారిత్రక కవిలెకట్టగా నిలిచిపోతుంది. అప్పుడప్పుడు ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొంటున్నప్పటికీ ఈ పత్రిక మరెన్నో సంవత్సరాలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను.



కె.పి. సుబ్బారావు
విశ్రాంత అధ్యాపకులు,
ఆంధ్ర విశ్వవిద్యాలయం

ముందుగా వీక్షణం పది హేడు సంవత్సరాలు పూర్తిచేసుకొని పద్దెనిమిదో సంవత్సరంలోకి అడుగు పెడు తున్నందుకు శుభాకాంక్షలు. ఇన్ని సంవత్సరాలు దిగ్విజయంగా వీక్షణం ప్రతీ నెలా మొదటి వారంలోనే తీసుకురావడం ఘనతే. ఒక మేగజైన్‌ను నెల వారీ తీసుకు రావడంలో ఎన్నో వ్యయప్రయాసలతో కూడుకున్న పని. దీనికి వీక్షణం అతీతం కాదు. ఆర్థికంగా ఇబ్బందిపడినా ఎప్పటికప్పుడు ఆకర్షణీయంగా నాణ్యతతో మంచి ప్రింట్‌తో వెలువడుతోంది. అతి ముఖ్యమైన విషయాలు (కాంటెపరరీ ఇష్యూస్ ఆఫ్ ఇంపార్టెన్స్) పాఠకుల ముందుకు తీసుకొని రావడంలో వీక్షణం సిబ్బంది విజయవంతమైందని నేను భావిస్తున్నాను. విషయపర నిష్ణాతులతో లెక్కకు మించిన వ్యాసాలను ప్రచురించడం వీక్షణం ప్రత్యేకత. తెలుగులో ఇటువంటి నెలవారీ పత్రిక మరొకటి లేదు. అయితే పర్యావరణంపై మరింత శ్రద్ధ తీసుకోవాలి. పర్యావరణంపై చేస్తున్న పోరాటం నేటి బాలబాలికలకు అనుసరణీయమైంది. ఆచరణీయమైనదీ కూడా. ఈ సందర్భంగా బాలల హక్కులపై కొంచెంద దృష్టిపెడితే పత్రిక సమగ్రంగా ఉంటుందనేది నా అభిప్రాయం. మహిళలు, దళితులు, సామాన్య ప్రజలపై జరుగుతున్న హింస, హక్కుల నిరాకరణ గురించి అనేక వ్యాసాలు ముద్రించడం ముదావహం. అవి చాలా గొప్ప చైతన్యానిచ్చేవిగా ఉన్నాయి. ఈ విషయాలతో పాటు రాజకీయార్థికమైనవి, చారిత్రకంగా పేరు మోసిన వ్యక్తుల గురించి వీక్షణంలో కొంత స్థలం ఇస్తే బాగుంటుంది. 'వీక్షణం' పద్దెనిమిదవ సంవత్సరంలో అడుగు పెట్టే క్షణంకోసం ఎదురుచూస్తూ...



మహమూద్
కవి, అధ్యాపకులు

వీక్షణం 18 వ సంవత్సరంలోకి విజయవంతంగా ప్రవేశిస్తున్నందుకు శుభాకాంక్షలు. ప్రజాపక్షం వహించి అనేక అననుకూలతల మధ్య పత్రిక నడపడం సులభమేమీ కాదు. చారిత్రక గమనంలో రెండు దశాబ్దాల కాలం పెద్దదేమీ కాదు. కానీ కాలం ప్రజాస్వామ్య వ్యవస్థ అయిన మనదేశం ముందు అనేక సవాళ్లు ఉంచింది. ప్రజాస్వామిక ఆకాంక్షలు నేపథ్యంగా అనేక ఉద్యమాలు ఈ కాలంలో తమ గళాన్ని వినిపించాయి. దానికి తగ్గట్టే ప్రభుత్వాల రిప్రెషన్‌ని ఎదుర్కొన్నాయి. వీటి వెనుక ఉన్న రాజకీయార్థిక అంశాలను వెలికి తీయడంలోనూ, వాటిని పాఠకులకు అందజేయడంలోనూ వీక్షణం అత్యంత ప్రజాస్వామిక పద్ధతిని గీటురాయిగా పెట్టుకుంది. దాదాపు ప్రతి ఇష్యూలో ప్రత్యేకమైన కథనాలను పాఠకులకు అందేలా జాగ్రత్తలు తీసుకుంది. పత్రిక అభిప్రాయాలతో ఏకీభవించని వారికి కూడా తమ అభిప్రాయాలను వెలిబుచ్చే, పత్రికను విమర్శించే అవకాశాన్ని కల్పించింది. అనేక అంశాల మీద భిన్న సామాజిక నేపథ్యం కలిగిన వ్యాసకర్తల మధ్య ప్రజాస్వామిక చర్చ జరిపి ఆ నేపథ్యంలో పాఠకులు తమదైన సొంత ఆలోచనలకు ప్రేరణగా నిలిచింది. మరే ఇతర తెలుగు పత్రికలలో దొరకని దేశీయ అంతర్జాతీయ రాజకీయ పరిణామాలను వీక్షణం పాఠకుల ముందుంచ గలిగింది. ఇక ముందు కూడా వీక్షణం ప్రజల చేతిలో జ్ఞానదీప్తిగా వెలగాలని మనసారా కోరుకుంటూ..

వీక్షణం మాసపత్రిక వర్తమాన ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రజలను నిర్దిష్ట ప్రగతిశీల దృక్పథంతో చైతన్యపరిచే కృషిని సాగిస్తోంది. ముఖ్యంగా భావజాల రంగంలో ఒక ప్రత్యామ్నాయ కృషి చేస్తోంది. అది ఇంతటి సుదీర్ఘకాలం నిరవధికంగా, నిరంతరాయంగా తన బాధ్యతను కొనసాగిస్తూ రావడం ఓ విశేషమే! ముఖ్యంగా ఇలాంటి పత్రికలు ఆర్థికంగా నిధుల కొరతను ఎదుర్కొనడం సహజమే! అందుకు 'వీక్షణం' కూడా మినహాయింపు కాదు. ప్రజాదరణ గల సంస్థలు నిర్వహించే పత్రికలు సైతం నిరంతరాయంగా నడిపించడం చాలా కష్టంగా ఉండటం ఓ భౌతిక సత్యం. కానీ వీక్షణం తరహా పత్రికలు నడపడం ఎంత కష్టంతో కూడుకున్నదో ఊహించుకోవచ్చు. సహజంగా ఈ తరహా పత్రికలు కొంత కాలం తర్వాత ఆగిపోవడమో లేదంటే అంతరాయాలతో వెలువడుతుండటమో చూస్తున్నాం. కానీ వీక్షణం ఇంత సుదీర్ఘ కాలంగా నిలకడగా నిరంతరాయంగా నడుస్తున్నదంటే వేణు గారి నేతృత్వంలో సమర్థులైన వీక్షణం టీం సమిష్టి కృషితో పాటు పాఠకుల ఆర్థిక, హార్దిక, నైతిక, భౌతిక ఆదరణ, అండదండలే ముఖ్య కారణంగా భావించవచ్చు. ఉద్యమాభినందనలతో...

– **ఇఫ్టూ ప్రసాద్,** రచయిత, కార్మికోద్యమ నాయకులు

వీక్షణం పదిహేడేళ్ల ప్రయాణం



దుప్పల రవికుమార్
అధ్యాపకులు,
సిక్కోలు బుక్ ట్రస్ట్,
శ్రీకాకుళం నిర్వాహకులు

పద్దెనిమిదో ఏటికి అడుగుపెట్టి కౌమార ప్రాయపు చివరి దశ సంతరించుకున్న వీక్షణం మాసపత్రికకు అభినందనలు. తెలుగులో సీరియస్ పత్రికలు లేని లోటు తీరుస్తూ, యువతను వర్తమాన సామాజిక అంశాలలో జాగృతం చేయడానికి ఏకైక మాసపత్రికగా వీక్షణం తన బాధ్యతను గడచిన పదిహేడేళ్లుగా విజయవంతంగా నిర్వహించింది. జరుగుతున్న పరిణామాలను యథాతథంగా రిపోర్ట్ చేయడమే కాకుండా కార్యకారణ సంబంధాలను కూడా విశ్లేషించడం వీక్షణం ప్రత్యేకత. కమర్షియల్ ఎలిమెంట్స్ లేకుండా నిజాల నిగ్గు తేల్చే నిఖార్సయిన తన వార్తా విశ్లేషణతో తెలుగు ఇపిడబ్ల్యు అనిపించుకుంటున్న వీక్షణం ప్రతి సంచికా మనతో దాచుకోదగ్గ ఒక ట్రెజర్ హవుస్. పరిమితమైన సిబ్బందితో క్రమం తప్పకుండా, నాణ్యతలో రాజీ పడకుండా రెండు తెలుగు రాష్ట్రాలలో పాఠకులందరికీ నిర్దిష్టమైన గడువులోగా ప్రతినెలా అందడం అసామాన్యమైన విషయం. అక్కడితో ఆగకుండా విభిన్నమైన దృక్పథాలు కలిగిన రచయితలు భిన్న విషయాలపై రాసిన అనేక వ్యాసాలలో వీక్షణం (ఏకరూప అనలేం గాని) దాదాపుగా ఒక క్రమ శైలిని సాధించడం అపురూపం. ఇందులో వ్యాసాలూ రాసే ప్రతి రచయితా మిగిలిన అన్ని వ్యాసాలూ చదువుతుంటేనే అది సాధ్యపడే విషయం. ఏ నెలకానెల వీక్షణంకు అందిన పుస్తకాలను పాఠకులతో పంచుకోవడం ద్వారా ఇటీవల విడుదలయిన పుస్తకాలు పాఠకులకు తెలుస్తున్నాయి గాని, ప్రతినెలా ఒకటో రెండో పుస్తకాలను పరిచయం చెయ్యడం లేదా సమీక్షించగలిగితే మరింత మేలు జరిగే అవకాశం ఉంది. ఇప్పుడున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ప్రజల్లో నెలకొంటున్న అశాంతి, అసంతృప్తి, అలజడికి దారి తీస్తున్నప్పటికీ ప్రజాగ్రహాన్ని మన కార్పొరేట్ మీడియా నిర్లక్ష్యం చేస్తోంది. స్వప్రయోజనమే ప్రజా ప్రయోజనంగా భావిస్తున్న తెలుగు పత్రికలు ప్రజాందోళనలకు సరైన కవరేజ్ ఇవ్వలేకపోతున్నాయి. వీక్షణం లాంటి ప్రత్యామ్నాయ పత్రికలు తెలుగు సమాజాలలో చెదురుమదురుగా వస్తోన్న ప్రజా ఆందోళనలకు తగినంత చోటు ఇవ్వాలని మనవి.



డేవిడ్
రచయిత, పరిశోధక విద్యార్థి,
ఉస్మానియా విశ్వవిద్యాలయం

పత్రిక ఓ అద్దం లాంటిది..అచ్చం అద్దం నిర్వహించే బాధ్యతను నిర్వహించాలి. అందవికారాలతో పనిలేకుండా సమాజంలోని మంచినీ, చెడునూ, తప్పునూ, ఒప్పునూ బట్టబయలు చేయాలి. అప్పుడే ఆ పత్రిక సమాజానికి దోహపడ్డట్లు. లేదంటే సమాజానికి ద్రోహం చేసినట్లే. శ్రీశ్రీ అన్నట్లు 'పెట్టుబడికి, కట్టుకథకు పుట్టిన' మెజారిటీ పత్రికలు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా పాలకవర్గాలకు ఊడిగం చేస్తున్నాయి. ఈ నేపథ్యం ప్రజలవైపు నిలబడ్డ పత్రికలు వేళ్ళమీద లెక్కబెట్టవచ్చు.. ఆ పత్రికల్లో మాసపత్రికలు మరీ తక్కువ.. కానీ గత 17 ఏండ్లుగా వీక్షణం మాసపత్రిక ప్రజలవైపు నిలబడి, పాలక వర్గాల కుట్రలను ఎప్పటికప్పుడు పీడిత వర్గాలకు అర్థం చేయించడంలో ముందువరుసలో ఉందనే చెప్పవచ్చు. అనేక ఇబ్బందులను అధిగమిస్తూ కూడా నిర్విరామంగా ఓ పత్రికను నిర్వహించడం మాములు విషయం కాదు. 18వ వసంతంలోకి అడుగుపెడుతున్న వీక్షణం మాస పత్రికకు శుభాకాంక్షలు.

గత పదమూడేళ్లుగా వీక్షణం పాఠకురాలిగా నా ఆలోచనలు కొన్ని పంచుకునే అవకాశానిచ్చిన వీక్షణం పత్రికకి ధన్యవాదాలు. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ పరిణామాల గురించి అందరికీ అన్నీ తెలుసుకునే అవకాశం ఉండదు, రకరకాల వెబ్ సైట్లు, పత్రికలు, పుస్తకాలు చదివితే తప్ప. అవన్నీ అందుబాటులో లేని వాళ్లకి, అవసరమైన, ముఖ్యమైన విషయాలని, సమాచారాన్ని ఒక చోట చేర్చి ఇచ్చే వీక్షణం ఒక గొప్ప వనరు. కేవలం విషయాలని రిపోర్టు చెయ్యడమే కాక, వాటి వెనక ఉన్న రాజకీయార్థిక, సామాజిక కారణాలని విశ్లేషించి చెప్పడం వీక్షణం విశిష్టత. అదే పాఠకులకి అత్యంత అవసరం కూడా. కనీస ప్రజాస్వామిక, రాజ్యాంగ బద్ధ పాలన కూడా కరువైన ఇవాల్టి మన రాజకీయ పరిస్థితుల్లో, ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించ వలసిన, అసమ్మతిని తెలపవలసిన మీడియా పూర్తిగా పాలక పక్షాలకి అమ్ముడు పోయినప్పుడు, అసమ్మతిని, ఒక రకంగా ధిక్కార స్వరాన్ని వినిపిస్తూ పదిహేడు సంవత్సరాలు పూర్తిచేసుకొని పద్దెనిమిదో సంవత్సరంలోకి అడుగులు వేస్తున్న వీక్షణంకి నా హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు. ఇక ముందు కూడా వీక్షణం ప్రజల పక్షాన నిలబడి, ప్రజల ధిక్కార స్వరాన్ని వినిపించే పత్రికగా కొనసాగుతుందని నా నమ్మకం, ఆశ. అంతే కాకుండా, రకరకాల ప్రతిఘటన ధారల మధ్య సంభాషణని, సంవాదాన్ని ఆరంభించ గల ఒక వేదికగా కూడా వీక్షణం పని చెయ్య గలిగితే చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

– అరవింద
రచయిత, సాఫ్ట్‌వేర్ నిపుణులు

వీక్షణంకు పదిహేడు సంవత్సరాలు నిండి పద్దెనిమిదవ సంవత్సరంలో ప్రవేశిస్తున్న సందర్భంగా, జనవరి 2020 జన్మదిన ప్రత్యేక సంచికలో మిత్రుల విమర్శనాత్మక అభిప్రాయాలు ప్రకటించాలనే ఆలోచనతో కొందరు మిత్రుల నుంచి అభిప్రాయాలు కోరాం. క్రమంగా అది ఇంత మంది మిత్రుల ప్రశంసగా మారడం మాకు సంతోషంగాను, మొహమాటంగాను ఉన్నది. మేం కోరిన మీదటా, స్వచ్ఛందంగానూ స్పందించి అభినందనలు తెలియజేసిన మిత్రులందరికీ వినమ్రంగా కృతజ్ఞతలు.

– వీక్షణం కలెక్టివ్

సంఘ్ దుర్మార్గానికి చిహ్నం పౌరసత్వ సవరణ చట్టం

భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పౌరసత్వ సవరణ చట్టం దుర్మార్గాన్ని, దానికి నేపథ్యమైన జాతీయ పౌరుల పట్టిక, జాతీయ జనాభా పట్టిక దురాలోచనలను, వాటికి పునాది విద్వేష రాజకీయాలను వివరిస్తున్నారు ఎన్ వేణుగోపాల్

ప్రవేశిక

పౌరసత్వ చట్టం 1955లో సవరణలకు ఉద్దేశించి కేంద్ర ప్రభుత్వం తయారు చేసిన పౌరసత్వ సవరణ బిల్లు (సిటిజెన్ షిప్ అమెండ్ మెంట్ బిల్), 2019 డిసెంబర్ 9న లోకసభలో 311 అనుకూల వోట్లు, 80 ప్రతికూల వోట్లతో, డిసెంబర్ 11న రాజ్యసభలో 125 అనుకూల వోట్లు, 105 ప్రతికూల వోట్లతో ఆమోదం పొంది పౌరసత్వ సవరణ చట్టం (సిటిజెన్‌షిప్ అమెండ్‌మెంట్ అక్ట్) 2019గా మారిపోయింది. ఈ బిల్లు ప్రతిపాదన దశలో ఉన్నప్పటి నుంచే ఈశాన్య రాష్ట్రాలలో, ప్రత్యేకించి అస్సాంలో వ్యక్తమవుతూ వచ్చిన వ్యతిరేకత, లోకసభ ఆమోదం తర్వాత మరింత పెరిగి, రాజ్యసభ ఆమోదం తర్వాత దేశవ్యాపిత నిరసన ఆందోళనలకు దారి తీసింది. ఆ తర్వాత గడిచిన రెండు వారాలుగా పౌరసత్వ సవరణ చట్టం పట్ల దేశం అట్టుడికిపోతున్నది.

ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలనే నినాదంతో వేలాది చిన్నా పెద్దా పట్టణాలలో కోట్లాది మందితో ప్రతి రోజూ నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. నిరసన కారులందరూ ఈ చట్టాన్ని అస్సాంలో అమలైన జాతీయ పౌరుల పట్టిక (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ – ఎన్ఆర్‌సి) తో, 2020 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ దాకా నమోదు కానున్న జాతీయ జనాభా పట్టిక (నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ – ఎన్‌పిఆర్) తో కలిపి చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాలకులు ఒకవైపు ఎంత ప్రతికూలత వచ్చినా ఈ చట్టాన్ని అమలు చేసి తీరుతామని బీరాలు పలుకుతున్నారు, మరొకవైపు ఈ చట్టానికీ ఎన్ఆర్‌సికీ సంబంధం లేదనీ, దేశవ్యాప్త ఎన్ఆర్‌సి అనే మాట తాము అననేలేదనీ పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. ఎన్‌పిఆర్‌ను ముందుకు తీసుకువస్తున్నారు.

న్యాయమైన ప్రజాందోళనల మీదికి పోలీసు బలగాలనూ, పారా మిలిటరీ బలగాలనూ ఉసిగొల్పుతున్నారు. ఈ భద్రతా బలగాలు సెక్షన్ 144, లాఠీచార్జి, బాష్పవాయు ప్రయోగం, కాల్పులు, అరెస్టులు, అక్రమ కేసులు, తామే దహనకాండకు, విధ్వంసానికి దిగి, దాన్ని నిరసనకారుల మీదికి తోయడం వంటి అన్ని రకాల దమన పద్ధతులకు పాల్పడుతున్నాయి. దేశవ్యాప్తంగా రెండు వారాల ఆందోళనలో కనీసం రెండు డజన్ల మంది మరణించారు. విపరీతమైన హింసాకాండ చెలరేగింది.

ఈ నేపథ్యంలో పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌరుల పట్టిక, జాతీయ జనాభా పట్టిక అనే మూడు అంశాలు విడివిడిగా ఏమిటి, కలిపి ఏమిటి వివరంగా అర్థం చేసుకోవలసి ఉంది.

చట్టాలు ఎలా తయారవుతున్నాయి?

అసలు భారత పాలనా వ్యవస్థలో సానుకూలమైన, ఉదాత్తమైన, ఆమోదయోగ్యమైన మాటల్లో కనబడే ప్రజానుకూల చట్టాలు, అటువంటి మాటల ముసుగులో వచ్చే ప్రజావ్యతిరేక చట్టాలు, మాటల్లోనూ ఉద్దేశంలోనూ కూడ దుర్మార్గమైన ప్రజావ్యతిరేక చట్టాలు అనే మూడు రకాల చట్టాలున్నాయి. అవినీతి నిరోధక చట్టం, వరకట్న నిషేధ చట్టం, భూసంస్కరణల చట్టం వంటి మొదటి రకం చట్టాలు స్థూలంగా ప్రజానుకూల అంశాలను, ఒకటి రెండు పరిమితులతోనైనా సానుకూలమైన మంచి మాటల్లోనే ప్రతిపాదిస్తాయి. కాని ఇటువంటి చట్టాలు అమలు కాకపోవడం గాని, అరకొరగా అమలు కావడం గాని, వాటిలోని మినహాయింపులూ పరిమితులూ మాత్రమే అమలు లోకి రావడం గాని జరుగుతుంది. ఇవి కేవలం వ్యవస్థ పట్ల, పాలకవర్గాల పట్ల, ప్రభుత్వాల పట్ల భ్రమలు కల్పించడానికే ఉపయోగపడతాయి గాని వాస్తవంగా కేవలం కాగితం మీద మాత్రమే మిగిలిపోతాయి, ఆచరణలోకి రావు, వచ్చినా ఎక్కడో సముద్రంలో కాకిరెట్ట లాగ వస్తాయి.

ఇక రెండో రకం చట్టాలు వాస్తవంగా ప్రజావ్యతిరేక, పాలకవర్గ అనుకూల ఉద్దేశాలతో తయారవుతాయి గాని చేదుమాత్రలకు పంచదార పూతలాగ మంచి మాటలతో, తటస్థమైన మాటలతో వాటిని అలంకరిస్తారు. జాతీయ భద్రతా చట్టం, అత్యవసర సేవల నిర్వహణా చట్టం వంటి చట్టాల పేర్లు చూసినా, వాటిలో నిబంధనలు చూసినా అవి సామాజిక అవసరాలు తీర్చడం కోసమే వచ్చినట్టు నటిస్తాయి. కాని వాస్తవంగా అవి పోరాడే ప్రజల హక్కులను, కార్మికుల హక్కులను అణచివేయడానికీ, సామాజిక విధ్వంసానికి ఉపయోగపడతాయి.

మూడో రకం చట్టాలు దుర్మార్గమైన ఉద్దేశాలను అంతే దుర్మార్గమైన మాటల్లోనే నిస్సిగ్గుగా, బహిరంగంగా ప్రకటిస్తాయి. తీవ్రవాద కార్యకలాపాల నిరోధ చట్టం, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధ చట్టం వంటి అనేక చట్టాలు ఈ రకమైనవే. ఇప్పుడు కొత్తగా ఉనికిలోకి వచ్చిన పౌరసత్వ సవరణ చట్టం కూడ ఇటువంటిదే. ఇది మాటల్లో ఎటువంటి దాపరికం లేకుండా నిస్సిగ్గుగా సంఘ్ పరివార్ భాష రాసింది. దీని ఉద్దేశం స్పష్టంగా ముస్లిం వ్యతిరేక విద్వేష రాజకీయాలను రెచ్చగొట్టి, హిందూ వోట్లను సమీకరించుకోవడమే.

పౌరసత్వ చట్టపు చరిత్ర

నిజానికి భారతదేశంలో పౌరులెవరు, పౌరసత్వం ఎలా వస్తుంది, పౌరసత్వం మీద ఆంక్షలూ పరిమితులూ ఏమిటనే అంశాలను భారత రాజ్యాంగం, రెండో భాగంలో అధికరణం 5 నుంచి అధికరణం 11

వరకు స్పష్టంగా నిర్వచించింది. ఆ తర్వాత పందొమ్మిది సెక్షన్లతో, నాలుగు షెడ్యూళ్లతో వివరమైన పౌరసత్వ చట్టం 1955 రూపొందింది. ఆ చట్టం ప్రకారం భారత దేశంలో పౌరసత్వం ఐదు మార్గాల్లో మాత్రమే వస్తుంది. అవి 1. దేశంలో పుట్టినందువల్ల. 2. బైటి దేశంలో పుట్టినప్పటికీ తల్లిదండ్రులు భారత పౌరులైనందువల్ల. 3. విదేశాల నుంచి వచ్చినప్పటికీ నిర్ణీత ఆంక్షలకు లోబడి భారత ప్రభుత్వం నమోదు చేసినందువల్ల. 4. అటువంటి నమోదుతో పన్నెండు సంవత్సరాల పాటు స్థిర నివాసం ఉంటే, సహజీకరణ చేయడం వల్ల. 5. భారత ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని తనలో కలుపుకున్నందువల్ల (ఉదాహరణకు సిక్కిం). ఈ పౌరసత్వ చట్టానికి 1986లో, 1992లో, 2003లో, 2005లో, 2015లో చేసిన సవరణల క్రమంలో రెండు షెడ్యూళ్లనే పూర్తిగా తొలగించారు. అనేక సెక్షన్లలో మార్పులూ చేర్పులూ చేశారు. ఈ క్రమంలో జరిగిన కొత్త సవరణగా పౌరసత్వ సవరణ చట్టం 2019ని పార్లమెంటు ప్రస్తుతం ఆమోదించింది. ఇక్కడ గుర్తించవలసిన విషయమేమంటే రాజ్యాంగ అధికరణాలలోను, 1955 చట్టంలోను, ఆ తర్వాత జరిగిన ఐదు సవరణల్లోను లేని విధంగా మొట్టమొదటిసారిగా 2019 చట్ట సవరణల్లో పౌరసత్వం ఇవ్వడానికి, లేదా నిరాకరించడానికి ప్రాతిపదికగా మతాన్ని చేర్చారు.

ఈ పౌరసత్వ సవరణ చట్టం ఇప్పుడు ప్రవేశపెట్టడానికి ఎన్ని కారణాలు చెప్పినప్పటికీ, అసలు బీజాలు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆలోచనల్లోనే, భారతీయ జనతా పార్టీ ఆలోచనల్లోనే ఉన్నాయి. భారతీయ జనతా పార్టీ 2014 ఎన్నికల ప్రణాళికలోనే, "ప్రపంచంలో ఎక్కడైనా వివక్షను ఎదుర్కొంటున్న హిందువులందరికీ భారత దేశం సహజమైన ఆశ్రయం అవుతుంది, వారు శరణార్థులుగా భారతదేశం రావడానికి సదా ఆహ్వానం ఉంటుంది" అని రాశారు. దానికి కొనసాగింపుగానే ఫారినర్స్ ఆర్డర్ 1948లో 2015 సెప్టెంబర్ 7న చేర్చిన కొత్త నిబంధనలో బంగ్లాదేశ్, పాకిస్తాన్‌ల నుంచి వచ్చే హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతస్తులకు ప్రత్యేక మినహాయింపుల గురించి ప్రస్తావించారు. అలాగే పాస్ పోర్ట్ (ఎంట్రీ ఇన్‌టు ఇండియా) రూల్స్ 1950లో 2015 సెప్టెంబర్ 7న చేర్చిన కొత్త ఉప నిబంధనలో పాకిస్తాన్, బంగ్లాదేశ్ ల నుంచి వచ్చే హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతస్తులకు ప్రత్యేక మినహాయింపులను చేర్చారు. ఈ రెండు కొత్త మినహాయింపులకూ 2016 జూలై 18న మరొక సవరణ చేస్తూ ఆఫ్ఘనిస్తాన్ పేరు కూడ చేర్చారు.

2014 ఎన్నికల ప్రణాళిక వాగ్దానం, ఫారినర్స్ ఆర్డర్ లో చేర్పు, పాస్ పోర్ట్ (ఇంట్రీ ఇన్‌టు ఇండియా)లో చేర్పు అనే ఈ మూడు అంశాలనూ కలగలిపి నేరుగా పౌరసత్వ చట్టంలోకి ప్రవేశపెట్టడమే పౌరసత్వ సవరణ చట్టం 2019 ఉద్దేశం.

కొత్త చట్టంలో ఏముంది?

పౌరసత్వ సవరణ చట్టం 2019 నిండా మూడు పేజీలు కూడ లేని చాల చిన్న చట్టం. ఇది రెండు సెక్షన్లలో చేర్పులు, మరి రెండు సెక్షన్లలోనూ, ఒక షెడ్యూల్ లోనూ మార్పులు చేయడానికి ఉద్దేశించింది. వీటిలో సెక్షన్ 2లో చేర్పు "పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుంచి వచ్చే హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతస్తులు 'చట్టవ్యతిరేక చొరబాటుదారుల' గుర్తింపు నుంచి మినహాయింపు పొందుతారు" అని చెపుతుంది. అలాగే కొత్తగా చేర్చిన సెక్షన్ 6బి ఈ మినహాయింపు పొందినవారు పౌరసత్వం కోసం నమోదు చేసుకున్నప్పుడు పొందే రాయితీల గురించి చెపుతుంది. సెక్షన్ 7డి లో సవరణ, సెక్షన్ 18లో సవరణ ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా కార్డు కలిగి ఉన్నవారికి ఇచ్చే మినహాయింపు గురించి చెపుతాయి. మూడో షెడ్యూల్ లో కొత్తగా చేర్చిన నిబంధన ప్రకారం "ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ ల నుంచి వచ్చే హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతస్తుల విషయంలో గతంలోని 'పదకొండు సంవత్సరాలకు తక్కువ కాకుండా' అని ఉన్న నిబంధనను 'ఐదు సంవత్సరాలకు తక్కువ కాకుండా'" అని మార్చారు.

ఈ చట్టపు రాజ్యాంగ వ్యతిరేకత

మొట్టమొదట ఈ చట్టం రాజ్యాంగ వ్యతిరేకమైనది. భారతదేశంలో ప్రవేశపెట్టబడే, ఆమోదం పొందే, అమలులోకి వచ్చే ఏ చట్టమైనా రాజ్యాంగబద్ధమైనదిగా, రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించేదిగా ఉండాలి. కాని ఈ చట్టం ఎన్నో అంశాలలో రాజ్యాంగ వ్యతిరేకమైనది. రాజ్యాంగంలో స్పష్టంగా నిర్దేశించిన భావనలకూ, రాజ్యాంగ రూపకల్పనలో ఉండిన స్ఫూర్తికీ వ్యతిరేకమైనది. రాజ్యాంగ ప్రవేశికలో లౌకిక, ప్రజాస్వామిక, గణతంత్ర భావనలు మూడిటికీ ఈ చట్టం వ్యతిరేకమైనది. తర్వాత ఏడు దశాబ్దాలలో ఆ మాట ఎంతగా వక్రీకరణకు గురైనప్పటికీ, ప్రవేశికలో లౌకిక అన్నప్పుడు దాని అర్థం మత ప్రమేయంలేని అని. కనీసం రాజ్యవ్యవహారాలలో, బహిరంగ సామాజిక కార్యక్రమాలలో, పాలనా సరళిలో మత ఛాయలు, వాసనలు కనబడగూడదని దాని అర్థం. కాని పౌరసత్వ సవరణ చట్టం 2019 స్పష్టంగా, నిస్సిగ్గుగా ఆరు మతాల పేర్లు రాసింది. అక్కడ ప్రస్తావించని మిగిలిన మతాల పట్ల, స్పష్టంగా ముస్లిం మతస్తుల పట్ల వివక్షను ప్రదర్శించింది.

ఈ చట్టం రాజ్యాంగ ప్రవేశికలోని ప్రజాస్వామ్యం, గణతంత్రం అనే మరో రెండు ముఖ్య భావనలను కూడ ఉల్లంఘించింది. దేశ పౌరసత్వానికి సంబంధించి అత్యంత కీలకమైన మార్పులు చేయదలచిన ఈ చట్టం తయారీలో ఎటువంటి ప్రజాస్వామిక చర్చ జరగలేదు. ఆ మార్పులను బహిరంగంగా ప్రతిపాదించడం, ప్రజా వేదికల మీద, ప్రచారసాధనాలలో విస్తృతమైన చర్చ జరిపి ప్రజాభిప్రాయం గుర్తించి ప్రజాభిప్రాయానికి అనుగుణంగా చట్టాలను ప్రవేశపెట్టడం ప్రజాస్వామ్యంలో అత్యవసరమైన పద్ధతి. గణతంత్రం అంటే, ప్రజల పాలన అంటే అదే. దొంగ వోట్ల, దొంగ నోట్ల రాజ్యంలో అక్రమంగా మెజారిటీ స్థానాలు గెలుచుకుని ఆ పశుబలంతో ఇష్టారాజ్యపు చట్టాలను ప్రవేశపెట్టడం ప్రజాస్వామ్యం కాదు, గణతంత్రం కాదు. ఆధిక్యతా స్థానంలో ఉన్నవారు అల్పసంఖ్యాకుల అభిప్రాయాలను, ఒంటరి అభిప్రాయాన్నయినా సరే, గౌరవించడమే ప్రజాస్వామ్యానికి మూల ధాతువు.

రాజ్యాంగ ప్రవేశికను మాత్రమే గాక కనీసం నాలుగు రాజ్యాంగ అధికరణాలను కూడ ఈ కొత్త చట్టం ఉల్లంఘిస్తున్నది. రాజ్యాంగంలో అధికరణం 14 'చట్టం ఎదుట పౌరులందరి మధ్య సమానత్వం' ఉంటుందని చెపుతుండగా, అధికరణం 15 రాజ్యం ఏ వ్యక్తి పట్లా 'మత ప్రాతిపదిక మీద వివక్ష చూపబోద'ని చెపుతుండగా, అధికరణం 16 'అవకాశాలలో పౌరులందరి మధ్యా సమానత్వం' పాటిస్తామనీ, మతప్రాతిపదిక మీద అవకాశాల నిరాకరణ జరగదనీ చెపుతుండగా,

అధికరణం 25 ఏ వ్యక్తికైనా ఏ మతాన్నయినా పాటించే 'వ్యక్తిగత మత స్వేచ్ఛ'కు హామీ ఇస్తుండగా కొత్త చట్టం ఈ అధికరణాలన్నిటినీ ఉల్లంఘిస్తున్నది. ఈ చట్టం ప్రత్యేకంగా ఆరు మతాలను ప్రస్తావించి వారికి మాత్రమే "అక్రమ చొరబాటుదారులు"గా గుర్తింపు నుంచి మినహాయింపు ఇస్తున్నదంటే, పౌరులుగా గుర్తించడానికి కొన్ని మతాల వారికి మాత్రమే నివాసకాలపు పరిమితిని తగ్గిస్తున్నదంటే అది కచ్చితంగా వివక్షాపూరితమే. ఆ జాబితాలో రాయని మతాల పట్ల వివక్ష చూపుతూ, ఆ జాబితాలో ఉన్న మతాల పట్ల అనుచిత ప్రాధాన్యతను చూపడమే.

నిజానికి ఇప్పుడు ఒక చట్టంలో మొదలైన ఈ వైఖరిని ఇప్పుడే ప్రతిఘటించి, ఉపసంహరించేలా ఆందోళన జరపకపోతే ఇప్పుడు ఒక చట్టానికి మతాన్ని ప్రాతిపదిక చేసినవారు రేపు అనేక ఇతర అంశాలకు కూడ మతాన్ని ప్రాతిపదికగా చేయడానికి అవకాశం వస్తుంది. విదేశాల నుంచి వచ్చినవారికి పౌరసత్వం ఇవ్వడానికి మత ప్రాతిపదికను అమలు చేయడం అనేది చట్టబద్ధమై, నిర్ధారణ అయిపోతే, దానికి కొనసాగింపుగా స్వదేశంలో ఉన్నవారికి కూడ మతప్రాతిపదికన మినహాయింపులు, ప్రత్యేకసౌకర్యాలు ఇవ్వడానికి దారి తీస్తుంది. ఇప్పటికి తరతరాలుగా నిరాదరణకు గురైన సమూహాలకు, ప్రాంతాలకు మాత్రమే అటువంటి మినహాయింపులు, ప్రత్యేక సౌకర్యాలు ఇవ్వడానికి రాజ్యాంగం అవకాశం ఇస్తుంది. ఆ ప్రాతిపదికను మార్చి, అధికారంలో ఉన్న ప్రభుత్వపు ఇష్టారాజ్యంగా, వారి భావజాలానికి అనుగుణంగా మినహాయింపులు, ప్రత్యేక సౌకర్యాలు ఇవ్వడం ప్రారంభిస్తే కొనసాగుతున్న ఆధిపత్య సంస్కృతిలో భవిష్యత్తులో కందిరీగల తుట్టె కదలడానికి అవకాశం వస్తుంది.

ప్రభుత్వ ప్రకటిత లక్ష్యాలు

పార్లమెంటులో బిల్లును ప్రవేశపెడుతూ ఈ కొత్త చట్టం తేవడానికి కారణాలేమిటో, లక్ష్యాలేమిటో ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. అంతకు ముందూ ఆ తర్వాతా కూడ ఆ ప్రకటనలోని అంశాలనే పదేపదే చెపుతున్నారు. వాటి ప్రకారం ఒకప్పుడు భారతదేశంలో భాగంగా ఉండిన పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్తాన్ ల రాజ్యాంగాల ప్రకారం అవి మత రాజ్యాలు గనుక అక్కడ హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతస్తులు మత వివక్షకు గురవుతున్నారని, అటువంటివారిలో చాలమంది భారతదేశానికి పారిపోయి వచ్చి ఇక్కడ తలదాచుకుంటున్నారని, వారిని పూర్తిస్థాయి పౌరులుగా మార్చి ఆదుకోవడమే ఈ చట్టం లక్ష్యమని అంటున్నారు. వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోకుండా ఉండడానికి, వారికి దీర్ఘకాలిక వీసాలు ఇవ్వడానికి ఇప్పటికే పాస్‌పోర్ట్ (ఎంట్రీ ఇన్‌టు ఇండియా) చట్టం, 1920 లోనూ, ఫారినర్స్ చట్టం 1946 లోనూ 2015, 2016లో సవరణలు చేశామని, ఇప్పుడు వాటి కొనసాగింపుగా ఈ చట్టం తెస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ విధంగా 2014 డిసెంబర్ 31కి ముందు ఆ మూడు దేశాల నుంచి వచ్చిన ఆ ఆరు మతాల వ్యక్తులందరికీ భారత పౌరసత్వం పొందడం సులభతరం చేయడమే ఈ చట్ట లక్ష్యమని అన్నారు.

ప్రకటిత లక్ష్యాల బూటకత్వం

నిజంగానే ఏదైనా ఒక దేశంలో వివక్షను, పీడనను ఎదుర్కొంటూ, అక్కడ జీవించడం అసాధ్యమైన వారు మరొక దేశంలో శరణాగతి కోరడం అసాధారణమైన విషయమేమీ కాదు. మత పరమైన వివక్షతో పాటు, రాజకీయ నిర్బంధ కారణాలతో, దేశంలో అంతర్యుద్ధ కారణాలతో కూడ చాల దేశాలనుంచి ఇతర దేశాలకు వలసలు, ప్రవాసాలు, శరణాగతి కోరడం జరుగుతున్నాయి. మానవతా దృష్టితో అటువంటి కోరికలను మన్నించడంలో తప్పేమీ లేదు. ప్రపంచంలో చాల దేశాల ప్రభుత్వాలు అలా వలసదారులకు రాజకీయ ఆశ్రయాలు, మానవతాదృష్టితో ఆశ్రయాలు ఇస్తున్నాయి. కాని సంఘ్ పరివార్ ప్రభుత్వం ప్రకటిస్తున్న లక్ష్యాలను, అందులోనూ అది ప్రత్యేకంగా కొన్ని దేశాల పేర్లు, కొన్ని మతాల పేర్లు రాయడంలో ఉన్న దురుద్దేశాలను, ప్రకటిత లక్ష్యాల బూటకత్వాన్ని గుర్తించవలసి ఉంది.

మొట్టమొదట, అక్రమ, చట్టవ్యతిరేక చొరబాటుదారుల సమస్యను ఎదుర్కోవడానికి చట్టపరమైన పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఈశాన్య రాష్ట్రాలలో ప్రజాందోళనలు జరుగుతుండగా, ఈ చట్టం ఆ సమస్యను పక్కన పెట్టి ఆ చొరబాటుదారులలో కొందరిని "సక్రమ చొరబాటు దారులు"గా గుర్తించి పౌరసత్వం ఇవ్వడానికి మార్గం సుగమం చేస్తున్నది. అంటే అసలు సమస్య ఒకటైతే, ఆ సమస్యను పరిష్కరించే దిశగా కాకుండా, పనిలో పనిగా తన సొంత మత విద్వేష కార్యక్రమానికి దాన్ని ఒక సాకుగా చూపడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

రెండు, ఈ చట్టం ఆయాదేశాల్లో వివక్షను ఎదుర్కొంటున్న మైనారిటీ మతస్తులకు రక్షణ, ఆశ్రయం కల్పించడం కోసం అనే వాదన పచ్చి అబద్ధం. వివక్షను ఎదుర్కొంటున్న మైనారిటీ మతస్తులు ఆ మూడు దేశాల్లో మాత్రమే లేరు. ఆ సమస్య ప్రపంచవ్యాప్తంగా ఉన్నది. ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క విధమైన మైనారిటీల మీద హింస, పీడన, వివక్ష అమలవుతున్నాయి. భారతదేశం అలా ప్రపంచ బాధితులందరికీ తన ఆశ్రయాన్ని ఇవ్వబోవడం లేదు, స్నేహహస్తం చాచడం లేదు. నిజానికి ఆ కోరిక ఉన్నప్పటికీ భారత ప్రభుత్వానికీ, భారత ఆర్థిక వ్యవస్థకూ ఆ శక్తి కూడ లేదు. అది అలా ఉంచి సంఘ్ పరివార్ ప్రభుత్వం ఆ ఉదాత్త ఆలోచనను తన సంకుచిత మతోన్మాద పరిధిలోకి కుదించి అమలు చేయబోతున్నది.

ఒకప్పుడు భారత దేశంలో భాగమై, ఆ తర్వాత వేరే దేశాలుగా మారిన చోట్ల నుంచి మత వివక్ష కారణంగా సరిహద్దులు దాటి వస్తున్న వారందరినీ ఆహ్వానించడం కోసం ఈ చట్టం అన్నప్పటికీ అది కూడ అబద్ధమే. ఇప్పుడు చెపుతున్న మూడు దేశాలలో ఆఫ్ఘనిస్తాన్ తో భారత్ కు సరిహద్దు లేదు. సరిహద్దు ఉన్న మయన్మార్ నుంచి మత వివక్ష, హింస కారణంగానే రోహింగ్యాలు భారతదేశంలోకి వలస వస్తున్నారు. కాని ఈ చట్టం మయన్మార్ పేరు, రోహింగ్యాల పేరు రాయలేదు. సముద్ర సరిహద్దు ఉన్న శ్రీలంక నుంచి మత వివక్ష కారణంగా, అంతర్యుద్ధం కారణంగా వేలాది మంది తమిళులు భారత్ లోకి ప్రవేశించారు, రావడానికి సిద్ధంగా ఉన్నారు. వారు హిందువులే అయినప్పటికీ ఈ చట్టం శ్రీలంక పేరు ప్రస్తావించలేదు. చట్టంలో పేరు ప్రస్తావించిన పాకిస్తాన్ లో మత వివక్షను, హింసను ఎదుర్కొంటున్న వారిలో కేవలం ఆ ఆరు మతాల వారు మాత్రమే కాక అహ్మదియాలు, షియాలు, సూఫీలు, బలూచీలు వంటి అనేక మైనారిటీ మతస్తులు, తెగలవారు ఉన్నారు. ఇక బంగ్లాదేశ్ లోనైతే ఆ ఆరు మతాల వారు మాత్రమే కాక మైనారిటీలుగా గుర్తింపు పొందిన కనీసం పన్నెండు గిరిజన తెగలవారు వివక్షనూ హింసనూ ఎదుర్కొంటున్నారు.

పొరుగుదేశాలలో మతవివక్షను ఎదుర్కొంటున్న మైనారిటీలకు ఆశ్రయం ఇవ్వడానికి, పౌరసత్వం ఇవ్వడానికి ఎంతో ఉదాత్తంగా, కరుణతో తయారైనట్టు చెప్పుకుంటున్న ఈ చట్టం అదే స్థితిలో, అంతకన్న అన్యాయమైన స్థితిలో వారి పక్కనే ఉన్న ఇతర మైనారిటీల పట్ల అంతే ఉదాత్తతను, కరుణను ప్రదర్శించకపోవడం స్పష్టంగా ముస్లిం వ్యతిరేకత వల్ల మాత్రమే. దాన్ని చూపి ఇతర మతస్తులలో ప్రాబల్యం పెంచుకోవాలనే దురుద్దేశం వల్ల మాత్రమే.

ఈ ప్రాధాన్యతల సమస్యతో పాటు ఈ అంశంలో మరికొన్ని ఇతర సమస్యలు కూడ ఉన్నాయి. చట్టప్రకారమే ఈ మూడు దేశాల నుంచి, ఆ ఆరు మతాల నుంచి వచ్చినవారు కేవలం మతపరమైన వివక్ష వల్లనే వచ్చారని ఎలా రుజువు చేస్తారు? వారు ఆర్థిక కారణాల వల్ల, బతుకుదెరువు కోసమో, అక్కడి కన్న ఇక్కడ ఎక్కువ ఆర్థిక ప్రయోజనాలున్నాయనో, లేక తమ ఆర్థిక ప్రయోజనాలను విస్తరించాలనో లేక రాజకీయ కారణాల వల్ల కూడ వచ్చి ఉండవచ్చు. అభ్యర్థించిన వారిలో ఒక్కొక్క వ్యక్తినీ, కుటుంబాన్నీ పరిశీలించి, వారికి అర్హత ఉన్నదో లేదో చూసి పౌరసత్వం ఇచ్చే తతంగమంతా జరపడానికి ఎంత శక్తి, ఎంత వ్యయం, ఎంత మంది సిబ్బంది కావాలి? ఇదంతా భారత ఆర్థిక వ్యవస్థ నిర్వహించగలదా? అసలింతకూ ఈ చట్టం వల్ల ఎంతమంది పౌరసత్వం కోసం అభ్యర్థిస్తారు, ఎంత మందికి పౌరసత్వం ఇవ్వవలసి ఉంటుంది, అలా ఈ చట్టం ఫలితంగా కొన్ని లక్షల మందినో, వేల మందినో భారత పౌరులుగా గుర్తిస్తే వారికి కల్పించవలసిన సౌకర్యాలకూ, హక్కులకూ, ఉద్యోగకల్పనకూ ఎంత ఖర్చవుతుంది, వారికి ఎక్కడ పునరావాసం కల్పిస్తారు, ఇప్పటికే ఉన్న పౌరులకే తగిన పౌర సౌకర్యాలూ పౌర హక్కులూ కల్పించలేకపోతున్న ప్రభుత్వం ఈ కొత్త బహిరాగత పౌరులకు ఎటువంటి సౌకర్యాలు కల్పిస్తుంది, ఈ పరిణామం వల్ల భారత ఆర్థిక వ్యవస్థ మీద కొత్తగా ఎంత భారం పడుతుంది వంటి అనేక ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర అవసరమైన సమాధానాలూ, అంచనాలూ, బడ్జెట్ కేటాయింపులూ ఏమీ లేవు.

కాందిశీకుల విధానం లేని భారత ప్రభుత్వం

ఇంతకీ, ఇలా విదేశాల నుంచి శరణాగతి కోరి వచ్చినవారిని పౌరులుగా గుర్తించడానికి ముందు ప్రభుత్వానికి ఒక సూత్రపరమైన, హేతుబద్ధమైన, కచ్చితమైన, సందేహాలకు తావులేని కాందిశీకుల విధానం ఉండాలి. కాని భారత ప్రభుత్వం స్వయంగా రాసుకున్న ఫారినర్స్ చట్టం 1946లో "కాందిశీకులు" అనే మాటే లేదు. ఇతర దేశాల నుంచి వచ్చే కాందిశీకులతో వ్యవహరించడానికి అంతర్జాతీయ స్థాయిలో ఐక్యరాజ్యసమితి రెఫ్యూజీ కన్వెన్షన్ 1951 అనే పత్రాన్ని, రెఫ్యూజీ ప్రోటోకాల్ 1967 అనే పత్రాన్ని తయారు చేసింది. భారత ప్రభుత్వం ఇప్పటివరకూ ఆ రెండు ఒడంబడికల మీద సంతకం చేయలేదు. ఇప్పటివరకూ ఇతర దేశాల నుంచి వచ్చినవారి పట్ల భారత పాలకవర్గాలు అనుసరించినదంతా పచ్చి అవకాశవాద, రాజకీయ ప్రేరేపిత వైఖరే తప్ప స్పష్టమైన, సూత్రబద్ధమైన వైఖరి కాదు. దేశ విభజన సందర్భంలో లక్షలాదిగా వచ్చిన శరణార్థులను, ఆ తర్వాత అడపాదడపా వచ్చిన కొన్ని వేల మంది శరణార్థులను అలా ఉంచి, నాలుగు ప్రధాన వలసల వెల్లువలలో భారత ప్రభుత్వ వైఖరి చూస్తే ఈ అవకాశవాద వైఖరి తేటతెల్లమవుతుంది.

మొదటి సందర్భంలో 1959లో టిబెట్ నుంచి దలైలామా, ఆయనతో పాటు దాదాపు ఎనభై వేల మంది టిబెటన్లు భారత్‌లో ప్రవేశించారు. చైనాతో ఘర్షణ వాతావరణంలో భారత ప్రభుత్వం వీరికి ప్రధానంగా హిమాచల్ ప్రదేశ్, కర్నాటక, ఒరిస్సాలలో భూమి ఇచ్చి ఆశ్రయం, పరిమిత హక్కులు, సౌకర్యాలు కల్పించింది. ప్రవాస ప్రభుత్వాన్ని ఏర్పరచుకోవడానికి కూడ అవకాశం ఇచ్చింది. రెండో సందర్భంలో 1971లో తూర్పు పాకిస్తాన్‌లో అంతర్యుద్ధం జరుగుతున్నప్పుడు, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా అక్కడ మంటను ఎగదోయడానికి భారత ప్రభుత్వమే స్వయంగా ముక్తిబాహిని తయారుచేసి పంపినప్పుడు, లక్షలాది మంది అక్కడి నుంచి తరలి వచ్చి పొరుగు రాష్ట్రాలలో స్థిరపడ్డారు. చాలచోట్ల భారత ప్రభుత్వం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వారికి సౌకర్యాలు, హక్కులు కల్పించాయి. మూడో సందర్భంలో 1972లో ఉగాండాలో ఇదీ అమీన్ పాలనలో భారత సంతతి వారందరినీ వెళ్లగొట్టినప్పుడు అక్కడి నుంచి వచ్చిన వారికి భారత ప్రభుత్వం అనేక రాష్ట్రాల్లో ఆశ్రయం కల్పించి, హక్కులు, సౌకర్యాలు ఇచ్చింది. అలాగే, నాలుగో సందర్భంలో 1980ల తర్వాత శ్రీలంకలో అంతర్యుద్ధం మొదలైన తర్వాత అక్కడి నుంచి వచ్చిన తమిళ ప్రజలకు భారత ప్రభుత్వం, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడులోనూ, కర్నాటకలోనూ ఆశ్రయం ఇచ్చి, హక్కులు, సౌకర్యాలు కల్పించాయి.

అయితే ఈ నాలుగు సందర్భాలలోనూ కూడ భారత ప్రభుత్వం అనుసరించినది కాందిశీకుల పట్ల మానవతా వాద, సూత్రబద్ధ, ఉదార వైఖరి ఏమీ కాదు. శత్రువుకు శత్రువు మిత్రుడు అనే పద్ధతిలోనో, ఆయా ప్రభుత్వాల పట్ల అప్పటికి తనకు ఉండిన సంబంధాల రీత్యానో మాత్రమే ఆయా శరణార్థులను దేశంలో ఉండడానికి అనుమతించింది. శ్రీలంక తమిళుల విషయంలో శ్రీలంక ప్రభుత్వంతో తనకు విభేదం ఉన్నప్పుడు ఒక రకంగానూ, మైత్రి ఉన్నప్పుడు మరొక రకంగానూ ప్రవర్తించింది.

ఈ చరిత్ర నేపథ్యంలో ఇప్పుడు ప్రత్యేకించి మూడు దేశాల నుంచి ఆరు మతాలకు చెందినవారికి హఠాత్తుగా పౌరసత్వం ఇస్తామని చట్టం చేయడం మరొక అవకాశవాదానికి, అందులోనూ ఇతర అంశాలను కలిపి చూస్తే దుర్మార్గమైన విద్వేష రాజకీయాలకు, చిహ్నమే తప్ప మరేమీ కాదు.

పౌరసత్వ అర్హత లేనివారిని ఏం చేస్తారు?

సరే, ఆ మూడు దేశాల నుంచి వచ్చిన ఆరు మతాల వారికి పౌరసత్వం ఇస్తారు. మరి, ఆ మూడు దేశాల నుంచి వచ్చిన ఇతర మతస్తులను, ఇతర దేశాల నుంచి వచ్చిన అన్ని మతాల వారిని ఏం చేస్తారు? ఒక దేశంలోకి చట్టవ్యతిరేకంగా చొరబడిన మరొక దేశపు పౌరులను వెనక్కి పంపించడానికి ఆ రెండు దేశాల మధ్య రిపాట్రియేషన్ ట్రీటీ (పునరావాస ఒడంబడిక) గాని, వారు నేరస్తులైతే వెనక్కి పంపించడానికి ఎక్స్‌ట్రాడిషన్ ట్రీటీ (అప్పగింత ఒప్పందం) గాని ఉండవలసి ఉంటుంది. భారతదేశానికి ఈ మూడు దేశాలతోనూ రిపాట్రియేషన్ ట్రీటీలు లేవు. రెండు దేశాలతో ఎక్స్ ట్రాడిషన్ ట్రీటీలు ఉన్నాయి గాని ప్రస్తుత సందర్భంలో అవి వర్తించవు. అంటే ఈ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత కూడ ఆ మూడు దేశాల నుంచి వచ్చిన ఆరు మతాలకు చెందిన కొన్ని వేల మందో లక్షల మందో భారత

పౌరులుగా మారే అవకాశం ఉంది గాని మిగిలిన మతాలకు చెందినవారిని భారత పౌరులుగా గుర్తించడమూ కుదరదు, వారి స్వదేశాలకు పంపించడమూ కుదరదు. అప్పుడిక మిగిలిన అవకాశం వారిని నిర్బంధించి పెట్టడం మాత్రమే. కనుక ఈ చట్టం అమలులోకి వచ్చినా "చట్టవ్యతిరేక చొరబాటుదారుల" సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. కేవలం "చట్టవ్యతిరేక చొరబాటుదారుల"ను మత ప్రాతిపదికపై విభజించి, కొందరిని పౌరులుగా గుర్తించి, సంఘ్ పరివార్ ద్వేషించే మతస్తులను జైలు పాలు చేయడం తప్ప అసలు సమస్యకు మానవీయ, హేతుబద్ధ, దౌత్యపరమైన, ప్రజాస్వామిక పరిష్కారం కుదిరినట్టు కాదు. అసలు ఇంతకీ సంఘ్ పరివార్ కు ఈ చొరబాటుదారుల సమస్యను చూపి, మతవిద్వేష రాజకీయాలు రెచ్చగొట్టి తన స్వప్రయోజనాలు నెరవేర్చుకునే ఆలోచనే తప్ప సమస్యను పరిష్కరించాలనే కోరిక లేదు.

చొరబాటుదారుల సమస్యను పరిష్కరించడం ఎలా?

శరణార్థులు, కాందిశీకులు, వలసదారులు, చట్టవ్యతిరేక చొరబాటుదారులు, అక్రమ చొరబాటుదారులు, సక్రమంగానే ప్రవేశించి నిర్ణీత కాలాన్ని మించి దేశంలో ఉండిపోతున్నవారు, ఆశ్రయం కోరుతున్నవారు వంటి ఏ పేరుతో పిలిచినా దేశంలో పౌరులు కాని, విదేశాల నుంచి వచ్చి స్థిరపడిన, స్థిరపడుతున్న వారి సమస్య వాస్తవమైన సమస్యే. పొరుగుదేశాల నుంచి భారత దేశంలోకి చట్టవ్యతిరేకంగా, అక్రమంగా ప్రవేశిస్తున్న వారి సంఖ్య గణనీయంగానే ఉంది. ఈ సంఖ్యను కచ్చితంగా చెప్పగల స్థితి భారత ప్రభుత్వానికి కూడ లేదు గాని వేరువేరు వ్యక్తులు, సంస్థలు వేరువేరు అంకెలు ప్రకటిస్తున్నారు. అఫ్ఘనిస్తాన్ నుంచి 2009 నాటికి 13,000 మంది, బంగ్లాదేశ్ నుంచి ఇరవై లక్షల నుంచి రెండు కోట్ల నలభై లక్షల మంది, మయన్మార్ నుంచి ఒక లక్ష మంది బర్మీస్ చిన్ తెగకు చెందినవారు, 40,000 మంది రోహింగ్యాలు, పాకిస్తాన్ నుంచి దాదాపు 8,000 మంది వలసదారులు, శ్రీలంక నుంచి రెండు లక్షల మంది, మొత్తం మీద అన్ని దేశాల నుంచీ కలిపి కనీసం మూడు కోట్లకు పైగా ఉన్నారని అంచనాలు ఉన్నాయి. ఈ వలసదారులు స్థిరపడిన ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క రకమైన సమస్య ఉంది. వీరిలో అత్యధిక సంఖ్యాకులు తమ దేశాల్లోని కల్లోలాల వల్ల అక్కడ జీవన భద్రత లేక, అక్కడ స్థిరమైన జీవనోపాధి లేక, అక్కడ కొంపా గోడూ పోగొట్టుకుని పొట్టచేత పట్టుకుని వచ్చినవారే.

ఈ మొత్తం సమస్యలో ఎక్కువ భాగం భారత–బంగ్లాదేశ్ సరిహద్దు పరిస్థితి వల్ల తలెత్తినదే. దేశం మధ్య భాగంలో మరొక దేశంగా ఉన్న బంగ్లాదేశ్ కు దేశంలోని ఐదు రాష్ట్రాలతో (అస్సాం, త్రిపుర, మిజోరాం, మేఘాలయ, పశ్చిమ బెంగాల్) సరిహద్దులు ఉన్నాయి. నాలుగువేల కి.మీ. విస్తరించిన ఈ సరిహద్దులో దాదాపు వెయ్యి కి.మీ. వేరువేరు నదులు, నదుల పాయల రూపంలో ఉంది. అంతర్జాతీయ సరిహద్దు నదులకు, చెరువులకు, పంటపొలాలకు, గ్రామాలకు అడ్డంగా ఉంది. ఇంకా చెప్పాలంటే ఒక ఇంటి ముంగిలి ఒక దేశంలోనూ, వెనుక పెరడు మరొక దేశంలోనూ ఉన్న పరిస్థితి కూడ ఉంది. సరిహద్దుకు ఎటువైపు మెరుగైన ఆర్థిక స్థితి ఉంటే, రోజు కూలి దొరికే అవకాశం ఉంటే అటు వలస వెళ్లడం సర్వ సాధారణంగా జరుగుతున్నది.

ఇలా వలస వస్తున్నవారిలో అత్యధిక సంఖ్యాకుల జీవన పరిస్థితి దుర్భరంగా ఉన్నది గనుక వారిని సానుభూతితో చూడవలసిందే. కాని వారు ఎక్కువ సంఖ్యలో వచ్చి ఇక్కడ స్థిరపడినప్పుడు స్థానిక వనరుల మీద ఒత్తిడి పెరిగి, స్థానిక పేద, మధ్యతరగతి ప్రజలకు కొత్త సమస్యలు కూడ వస్తున్నాయి. ఈ సమస్య అన్ని రాష్ట్రాలకన్న అస్సాంలో చాల ఎక్కువగా ఉంది. దేశ విభజన సమయంలో తూర్పు పాకిస్తాన్ గా ఏర్పడనున్న భూభాగం నుంచి పొరుగు రాష్ట్రాలకు పెద్ద ఎత్తున వలసలు సాగాయి. ఆ సమయంలో 1948 జూలై 19కి ముందు వచ్చినవారు భారత పౌరులు అవుతారని, ఆ తర్వాత వచ్చిన వారు చొరబాటుదారులుగా గుర్తింపు పొందుతారనీ ఒక అవగాహనకు వచ్చారు. తర్వాత ఈ సమస్యను పరిష్కరించడానికి ఎన్నో చట్టాలు, సవరణలు వచ్చాయి గాని సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. తూర్పు పాకిస్తాన్ లో అంతర్యుద్ధం ప్రారంభమయ్యాక వలసలు మరింత పెరిగాయి.

ఒక అంచనా ప్రకారం మూడు కోట్ల ఇరవై లక్షల అస్సాం జనాభాలో సగానికి పైగా బహిరాగతులే. ఇందులో పొరుగు దేశాల నుంచి, ప్రధానంగా బంగ్లాదేశ్ నుంచి సక్రమంగానూ, అక్రమంగానూ వలస వచ్చిన వారు ఎంతగా ఉన్నారో, భారతదేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి, ప్రధానంగా బెంగాల్, బీహార్ ల నుంచి వలస వచ్చినవారు అంతగా ఉన్నారు. అస్సాంలో ఉన్న ఇతర రాష్ట్రాల వారిపైనా, ఇతర దేశాల వారిపైనా కూడ సమానంగానే అస్సామీయులకు ఆగ్రహం ఉంది. వారు తమ వనరుల మీద భాగం పంచుకుంటూ తమ బతుకు దుర్భరం చేస్తున్నారనే అసంతృప్తి ఉంది. అఖిల అస్సాం విద్యార్థి సంఘం, అఖిల అస్సాం గణ సంగ్రామ పరిషత్ ల నాయకత్వంలో 1979లో ప్రారంభమై, ఆ తర్వాత అసోం గణపరిషత్ అనే రాజకీయ పార్టీ పుట్టుకకు, అది అధికారంలోకి రావడానికి దారితీసిన ఆందోళన ప్రధానంగా ఈ బహిరాగతుల సమస్యపైనే జరిగింది. 1951లో తయారైన ఎన్ఆర్సి స్థానంలో కొత్త ఎన్ఆర్సి తయారు చేయమని అఖిల అస్సాం విద్యార్థి సంఘం ఉద్యమ క్రమంలోనే డిమాండ్ చేసింది. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన వారి మీద వ్యతిరేకత వల్లనే ఆరు గంటల్లో పద్నాలుగు గ్రామాల్లో అధికారిక లెక్కల ప్రకారం 2,200 మందిని, అనధికార అంచనాల ప్రకారం పది వేల మందిని ఊచకోత కోసిన 1983 ఫిబ్రవరి నెల్లీ మారణకాండ జరిగింది. చివరికి ఈ సమస్యకు ఒక పరిష్కారంగా అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వానికీ, రాష్ట్ర ప్రభుత్వానికీ ఉద్యమకారులకూ మధ్య కుదిరిన అస్సాం ఒప్పందం ప్రకారం అస్సాంలో స్థిరపడిన విదేశీ పౌరులను, అక్రమ చొరబాటు దారులను గుర్తించడానికి 1971 మార్చ్ 25 తేదీ నిర్ణయించి, ఆ తర్వాత వచ్చిన వారిని అక్రమ చొరబాటుదార్లుగా గుర్తించి వారిని వెనక్కి పంపించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆ తర్వాత వోటర్ల జాబితాలో అనుమానితుల పేర్ల పక్కన డి (డౌట్ఫుల్ –అనుమానాస్పద) అనే మాట చేర్చాలని ఎన్నికల సంఘం 1997లో నిర్ణయం తీసుకుంది. తర్వాత ఎన్ఆర్సిని నవీకరించడానికి కేంద్ర ప్రభుత్వం 1999 నవంబర్ లో ప్రయత్నాలు ప్రారంభించింది. 1955 చట్టం ప్రకారం పౌరసత్వానికి పుట్టుక అనే అర్హత ఉంది గనుక దాన్ని సవరించడానికి 1950–87 మధ్య పుట్టినవారు పౌరులని, 1987–2003 మధ్య పుట్టినవారి తల్లిదండ్రులలో ఒకరు పౌరులైతే పౌరసత్వం వస్తుందని, 2003 తర్వాత పుట్టినవారి తల్లిదండ్రులలో ఒకరు అక్రమ చొరబాటుదారులైనా పౌరసత్వ అర్హత ఉండదని 2003లో సవరణలు చేశారు. ఈ సంక్లిష్ట చరిత్రలో వేరువేరు రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు, సుప్రీం కోర్టు జోక్యం

కలిసి సమస్యను మరింత జటిలం చేశాయి.

ఏ ప్రాంతంలోనైనా ఆ ప్రాంతంలోకి అక్రమంగా చొరబడి అక్కడి వనరుల మీద ఒత్తిడి తెస్తున్న, స్థానికులకు సమస్యలు సృష్టిస్తున్న వలసదారుల సమస్యను పరిష్కరించవలసిందే. ఆ వలసదారులు విదేశస్తులైతే ఆ సమస్యను మరింత సమర్థంగా పరిష్కరించాలి. అలా వచ్చిన వారందరికీ స్థానిక పౌరులుగా గుర్తింపునిచ్చి, కనీస సౌకర్యాలు, హక్కులు ఇవ్వడం అసాధ్యమవుతుంది. అలాగే వారందరినీ కట్టగట్టి వెనక్కు పంపించడం గాని, ఇక్కడే నిర్బంధించడం గాని అమానవీయ మవుతుంది. వారు కేవలం బతుకుదెరువు కోసం వచ్చినవారైతే వారు ఏ ప్రాంతం నుంచి, ఏ దేశం నుంచి వచ్చారో అక్కడి ప్రభుత్వాలతో దౌత్యపరమైన సంప్రదింపులు, సంభాషణలు, చర్చలు జరపడం, వారిని గౌరవప్రదంగా వెనక్కి పంపించడానికి, స్థానికంగా స్థిరపరచడానికి పరిష్కార మార్గాలను మానవీయంగా, ప్రజాస్వామికంగా, సామరస్య పూర్వకంగా అన్వేషించడం జరగాలి.

సంక్లిష్టమైన ఈ మొత్తం చరిత్ర చూస్తే ప్రధానంగా గుర్తించవలసిన అంశం ఇందులో అక్రమ చొరబాటుదారులకూ మతానికీ సంబంధం లేదు. చొరబాటుదారులలో అన్ని మతాలవారూ ఉన్నారు. ఉన్నచోట మంచి బతుకు లేక బతుకుదెరువు వెతుకులాటలో వలస వెళ్లడం ఏ మత విశ్వాసాలు పాటించేవారికైనా సర్వ సామాన్యం. కాని ఆ స్పష్టంగా అర్థమయ్యే విషయానికి మసిపూసి మారేడుకాయ చేయడం సంఘ్ పరివార్ లక్ష్యం. తమ చేతికి వచ్చిన అన్ని సమస్యల లాగనే దీన్ని కూడ మత సమస్యగా మార్చి, ముస్లిం బూచిని చూపి ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టడానికి పనికి వచ్చే ఒక ఆయుధంగా సంఘ్ పరివార్ శక్తులు మలచుకుంటున్నాయి. అంటే ఈ సంక్లిష్ట సుదీర్ఘ చారిత్రక సామాజిక సమస్యకు సామరస్య పూర్వక పరిష్కార మార్గాలు అన్వేషించే బదులు, సమస్యను జటిలంగా మార్చడానికే పూనుకుంటున్నారు. ఆ కుటిల ప్రయత్నాలలో భాగంగానే పౌరసత్వ సవరణ చట్టం తీసుకువచ్చారు.

ఈ చట్టాన్ని దానికదిగా చూడడం మాత్రమే కాక, ఇటీవలనే అస్సాంలో జరిగిన జాతీయ పౌరుల పట్టిక అనుభవంతో, త్వరలో నమోదు కానున్న జాతీయ జనాభా పట్టికతో కలిపి చూసినప్పుడు ఈ మూడూ కలిసి ఎంత దుర్మార్గమైన పర్యవసానాలకు దారి తీయనున్నాయో అర్థమవుతుంది.

అస్సాంలో అమలైన జాతీయ పౌరుల పట్టిక

పైన వివరించిన విషాద, బీభత్స, సంక్లిష్ట చరిత్ర నేపథ్యంలో అస్సాంలో బహిరాగతులను, ముఖ్యంగా బంగ్లాదేశ్ నుంచి సరిహద్దులు దాటి వచ్చిన అన్ని మతాలవారినీ గుర్తించడానికి జాతీయ పౌర పట్టిక తయారు చేయాలనీ, 1951 జనగణన ఆధారంగా 1951లోనే తయారై, ఆ తర్వాత ఏ మార్పులూ లేకుండా ఉండిపోయిన జాతీయ పౌర పట్టికను తాజాగా సవరించాలనీ 1985 అస్సాం ఒప్పందం నిర్దేశించింది. బంగ్లాదేశ్ 1971 మార్చ్ 25న ఏర్పడింది గనుక ఆ తర్వాత వలస వచ్చినవారందరినీ అక్రమ చొరబాటుదారులుగా గుర్తించాలని అనుకోవడం జరిగింది.

అస్సాం జనాభాలో భారత పౌరులు కానివారు కనీసం ఒక కోటీ ఇరవై లక్షల మంది ఉండవచ్చుననే అంచనాతో ఎన్ఆర్‌సి నమోదు కార్యక్రమం మొదలైంది. మూడు కోట్ల ఇరవై తొమ్మిది లక్షల మంది దగ్గర దరఖాస్తులు తీసుకుని వడపోయగా, 2018 జూలై 30 నాటికి తుదిదశకు వచ్చిన ఎన్ఆర్‌సి ప్రకారం చొరబాటుదారుల సంఖ్య 40 లక్షలు ఉండవచ్చునని అంచనా వేశారు. 2019 ఆగస్ట్ 31న ప్రకటించిన ఎన్ఆర్‌సి తుది జాబితాలో ఆ సంఖ్య 19,06,657 గా తేలింది. అందులోనూ ఏడు లక్షల మంది మాత్రమే ముస్లింలనీ, మిగిలినవారు బంగ్లాదేశ్ నుంచి వచ్చిన, లేదా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన హిందువులనీ తేలడంతో సంఘ్ పరివార్ శక్తులకు నోట్లో వెలక్కాయ పడినట్టయింది.

అప్పటివరకూ అస్సాంలో ఎన్ఆర్‌సి అయిపోగానే దాన్ని దేశమంతా విస్తరిస్తామనీ, మొట్టమొదట హైదరాబాద్ లో ఎన్ఆర్‌సి నమోదు ప్రారంభిస్తామనీ నరేంద్ర మోడీ, అమిత్ షా తో సహా సంఘ్ పరివార్ నేతలు చేస్తూవచ్చిన బెదిరింపులూ, హెచ్చరికలూ కాసేపు పక్కన పెట్టి, అసలు ఎన్ఆర్‌సి దేశమంతా విస్తరిస్తామని అననే లేదని, ఎన్ఆర్‌సి గురించి చట్టసభల్లో గాని, బైట గాని మాట్లాడనే లేదని పచ్చి అబద్ధాలు చెప్పడం ప్రారంభించారు.

అస్సాంలో చొరబాటుదారుల సంఖ్య అనుకున్నంతగా లేకపోయినా, చొరబాటుదారుల్లో అనుకున్నంతగా ముస్లింలు ఎక్కువగా లేకపోయినా, వారిని అదుపులోకి తీసుకుని నిర్బంధ శిబిరాలకు పంపించే కార్యక్రమం ప్రారంభమయింది. అస్సాంలో ఇప్పటికే ఆరు నిర్బంధ శిబిరాల నిర్మాణం జరిగి కొన్ని వేలమందిని అక్కడ నిర్బంధించారు. భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న మహారాష్ట్ర, కర్నాటకల్లో కూడ నిర్బంధ శిబిరాలు నిర్మించారు. కర్నాటకలో మరిన్ని శిబిరాలు నిర్మిస్తామని అంటున్నారు. అస్సాంలోనైతే ఈ నిర్బంధ శిబిరాలలో కనీస మానవజీవనానికి అవసరమైన వసతులు లేవనీ, అక్కడి నిర్బంధితులు అనారోగ్యానికీ, పోషకాహార లోపానికీ, అనేక శారీరక, మానసిక ఇబ్బందులకూ గురవుతున్నారనీ, అక్కడి స్త్రీ ఖైదీల మీద అత్యాచారాలు జరుగుతున్నాయనీ, ఇప్పటికే గణనీయమైన సంఖ్యలో మరణాలు సంభవించాయనీ వార్తలు వస్తున్నాయి. అంటే పీడనకు గురవుతున్నవారికి ఆశ్రయం కల్పించే ఉదాత్త లక్ష్యాన్ని ప్రకటిస్తూ వస్తున్న పౌరసత్వ సవరణ చట్టం గోముఖం వెనుక దాగిన ఎన్ఆర్‌సి వ్యాఘ్ర ముఖం ఇప్పటికే తన కోరలు చాచడం మొదలైంది.

జాతీయ జనాభా పట్టిక

జాతీయ పౌర పట్టిక మీద అనుమానాలు, గందరగోళం అలా ఉండగానే, భారత ప్రభుత్వం జాతీయ జనాభా పట్టికను తయారు చేయబోతున్నానని మరొక ప్రకటన చేసింది. దీని తయారీకి ఏప్రిల్ 2020 నుంచి సెప్టెంబర్ 2020 వరకు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తారని అంటున్నారు. రు. 8,500 కోట్ల వ్యయంతో తయారయ్యే ఈ పట్టిక దేశంలో "సాధారణ నివాసులైన" ప్రతి వ్యక్తి గురించీ సమగ్ర సమాచారాన్ని సమీకరిస్తుందని అంటున్నారు.

అసలు ఈ జాతీయ జనాభా పట్టిక అనే ఆలోచన ఎబి వాజపేయి ప్రధాన మంత్రిగా ఉండగా ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో 2000లో మొదటిసారి వచ్చింది. కార్గిల్ యుద్ధం తర్వాత ఏర్పాటయిన కార్గిల్ సమీక్షా కమిటీ దేశవ్యాప్తంగా పౌరులను, పౌరులు కాని వారిని తప్పనిసరిగా నమోదు చేసి పట్టిక తయారు చేయాలని సిఫారసు చేసింది. ఈ సిఫారసును వాజపేయి ప్రభుత్వం 2001లో ఆమోదించి 2003

లో సిటిజెన్ షిప్ (రిజిస్ట్రేషన్ అండ్ ఇష్యూ ఆఫ్ నేషనల్ ఐడెంటిటీ కార్డ్స్) రూల్స్ ప్రవేశపెట్టింది. ఆ విధానాన్ని యథాతథంగా ఆమోదించిన యుపిఎ ప్రభుత్వం 2004లో పౌరసత్వ చట్టం 1955లో "భారతదేశంలోని పౌరులలో ప్రతి ఒక్కరినీ తప్పనిసరిగా నమోదు చేసి, ఒక జాతీయ ఐడెంటిటీ కార్డ్ ఇవ్వాలి" అనే సవరణ చేసి జాతీయ పౌర పట్టిక తయారు చేసే ప్రయత్నం ప్రారంభించింది. 2003 నుంచి 2009 మధ్య కొన్ని ఎంపిక చేసిన సరిహద్దు ప్రాంతాలలో ముందస్తు నమోదు ప్రారంభించారు. 2009–11 మధ్య తీర ప్రాంతాలలో కూడ ఈ కసరత్తు చేశారు. అలా మొదటిసారి 2010లో ఈ జాతీయ జనాభా పట్టిక రూపొందింది. ముంబై దాడుల తర్వాత ఈ ప్రయత్నాన్ని భద్రతా చర్యలతో జతచేసి, దాదాపు 66 లక్షల మందికి నివాస ఐడెంటిటీ కార్డులు కూడ ఇచ్చారు. 2010లో తయారైన జాతీయ జనాభా పట్టికను 2015లో పరిష్కరించి తాజా పరిచారు.

ఆ జాతీయ జనాభా పట్టికను ఇప్పుడు మళ్లీ తయారు చేస్తామని ప్రభుత్వం అంటున్నది. పది సంవత్సరాలకు ఒకసారి జరిగే జనగణన, జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున హడావిడి, బెదిరింపులు చేసి సాధించిన ఆధార్ కార్డ్, వేరు వేరు స్థాయిల్లో ప్రభుత్వం దగ్గరా, వాణిజ్య సంస్థల దగ్గరా పోగుపడుతున్న కుప్పల కొద్దీ వ్యక్తిగత సమాచారం ఉండగా ప్రత్యేకంగా ఈ జాతీయ జనాభా పట్టిక అవసరమే లేదు. గత ఆరు నెలలుగా ఆ ప్రాంతంలో నివసిస్తున్న సాధారణ నివాసులకు సంబంధించిన పదిహేను అంశాల వివరాలు సేకరించే ఈ జాతీయ జనాభా పట్టికలో నుంచి నాలుగైదు అంశాలను విడదీస్తే జాతీయ పౌర పట్టిక తయారవుతుంది. అంటే ఎన్ఆర్‌సి తయారు చేయడానికి మొదటి మెట్టు ఎన్‌పిఆర్. ఆ విధంగా ప్రజలను చీలదీయడానికి, ప్రజలలో ఒక సమూహాన్ని ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకోవడానికి ఒక సాధనంగా ఈ పట్టిక సంఘ్ పరివార్ పాలకులకు ఉపయోగపడుతుంది. ఎలాగైతే గుజరాత్ మారణ కాండకు నెలల ముందే ఎక్కడెక్కడ ముస్లిం ఆవాస ప్రాంతాలున్నాయో, ఎక్కడెక్కడ ముస్లిం యజమానుల వ్యాపార సంస్థలున్నాయో జాబితాలు తయారు చేసి, ఆ జాబితాల ఆధారంగానే మారణకాండ, విధ్వంసకాండ జరిపారో, ఇప్పుడు కూడ ఏవో దురుద్దేశాల తోనే దేశవ్యాపిత జాబితాలు తయారు చేస్తున్నారు. అస్సాంకు మాత్రమే ప్రత్యేకమైన ఎన్ఆర్‌సి ని దేశవ్యాప్తంగా విస్తరిస్తామని అంటూ, అటువంటి ఎన్ఆర్‌సికి తొలి మెట్టుగా ఈ ఎన్‌పిఆర్ ఉపయోగ పడుతుందని స్వయంగా మంత్రులే పార్లమెంటులో ప్రకటించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వార్షిక నివేదికలో కూడ ఆ మాట రాశారు. కాని ఇప్పుడు హఠాత్తుగా మాట మారుస్తూ ఆ రెంటికీ సంబంధం లేదని అంటున్నారు.

అసలు సమస్య ఎవరికి వస్తుంది?

దాన్ని పౌరసత్వ సవరణ చట్టం అంటారా, జాతీయ పౌరుల పట్టిక అంటారా, జాతీయ జనాభా పట్టిక అంటారా అనేది సాధారణ భారతీయులకు అనవసరం. దానివల్ల ఎవరి మీద ఏ ప్రభావం పడనున్నదనేదే ముఖ్యం. మొట్టమొదట అర్థం చేసుకోవలసినది, అవి మూడూ వేరువేరు కాదు. ఒకదానితో మరొకదానికి సంబంధం లేదని ప్రభుత్వాధినేతలు ఎంత నమ్మబలుకుతున్నప్పటికీ, వాస్తవాచరణలో ఒకదాని ప్రభావం మరొకదాని మీద ఉండక తప్పదు. అందువల్ల ఈ మూడిటినీ కలిపి చూసి ప్రభావాన్ని గుర్తించవలసిందే. అలా మూడూ కలిపి చూస్తే, దేశంలో ప్రతి మనిషీ తనకు ఈ దేశ పౌరసత్వం ఉందని తనకు తాను రుజువు చేసుకోవలసి వస్తుంది. అస్సాం అనుభవాన్ని బట్టి చూస్తే పద్నాలుగు రకాల ధ్రువీకరణ పత్రాలలో ఏదో ఒకటి చూపమని అడిగారు. వాటిలో జనన ధ్రువీకరణ పత్రం దగ్గరి నుంచి బ్యాంక్ అకౌంట్ నుంచి వోటర్ల జాబితా నుంచి భూమి పట్టా వరకూ ఎన్నో ఉన్నాయి. అక్కడ ఏదో ఒక ధ్రువీకరణ పత్రాన్ని చూపితే కూడ వాటిని తోసివేశారు. ఈ పద్నాలుగు ధ్రువీకరణ పత్రాలలో ఒక్కటైనా లేనివారు దేశవ్యాప్తంగా కనీసం మూడో వంతు ఉంటారనీ, ముస్లింలలో ప్రత్యేకంగా 40 శాతం ఉంటారనీ ఒక అంచనా.

అంటే దారిన వెళ్లే వ్యక్తినెవరినైనా పట్టుకుని వారు పౌరులవునో కాదో రుజువు చేసుకోమంటే వారు సిఎఎ లోని ఆరు మతాలకు చెందినవారైతే వారు విదేశాల నుంచి వచ్చినవారైనా సరే పౌరులుగా గుర్తింపు పొందుతారు. ముస్లింలైతే, వారి తాత ముత్తాతల నుంచి ఇక్కడే ఉన్నవారైనప్పటికీ ఆఫ్ఘనిస్తాన్ నుంచో, పాకిస్తాన్ నుంచో, బంగ్లాదేశ్ నుంచో వచ్చినవారని ఆరోపించవచ్చు. ఆ ఆరోపణను తిరస్కరించే ఆధారాలు చూపి నిరూపణ చేసుకొమ్మని అడగవచ్చు. అవి వారి దగ్గర దొరకవు గనుక వారిని అక్రమ చొరబాటుదారులుగా ప్రకటించి, అక్కడికక్కడే నిర్బంధించి నిర్బంధ శిబిరంలోకి పంపవచ్చు. దేశంలోని ఇరవై కోట్ల మంది ముస్లింలలో నలభై శాతం మందికి, అంటే ఎనిమిది కోట్ల మందికి ఇటువంటి పత్రాలు ఆధారాలు లేవు గనుక వారందరినీ ఒక్క కలం పోటుతో అక్రమ చొరబాటుదార్లుగా ముద్ర వేసి వేధించవచ్చు. అలా ఈ దేశ ముస్లింలందరి మెడల మీద గుర్తింపు పత్రాల కత్తి వేలాడదీయవచ్చు.

జర్మనీ, ఇజ్రాయిల్ లే సంఘ్ పరివార్ ఆదర్శం

ఇదంతా ఊహ కాదు. సరిగ్గా ఇటువంటి పనే జర్మన్ ప్రభుత్వ పోలీసులు, నాజీ పార్టీ కలిసి జర్మనీలో 1933 నుంచి 1939 దాకా సాగించారు. వీధుల్లో ప్రతి ఒక్కరినీ "కాగితాలు" "కాగితాలు" అని అడిగారు. కాగితాలు చూపలేని యూదులను నిర్బంధించారు. నిర్బంధ శిబిరాలకు, విషవాయుగృహాలకూ పంపారు. అరవై లక్షల మందిని ఊచకోత కోశారు. అక్కడ ఉపయోగించినది కేవలం మత ప్రాతిపదికే. ప్రజలను చీలదీసి, ఒక వర్గానికి వ్యతిరేకంగా మరొకరిని నిలిపి, సాధారణ ప్రజలలో కూడ మత విద్వేషం ప్రేరేపించి విధ్వంస సంస్కృతిని పెంచారు. అక్కడ అంత హింసకూ పీడనకూ వేదనకూ గురైన బాధితులైన యూదులే అరబ్బుల నేలలో తమకు ఇజ్రాయిల్ అనే రాజ్యం వచ్చేసరికి పాలస్తీనీయుల మీద అదే రకమైన పీడననూ, హింసనూ అమలు చేస్తున్నారు. ఏడు దశాబ్దాలుగా పాలస్తీనీయుల భూభాగాన్ని అక్రమంగా ఆక్రమించి విస్తరిస్తూ, లక్షలాది మంది పాలస్తీనీయులను వేధిస్తూ, నిర్బంధిస్తూ, చిత్రహింసలు పెడుతూ, హత్య చేస్తూ, బాంబు దాడులు చేస్తూ, అత్యంత అమానుష, క్రూర పాలన సాగిస్తున్నారు. ఆ నాజీ పాలకవర్గాలు, ఇజ్రాయిలీ పాలకవర్గాలు ఆర్ఎస్ఎస్ కు ఆదర్శం.

హిట్లర్ దుర్మార్గాన్ని సంపూర్ణంగా సమర్థించినవాడు, దాన్ని మనదేశంలో కూడ ఆదర్శంగా తీసుకోవాలని అక్షరాలా రాసినవాడు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సిద్ధాంతకర్త ఎంఎస్ గోల్వాల్కర్. ముస్లింలు తమ అస్తిత్వాన్ని, మతాన్ని, సంస్కృతిని వదులుకొని, ఘర్ వాపసీ వచ్చి,

హిందూ ధర్మంలో సమ్మిళితమైపోవాలని, లేదా హిందూ ధర్మానికి లొంగిపోయి, రెండో తరగతి పౌరుల్లా బతకాలని ఆర్‌ఎస్‌ఎస్ భావిస్తుంది. ఆ సంస్థలో ఎదిగివచ్చి, ఆ భావజాలాన్ని నరనరానా జీర్ణించుకున్నవారు ఇవాళ దేశానికి కీలకమైన రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, హోంమంత్రి పదవుల్లో ఉన్నారు. న్యాయవ్యవస్థ, అధికారవర్గం, ప్రచారసాధనాలు అన్నిటిలోకీ తమ శక్తులు చొరబడేలా, కీలకస్థానాల్లో చేరేలా దశాబ్దాల తరబడి పనిచేశారు. ఇవాళ దేశంలో ప్రతి వ్యవస్థనూ ధ్వంసం చేసి, ప్రతి మానవీయ, ప్రజాస్వామిక, ఆధునిక పద్ధతినీ వక్రీకరించి, ఇటు తమ భూస్వామ్య, బ్రాహ్మణీయ, హిందూ పాలననూ అటు సామ్రాజ్యవాద దళారీ పాలననూ కొనసాగించడమే ఈ పాలకుల లక్ష్యం. తాము ఈ లక్ష్యాన్ని సాధించే మార్గంలో ఉండగా, తమకు అడ్డు రాకుండా ప్రజలను పక్కదారి పట్టించడం కూడ ఈ పాలకుల ఉప వ్యూహం. పైగా ఐదున్నర సంవత్సరాల పాలనలో అటు అంతర్జాతీయ సామ్రాజ్యవాద కారణాల వల్ల, ఇటు వీరి పాలనాసరళివల్ల దేశ ఆర్థిక వ్యవస్థ మున్నెన్నడూ లేనంత పెద్ద ఎత్తున సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. పాలకులు ప్రకటిస్తున్న గణాంకాలే ఆర్థిక వ్యవస్థ సూచికలన్నీ పతన దశలో ఉన్నాయని చూపుతున్నాయి. జాతీయాదాయ వృద్ధి రేటు ఆశించిన, ఊహించిన దానిలో సగానికి సగం పడిపోయింది. నిరుద్యోగ రేటు ఈ ఏడు దశాబ్దాలలో ఎన్నడూ లేనంత పెద్ద ఎత్తున నమోదవుతున్నది. విదేశీ రుణ భారం ఈ ఐదున్నర సంవత్సరాలలో రెట్టింపు అయింది. మొత్తం ఆర్థిక వ్యవస్థ లాభాలన్నీ రెండు మూడు కార్పొరేట్ గృహాల గుత్తాధిపత్యానికే చేరుతుండడంతో పాలకవర్గాలలోనే ముఠా తగాదాలు పెరిగిపోతున్నాయి. ఈ ఆర్థిక సంక్షోభ ఫలితంగా రాజకీయ సంక్షోభం కూడ పెరుగుతున్నది. రెండు సంవత్సరాల కిందటి దృశ్యంతో పోలిస్తే, ఆరు నెలల కింద అఖండ ఆధిక్యత సాధించాననుకున్న పార్టీ చేతిలోనుంచి సగానికి సగం రాష్ట్రాలూ, జనాభా జారిపోయాయి. సహజంగానే ఈ రాజకీయార్థిక సంక్షోభం సామాజిక, సాంస్కృతిక రంగాలలో ప్రతిఫలిస్తున్నది. నిజానికి ఈ సంక్షోభం నుంచి దేశాన్ని, దేశ ప్రజలను రక్షించగలిగింది కార్మికవర్గ నాయకత్వంలోని ప్రజా విముక్తి పోరాటమే గాని, అనేక అంతర్గత, బాహ్య కారణాల వల్ల దేశంలో పీడిత వర్గ శక్తులు ఇంకా అంత శక్తి సామర్థ్యాలు సంతరించుకోలేదు. ఈ సంక్షోభం నుంచి ప్రజలు తమంత తాముగానే వర్గపోరాట అవసరాన్ని, కార్మికవర్గ నాయకత్వాన్ని గుర్తిస్తారేమో, ఈ పాలకవర్గాలను కూలదోస్తారేమో అనే అనుమానాలతో, వారిని పక్కదారి పట్టించడానికి మతాన్ని, కులాన్ని, ప్రాంతీయతను, తప్పుడు చైతన్యాన్ని వాడుకోవడానికి పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయి.

వెల్లువెత్తుతున్న ప్రతిఘటన

అయితే ఇంత నిరాశామయ వాతావరణంలో కూడ సంఘ్ పరివార్ దుర్మార్గానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసన, ప్రతిఘటన ఒక ఆశాసూచిక. గత ఐదున్నర సంవత్సరాలలో ఘర్ వాపసీ, పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి, అసహన దాడులు, గోరక్షణ పేరిట హింసాకాండ, ప్రశ్నించే గళాలపై అక్రమ కేసులు, ఎన్నికల అక్రమాలు, అధికరణం 370 రద్దు, కశ్మీర్ మీద దమనకాండ, ట్రిపుల్ తలాక్ చట్టం, అయోధ్య తీర్పు వంటి ఎన్నో దుర్మార్గాలు సజావుగానో, చిన్నస్థాయి నిరసనలతోనో సాగిపోయాయి గాని, ఇప్పుడు పౌరసత్వ సవరణ బిల్లు ప్రవేశపెట్టిన నాటి నుంచీ, అది ఆమోదం పొంది చట్టంగా మారిననాటి నుంచీ దేశం దేశమే ఉవ్వెత్తున తిరగబడుతున్నది. ఆ చట్టాన్ని వెనక్కి తీసుకొమ్మని అనేక వర్గాల, మతాల ప్రజలు ఒక్కుమ్మడిగా దేశమంతా నిరసన తెలుపుతూ ఈ దేశపు సహజీవన, బహుళత్వ సంస్కృతికి అద్దం పడుతున్నారు. సిఎఎ మీద మొదలైన నిరసన ఎన్‌ఆర్‌సి దాకా, ఎన్‌పిఆర్ దాకా వ్యాపించి, ఎన్నో రాష్ట్ర ప్రభుత్వాలు కూడ ఎన్‌ఆర్‌సి –ఎన్‌పిఆర్ లను అమలు చేయబోమని ప్రకటించక తప్పని స్థితి వచ్చింది. డిసెంబర్ 12 నుంచి ఇది రాస్తున్న 26 దాకా గడిచిన రెండు వారాల్లో దేశవ్యాప్తంగా కొన్ని వేల నగరాల్లో, పట్టణాల్లో, గ్రామాల్లో కూడ నిరసన ప్రదర్శనలు జరిగాయి. కొన్ని కోట్ల మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వ దుర్మార్గాన్ని నిలదీశారు. కనీసం యాభై విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు ఈ చట్టాన్ని ప్రతిఘటించారు.

ఈ ప్రజా నిరసన ప్రదర్శనల్లో ఎక్కువభాగపు సాధారణ లక్షణం అవి స్వచ్ఛందంగా, ప్రజల చొరవతో, భాగస్వామ్యంతో జరగడం. అక్కడక్కడ రాజకీయ పార్టీలు నాయకత్వ స్థానంలో ఉండడానికి ప్రయత్నించినప్పటికీ, స్వయంగా మోడీ ఈ నిరసన ప్రదర్శనలకు ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, అర్బన్ నక్సలైట్లు కారణమని ఆరోపించినప్పటికీ, ఎక్కువచోట్ల ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, ముస్లిం మహిళలతో సహా యువతరం, వీధుల్లోకి వచ్చి సమరశీలంగా పోరాడుతున్న నిదర్శనాలు కనిపిస్తున్నాయి. ఈ రెండు వారాల నిరసన వెల్లువను వీలైనంత తగ్గించి చూపడానికి ప్రధానస్రవంతి ప్రచార సాధనాలు ప్రయత్నిస్తున్నప్పటికీ, సోషల్ మీడియా వ్యక్తీకరణలను చూస్తే ఈ రెండు వారాల్లో ప్రజా కార్యాచరణ విస్ఫోటనం మాత్రమే కాదు, ప్రజా చైతన్య విస్ఫోటనం ఎంత జరిగిందో కనబడుతుంది. అనేక కొత్త నిరసన రూపాలు, ఆకర్షణీయమైన నినాదాలు, ఉపన్యాసాలు, కవిత్వం, పాటలు, బానర్లు, పెయింటింగ్ లు, కార్టూన్లు, లాఠీచార్జి చేసున్న పోలీసులకు పూలు అందిస్తున్న బాలికలు, పోలీసు వలయం మధ్య నిలబడి ధైర్యంగా, గంభీరంగా వాదన వినిపిస్తున్న ఒంటరి యువతులు, లాఠీ దెబ్బలకు ఒళ్లు కదుములు కడుతున్నా, తలలు పగిలి, కాళ్లూ చేతులూ విరిగి రక్తాలు కారుతున్నా ఆ గొంతుల నుంచి ఎగసివస్తున్న ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు, ప్రభుత్వ బలగాలూ, ఆర్‌ఎస్‌ఎస్ గూండాలూ కలిసి బీభత్సం సృష్టించిన స్థలంలోనే మరి కొద్ది సేపటికే ఉజ్వలమైన నిరసన ప్రదర్శనలు... ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజా చైతన్య సృజనాత్మక వికాసం ఎల్లెడలా కనబడుతున్నది. ఉక్కుపాదాల రాజ్యం చెల్లదనీ, మహా విష సర్పాన్ని కూడ మట్టికరిపించగల శక్తి చలిచీమలకు ఉందనీ ఈ రెండు వారాల భారత ప్రజా ప్రదర్శన దృశ్యం మరొకసారి ఉత్తేజకరమైన చరిత్ర పాఠం నేర్పుతున్నది.

ఈ ప్రదర్శనలను సమీకరించి, సంఘటితం చేసి, శాస్త్రీయ మార్గంలో లక్ష్యందాకా నడిపించగల శక్తులు లేకపోతే ఇంత అద్భుతమైన ప్రజా వికాసమూ చప్పున చల్లారి పోగలదని లక్షలాది మంది పాల్గొన్న అరబ్ స్ప్రింగ్ ఉద్యమాలు మన కళ్ల ముందరే చూపాయి. ఇవాళ దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న నిరసనను విస్తృతం చేయడమూ, సంఘటితం చేయడమూ, విద్వేష రాజకీయాల సంఘ్ పరివార్ వ్యూహాలను అడ్డుకోవడమూ, ఈ దేశపు బహుళత్వ సహజీవన సంస్కృతిని ఎత్తిపట్టడమూ ఇవాళ ప్రగతిశీల వ్యక్తులందరి కనీస కర్తవ్యం. వీ

(రచయిత వీక్షణం సంపాదకులు)

అమిత్ షాకు సాహిత్య విమర్శకుడి బహిరంగ లేఖ

***ఇటీవలి పరిణామాల మీద 'సిటిజెన్ అమిత్ షా' కు రాసిన బహిరంగ లేఖలో అనేక సామాజిక, చారిత్రక విషయాలు గుర్తుచేస్తున్నారు* గణేశ్ డెవీ**

"సిటిజెన్ షిప్ అమెండ్ మెంట్ ఆక్ట్ 2019 గురించి ఏ ఒక్క భారతీయ పౌరుడూ భయపడనక్కరలేదు" అని ఎంత బాగా అన్నారు, అమిత్ భాయ్! ఆఫ్ఘనిస్తాన, పాకిస్తాన్, బంగ్లాదేశ్ లలో తాము ఎదుర్కొన్న మతపరమైన వివక్ష వల్ల చట్టవ్యతిరేక చొరబాటుదారులుగా భారతదేశంలో ప్రవేశించిన హిందూ, జైన, బౌద్ధ, సిక్కు, పార్సీ, క్రైస్తవ సోదర సోదరీమణులు సంతోషంతో నిట్టూర్పు విడవడానికి ఒక కారణం దొరికింది. వేదనకు గురవుతున్న మానవుల పట్ల అంత దయ చూపినందుకు, మీలో అంత లోతైన కరుణాహృదయం ఉన్నందుకు కృతజ్ఞతలు. వివక్షకు గురవుతున్న బాధితుల వేదనను రూపుమాపడానికి మీరు చూపిన ఈ అపార కరుణకు వారూ, భారతీయులందరమూ మీకు కృతజ్ఞులమై ఉంటాము. కాని, మరికొందరు కూడ అటువంటి వాళ్లున్నారు. బంగ్లాదేశ్ లో మ్రో అనే గిరిజన తెగ సమూహం ఉంది. వారికి వారి సొంత దేవతలున్నారు. వారు మందిరాలకు వెళ్లరు, మసీదులకూ వెళ్లరు. చర్చిలకో, గురుద్వారాలకో, దేరాసారి లకో, సినగాగ్ లకో వెళ్లరు. వారు కేవలం ప్రకృతిని ఆరాధిస్తారు. దైవత్వం గురించి వారికి ఉన్న భావన గురించి తెలియని ఆంత్రొపాలజిస్టులు, జనగణన అధికారులు వారిని 'సర్వాత్మవాదులు' అనే వర్గంలో చేర్చారు. నిజానికి ఇటువంటి సమూహాలలో మ్రో సమూహం ఒక్కటి మాత్రమే కాదు, మరెన్నో ఉన్నాయి. మీటీ, త్రిపుర, మర్మా, తంచంగ్యా, బరువా, ఖాసీ, సంథాల్, చక్మా, గారో, ఒరావున్, ముండా, త్రిప్పెరా వంటి సమూహాలెన్నో. ఈ పదకొండు గిరిజన తెగలకు చెందినవారిలో అత్యధికులు చిటగాంగ్ కొండ చరియల్లో జీవిస్తారు. వీరందరినీ బంగ్లాదేశ్ ప్రభుత్వం 'మైనారిటీలు' అని వర్గీకరించింది.

ఈ గిరిజన తెగలవారందరూ కూడ సుదీర్ఘకాలంగా ఒక ఇస్లామిక్ రిపబ్లిక్ పౌరులుగానే ఉన్నారు. వారు కూడ మీలాగనే మతపరమైన వివక్ష పట్ల భయంతో జీవిస్తున్నారు. మరి, అమిత్ భాయ్, మీ కరుణాదృక్కులు వారి మీద ప్రసరించడంలో విఫలమయ్యాయేం? వారు గిరిజనులు గనుకనా? లేక తమను తాము హిందువులుగా చెప్పుకోని గిరిజనులంటే ఆర్ ఎస్ ఎస్ కు సహజంగా ఉండే కోపం వల్లనా?బంగ్లాదేశ్ అధికారిక గణాంకాల ప్రకారం ఈ గిరిజన తెగలకు చెందిన దాదాపు తొమ్మిది లక్షల మంది ఆ ప్రాంతంలో నివసిస్తున్నారు. ఇవే తెగలకు చెందిన దాదాపు అంతే మంది మిజోరాంలో, మేఘాలయలో, త్రిపురలో, అస్సాంలో నివసిస్తున్నారు, పనిచేస్తున్నారు. వారిని మీరేం చేయబోతున్నారు?

పాకిస్తాన్ లో మతపరమైన వివక్షకు గురవుతున్న షియాలు, అహ్మదియాలు వంటి 'ఇతర' ఇస్లామిక్ శాఖల గురించి మీకు అవగాహన కల్పించడానికి ఇప్పటికే చాల మంది ప్రయత్నించారు. నిజం చెప్పాలంటే, అసలు ఇస్లాం అనే మాట వింటేనే మీకు ఒంటిమీద తేళ్లూ జెర్రూ పాకుతాయని మాకు తెలుసు. మరి మీరు కోరుకుంటున్నట్టుగా జాతీయ పౌరుల పట్టిక నమోదు జరుగుతున్నప్పుడు, అల్లా కటాక్షాన్నే కోరుకునే సూఫీలనూ, మాదరిలనూ, దర్వేష్ లనూ, బౌల్ లనూ మీరు ఏం చేయదలచుకున్నారు? వారికి నిర్దిష్టమైన స్వస్థలాలు లేవు, గుర్తింపు పత్రాలు లేవు. వారి పూర్వీకుల గురించీ, స్వస్థలాల గురించీ రుజువు చేసుకునే చిహ్నాలేమీ లేవు. మీరు ఉత్సాహంగా నిర్మించిన నిర్బంధ శిబిరాల్లో బంధించబోయే తొలి ఖైదీలు వాళ్లేనా?

మీ ప్రతిపాదనకు లోకసభలో 311 మంది, రాజ్యసభలో 125 మంది 'ఔను' మీట నొక్కేలా చూసుకున్నందుకు అభినందనలు. కాని మీకైనా, ఆ మీట నొక్కినవారికైనా ఏం చేస్తున్నారో అర్థమయిందా? భారీ సంఖ్యలో ప్రజానీకపు హక్కులను తుడిచివేశారనీ, వారి ఆర్తనాదాలు మీ చెవికి ఎన్నడూ వినబడబోవనీ మీకు తెలిసిందా? అలా హక్కులు కోల్పోయిన వారిలో అందరికంటె మొట్టమొదట చెప్పవలసిన వారు పదమూడు కోట్ల డినోటిఫైడ్, నొమాడిక్ (విముక్త, సంచార) జాతుల ప్రజలు. వారు రెండు వందల కన్న ఎక్కువ తెగలలో, సముదాయాలలో దేశమంతా వ్యాపించి ఉన్నారు. వారిని వలసపాలనా సమయంలో తప్పుడు పద్ధతిలో నేరస్త జాతులుగా వర్గీకరించి 1871లో నేరస్త తెగల చట్టం తీసుకువచ్చారు. వారి మీది నుంచి ఆ మచ్చ తొలగించి "విముక్త" జాతులుగా పిలవాలనే ప్రయత్నాన్ని 1952లో జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభించాడు. వారు "పౌరులు కారు" గనుక 1951 జనగణన కసరత్తులో వారి పేర్లు సహజంగానే నమోదు కాలేదు. ఆ జనగణన ఆధారంగానే మొట్టమొదటి జాతీయ పౌరుల పట్టిక తయారైనప్పుడు వారి పేర్లు అందులోకి ఎక్కలేదు. వారిలో అతి తక్కువ అంత దురదృష్టవంతులు కాని తెగలు మినహా మిగిలినవారందరూ షెడ్యూల్డ్ తెగల జాబితాలోకీ ఎక్కలేదు, షెడ్యూల్డ్ కులాల జాబితాలోకీ ఎక్కలేదు.

జవహర్ లాల్ నెహ్రూ అప్పటి పాకిస్తాన్ ప్రధాని లియాఖత్ అలీ ఖాన్ తో ఒక ఒప్పందం మీద సంతకం చేసి ఉండనట్టయితే ఇప్పుడు ఆ దేశాల నుంచి వివక్షకు గురవుతున్న హిందువులను భారత పౌరులుగా గుర్తించే వ్యవహారంలోకి దిగవలసిన అవసరమే మీకు వచ్చేది కాదని వాదిస్తున్నారు గదూ, అమిత్ భాయ్, అబ్బ మీరు మాట్లాడేది ఎంత వాస్తవం. నెహ్రూ చేసిన పనులను తిరగదోడాలన్న మీ దృఢ దీక్ష నిజంగా ప్రశంసనీయం. మరి, విదేశాల సంగతి పక్కన పెట్టండి, భారత దేశంలోని

విముక్త జాతుల సంగతి ఏమిటి? వారు ఇంకా మన నగరాల, పట్టణాల కూడళ్లలో గాలి బుడగలు అమ్ముకుంటూ తిరుగుతున్నారు. వారికి ఏ గుర్తింపు పత్రాలూ లేవు, ఆధార్ కార్డు లేదు, గ్యాస్ కనెక్షన్ లేదు. కరెంటు బిల్లు లేదు. పాస్ పోర్ట్ అయితే కచ్చితంగా ఉండి ఉండదు. వారు అప్పటికే ఉండిన నిర్బంధ శిబిరాలను 1952లో తెరిపించి, నెహ్రూ వారిని విడుదల చేశాడు. మరి నెహ్రూ చేసినవన్నీ తిరగదోడాలి గదా, మీరు వారిని మళ్లీ నిర్బంధంలోకి తీసుకుని నిర్బంధ శిబిరాల్లోకి తోయనున్నారా? ఎలాగా వారు 1871 నుంచి 1952 దాకా అక్కడే బందీలుగా బతుకునీడ్చారు.


నెహ్రూ పేరు వినగానే మీరు ముఖం చిట్లిస్తారని నాకు తెలుసు. ఔను, నెహ్రూనే, ఆ నెహ్రూనే మన సమస్యలనిటినీ ప్రారంభించినవాడు. అది కశ్మీర్ గాని, లౌకికవాదం గాని, నిర్బంధ శిబిరాల్లో ఉన్న తెగలను విముక్తం చేయడం గాని సమస్యలన్నీ సృషించినది ఆయనే. మన దరిద్రాలన్నిటికీ ఆ నెహ్రూ, రాజీవ్, కాంగ్రెస్ లే కారణమని నరేంద్ర భాయ్ ఆరు సంవత్సరాలుగా మనకు చెపుతూనే ఉన్నారు. మీరు, నరేంద్ర భాయీ, ఆర్ ఎస్ ఎస్ లో మీ పూర్వీకులూ కూడ లౌకికవాదం పట్ల భారతదేశపు అవగాహన ఎంత లోపభూయిష్టమైనదో చెపుతూనే ఉన్నారు. భారత్ లో ఉన్న ప్రతి ఒక్కరూ హిందువేనని, వారు తమ మతం ఏమని చెప్పుకున్నప్పటికీ, తమను తాము ఏమని పిలుచుకున్నప్పటికీ వారందరినీ హిందువులుగానే చూడాలనీ మావంటి కుహనా లౌకికవాదులలో చాలమందిమి అర్థం చేసుకోకపోవడం నిజంగా శోచనీయం. ఒక భిన్నమైన వ్యక్తిని కొట్టి చంపినప్పుడల్లా, బుద్ధుడు, బసవన్న, కబీర్, మీరా, నానక్, గాంధీ వంటి పేర్లు చెపుతూ మన దేశపు సంకీర్ణ, బహుళత్వపు సంస్కృతి గురించి, ఇతర చరిత్ర భావనల గురించి మాట్లాడే మమ్మల్ని మీ దేశభక్తులు ఎంతగా దుర్భాషలాడుతున్నారో మీకు తెలిసే ఉంటుంది. గోమాతకు ప్రమాదం ఏర్పడినప్పుడు ఇటువంటివి తప్పవు.

కశ్మీర్ ను ఎన్నో నెలలుగా "మూసిపెట్టడం" లోనూ, అనవసరమైన ప్రశ్నలు వేసేవారిని అనుమతించక పోవడంలోనూ, కశ్మీర్ ఎంత ప్రశాంతంగా ఉన్నదో చూసి మెచ్చుకోవడానికి సహచర యూరోపియన్ల ప్రతినిధివర్గాన్ని మాత్రమే ఆహ్వానించడంలోనూ మీరు చేస్తున్న కృషి ఎంత ప్రశంసనీయం! అలాగే జామియా మిలియా ఆవరణలో కాల్పుల తర్వాత సమస్యా కారకులను శిక్షిస్తామని ప్రకటించినందుకూ, పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చెలరేగిన తర్వాత సగం దేశంలో సెక్షన్ 144 విధించినందుకూ అభినందనలు. భారతదేశం అనే మీ అవగాహనతో మీరు గుజరాత్ అల్లర్లను ఎలా "అదుపు చేశారో", అల్లర్లకు సంబంధించిన కేసులతో ఎలా వ్యవహరించారో మేం ఇంకా గుర్తు చేసుకుంటూనే ఉన్నాం.

కాని, అమిత్ భాయ్, నిరసన ప్రదర్శనలను భారత దేశం మొత్తం తమ టెలివిజన్ తెరల మీద చూస్తున్నప్పుడు, లేదా వాటిలో పాల్గొంటున్నప్పుడు, వ్యక్తమైన అసంతృప్తి వెల్లువ ఈసారి కాస్త భిన్నంగా ఉంది. ఈసారి దృశ్యంలో కనబడుతున్నవారు మీరు మామూలుగా దృష్టి మళ్లించడానికి చెప్పే "టుక్డే టుక్డే గ్యాంగ్' లా అనిపించడం లేదు. ఈసారి నిరసనకారుల్లో ఎక్కువమంది విద్యార్థులూ, యువజనులూ మాత్రమే గాని, ఏ రాజకీయ బృందానికీ చెందినవాళ్లలా కనిపించడం లేదు. వీళ్లు ఈసారి "మనుషులందరూ మొట్టమొదట మనుషులు" అనే విచిత్రమైన మాటలు మాట్లాడుతున్నారు. వీళ్లు తమను తాము భారత పౌరులమని చెప్పుకుంటున్నారు. కాకపోతే మీరు చెపుతున్నలాంటి పౌరులు కాదు. వీళ్లు తమ అవగాహనలోని భారత భావన వర్ధిల్లాలంటున్నారు. అమిత్ భాయ్, ఎక్కడో ఏదో పొరపాటు జరిగినట్టు లేదూ?! మీకు మీ మీద ఎప్పుడూ సందేహాలు రావనుకోండి. కాని ప్రతి ఒక్కరికీ తమ పనులను గురించీ ఆలోచనల గురించీ పునరాలోచించుకోవలసిన సమయం ఒకటి వస్తుందని మీకు తెలియదా? పౌరసత్వమనేది మతానికీ, భాషకూ, లింగానికీ అతీతంగా ఉండాలని ఇవాళ దేశంలోని పౌరులందరూ లేచి నిలబడి ప్రశ్నిస్తున్నప్పుడు, అందులో మీకేదో సందేశం ఉన్నదని అనిపించడం లేదా? సిటిజన్ అమిత్ భాయ్, ఒక్కసారి ఆలోచించండి.

(రచయిత సాహిత్య విమర్శకులు, సాంస్కృతిక కార్యకర్త, పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యక్షులు)

(https://www.freepressjournal.in/analysis/an-open-letter-to-citizen-shah-ganesh-devy) వీ



అత్యాచారాల వెనుక ప్రవహిస్తున్న మద్యం

***మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు మద్యపానం, సినిమా, సీరియల్స్, సోషల్ మీడియా, నీలి చిత్రాలు కారణమని, వీటిని కట్టడి చేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోకుండా ఘటన జరిగినపుడు మాత్రమే చట్టాలను ముందుకు తెస్తుందని అంటున్నారు* డా. కత్తి పద్మారావు**

స్త్రీలపై అత్యాచారాలు ఎందుకు జరుగుతున్నాయి అనే ఒక పెద్ద ప్రశ్న ఈనాడు మన ముందు నిలబడి ఉంది. కామోద్రేకాలు రెచ్చగొట్టే ఒక వాతావరణం ఈనాడు భారతావనిలో కమ్ముకొని ఉంది. స్త్రీ బహుముఖ వ్యక్తిత్వం గలది. నాగరిక సమాజంలో స్త్రీకి అబలత్వాన్ని ఆపాదించడం జరిగింది. ఆటవిక దశలో స్త్రీ అన్ని రంగాల్లోను పురుషునికే మాత్రం తీసిపోలేదు. శారీరక శక్తిలోను, సామర్థ్యంలోను, చొరవలోను, ధైర్య సాహసాల్లోను, ఓర్పులోను నేర్పులోను స్త్రీ సమతూకం కలిగి ఉండేది. సామాజిక అభివృద్ధి క్రమంలోనే స్త్రీ పురుషుల మధ్య తేడాలను సృష్టించి శారీరక, మానసిక స్థితులలో వైరుధ్యాలను సృష్టించి శ్రమ విభజనలో స్త్రీని న్యూనత పరచడానికి పురుష సమాజం ప్రయత్నించింది. అందువల్లనే స్త్రీల పనులను ప్రత్యేకంగా కేటాయించడానికి ప్రయత్నించడం జరిగింది.

శారీరక నిర్మాణ శాస్త్రంలో స్త్రీ అబలత్వమేమి పేర్కొనబడలేదు. జంతు ప్రపంచంలో స్త్రీ జాతులకంటే పురుష జాతులే బలహీనమైనవి. వెన్నెముక లేని జంతువుల్లో కూడా ఎక్కువ పరిమాణం కలిగినట్టిది. డార్విన్ జంతు జాలంలో ఒక సందర్భంలో కూడా ఆడదానికంటే మగదానిని పెద్దదిగా చూడలేదని తెలిపాడు. (స్మిత్ సోనియన్ పేపర్స్‌లో) సిప్రినో డాంట్ చేపలలో మగవి ఆడవాటిలో సగము సైజు కూడా ఉండవు. ఆడవి మగవాటిని కూడా మింగి వేయడం జరుగుతుంది. సామాన్యంగా ఆడపాములన్నీ మగ పాముల కంటే పెద్దవి అన్నాడు.

భారతదేశంలో అయితే హిందూ మతవాదం స్త్రీని న్యూనత పరచింది. ముఖ్యంగా మనుస్మృతి స్త్రీకి అనేక సంకెళ్లు బిగించింది. ఆ తరువాత ఎన్నో పునరుజ్జీవన ఉద్యమాల ద్వారా స్త్రీలు విముక్తి బాటలో నడిచారు. ముఖ్యంగా మహాత్మాపూలే స్త్రీలను మళ్లీ మెయిన్‌స్ట్రీమ్ సమాజంలోకి తీసుకువచ్చారు. స్త్రీని కేవలం శరీర మాత్రంగా చూస్తే ఆమె అర్థం కాదు. ఆమెలో అనేక ప్రతిభలు ఉన్నాయి. ఆధునిక యుగంలో ఆమె అనేక రంగాల్లో పురుషుణ్ణి అధిగమించింది. పురుషులు విజ్ఞులుగా ఆలోచనా పరులుగా ఉంటేనే స్త్రీని గౌరవించగలుగుతారు. ఆమెలోని ప్రతిభను చూడగలుగుతారు.

ఇటీవల 'దిశ' రెండు తెలుగు రాష్ట్రాలనే గాక మొత్తం భారతావనిని కుదిపి వేసింది. ఒక డాక్టర్‌ని అలా నలుగురు మానభంగం చేసి చంపడం అత్యంత దారుణమైన విషయం. అంతకు ముందు అనేకమైన ఘటనలు జరిగాయి. అయితే అనేక కారణాలతో ప్రజలు కొన్ని సంఘటనల పట్ల చలితులవుతారు. ఈ సంఘటన కొంత మేథో మధనానికి దారి తీసింది. మనుషుల్లో దాగున్న కామ పశుత్వాన్ని రెచ్చగొడుతున్న వాటిలో ప్రభుత్వాల పాత్ర కూడా బలీయంగానే ఉందని చెప్పక తప్పదు. ముఖ్యంగా యువతను మతిలేకుండా చేస్తున్న అంశాల్లో మద్యపానం ముఖ్యమైంది. తాగుడు ఇటీవల యవనావస్థకు పూర్వం నుండే స్వీకరించడం వలన యువకులు విచక్షణా జ్ఞానాన్ని కోల్పో తున్నారు.

తెలంగాణ భారతదేశంలోనే అత్యంత ఆదాయ వనరుగా మద్యాన్ని భావిస్తూ ఉంది. ఆంధ్రప్రదేశ్ ఇటీవల పాక్షికంగా నిషేధించినా యువకుల్లో ఆ ప్రభావం తగ్గలేదు. యూనివర్సిటీ హాస్టళ్లలోనే రాత్రులు పొద్దుపోయే వరకు మద్యాన్ని సేవించి ఆడపిల్లల హాస్టళ్లకు వెళ్లి వారి స్నానాల గదుల కిటికీల నుండి ఫోటోలు తీసిన ఉదంతాల్ని మనం చూశాం. అంటే విద్యకు దారబోస్తున్న ధనం అంతా కూడా తాగుడు వలన వ్యర్థం అవుతుందనడాన్ని మనం తెలుసుకోవలసి ఉంది. 1997-98 ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎ.పి. ఎక్సైజ్ ఆదాయం వెయ్యి కోట్లు అయితే రెండు దశాబ్దాల తరువాత 30 వేల కోట్లకు ఎగబాకింది. తెలుగు రాష్ట్రాలు చివరికి లిక్కర్ అమ్మకాల మీద ఆధారపడి జీతాలు ఇచ్చే స్థితికి చేరింది.

తాగుడు వల్ల పెరిగిన అత్యాచారాల్లో మంత్రుల కుమారులుండటం మరొక విశేషం. పొరుగున కర్ణాటక పదకొండేళ్ల వ్యవధిలో మద్య విక్రయాల్లో 77 శాతం, రెవిన్యూలో 273 శాతం 'విశేష వృద్ధిని సాధించింది. మద్యం ఖాతా కింద చేతనైనంత రాబట్టడంలో రాష్ట్రాల మధ్య పోటాపోటీ పర్యవసానంగా దేశ జనాభాలో ఆల్కహాల్ వినియోగదారులు దాదాపు పదిహేను శాతానికి విస్తరించారు.

మద్యానికి బానిసలైన అయిదు కోట్ల 70 లక్షల మందిలో మూడు కోట్ల 20 లక్షల మందికి అత్యవసర వైద్య సేవలందించాల్సి ఉందని ఎన్‌డిడిటిసి (జాతీయ డ్రగ్ డిపెండెన్స్ చికిత్సా కేంద్రం) ఇటీవల సర్వే స్పష్టీకరించింది. మరో ఏడెనిమిది శాతం జనాభా భిన్నమార్గాల్లో మాదక ద్రవ్య సేవనంతో జోగుతోందనీ అతి దిగ్భ్రాంతికర వాస్తవాన్ని బహిరంగ పరిచింది. 2005 సంవత్సరం నాటికి దేశంలో 2.4 లీటర్లున్న లిక్కర్ తలసరి వినియోగం తరవాతి అయిదేళ్లలో 4.3 లీటర్లకు, 2016లో 5,7 లీటర్లకు ఎగబాకింది.

ఛత్తీస్‌గఢ్, త్రిపుర, పంజాబ్, అరుణాచల్ ప్రదేశ్, గోవా మద్యసేవనంలో రికార్డులు బద్దలుగొడుతున్నాయి. యుపి, ఎపి, తమిళనాడు, మధ్యప్రదేశ్ వంటివి ఆల్కహాల్ సంబంధిత సమస్యల నిలయాలవుతుండగా సూదుల ద్వారా మాదక ద్రవ్యాలకు అలవాటు పడ్డవారి జాబితాలో ఉభయ తెలుగు రాష్ట్రాలు నాలుగైదు స్థానాల్లో కొలువుతీరడం తీవ్రంగా ఆందోళనపరిచేదే. ఒక్కముక్కలో ఇది జాతికి

పెను ఉత్పాతమే. లిక్కర్ రాబడిపై ప్రభుత్వాల ఎనలేని మక్కువ కోట్లాది కుటుంబాల ఆర్థిక స్థితిగతుల్ని తలకిందులు చేసి అశాంతి, అభద్రతల్ని కలిగిస్తున్నాయి. దేశవ్యాప్తంగా గంజాయి చాక్లెట్లకు, సింథటిక్ డ్రగ్స్‌కు అలవాటుపడిన వారెందరో, విద్యార్థులే లక్ష్యంగా మాయవలలు విసరుతున్న ముఠాల ఆనుపానులు ఏ మేరకు విస్తరించాయో, ఆన్‌లైన్ కొనుగోళ్ల సంస్కృతి మారుమూల పల్లెలకూ ఎంతగా చొచ్చుకుపోయిందో ఇప్పటికీ సరైన లెక్కలు లేవు. 2023 నాటికి మాదక ద్రవ్యాల గిరాకీని తగ్గించేందుకు నిరుడు జాతీయ కార్యాచరణ ప్రకటించామంటున్న కేంద్రం, రాబడి మత్తులో జోగుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా నిద్ర అభినయించడం మాని మేలుకోవాలి.

దేశంలో తొలిసారి లిక్కర్ రుచి మరిగే వయస్సు 12.3 ఏళ్లకు పడిపోయింది. మాదక ద్రవ్యాలు నెట్టింట్లో అందుబాటులోకి వస్తున్నాయి. మద్యాన్ని చంద్రబాబు ప్రభుత్వం అయితే ఇంటింటికీ సరఫరా చేసి సామాజిక వ్యవస్థల్ని ఆయన విచ్ఛిన్నం చేశారు. మహిళలు తమ బతుకు విచ్ఛిన్నం అవుతుందని ఘోషించినా ఆయన పట్టించుకోలేదు. జగన్ ప్రభుత్వం పాక్షిక మద్య నియంత్రణ ప్రారంభించింది. కానీ యువత తాగుతూనే ఉంది. యువత స్మార్ట్‌ఫోన్‌లో నీలి దృశ్యాలు చూసి అరాచకాలు చేస్తున్నారు. నిజానికి హైద్రాబాద్ అంత పబ్బుల మయం అవుతుంది. సినీ నటులు పిల్లలకు మత్తు మందులు నేర్పి వారు మత్తులోకి వెళ్లాక అపస్మారక స్థితిలో వారిపై అత్యాచారాలు చేస్తున్నారు. విజయవాడకు కూడా ఈ పబ్బులు పాకుతున్నాయి. ఒక్క విద్యార్థులే కాక, నడి వయస్సువారు యువతులపై బాలికలపై వయస్సు తేడా లేకుండా అత్యాచారాలు చేసే ఉన్మాదంలోకి నెట్టబడడానికి కారణం ఏమిటి?

అత్యాచారాలకు పురుషాధిపత్యంతో పాటు పురుషులు పాలకులుగా ఉన్న రాజ్యం కూడా కారణం. లాయర్లు, డాక్టర్లు, పోలీసులు, జడ్జీలు అందరూ పురుషులు కావడంతో నేరాలు చేసేవాడు, తీర్పు చెప్పేవాడు, శిక్షించేవాడు అందరూ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారు. 1991తో పోలిస్తే మహిళల పట్ల జరిగిన నేరాలు 1996లో 11.5 శాతం పెరిగాయి. కారణం స్త్రీలలో చైతన్యాన్ని నిరోధించడానికి పురుష ప్రపంచం బలవంతంగా చేస్తున్న అఘాయిత్యాలు, హత్యలు, కిడ్నాపులు, లైంగిక వేధింపులు. ఒక కక్ష సాధింపు చర్యగా సాగించుటకు పురుషాధిపత్యానికి సంబంధించిన ఈ నేపథ్యంలో స్త్రీలలో పెరగుతున్న చైతన్యాన్ని, ఆత్మ స్థైర్యాన్ని చాటుతూనే మరొక పక్క ఆ హింసను ఎదుర్కొని నిలబడడానికి సంబంధించిన ప్రత్యామ్నాయ నిర్మాణం కోసం స్త్రీవాద ఉద్యమం కృషి చేయవలసిన బాధ్యతను గుర్తు చేస్తుంది. దళితులపై కూడా ఇదే క్రమంలో దాడుల సంఖ్య పెరుగుతోంది.

దళితులు, స్త్రీలు ఇద్దరూ భారత సమాజంలో అణగదొక్కబడినవారు. వారిలో చైతన్యం పెరిగే కొద్దీ అగ్రవర్ణ పురుష ప్రపంచం తన ఉక్కు పాదాన్ని వారిపై మోపి మరింత తొక్కడం ప్రారంభించింది. స్త్రీలోని వ్యక్తిత్వాన్ని, ఔదార్యాన్ని, స్వేచ్ఛని అణచడానికి ఇంటిలో, రోడ్డులో, విద్యాలయాల్లో, ఆఫీసులో, అన్ని స్థలాల్లో గుంపుదాడులు, వైయక్తిక దాడులు పురుష ప్రపంచం నిర్వహించింది. ఆ దాడులను తిప్పికొట్టడానికి అవసరమైన సంఘటిత శక్తికై పోరాడే క్రమం నిదానంగా, నిలకడగా విస్తృతమౌతోంది. ఈ క్రమం పూర్తయ్యే వరకు హిందూ అగ్రవర్ణ స్త్రీ పరిమితుల్లోనే ఉద్యమం నడపగలుగుతుంది. ఈ క్రమంలో దిశపై పాశవికంగా జరిగిన అత్యాచారం హత్య భారతదేశాన్ని కుదిపింది. ఆ తరువాత జరిగిన ఎన్‌కౌంటర్‌పై కొంత చర్చ ఉన్న సమాజ ఆమోదం లభించింది. ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ దిశ 19 ద్వారా స్త్రీలపై జరిగే అత్యాచారాలకు సత్వర చర్యగా ఈ నిర్ణయాలు చేశాయి. అత్యాచారానికి పాల్పడ్డ వారికి తప్పనిసరిగా ఉరి. ఏడు రోజుల్లో దర్యాప్తు, 14 రోజుల్లో విచారణ పూర్తిచేసి 3 వారాల్లో న్యాయం చేయాలి. చిన్న పిల్లలపై పాల్పడే లైంగిక నేరాలకు జీవిత ఖైదు తప్పదు, తీవ్రతను బట్టి మరణ శిక్ష కూడా ఉండాలి.

సోషల్ మీడియాలో మహిళలను వేధించినా, అసభ్య పోస్టింగులు పెట్టినా, మొదటిసారి రెండేళ్లు... రెండోసారీ చేస్తే నాలుగేళ్లు శిక్ష. అత్యాచారం, యాసిడ్ దాడి, పోక్సో, సోషల్ మీడియా ద్వారా వేధింపులు సంబంధిత కేసుల విచారణకు ప్రతి జిల్లాకు శాశ్వత ప్రత్యేక కోర్టు. ఇటువంటి నేరాల్లో శిక్షలు పడ్డవారి అప్పీలు గడువు ఆరు నుంచి మూడు నెలలకు కుదింపు. మహిళలు, చిన్నారులపై నేరాల్లో సత్వర దర్యాప్తునకు జిల్లా స్థాయిలో డిఎస్‌పి నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఉన్నతాధికారి ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను కోర్టు నియమిస్తుంది. నిందితుల వివరాలను డిజిటలైజేషన్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచి, ఎవరు ఎటువంటి నేరాలు చేసిందీ బహిరంగ పరుస్తారు. ఈ చట్టం చరిత్రకు నాంది పలికింది. ఈ క్రమంలో బాలికలకు ఒక సామాజికమైన హామి లభ్యమైన మాట నిజం.

మనం సామాజిక సాంస్కృతిక వాతావరణాన్ని అత్యాచాలకు ప్రత్యామ్నాయంగా రూపొందించకుండా చట్టం ఆచరణలోకి రావడం సాధ్యం కాదు. దీనికి ప్రతి విద్యార్థి విద్యార్థినికి రాజ్యాంగ సూత్రాల అధ్యయనం అవసరం. బుద్ధుని సూత్రాలు అవసరం. ఎక్కువ అత్యాచారాలు సాక్ష్యాలు రద్దుచేసే క్రమంలోనే జరుగుతాయి. అందుకే మానసిక వ్యవస్థల్ని మార్చే నైతికతను గూర్చిన సదస్సులు, స్కూళ్లలో ప్రతి శనివారం జరగాలి. విద్యార్థులను విజ్ఞానం వైపు తరలించాలి. సెల్‌ఫోన్ యాప్‌లో నీలి చిత్రాలకు సంబంధించిన వాటిని పూర్తిగా నిషేధించాలి.

తల్లిదండ్రులు పిల్లలతో స్నేహంగా మెలగవలసి ఉంది. నేరానికి ప్రేరణ అయిన తాగుడు మద్యపానం, మత్తు మందులు, ధూమపానం, అశ్లీల చిత్రాలు, సినిమాల్లోని రేప్ సీన్‌లు, గ్యాంగ్ రేప్ సీన్‌లు, సీరియల్స్‌లో హత్యలు వంటి ప్రేరణాంశాలన్నింటిని ప్రభుత్వం నిషేధించాలి. అప్పుడే ఈ చట్టానికి అర్థం వస్తుంది. నేరం జరిగేటట్టు చూడడం కంటే నేరం జరగకుండా చూడడమే పాలనలోని నైపుణ్యం. ఏది ఏమైనా 2019 దిశ చట్టం ఒక అఘాయిత్యపు నేరగాళ్లలో భయాన్ని కల్పించింది. విద్యార్థులకు విద్యార్థినులకు వ్యక్తిత్వ నిర్మాణ శిక్షణ వారిలో అభద్రతను తొలగిస్తుంది. స్త్రీ పురుషుల సమానత్వాన్ని బోధిస్తుంది. డా. బి.ఆర్. అంబేద్కర్ హిందూ కోడ్ బిల్లులో స్త్రీకిచ్చిన సమానత్వం, స్వేచ్ఛకు మార్గం ఏర్పడుతుంది. ఏ తీర్పు అయిన కుల మతాలకు అతీతంగా జరిగినప్పుడే సమాజం వర్ధిల్లుతుంది. ఆ దిశగా పయనిద్దాం..

(రచయిత సామాజికత తత్వవేత్త,
నవ్యాంధ్రపార్టీ, వ్యవస్థాపక అధ్యక్షులు) వీ

నిర్భయ నుంచి దిశ దాకా

అత్యాచారాల గురించి మరొకసారి దేశవ్యాప్త చర్చకు దారితీసిన దిశపై అత్యాచారం, నిందితుల బూటకపు ఎన్ కౌంటర్ నేపథ్యంలో అత్యాచార సంస్కృతి అసలు మూలాల గురించి విశ్లేషిస్తున్నారు **సి. వనజ**

నిర్భయకి ముందు కానీ ఆ తరవాత కానీ భారత దేశంలో ఇటువంటి దారుణాలు జరగలేదని కాదు గాని ఈ రెండు సంఘటనలకి ఒక ప్రాధాన్యత ఉంది. హక్కులే కాదు బాధ్యతలు కూడా చెప్పకుండా పెంచిన, సహకారం బదులుగా పోటీ, తృప్తికి బదులుగా విజయం, త్యాగానికి బదులుగా స్వార్థం విలువలుగా నేర్చుకుంటున్న మిల్లీనియమ్ తరాన్ని, సంపద ఎలా వచ్చినా ఫర్వాలేదు దాన్ని పోగెయ్యటాన్ని మాత్రమే విజయంగా భావిస్తూ, నేను బాగుంటే చాలు ప్రపంచం ఏమైనా ఫర్వాలేదని భావిస్తూ భద్రలోకాల్లో విహరిస్తున్న మధ్యతరగతిని చెళ్లున కొట్టిలేపిన సంఘటనలివి. రెండు సంఘటనల్లోనూ అత్యాచారానికి గురయిన వాళ్లు మధ్యతరగతికి చెందిన వాళ్లు కావటంతో అత్యంత దారుణంగా జరిగిన ఈ సంఘటనలతో ఈ రెండు వర్గాలు సహానుభూతి చెందాయి. అప్పటిదాకా దళితుల మీద, మైనారిటీల మీద జరిగిన అత్యాచారాలకి, పోలీసు స్టేషన్లలో, మిలిటరీ ఉన్న ప్రాంతాల్లో ఇంతే దారుణంగానో ఇంతకన్నా దారుణంగానో జరిగిన సంఘటనల మీద ఎప్పుడూ గొంతెత్తని వాళ్లు కూడా ఇప్పుడు రోడ్డున పడ్డారు.

కోపం, ఆవేశం, నిస్సహాయతలతో పాటు తాము ఉందనుకున్న భద్రత లేదన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోయిన ఈ రెండు వర్గాలు, హింసకు ప్రతిహింస తప్పుడు విలువగా మాట్లాడే వర్గాలు కూడా ఇక్కడ మాత్రం పరిష్కారంగా ప్రతిహింసనే కోరాయి. నిర్భయ సంఘటన సమయంలో నిందితులను వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేసిన వాళ్లు దిశ సంఘటన సమయానికి వాళ్లను కాళ్లు, చేతులు విరిచి, వాళ్లు చేసిన హింసకు పదిరెట్లు హింసించి చంపాలని డిమాండ్ చేశారు. బహుశా దేశంలో పెరిగిపోయిన లించింగ్ సంస్కృతికి ఈ వర్గాల నుంచి ఉన్న ఒక నిశ్శబ్ద ఆమోదానికి ఇది సూచిక కావచ్చు.

ముందుగా 'చంపెయ్యండి విరిచెయ్యండి' అని మధ్యతరగతి అడుగుతున్న పేదల విషయం తీసుకుందాం. ఇటువంటి నేరాలకు పాలదుతున్నవాళ్లు చదువురాని పేద కుటుంబాల పిల్లలే అన్న అభిప్రాయం సమాజంలో ఉంది. దానికి తగ్గట్టే అటు నిర్భయ కేసులో, ఇటు దిశ సంఘటనలో పట్టుపడిన నిందితులు కూడా చిన్న వయసులో ఉన్న చదువు లేని పేద వర్గాల వాళ్లే. కేవలం పేద పిల్లలే ఇలాంటి నేరాలు చేస్తున్నారా? మిగిలిన పిల్లలు చెయ్యట్లేదా? అసలు ఏ పిల్లలు అయినా ఈ నేరాలు ఎందుకు చేస్తున్నారు? ఇవి అలోచించాల్సిన, అర్థం చేసుకోవాల్సిన ప్రశ్నలు.

భారత దేశంలో అధికారిక లెక్కల ప్రకారం ప్రైమరీ స్కూళ్లలో 90 శాతం మంది చేరితే (వచ్చినా రాకపోయినా ఊళ్లో ఉన్న పిల్లలనందరినీ హాజరు పట్టీలో చేర్చే ప్రాథమిక పాఠశాలల్లో) అందులో సెకండరీ స్కూలుకి చేరేసరికి అందులో దాదాపు సగం మంది బడి మానేస్తున్నారు. ఇలా బడి మానేసే పిల్లలంతా పేద పిల్లలే. సరైన బళ్లు లేక, బళ్లు ఉన్నా ఈ పిల్లల కోసం కన్సర్న్‌తో పాఠాలు చెప్పే వాళ్లు లేక, ఇంట్లో పేదరికంతో గడవక, ఆడపిల్లలయితే వీటన్నిటికి తోడు బయట భద్రత లేక సరిగ్గా టీనేజ్ వచ్చేసరికి వీళ్లంతా బడి బయట ఉంటారు.

అదే సమయంలో భారతీయ కుటుంబ వ్యవస్థ గురించి ఎవరు ఎంత డబ్బా కొట్టుకున్నా భారతీయ కుటుంబాల్లో విపరీతంగా గృహహింస పెరిగిందన్నది ఒక వాస్తవం. ముఖ్యంగా సరళీకరణ విధానాల తర్వాత కుటుంబాల మీద విపరీతంగా ఆర్థిక పరమైన ఒత్తిడి, వలసలు పెరిగాయి. మద్యం మీద ఆధారపడి నడిచే ప్రభుత్వాలవల్ల విపరీతంగా మద్యం వాడకం, దానితో పాటు కుటుంబాల్లో హింస కూడా పెరిగింది. అయితే బ్రోకెన్ కుటుంబాలు లేదా సింగిల్ పేరెంట్ కుటుంబాలు కూడా ఎక్కువయ్యాయి.

ఈ కుటుంబాల నుంచి వచ్చి 13, 14 ఏళ్లకు బడి బయట ఉన్న పిల్లల పరిస్థితి ఏమిటి? పనిచెయ్యటానికి అవసరమైన నైపుణ్యం ఉండదు. పని చేసినా పిల్లలు కనుక అందులోనూ విపరీతమైన అధిపత్యం, దెబ్బలు, హింస ఉంటాయి. ప్రేమ, భద్రత, గౌరవం అన్నీ కరువైన ఈ పిల్లలకు తేలిగ్గా దొరికేది వెయ్యి రూపాయల స్మార్ట్ ఫోను, దాంట్లో 100 రూపాయలకి అపరిమితమైన డేటా. కాబట్టి ఇటు జెండర్ ఎడ్యుకేషన్ కానీ అటు సెక్స్ ఎడ్యుకేషన్ కానీ ఎప్పుడూ అందని వీరికి, 140 కోట్ల మందిని 4జి పేరుతో తమ స్నేహితులకు పళ్లెంలో పెట్టి ఇచ్చిన ప్రభుత్వాల పుణ్యమా అని, అతి తేలిగ్గా దొరికేది విచ్చలవిడి పోర్న్. అందులోనూ కావలసినన్ని రేప్ వీడియోలు. చిన్నప్పటినుంచీ రకరకాల హింస (అసలు పేదరికమే హింస అనుకోండి) చూసి అనుభవించిన పిల్లల్లో కొందరికి హింస పట్ల నిర్లిప్తతతో కూడిన ఆమోదం కలిగితే, మరికొంత మందికి దూకుడుతో కూడిన హింసాతత్వం అలవడుతుంది. వాటికి తోడు, సినిమాల్లో విపరీతంగా గ్లామరైజ్ అయిన హింస, అరచేతిలో ఎప్పుడంటే అప్పుడు కనిపించే అసహజ హింసాత్మక అత్యాచార దృశ్యాలు. ఇక కావలసిందల్లా ఒక విక్టిమ్ మాత్రమే.

ఇక ఒక బిడ్డ తనకు రాజ్యాంగం ఇచ్చిన గౌరవంగా జీవించే హక్కు పొందటానికి అవసరమైన ఏ పనీ చెయ్యని ప్రభుత్వాలు ఈ పిల్లలు తప్పు చేస్తే మాత్రం మరింత కఠినంగా శిక్షించటానికి కొత్త కొత్త చట్టాలు తెస్తాయి. ఒకసారి తప్పు మీద పడితే అది నిజమో కాదో చెప్పుకునే అవకాశం కూడా దొరకని వాళ్లను 'చంపెయ్యండి, నరికెయ్యండి' అని అరవటం కూడా తేలిక.

అయితే కేవలం ఒక వర్గంలోనే ఇలాంటి ధోరణులున్నాయనుకుంటే పొరపాటు. ఇక మధ్యతరగతికి వద్దాం. మధ్య తరగతి కుటుంబాలు కూడా హింసాత్మక ప్రవృత్తికి ఏమీ దూరంగా లేవు. కుటుంబ వ్యవస్థ నిలబడటానికి భార్యను ఒక దెబ్బ వెయ్యటం తప్పు కాదని 90 శాతం మంది పురుషులు, 50 శాతం మంది స్త్రీలు కూడా నమ్మే దేశమిది. సమానత్వం, గౌరవం, ప్రేమ ఆధారంగా కాక, కులం, కట్నం, జాతకం ఆధారంగా ఏర్పడే కుటుంబ వ్యవస్థలో ప్రధానంగా ఉండేవి ఆధిక్యత, విధేయత. ఇందులో ఆధిపత్య ధోరణికి, అవసరమైతే దాన్ని నిలబెట్టుకోవటానికి ఏదో ఒక మోతాదులో హింసను ప్రయోగించటానికి ఆమోదం ఉంటుంది. భార్యాభర్తల మధ్యనే కాదు, తల్లితండ్రులకు పిల్లలకు మధ్య కూడా అదేరకమైన సంబంధాలు ఉంటాయి. చెప్పేవాళ్లు – వినేవాళ్లు, నిర్ణయించేవాళ్లు – ఆమోదించేవాళ్లు ఇలా పాత్రలు నిర్ణయమైన అసమాన కుటంబాల నుంచి సమానత్వ భావనను పిల్లలు నేర్చుకోవటం సాధ్యం కాదు. ఒక వేళ స్త్రీ పురుష సమానత్వం గురించి పిల్లలకు చెప్పినా ఆ కుటుంబం కుల పరమైన, ఆర్థిక పరమైన సమానత్వాన్ని పాటించకపోతే వాళ్లు సమానత్వ భావం నేర్చుకోరు సరికదా అవసరాన్ని బట్టి, అవకాశాన్ని బట్టి దాన్ని ఎలా మానిప్యులేట్ చెయ్యొచ్చో నేర్చుకుంటారు.

మరోవైపు పిల్లలకు ఉగ్గుపాలతో పాటు చూపించే హింసా దృశ్యాలు. చాలామంది పిల్లలు ఏడాది రెండేళ్లు వచ్చేసరికి టామ్ అండ్ జెర్రీ లాంటి కార్టూన్లు చూస్తుంటారు. ఈ కార్టూన్లలో అదేపనిగా ఒకరినొకరు కొట్టుకుంటూ ఉంటారు. కొట్టుకోవటం కూడా చాలా దారుణంగా. కానీ ఆ దారుణమైన కొట్టుకోవటం ఒక ఆటగా, వినోదంగా చూపిస్తారు. అది చూసీ చూసీ, పిల్లలు కొట్టుకోవటం ఒక ఆటగా భావించటం మాత్రమే కాదు దాని వల్ల వచ్చే బాధ లేదా పరిణామాల పట్ల సున్నితత్వాన్ని పోగొట్టుకుంటారు. అందుకే చాలా తరచుగా స్కూళ్లలో పెరిగిపోతున్న దుడుకు పిల్లల గురించి వింటున్నాం. టామ్ అండ్ జెర్రీలతో ప్రారంభించి చోటా భీమ్ లు కూడా చూసేశాక వాళ్లిక ఫోన్లలో, టాబ్ లలో ఆటలు మొదలు పెడతారు. ఇందులో మూడేళ్ల పై వయసు పిల్లల ఆటల్లో విల్లంబులు ఉంటే ఆ పై వయసు పిల్లల ఆటల్లో తుపాకులు ఉంటాయి. పెరిగే కొద్దీ మరింత రక్తపాతం ఉండే పబ్జీ లాంటి ఆటలు మొదలవుతాయి. ఆయుధాలను అత్యంత అలవోకగా వాడే తత్వం పిల్లలు టీనేజ్ కు వచ్చేసరికి అలవాటు అవుతుంది. అవతలి వాళ్లను చంపటం, ఆ చంపటం విజయ సూచకం కావటం తప్పు కాదని నేర్చుకుంటారు. పబ్జీ లాంటి ఆటల్లో అయితే నలుగురు జట్టుగా కలిసి అవతలి వాళ్లను చంపేస్తే సరిపోదు. తన జట్టులోనే ఉన్న మిగిలిన ముగ్గురిని కూడా చంపినప్పుడే విజేతగా మారతాడు. చంపటం మాత్రమే కాదు విజేతగా నిలవాలంటే తనతోనే ఉన్నవాళ్లను ద్రోహబుద్ధితో చంపెయ్యటం కూడా తప్పు కాదన్న విలువను నేర్చుకుంటారు.

ఇక 12, 13 ఏళ్లు వచ్చేసరికి వాళ్లకు లైంగికత పట్ల కుతూహలం మొదలవుతుంది. సెక్స్ ఎడ్యుకేషన్ ను మమ అనిపించే, జెండర్ ఎడ్యుకేషన్ ఆలోచనే లేని స్కూళ్లలో వాళ్లకు ఆ కుతూహలానికి సమాధానాలు దొరకవు. ఇళ్లలో ఎవరూ మాట్లాడరు. ఇక ఈ పిల్లలు కూడా స్కూలు బయట ఉన్న పిల్లలు ఫోన్లలో ఏం చూస్తారో అవే చూడటం మొదలుపెడతారు. కాకపోతే ఇంకొంచెం మంచి ఫోన్లలో మరింత నాణ్యమైన వీడియోల్లో. దిశ సంఘటన జరిగాక ఆమె అత్యాచార వీడియో కోసం ఇంటర్నెట్ లో వెతికిన పిల్లల్లో అన్ని వర్గాల పిల్లలూ ఉన్నారు.

ఇక ఇళ్లలో మరోవైపు ద్వేషం, పగ, కన్నీళ్లు మాత్రమే ఆధారంగా నడిచే సీరియళ్లు నిరంతరం నడుస్తుంటాయి. లేదా హింసను సెన్సేషనలైజ్ చేసే వార్తలు వస్తుంటాయి. ఇవన్నీ కాకపోతే విపరీతమైన హింసను, జెండర్ ఇన్సెన్సిటివిటీ ని గ్లామరైజ్ చేసే సినిమాలు. ఒకవేళ థియేటర్ కి వెళ్లకపోయినా అవి 'ఎ యు' సర్టిఫికెట్ తీసుకుని ఇంట్లో టివిలో వస్తాయి. కుటుంబాలకు కుటుంబాలు ఆ హింసను కళ్లార్పకుండా భయంతో కూడిన ఆరాధనతో చూస్తుంటాయి.

వీటిల్లో కొన్ని డైలాగులుంటాయి. 'వాడు మగాడ్రా బుజ్జీ', 'నువ్వు మగాడివేనా?', 'మగాడంటే అలా ఉండాలి' లాంటివి. దాదాపు ఈ డైలాగులన్నీ ఏదో ఒక హింసాత్మక సంఘటనకు లేదా ఆధిపత్య ప్రవర్తనకు ఆమోదం తెలుపుతూ ఆయా సందర్భాల్లో వచ్చేవే. ఏ మాత్రం విమర్శ లేకుండా కుటుంబాలు ఆ సినిమాలు చూస్తూ ఆ డైలాగులు వింటున్నపుడు కుటుంబం అంతటిలోనూ ఆ ప్రవర్తన పట్ల, ఆ ధోరణుల పట్ల ఆమోదం ఏర్పడుతుంది. అంతే కాదు, ఆ డైలాగులు ఇళ్లలోనూ, ఇతర సామాజిక సందర్భాల్లోనూ, చివరికి రాజకీయాలకు సంబంధించిన చర్చల్లోనూ చాలా సాధారణంగా వినపడుతుంటాయి. 'పాకిస్తాన్ మీద యుద్ధం చేసాడు, వాడు మొగాడు', 'ఫలానా రాష్ట్రంలో ఫలానా పని చేసాడు, ఇరగ దీసాడు, వాడు మొగాడు' – ఇలా ఉంటాయి సంభాషణలు. ఈ మాట అన్న ప్రతిసారీ తాము ఒక హింసను ఆరాధిస్తున్నమని కానీ, ఆహ్వానిస్తున్నామని కానీ జ్ఞానం ఉండదు చాల మందికి.

ఇంకో వైపు జండర్ వయొలెన్స్. ఇది కేవలం కొట్టటం, తిట్టటానికి సంబంధించింది మాత్రమే కాదు. ఆడపిల్లను చూస్తే "ఆమె కావాలని" అనిపిస్తే, "ఆమె నాది" అని చెప్పటం, ఆమెను "స్వంతం" చేసుకోవటం హీరోయిజంగా చూపించే సినిమాలు. అలాంటి సినిమాలు ఇవాళ అన్ని భాషల్లోనూ బ్లాక్ బస్టర్లే. వీటిని సినిమా హాల్లోనో లేకపోతే ఎయు సర్టిఫికేటు ముసుగులో టీవీలో వచ్చినప్పుడో, లేదంటే పెద్దవాళ్లు టీవీలో చూస్తే, చిన్నవాళ్ళు ఫోన్ లోనో అందరూ చూసేస్తారు. మొత్తంగా ఎవరూ ఏమీ మాట్లాడుకోకుండానే ఒక టాక్సిక్ మాస్క్యులినిటీ (ప్రమాదకర, విషపూరిత పురుషత్వం)కి పట్టం కట్టే సంస్కృతికి ఆమోదం తయారవుతూ ఉంటంది.

ప్రతి మనిషికి ఒక వ్యక్తిగా తృప్తినిచ్చేవి రెండు అంశాలు. ఒకటి, బయట తనకు గుర్తింపునిచ్చే పని. రెండు, వ్యక్తిగత జీవితంలో ప్రేమ. యుక్త వయసులో అయితే ఈ రెండూ పొందటమే చాలా కీలకం. నిరుద్యోగంలో 40 ఏళ్ల రికార్డు స్థాయికి చేరిన దేశంలో చదువుకున్నా కూడా (చదువు, నైపుణ్యం లేకపోతే ఎలాగూ లేదు) గౌరవప్రదమైన జీవితం దొరికే అవకాశం లేని నిస్పృహలో మగాడిగా నిరూపించుకునే ఒకే ఒక్క అవకాశం లైంగిక ఆధిపత్యం లేదా లైంగిక హింస. అలాంటప్పుడు కావలిసింది కూడా తేలిగ్గా దొరికే ఒక విక్టిమ్ మాత్రమే. తరచుగా మనం వినే సంఘటనల్లో తమ క్లాస్ మేట్ మీద అత్యాచారం చేసిన ఇంజనీరింగ్ విద్యార్థి లాంటి వార్తలు ఉంటాయి.

ఇంకొంచెం పైకి వెళ్దాం. ఆమధ్య ముంబాయిలో చాలా పెద్ద పెద్ద వాళ్ల పిల్లలు చదివే స్కూలులో పెద్ద తరగతి పిల్లల వాట్సప్ సంభాషణలు బయటికి వచ్చాయి. అందులో 15 ఏళ్లు కూడా నిండని మగపిల్లలు

తమ క్లాసులో ఉన్న ఆడపిల్లలపై ఎవరెవరు ఎవరెవర్ని ఎలా రేప్ చెయ్యాలనుకుంటున్నారో చర్చించుకున్నారు. ఫాం హౌస్ లలో ఇచ్చే రేప్, డ్రగ్స్ రేవ్ పార్టీలలో ఉండే విశృంఖలత్వాల గురించి తెలియనిది కాదు. కాని అక్కడ బయటికి రాకుండా ఉంచటానికి, వస్తే మానేజ్ చెయ్యటానికి అవసరమైన అన్ని అండదండలు ఉంటాయి. అందుకే ఇప్పటివరకూ ఇన్ని జరుగుతున్నా ఈ దేశంలో ఏ సంపన్న వర్గాల వ్యక్తులు అత్యాచార నేరంలో బోనెక్కడం చాలా అరుదు.

ఇక బాధితులు ఎవరు? 'బేటీ పడావో బేటీ బచావో' అని నినదించే రాజ్యం స్కూలుకి వెళ్లటానికి కనీసం బస్సు కూడా ఏర్పాటు చేయకపోతే నాలుగైదు మైళ్లు డొంకదారుల్లో నడిచిపోయే హాజీపూర్ పిల్లలు కావచ్చు, అమ్మ పక్కన ఆదమరిచి నిద్రపోయే నెలలపాప కావచ్చు, ఇంతమంది తిరిగే చోట భద్రమే అనుకుని స్కూటర్ పార్కు చేసుకున్న దిశ కావచ్చు, స్నేహితుడే కదా అని నమ్మిన మానస కావచ్చు, రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుని ఇల్లు చేరుకునే తొందరలో ఉన్న టేకు లక్ష్మి కావచ్చు, హాస్టల్ లో ప్రశాంతంగా ఉన్నాననుకున్న ఆయేషా మీరా కావచ్చు, సినిమా తార అయి కూడ (బహుశా అయినందువల్లనే) రక్షణ లేని ప్రత్యూష కావచ్చు, మనకు తెలియని మరెవరో కావచ్చు. నేర స్వభావం అనేది పేద ధనిక భేదం లేకుండా పెరుగుతూ ఉందన్నది ఒక వాస్తవం. కాని నేరస్తులు పేద వారో లేదా భాదితులు మధ్యతరగతి లేదా ఆ పైవర్గం వాళ్లో అయినప్పుడు మాత్రమే అవి వార్తలు కావడం, లేదా అందులో నేరస్తులకి శిక్షలు పడటం ఈ దేశపు వాస్తవం. నేరస్తులు పైవర్గం వాళ్లయితే, వాళ్లకు రాజకీయ అండదండలు ఉంటే ప్రత్యూష కేసులోలాగా వాస్తవాలు బయటికి రావు, ఆయేషా మీరా కేసులో లాగా నిందితులు దొరకరు. అవసరమైతే ఒక అర్భకుడిని లోపల వేసి ఏళ్ల తరబడి బయటకు రాకుండా చూడొచ్చు.

ఒకసారి నిర్భయ సంఘటనకు వెళ్తే, అప్పుడు కూడా తక్షణ న్యాయం గురించి ఎంత డిమాండ్ వచ్చినప్పటికీ దేశంలో మానవ హక్కుల కోసం పనిచేస్తున్న, రమీజాబీ సంఘటన నుంచి మధుర, భన్వారీ దేవీల దాకా అత్యాచార ఘటనల మీద పనిచేస్తున్న స్త్రీల హక్కుల ఉద్యమకారుల వల్ల, అప్పటికి ఇంకా ఈ స్థాయిలో ప్రభుత్వాలే హింసను ప్రోత్సహించే సంస్కృతి రాకపోవటం వల్ల వీటికి పరిష్కారం కనుక్కునే ప్రయత్నం కొంతైనా జరిగింది. ఫలితంగా వచ్చిందే జస్టిస్ వర్మ కమిషన్.

కొన్ని వేల మంది నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాత ఇచ్చిన నివేదికలో జస్టిస్ వర్మ ప్రజల నుంచి వచ్చిన మరణ శిక్ష డిమాండ్ ను సమర్థించలేదు. ప్రతి పది నిమిషాలకి ఒక అత్యాచార సంఘటన నమోదు అయ్యే (అసలు పది సంఘటనలు జరిగితే ఒకటే నమోదు అవుతుందనేది ఒక అంచనా) దేశంలో అత్యాచారానికి మరణశిక్ష విధించడం మొదలుపెడితే, సాక్ష్యాలు లేకుండా చేయటానికి బాధితులను చంపేసే అవకాశం పెరుగుతుందన్న వాదన సుప్రీం కోర్టు న్యాయమూర్తికి తెలియనిది కాదు. కఠిన శిక్షలతో పాటు సత్వర న్యాయం, అందుకోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. శిక్షాస్మృతిలో అనేక మార్పులు సూచించారు. ప్రధానంగా చిన్నచిన్నవిగా ఇటు సమాజం, అటు వ్యవస్థలు చూసీచూడనట్లు పోయే రకరకాల వేధింపులకు కూడ శిక్షలు కఠినం చేయాలన్నారు.

వర్మ కమిషన్ చేసిన మరో మంచి పని ఏమిటంటే ఆయన సమస్యను కేవలం నేరం – శిక్ష కి మాత్రమే పరిమితం చేయకుండా మొత్తంగా లైంగిక నేరాల నిరోధానికి కీలక వ్యవస్థల్లో రావల్సిన మార్పులు, సంస్కరణల గురించి చెప్పారు. అందులో మొదటిది, చాలా వివరంగా చెప్పింది పోలీసు సంస్కరణలు. పోలీసులకు జెండర్ సెన్సిటివిటీ పెంచటంతో పాటుగా లైంగిక నేరాలను సరిగా డీల్ చెయ్యటానికి అవసరమైన శిక్షణ కూడా ఇవ్వాలని సూచించారు. బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు జూరిస్ డిక్షన్‌తో సంబంధం లేకుండా ఫిర్యాదులు తీసుకోవాలని, ఫిర్యాదు తీసుకోవటానికి నిరాకరించిన పోలీసు అధికారుల మీద చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇంకా రాష్ట్రస్థాయిలో భద్రతా కమిషన్లు ఏర్పాటు చేయాలని, అత్యాచారాలను విచారించటానికి అవసరమైన మద్దతు అందించటానికి రేప్ క్రైసిస్ సెల్లులను ఏర్పాటు చేయాలని, ఎక్కడ అత్యాచార ఘటన జరిగి ఫిర్యాదు అందినా వెంటనే ఆ సెల్ కి సమాచారం అందించాలని సూచనలు చేసారు.

సంస్కరణలు చేయాల్సిన రెండవ సమూహం రాజకీయ నాయకులన్నది జస్టిస్ వర్మ అభిప్రాయం. లైంగిక నేరాలకు పాల్పడినవారే అసెంబ్లీలలో పార్లమెంట్ లో కూర్చునే పరిస్థితి ఉండకూడదని అన్నారు. అందుకోసం చట్టం సవరించి వాళ్లు ఎన్నికలలో పోటీ చేసే అవకాశం లేకుండా చెయ్యాలని కూడా చెప్పారు.

మూడవది, విద్యా సంస్కరణలు. అన్ని విద్యా సంస్థలలో స్కూలు స్థాయి నుంచి జెండర్, సెక్స్ ఎడ్యుకేషన్ ఏర్పాటు చెయ్యటంతోపాటు స్కూలు బయట ఉన్నవాళ్లకు వయోజన విద్య ద్వారా స్త్రీ పురుష సమానత్వం బోధించాలన్నారు.

అప్పటికి ముగుస్తున్న యుపిఎ 2 ప్రభుత్వం వర్మ కమిషన్ సిఫారసు చేసినట్లుగా లైంగిక వేధింపులకు, దాడులకు సంబంధించిన చట్టపరమైన మార్పులతోపాటు కమిషన్ వద్దన్నప్పటికీ సామూహిక అత్యాచారాలకు మరణశిక్షను కూడా జోడించింది.

దేశంలో పెరిగిపోయిన అత్యాచార సంస్కృతికి అప్పటిదాకా ఉన్న ప్రభుత్వాలదే బాధ్యత అని తిట్టిపోసినవాళ్లు అధికారంలోకి వచ్చారు. వర్మ కమిషన్ చేసిన మిగిలిన సిఫారసులను బుట్ట దాఖలు చేసిన కొత్త ప్రభుత్వం నిర్భయ సంఘటనలో లాగా నేరస్తులు మైనర్లు అయితే తప్పించుకు పోకుండా హీనమైన నేరాలకు పెద్దవాళ్లను విచారించినట్లే విచారించే విధంగా, నిందితుల వయసును 16 కి తగ్గిస్తూ పోక్సో చట్టానికి సవరణలు చేసింది. మరింత మందికి మరణశిక్షలు విధించే అవకాశం కల్పించింది. ఈ సవరణలు పార్లమెంట్ లో ప్రవేశపెడుతూ మంత్రి మనేకా గాంధీ ఒక వ్యాఖ్య కూడా చేసారు, "పేదరికం నేరాలు చెయ్యటానికి సాకు కారాదు" అని. అంటే ఇటువంటి నేరాలు చదువు సంధ్య లేని పేదలే చేస్తారని, కాబట్టి వాళ్లను శిక్షించటానికి వాళ్ల పేదరికం కాని, వాళ్ల వయసు కాని అడ్డంకి కాకూడదన్నది ఆమె అభిప్రాయం.

నేరస్తులని, బాధితులని తయారు చేసే సమాజాలు, రాజ్యాలు ఏమాత్రం దాన్ని మార్చే లేదా సంస్కరించే బాధ్యత తీసుకోకపోగా అత్యంత హీనమైన నేరం జరిగిన ప్రతిసారీ కఠిన శిక్షలు వేస్తామంటూ రంకెలు వేస్తాయి. విగ్రహాలకి వేల కోట్ల రూపాయలు కేటాయించే ప్రభుత్వాలకు అత్యాచార బాధితులను ఆదుకోవటానికి చెయ్యి రాదు. ఇచ్చిన అర కొర కూడా ఏ స్వచ్ఛ భారత్ కో తరలిపోతాయి. మాట్లాడితే భారతీయ సంస్కృతి గురించి ఘనంగా చెప్పుకునే వాళ్లు అత్యాచార సంస్కృతిని

మార్చటానికి మాత్రం ఏమీ చెయ్యరు. ప్రతి ఊరికీ పోలియో చుక్కలు వెయ్యాలన్న సందేశాన్ని తీసుకుపోగలిగిన ప్రభుత్వాలు తలచుకుంటే ఆడపిల్ల ఆమోదం లేకుండా ఆమెపై చెయ్యి వెయ్యకూడదన్న సందేశం కూడా తీసుకుపోగలవన్న స్పృహ ఉండదు. ఆడపిల్లను చూస్తే కళ్లు పీకేస్తామని ప్రగల్భాలు పలికే చోట ఆడపిల్లకు సమస్య వస్తే చెప్పుకోవటానికి ఒక వ్యవస్థ ఉండదు. సమాజంలో, పాలనలో ఉన్న లోపాల వైపు చూసే బదులు ప్రభుత్వం నేరస్తుడి వైపు చూపిస్తుంది. నేరాన్ని చంపటం కాక నేరస్తుడిని చంపటం మీద శ్రద్ధ పెడుతుంది. నేరస్తులే రాజకీయ నాయకులుగా, నేరమే అధికారమై రాజ్యమేలే చోట చిన్న చేపను తినే పెద్ద చేప లాగా చంపటానికి చిన్న నేరస్తులు కావాలి. సత్వర న్యాయం కోసం చెయ్యవల్సిన దీర్ఘకాలిక చర్యలు వదిలేసి తక్షణ న్యాయం పేరుతో మాయ చేస్తారు.

ఇక ఈ మొత్తం నేరపూర్వక వాతావరణంలో నేరము-శిక్ష లో ప్రధాన పాత్ర వహించే పోలీసు వ్యవస్థ గురించి మాట్లాడుకోవాలి. అత్యాచార సంస్కృతిని అరికట్టడానికి తొలి సంస్కరణలు ఇక్కడినుంచే ప్రారంభించాలని జస్టిస్ వర్మ అన్నారంటేనే ఇక్కడ సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం అవుతుంది. పురుషాధిక్య భావజాలానికి, టాక్సిక్ మాస్క్యులినిటీకి ప్రతిరూపంగా ఉండే ఈ వ్యవస్థలో స్త్రీలపై జరిగే నేరాల పట్ల ఆమోదంతో కూడిన తృణీకారం ఉంటుంది. 10 ఏళ్ల పాప నుంచి 70 ఏళ్ల పెద్దమనిషి దాకా ఒక స్త్రీ కనిపించటం లేదంటే ఆమె లేచిపోయి ఉంటుందని అనే నిర్లక్ష్యంతో మొదలుకొని, గృహహింస పడలేక వచ్చిన మనిషి పట్ల ఇంటి పరువు తీసిన తప్పుడు మనిషిలా భావించటం నుంచి, అత్యాచార బాధితురాలు వస్తే న్యూసెన్సుగా చూడటం దాకా, స్త్రీలపై జరిగే నేరాలన్నిటి పట్ల పోలీసులలో నేరపూరితమైన నిర్లక్ష్యం కనిపిస్తుంది. కేసులు కట్టటంలో నిర్లక్ష్యం మొదలుకొని అసలు కేసుల్లో చార్జి షీటు వెయ్యకపోవటం, చార్జిషీటు వేస్తే తప్పులతడకగా, కొట్టుడుపోయేలా తయారు చేసే దాకా అనేక వైఫల్యాలు. అనేక కేసుల్లో శిక్షలు పడకపోవటానికి కారణాలు ఇవే. ఇక రేప్ కేసుల్లో సంధి కుదిర్చి పెళ్లిళ్లు చెయ్యటానికి ఊళ్లల్లో కుల పంచాయితీల నుంచి మొదలుకుంటే, పోలీసు స్టేషన్లు, చివరికి కోర్టులు కూడా ఉత్సాహం ప్రదర్శిస్తాయి. ఆ మధ్య చెన్నై హైకోర్టు కూడా అలాంటి ఉత్సాహం చూపించి, సుప్రీంకోర్టుతో అక్షింతలు వేయించుకుని వెనక్కి తగ్గిందంటే అత్యాచారాల పట్ల ఎంత ఆమోదంతో కూడిన నిర్లక్ష్యం ఉందో అర్థమవుతుంది.

నిర్భయ తీవ్రమైన గాయాలతో చావు బతుకుల మధ్య నడిరోడ్డు మీద విలవిలలాడుతున్నప్పుడు కూడా గంట సేపు ఎవరి జూరిస్ డిక్షన్ లోకి వస్తుందో చర్చించగలిగే వెసులుబాటును ఆ నిర్లక్ష్యమే ఇస్తుంది. హాజీపూర్‌లో ఒకరి తర్వాత ఒకరు 13,14 ఏళ్ల పిల్లలు మాయమవుతున్నా లేచిపోయి ఉంటుందన్న నిర్ల క్ష్యపు సమాధానం చెప్పటం సాధ్యమవు తుంది. జూరిస్ డిక్షన్ పేరుతో కాలయాపన చెయ్యకూడదన్న విషయం నిర్భయ సంఘటన తర్వాత దేశం అంతటికీ తెలిసినా తెలియాల్సిన పోలీసులకు మాత్రం తెలియకుండా ఉండే అవకాశం ఉంటుంది. అంటే జస్టిస్ వర్మ చెప్పిన జండర్ సెన్సిటివిటీ కానీ, స్త్రీలపై జరిగే నేరాల పట్ల వ్యవహరించాల్సిన తీరుపై శిక్షణ కానీ ఐదు సంవత్సరాలు గడిచినా పట్టించుకోనేలేదన్నమాట. చివరికి దిశ సంఘటనలో కూడా కనిపించింది అటువంటి నేరపూరిత నిర్లక్ష్యమే. కూతురు ప్రమాదంలో ఉందని ఫోన్ చేస్తే మా జూరిస్ డిక్షన్ కాదంటే మా జూరిస్ డిక్షన్ కాదని ఒక గంట ఆలస్యం చెయ్యటమే కాక చివరికి ఏ పోలీస్ స్టేషనో కూడా కనుక్కుని వెళ్తే ఎవరితోనో లేచిపోయి ఉంటుందని బాధితురాలి తల్లితండ్రులతో వెకిలిగా మాట్లాడగలిగే ధైర్యం కూడా ఆ నిర్లక్ష్యం నుంచే వస్తుంది.

వెంటనే స్పందించి ఉంటే కనీసం దిశ బతికి ఉండేదన్నది ఒక వాస్తవం. తమ నేరపూరిత నిర్లక్ష్యం వల్ల జరిగిన నష్టానికి సమాధానం ఇవ్వలేని వ్యవస్థ తన తప్పు నుంచి బయటపడటానికి నిందితులను ఎన్ కౌంటర్ చేసి ఇమేజ్ మార్చుకోవటానికి ప్రయత్నం చేస్తుంది. ఇదే తప్పుచేసి హాజీపూర్‌లో ముగ్గురు ఆడపిల్లలను బలి ఇచ్చిన తర్వాతైనా వ్యవస్థ తన పద్ధతి మార్చుకుంటే దిశ బతికి ఉండేది. అక్కడ అట్లా మాట్లాడిన అధికారి మీద ఒక చర్య తీసుకుని ఉంటే మిగిలినవాళ్లు నేర్చుకునే వాళ్లు. నేరము-శిక్షలో అంత నమ్మకం ఉన్న వ్యవస్థ ఆ పని మాత్రం చెయ్యదు.

ఇప్పటికైనా మార్చుకుంటుదన్న నమ్మకం లేదు. ఎందుకంటే మారాలన్నా, మార్చాలన్నా చాల పెద్ద ప్రయత్నం చేయాలి. పని చేయాలి. జండర్ సెన్సిటివిటీ పెంచాలి. ఈ నేరాల పట్ల వ్యవహరించే పద్ధతి మీద శిక్షణ ఇవ్వాలి. అవన్నీ చెయ్యటానికి రాజ్యానికి తీరిక లేదు. నేరస్తులుగా మారిన తమకు రక్షకులుగా మాత్రమే పనిచేస్తూ ఉంటే ప్రతిఫలంగా మంచి మంచి వాహనాలు, వసతులు, నిధులు విసురుతూ ఉంటారు. ఇదేంటి అని ప్రశ్నించే వాళ్ల మీద తప్పుడు కేసులు పెట్టి బయటకు రాకుండా చూస్తే చాలు, అదనంగా. ఎప్పుడో ఐదేళ్లకో, ఏడేళ్లకో ఒకసారి ప్రజాగ్రహం వచ్చినప్పుడు వాళ్ల మొహాన పడెయ్యటానికి ఒక ఎన్‌కౌంటర్ చేస్తే సరిపోతుంది. బహుశా ఇప్పటి ఎన్‌కౌంటర్‌కి వచ్చిన స్పందన చూశాక ఇక నుంచి ఆయేషా మీరా కేసులో లాగా ఎవరో ఒకరిని తప్పుడు కేసు పెట్టి లోపల పడెయ్యటం కాకుండా ఇలాంటి నేరం జరిగిన ప్రతిసారీ ఎవరో ఒకరిని ఎన్ కౌంటర్ చేసేస్తారేమో కూడా. అత్యాచారం చేసి సాక్ష్యం లేకుండా చంపేసినట్లు. జనానికి న్యాయం జరిగినట్లు ఉంటుంది. తమకు కావల్సిన వాళ్లను రక్షించుకోనూ వచ్చు.

ఇలాంటి దారుణ సంఘటన జరిగిన ప్రతిసారీ ప్రజలలో ఇంకో రెండు రకాల వాదనలు వస్తాయి. ఒకటి ఆడపిల్లల ప్రవర్తన వల్లనే లేదా ధరించిన దుస్తుల వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతాయని. ఇది విక్టిమ్ బ్లేమింగ్. బాధితుల మీదనే నెపం వెయ్యటం. సమస్యను గుర్తించటానికి నిరాకరించటం. లేదా తమలో ఉన్న అత్యాచార మనస్తత్వాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించటం. రెండవది. పిల్లల పెంపకం లేదా కుటుంబ బాధ్యత చర్చ. ఒక బిడ్డను గ్రామమంతా కలిసి పెంచుతుంది అని ఒక సామెత. కాని ఇప్పుడు పరిస్థితి అలా లేదు. కొందరు తల్లితండ్రులకు బతుకే ఒక పోరాటం అయితే కొందరికి గెలవటం కోసం, సంపాదన కోసం ఆరాటం. పిల్లలు మూసిపెట్టిన ఇళ్లలో లేదా మూసిపెట్టిన స్కూళ్లలో పెరుగుతున్నారు. తల్లితండ్రులకు పిల్లలను పట్టించుకునే సమయం లేదు. స్కూళ్లకు ఆ బాధ్యత లేదు. పిల్లల ఎమోషన్లకు విలువ లేదు. ఆటలు లేవు. పాటలు లేవు. ఇప్పుడున్నంత ఒత్తిడి పిల్లల మీద ఎప్పుడూ లేదు. వాళ్ల కోసం ఏమీ చెయ్యని సమాజం, ప్రభుత్వాలు వాళ్లు చేసే తప్పులను దండించడానికి మాత్రం ముందుకు పరుగెత్తుకు వస్తాయి.

తక్షణ న్యాయం ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం

మహిళలపై జరుగుతున్న అత్యాచార హత్య ఘటనల మూలాలపై చర్చ జరగాలి తప్పిస్తే, తక్షణ న్యాయం పరిష్కారం కాదనే విషయం గతంలోనూ, దిశ ఘటన తరువాతా జరుగుతున్న దుర్మార్గాల పరంపర తేటతెల్లం చేస్తుందని అంటున్నారు **వై.హెచ్.కె. మోహన్‌రావు**

తక్షణ న్యాయం వినడానికి చాలా సంతుష్టికరమైన డిమాండు. ఈ కోరిక సాదాసీదా సాధారణ సమూహాల ఉపరితల వివేచన నుండి జనించినది మినహా మరొకటి కాదు. లోతైన ఆలోచన చేసే బుద్ధి జీవులందరికీ ఇబ్బంది కలిగించే ధ్వని. ప్రజాస్వామ్యంలో స్థాపితమైన వ్యవస్థలు తమ పరిధిని అతిక్రమించితే రాజ్యాంగ స్ఫూర్తికే భంగం వాటిల్లుతుందని న్యాయ కోవిదులూ, మేధావులూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'దిశ' దుర్ఘటన అనంతరం జన బాహుళ్యంలో పెల్లుబికిన ఆగ్రహ జ్వాలలలో ఉదయించిన నినాదమే 'తక్షణ న్యాయం'. రోజులు గుడుస్తున్నా కొద్దీ ఈ 'తక్షణ న్యాయం' అనే కోరిక విస్తృతంగానూ, బలంగానూ ప్రచారంలోకి వచ్చింది. 'దిశ' ఘటన నిందితులను బహిరంగంగా ఉరి తీయాలి, కాల్చి పారెయ్యాలి, ప్రజల సాక్షిగా కూడలిలో అవయవాలను తొలగించాలి అనే ఇటువంటి పదాలు అనేకం, ఎవరికి తోచిన రీతిలో వారు గొంతెత్తారు. వివిధ ఇస్లామిక్, ఇతర దేశాలలో అమలయ్యే బహిరంగ శిక్షల గూర్చి వరుస కథనాలు వల్లెవేస్తూ వచ్చారు. శిక్ష విచారణ అనంతరం కదా! శిక్షను ఖరారు చేయాల్సింది న్యాయస్థానం కదా! అని ఎవరైనా గొణిగినా సరే, మీ కుమార్తెకు ఈ ద్రోహం జరిగితే, మీరు అప్పుడు కూడా ఇట్లాగే మాట్లాడతారా! అంటు నోరు మూయించే తీవ్రత ఆనాటి వాతావరణం సంతరించుకుంది. 'దిశ' సంఘటనకు పూర్వం వరంగల్లు పట్టణంలో యాసిడ్ దాడి జరిపిన ముగ్గురు నిందితులను కూడా ఆనాడు సీన్ రీకన్‌స్ట్రక్షన్ సందర్భంలోనే పారిపోతుండగా కాల్చివేసినట్లు పోలీసులు ప్రకటించారు. ఇప్పుడు 'దిశ' దుర్ఘటనలో పోలీసుల వద్దనున్న ఆయుధాలు లాక్కొని వారిపైనే తిరగబడి కాల్పులు జరపబోయిన నలుగురు నిందితులకు అదే గతి పట్టిందని ఇప్పటి పోలీసులు కథను కంచికి చేర్చారు. ఐతే ఎన్‌కౌంటర్‌లు రెండూ ఐపిఎస్ సజ్జనార్ నేతృత్వంలోనే జరగడం యాదృచ్ఛికం కాదని ఆలోచనా పరులంటున్నారు. ఎన్‌కౌంటర్‌లోని మర్మాన్ని లోకమంతా అంతరంగంలో చర్చించుకున్న సంగతిని కూడా ఎవరికి వారే రహస్యంగా ఉంచారు. కాల్పులు జరిపి నిందితులను అంతం చేసిన విషయాన్ని అత్యధిక పౌరులు అంగీకరించారు. ఐతే ఎన్‌కౌంటర్ నగ్న ఇతివృత్తాన్ని నమ్ముతున్న వారు సైతం పోలీసు అధికారులు చెప్పే కథనానికి తలలూపుతున్నారు.

'తక్షణ న్యాయం' అనే డిమాండు మంచీ, చెడులపై విశాలమైన చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అత్యంత పురాతనమైన పదేపదే వల్లెవేసే నానుడే ఐనప్పటికీ దానినే మరోమారు గుర్తు చేస్తాను. 'నూరు మంది దోషులు చట్టం నుండి తప్పించుకున్నప్పటికీ ఒక్క నిర్దోషి కూడా శిక్షకు గురికాకూడదు' అనేది తరతరాలుగా వినపడుతున్న ఉపదేశం. ఇది అనుభవం నుండి వెలువడిన అత్యంత పురాతనమైన ఆచరణాత్మక సూక్తి. ఆయేషా మీరా అత్యాచారం, హత్య కేసులో సత్యం బాబును పోలీసు, ప్రత్యేక న్యాయస్థానం నేరస్తుడిగా పరిగణించి శిక్షకు గురిచేశాయి. ఆయేషా తల్లి షంషాద్ బేగం సత్యంబాబును అదుపులోకి తీసుకున్నప్పటి నుండీ నెత్తీ నోరు బాదుకుంటూ ఒక అమాయకుడిని బలిచేస్తున్నారని మొత్తుకుంటూనే ఉంది. ఒక నిర్దోషిని బలవంతులు బలితీసు కుంటున్నారని స్వరమెత్తింది. కడకు షంషాద్ బేగం అభిప్రాయమే నిజమైంది. ప్రత్యేక న్యాయస్థానం విధించిన శిక్షను తొమ్మిదేళ్ల పాటు అనుభవించిన అనంతరం హైకోర్టు సత్యంబాబును నిర్దోషిగా పేర్కొంటూ, అకారణంగా తొమ్మిదేళ్ల పాటు ఖైదు చేసినందుకు గానూ సత్యంబాబుకు నష్టపరిహారం, ప్రభుత్వోద్యోగం, ఉచిత గృహం ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని

కానీ సామాజిక జీవితం ఇంత ఒత్తిడిగా మారటానికి ఎవరు కారణం? జీవితమే ఒక ప్రెజర్ కుక్కర్ గా మారటానికి మన విధానాలు కారణం కాదా? ఎందుకు దేశం దేశమే ఎప్పుడూ ఆనంద సూచిక (హాప్పినెస్ ఇండెక్స్) లో వెనకబడి ఉంటుంది? ఎందుకు ఎప్పుడూ ప్రతి మనిషికీ చుట్టూ ఒక ఉద్రేకపూరిత వాతావరణం ఉంటుంది? ఎందుకు అందరికీ అన్ని వ్యవస్థల మీదా నమ్మకం పోయింది? న్యాయం జరగని చోట ప్రతీకారమే సరైనదని ఎందుకు నమ్ముతున్నారు? గొడ్డు మాంసం తింటే కూడా మనుషుల్ని నరికెయ్యటం న్యాయంగా మారినప్పుడు అత్యాచారానికి కూడా విరిచెయ్యటం న్యాయంగా మారకుండా ఎలా ఉంటుంది? ఒక దేశ సంస్కృతి మారాలంటే దేశ పాలనా సంస్కృతి, పాలకుల సంస్కృతి మారాలన్న సంగతి గుర్తు పెట్టుకోవాలి. పార్లమెంట్‌లో, అసెంబ్లీలలో కూర్చునే ఎంపీలు ఎమ్మెల్యేల మీదనే అత్యాచార నేరాలు ఉంటే వాళ్లు ఈ సంస్కృతిని ఎట్లా మారుస్తారు?

ఈ ప్రశ్నలకు వెతికే సమాధానాల్లోనే ఆ సమస్యకు పరిష్కారాలు ఉంటాయి. లేదంటే మరో దారుణ సంఘటన జరిగే దాకా వేచి చూడొచ్చు. ఈసారి ప్రజలు కోరుకున్నట్లుగా ఒక ఆర్థిక, రాజకీయ బలం, బలగం లేని నిందితుడిని ప్రజల చేతికి అందించవచ్చు విరిచెయ్యటానికి వీలుగా. ఈలోగా యాభై, వందేళ్లలో ఆడపిల్లలకి అందివచ్చిన కాస్త చదువు, కాసిని ఉద్యోగాలు కూడా ఈ కొత్త అభద్రతతో వెనక్కి పోతాయి. అప్పుడిక స్త్రీపురుష సమానత్వ సమన్యాయం ఉన్న సమాజం, జండర్ జస్ట్ సమాజం అనేది కలగా కూడా మిగలదు.

(రచయిత స్వతంత్ర పాత్రికేయులు) వీ

ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. తక్షణ న్యాయంగా సత్యంబాబును కూడా అప్పటికప్పుడు అంతం చేసి ఉంటే అనంతర హైకోర్టు తీర్పు విషయం గురించి ఎవరు బాధ్యత వహిస్తారు? ప్రాణాలెవరు తెచ్చిస్తారు. ఆ ఘోరమైన తప్పిదాన్ని ఎట్లా సరిచేస్తారు.

'దిశ' దుర్ఘటన నిందితుల కాల్చివేతపై దేశవ్యాప్తంగా ద్వైదీభావనలు బలంగా వినిపించాయి. సాధారణ పౌరుల నుండి, కొందరు శాసన సభ్యులూ, పార్లమెంటు సభ్యులూ, రాజకీయ నాయకులూ, మహిళా నాయకురాల్లు కొందరు సమర్థించారు. రాజ్య సభలో జయాబచ్చన్, స్మృతి ఇరాని మంత్రిగా మద్దతిచ్చారు. ఎపి శాసన సభలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ఈ సంఘటనపై మాట్లాడుతూ ఆడ పిల్లల తండ్రిగా తాను సమర్థిస్తున్నానన్నారు. ఇదే సందర్భంలో మాజీ కేంద్ర మంత్రి మేనకా గాంధీ వంటి నేతలు తిరస్కరించారు. అనేక మహిళా సంఘాలూ, వామపక్ష వాదులూ, హేతువాదులూ, న్యాయకోవిదులూ, న్యాయవాదులూ, న్యాయమూర్తులూ, హక్కుల కార్యకర్తలూ, మానవ హక్కుల కమిషన్లు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ కోవలోనే ఈ ఎన్‌కౌంటర్ సంఘటన నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బోబ్డే వ్యాఖ్యలు అంత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. సాధారణంగా ప్రచార సాధనాలకు దూరంగా ఉండే న్యాయమూర్తి మీడియా ముందుకు వచ్చి విస్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. 'న్యాయం ఎప్పుడూ ప్రతీకార రూపాన్ని సంతరించుకోకూడదు' అంటూ ఎన్‌కౌంటర్‌పై స్పందించారు. 'అట్లా జరిగితే న్యాయం తన సహజ గుణాన్ని కోల్పోతుంది' అని ఆయన హెచ్చరించారు. 'తక్షణ న్యాయం ఎప్పుడూ సాధ్యం కాదు' అని ఆయన స్పష్టం చేశారు. 'ప్రతీకారంతో న్యాయం తన సహజ రూపాన్ని కోల్పోతుంది' అంటూ భారత అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి వెల్లడించారు. ఛీఫ్ జస్టిస్ వ్యాఖ్యలు దేశమంతా పరిగణనలోకి తీసుకోవాల్సిన అగత్యముంది. తక్షణ న్యాయానికి బదులుగా సత్వర న్యాయం(త్వరితగతిన)కోరడంలో వివేకముంటుంది. ఏ వ్యవస్థ పని ఆ వ్యవస్థ చేయకపోతే మొత్తం రాజ్యాంగ స్ఫూర్తికే భంగం వాటిల్లుతుందనడంలో ఎలాంటి సంశయం ఉండనవసరం లేదు. కేసు నమోదు, విచారణ, తీర్పు అన్నీ కూడా కాలయాపనకు అవకాశంలేని విధంగా జరగాల్సిన అవసరం ఉంది. తీర్పులనూ, శిక్షలనూ సత్వరం అమలు జరపాలి. ఏళ్లు, పూళ్లు కొనసాగే విచారణల వల్లనే వ్యవస్థల పట్ల నేరస్తులకు అలుసు ఏర్పడింది. సాధారణ పౌర సమాజం విశ్వాసం కోల్పోతుంది. 'ఇప్పుడు ప్రతి ఒక్కరినీ అనుమానపు పీఢ వేదిస్తూనే ఉంది' అన్న కవి వాక్కుకు దర్పణం పట్టే విధంగా వ్యవస్థల పనితీరు ఉన్నదనేది చాలా వాస్తవం. భారతదేశంలో నేడు అనేక ప్రభుత్వ వ్యవస్థల పట్ల ప్రజల నమ్మకం సన్నగిల్లిన మాట నిజమే. అయినంత మాత్రాన తక్షణ న్యాయం మాటున ప్రాణాలను మట్టుబెట్టడం న్యాయ వ్యవస్థను ఎన్‌కౌంటర్ చేయడమే అవుతుంది. న్యాయ వ్యవస్థ చేయవలసిన పనిని మరో వ్యవస్థ చేతుల్లోకి తీసుకోవడం ప్రజా వ్యవస్థకు శ్రేయస్కరం కాదు.

'నిర్భయ' కేసు తీర్పువచ్చి ఏడేళ్లు ముగిసినా న్యాయస్థానం ఇచ్చిన తీర్పు నేటికీ అమలు కాకపోవడం విచారకరం. రాష్ట్రపతి వద్దనున్న నిర్భయ నిందితుల క్షమాభిక్ష ధరఖాస్తుపై ఆయన నుండి ఎటువంటి నిర్ణయం వెలువడలేదు. 'దిశ' ఘటన ఢిల్లీ పురవీథులను కూడా కదిలించిన పూర్వ రంగంలో ప్రజాందోళన ఢిల్లీ నగరాన్ని ఎక్కడ ముంచెత్తుతుందో ననే తలంపుతో హడావిడిగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ క్షమాబిక్ష ధరఖాస్తును తిరస్కరిస్తూ నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ కాలయాపననే పౌర సమాజం భరించలేకపోతుంది. నిర్ణయాలూ, తీర్పులూ, విచారణలూ ముగించడానికి కనీస కాల పరిమితి నిర్ణయించుకోకపోవడం, నిర్ణయించుకున్న కాల పరిమితిని అతిక్రమించడం మూలంగానే ప్రజలు తక్షన న్యాయం అంటూ నినదిస్తున్నారు. ఇదే క్రమంలో పలుకుబడి, రాజకీయ అండ, సంపన్నులు అనేక కేసుల్లో చట్టం నుండి, సంకెళ్ల నుండి తప్పించుకోవడంపై మానవ సమాజం ఉడికిపోతుంది. చట్టం, న్యాయం ఒకే స్వభావమున్న పలు కేసుల్లో పలు విధాలుగా స్పందిస్తున్న తీరు కూడా ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నాయి. నిరు పేదలూ, పేదలూ, ఎటువంటి అండాలేని నిర్భాగ్యులకే ఇలాంటి శిక్షలు విధిస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ మీడియా ముందుకొచ్చి ఇలాంటి ఆరోపణలను మరింత తీవ్రంగా చేశారు. ఆయన ఈ ఎన్‌కౌంటర్‌ను కులానికి అంటగట్టాడు. బాధితురాలు అగ్ర కులానికి చెందినది కాబట్టే పోలీసులు ఇంత తీవ్రంగా స్పందించారని, నిందితులు అగ్రవర్ణేతరులు కావడం కూడా ఒక ప్రధాన కారణమని దుయ్యబట్టారు. ఇదే కోవలో ఆయన మానసను మట్టుబెట్టిన నిందితునికీ, ముగ్గురు బాలికలను అత్యాచారం, ఆపై బావిలో పడేసి హతమార్చిన శ్రీనివాస్‌రెడ్డి ఉదంతాలనూ 'దిశ' ఎన్‌కౌంటర్‌కు ముడివేసి మాట్లాడారు. ఆయేషామీరా తల్లి షంషాద్ బేగం ఈ ఎన్‌కౌంటర్‌పై మాట్లాడుతూ నిందితులంతా సామాన్యులు కాబట్టే కాల్చేశారని వెల్లడించారు. నిందితుడు నవీన్ తల్లి ఎన్‌కౌంటర్ అనంతరం మాట్లాడుతూ ఇటువంటి ఘటనల దోషులందరికీ దేశంలో ఇట్లాగే శిక్ష విధిస్తున్నారా అంటూ నిలదీశారు. మరో నిందితుని భార్య కూడా ఇటువంటి ప్రశ్నలన్నింటికి ఉన్నత స్థానంలో ఉన్నవాడిపై తప్పనిసరిగా సమాదానం ఇవ్వవలసిన బాధ్యత ఉంది.

కృష్ణ జింకల వేట కేసులో ప్రత్యేక న్యాయస్థానం బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు శిక్షను ఖరారు చేసిన గంటలలోనే హైకోర్టు బెయిల్ మంజూరు చేసి అతనిని కనీసం కారాగారం గేటు కూడా తాకకుండా రక్షణ నిచ్చింది. అదే విధంగా మరో బాలివుడ్ నటుడు సంజయ్‌దత్ అక్రమ ఆయుధాన్ని కలిగి ఉన్నాడన్న కేసులో గవర్నర్ క్షమాభిక్షతో శిక్ష నుండి మినహాయింపు పొందాడు. టాలీవుడ్ నటీ నటుల డ్రగ్స్ కేసు ఆదిలోనే సమసిపోయింది. చంద్రబాబు నాయుడి ఓటుకు నోటు కేసును కేంద్ర స్థాయిలో కెసిఆర్ బాబుకు రాజీ కుదిర్చి ఐపు లేకుండా చేయడం జరిగిందని లోకం కోడై కూసింది. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో యువతిపై జరిగిన అత్యాచారం కేసులో ఆ రాష్ట్ర శాసన సభ్యుడు కూడా నేరస్తుడిగా నిరూపించబడ్డాడు. బెయిల్‌పై వచ్చి ఆనందంగా సంచరిస్తున్నాడు. 'దిశ' ఘటనానంతరం ఉన్నావ్‌లోని మరో కేసులో నింధితులు కోర్టుకు వెళుతున్న బాధితురాలిపై కిరోసిన్ పోసి సజీవ దహనం చేశారు. బాధితురాలిని దహనం చేయడం ద్వారా ప్రత్యక్ష సాక్ష్యాన్ని సైతం దగ్ధం చేసినట్లు అయింది. దశాబ్దాల తరబడి స్టేలతో పడకేసిన ఎపి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతి, అక్రమార్జన కేసులూ, వై.ఎస్. విజయమ్మ

చంద్రబాబుపై వేసిన పిటిషన్‌ను నాట్ బిఫోర్ చెప్పినప్పటికీ తను విచారించాల్సిందేనని పట్టుబట్టి పిటిషన్ ప్రాథమిక న్యాయ సూత్రాలకు విరుద్ధమంటూ రద్దుపరిచిన అప్పటి న్యాయమూర్తి వైనం, న్యాయస్థానాల వైఖరిని సంశయాత్మక లోయల్లోకి నెడుతున్నాయి. ఈ లోపాలనూ, లోటుపాట్లనూ సరిచేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ వ్యవస్థల పట్ల పౌర విశ్వాసం కూడగట్టవలసిన అగత్యం ఎంతైనా ఉంది.

కాగా మన దేశంలోనే కాదు, ప్రపంచ దేశాలలో కూడా చట్టాలూ, శిక్షలూ నేరాలను కొంత మేరకు మాత్రమే నియంత్రించగలుగుతున్నాయని అనులోమంగా ఎదుగుతున్న సంఖ్యే అద్దం పడుతుంది. చట్టాలూ, శిక్షలూ నేరాలను పూర్తిగా అదుపుచేయలేకపోతున్నాయనేది సుస్పష్టం. ఒకవైపున నూతన చట్టాలు తెస్తూ, ఉన్న చట్టాలను మరింత పదునుగా రూపొందిస్తున్నా, నేరాల సంఖ్య పైపైకి పాకుతుంది. నేషనల్ క్రైం రేటు ఏడాదికి ఏడాది మరింత వేగం పుంజుకుంటూనే ఉంది. ప్రత్యేకించి మన దేశంలో నేరాలు ఏమాత్రం అదుపులో ఉండడం లేదు. చట్టమూ, న్యాయమూ కూడా ఒక నేరంలో ఒక విధంగా, మరో నేర విచారణలో మరో విధంగా వ్యవహరించడంతో ఆయా సంస్థలకు లేనిపోని అపోహలు అంటుకుంటున్నాయి. 'దిశ' ఎన్‌కౌంటర్‌తో ఒక కఠోరమైన హెచ్చరిక దేశం మొత్తానికి అందినప్పటికీ, ఇటువంటి దారుణాలు నిలిచిపోలేదు. అంతకు క్రితం నిర్భయ దుర్ఘటన ఇతివృత్తంగా నిర్భయా చట్టం కేంద్ర స్థాయిలో రూపొందింది. ఈ చట్టం తీవ్రమైన ఉరిశిక్షను నిర్దేశించింది. ఈ చట్టం వచ్చినా అత్యాచారాలు ఏమాత్రం ఆగలేదు. ప్రపంచం ఎదుటకు రాకుండా ఉన్న నేరాలు పరువు మాటున అట్లా ఉంచితే, వెలుగులోకి వచ్చిన అత్యాచారాలను పరిగణనలోకి తీసుకుంటే చట్టాల ప్రభావమెంత? అనే ప్రశ్న మనకు మనమే వేసుకుంటాం. ఒకవైపు 'దిశ' అమానుషంపై ప్రజాగ్రహం వెల్లువెత్తే క్రమంలోనే హైదరాబాద్ నగరంలోని ఒక పబ్‌లో సంజనా అనే తెలుగు చలన చిత్ర కథానాయకిని మాజీ ఎంఎల్ఏ నందీశ్వర్‌గౌడ్ కుమారుడు లైంగికంగా వేదించిన కేసులో నేటివరకూ పోలీసులు నిందితుడిని కనీసం అదుపులోకి తీసుకోకపోవడం పై అంశానికి మద్దతునిస్తుంది. అట్లాగే న్యూ ఢిల్లీ రైల్వే స్టేషన్ సమీపంలో 30 ఏళ్ల మహిళపై ఓ వ్యక్తి యాసిడ్ దాడిచేసి పరారయ్యాడు. చత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాలో ఓ మహిళపై ఇంద్రపాల్ టోండే అనే వ్యక్తి కొడవలితో దాడిచేసి గాయపరిచాడు. నేపథ్యంలోకి వెళితే గతంలో ఈ టోండే బాధితురాలుని అభ్యంతరకర వీడియో తీసి బెదిరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేస్తే రిమాండుకెళ్లాడు. బెయిల్‌పై విడుదలై ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు.

బీహార్‌లోని ధర్భాంగాలో ఐదేళ్ల బాలికపై ఓ ఆటో డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అగర్తాలాలో నమ్మి వచ్చిన బాలికపై కోరిక తీరిన తరువాత తల్లి సహకారంతో ఓ యువకుడు దగ్ధం చేసి చంపాడు. అజయ్ రుద్రపాల్ అనే యువకుడు తన కామకాంక్ష తీర్చుకున్న అనంతరం తన స్నేహితుల కామవాంచకు కూడా బాలికను బలిపెట్టాడు. మహారాష్ట్రలోని హింగోలీ జిల్లాకు చెందిన 13 ఏళ్ల బాలికను ఒక వ్యవసాయ క్షేత్రంలో బంధించి లైంగిక కోర్కెలు తీర్చుకున్న ముగ్గురు క్రూరులను పోలీసులు అరెస్టు చేశారు. కాన్పూరుకు చెందిన 17 ఏళ్ల బాలికపై పొరిగింటి వారే అత్యాచారానికి పాల్పడితే లోకానికి ముఖం చూపలేని అవమాన భారంతో కుంగిపోయిన ఆమె ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దారుణాలన్నీ 'దిశ' సంఘటన జరిగిన వారంలోపుగా జరిగినవే. ఈ సంఘటనలన్నింటినీ మననం చేసుకున్నప్పుడు కేవలం చట్టాలూ, శిక్షలూ నేరాలను అడ్డుకోలేవని నమ్ముతాము.

ఎట్లా నియంత్రణలోకి వస్తాయి? చట్టాలూ, శిక్షలకంటే వ్యక్తి పరివర్తనే ముఖ్యమని చెప్పాలి. వ్యక్తిత్వ నిర్మాణమే ఏ నేరం వైపైనా వెళ్లకుండా పౌరుని నిలువరించగలుగుతుంది. ఈ పరివర్తన ఎవరిలో రావాలి? అందరిలో రావాల్సిన అవసరం ఉంది. ప్రథమంగా పాలకులూ, రాజకీయ నాయకులూ, అధికారులూ విలువలతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలి. ఆ దిశగా వారి అడుగులు పడాలి. అనంతరం వారి వారి కుటుంబాలలో ఈ విలువలు నింపాలి. ప్రభుత్వాన్ని నడపడానికి మించి సంఖ్యా బలమున్న నాయకుడు ఇతర పార్టీల నుండి ఎన్నికైన సభ్యులను తమ పార్టీలోకి తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని అత్యాచారం గావించడమే అవుతుంది. డబ్బును పంచి ఎన్నికల్లో విజయం సాధించిన వారే కాదు, ఓటమి పాలయిన వారుకూడా ఎన్నికల రంగాన్ని మానభంగం చేసినవారే అవుతారు. ఇట్లా ప్రతి అడుగులో విలువలతో కూడి ఉన్నప్పుడు మాత్రమే పాలితులు కూడా నేరాలకు దూరంగా జరుగుతారు. లంచాలు తీసుకునే ఉద్యోగులు, అధికారులు పరిపాలన మొత్తాన్ని బలాత్కారం చేసే వారుగానే చెప్పాలి. మహాత్ముడన్నట్లుగా 'మార్పు కోరుకునే వారంతా ఆ మార్పును తమనుండే ప్రారంభించాలి' అనేది సార్వకాలీన సత్యం. అనంతరం కుటుంబ స్థాయికి వెళ్లాలి. ఆ విధంగా దేశ వ్యాప్తంగా మనం మార్పును ఆశించగలం. అందరూ మారాలి, తను మాత్రం పాత రోతలోనే పొర్లుతాననే వారితో ఎలాంటి ప్రయోజనమూ ఉండదు గాక ఉండదు.

అదే విధంగా ఒక నేరం జరిగినప్పుడు సంబంధిత వ్యవస్థలన్నీ త్వరితగతిన స్పందించాలి. నేరం జరుగుతుందని సమాచారం అందుకున్నప్పుడు తేలికగా తీసుకోవడం, తాత్సారం చేసినప్పుడు 'దిశ' వంటివారు బలైపోవడం ఖాయం. వ్యవస్థలన్నీ సత్వరంగా, సమర్థవంతంగా, పారదర్శకంగా, త్వరితగతిన పనిచేసినప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. అమాయకులూ, బలహీనులూ, అబలలూ రక్షించబడతారు. అప్పుడు మాత్రమే వ్యవస్థల పైన నమ్మకం కుదురుతుంది. విశ్వాసం పాదుకున్న నేపథ్యంలో మాత్రమే న్యాయం జరుగుతుందని ప్రజల వైఖరిలో మార్పు తేగలుగుతాము. లేని పక్షంలో తక్షణ న్యాయం, బహిరంగ ఉరి లాంటి డిమాండ్లే ఆకాశాన్ని తాకుతుంటాయి. అత్యంత క్రూరమైన నేరాలకు పాల్పడిన దోషులూ, నిందితులూ అనేక లోసుగుల ఆసరాగా చట్టం నుండీ, శిక్షల నుండీ తప్పించుకుని ఒకవైపు నిర్దోషులుగా వెలుపలికి వచ్చి ఫోజులు పెడుతుంటే నిస్సహాయంగా స్థాణువులా చేతులు ముడుచుకునే అదే పోలీసు శాఖ, అమాయకులపై మూక దాడులు నిలువరించాలని ప్రధానికి ఉత్తరం రాసిన 49 మంది మేధావులూ, కళాకారులూ, రచయితలపైన రాజద్రోహం కేసు నమోదు చేయడం, భావ ప్రకటనా స్వేచ్ఛతో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తన అక్షరాలతో ఎత్తిచూపుతున్న పత్రికా సంపాదకుడు ఎన్. వేణుగోపాల్‌పై తెలంగాణ ప్రభుత్వం ఐపిసి, యుఎపిఎ సెక్షన్‌లతో కేసు పెట్టిన వైనం వింతగొలుపుతుంది.

(రచయిత అధ్యక్షులు: నవ్యాంధ్ర రచయితల సంఘం) వీ

అనాగరికత వైపుగా ఎన్‌కౌంటర్ న్యాయాలు

వ్యవస్థీకృతమైన నేరాన్ని నిర్మూలించకుండా సత్వర న్యాయం పేరు మీద కొంత మంది భావోద్వేగాల మెప్పుకోసం ప్రభుత్వం వ్యక్తుల్ని ఎన్‌కౌంటర్ చేస్తే ప్రజలకు దక్కేది న్యాయం కాదు, అభద్రత మాత్రమే అంటున్నారు **కేశవ్**

ఇటీవల డిసెంబర్ 6న దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసు మొత్తం భారతదేశాన్ని కుదిపివేసింది. ఈ న్యాయం సరిగానే ఉందని ఒక వర్గం, ఇది సరయిన న్యాయం కాదని మరో వర్గం భావించింది. ఎన్‌కౌంటర్‌కి పాల్పడిన పోలీసు అధికారిని కీర్తించే పని మరోవైపు ఆరంభమయింది. దిశకు జరిగిన అన్యాయానికి ఇది సరయిన న్యాయం అనీ, న్యాయ వ్యవస్థ చచ్చి పోయిందనీ, ఇలాంటి రేపిస్టులకి ఇదే సరయిన శిక్ష అని సోషల్ మీడియాలో నీతి వాక్యాలు వల్లించారు.

ఉద్యమానికి దారితీసిన లైంగిక దాడి

హైదరాబాద్‌లో ఇటీవల 27 సంవత్సరాల ఒక పశు వైద్యురాలిని ఒక పథకం ప్రకారం ప్రణాళిక వేసి ఆమెపై అత్యాచారం చేసి చంపేశారు. అత్యంత కిరాతకమైన చర్యను మానవాళి భరించలేకపోయింది. క్షణాల్లో యువత భగ్గుమంది. ఏ రాజకీయ పార్టీ పిలుపు లేకుండానే సోషల్ మీడియా సహకారంతో నిందితుల్ని ఉంచిన పోలీసు స్టేషన్ దగ్గర వేల సంఖ్యలో గుమిగూడి నిందితుల్ని తమకు అప్పగించాలనీ, తామే సత్వర న్యాయం చూసుకుంటామనీ అడిగారు. ఇప్పుడిప్పుడే నిరవధిక ఆర్‌టిసి సమ్మె విరమణతో ఊరట చెందుతోన్న రాష్ట్ర ప్రభుత్వానికీ, ఇటు పార్లమెంట్ పెద్దలకూ ఇది విషమ సమస్యగా మారింది. రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటామని శపథం చేసిన కొంతమంది పార్లమెంట్ పెద్దలయితే, ఇలాంటి నిందితులని సామూహికంగా చంపెయ్యాలని సెలవిచ్చారు. ఉద్రేకంతో ఉన్న యువత నరాల్లో ఇలాంటి వాక్యాలు మరింత ధైర్యాన్ని నింపాయి. పట్టుబడిన నలుగురు నేరస్తులను నేరం జరిగిన చోటుకి తీసుకెళ్లి మరింత స్పష్టత కోసం నేరం జరిగిన విధానాన్ని రీప్లే చేస్తుంటే, ఎదురు తిరిగి పారిపోతున్న నేరస్తులను ఇలా ఎన్‌కౌంటర్ చెయ్యాల్సి వచ్చిందని పోలీసులు చెప్పారు.

ఎన్‌కౌంటర్ అవసరం?

ప్రజల్లో ఒక భాగం ఇలాంటి చర్య హర్షించదగ్గది అని కొనియాడారు. వీరి వాదన ప్రకారం, భారతీయ న్యాయ వ్యవస్థలో న్యాయం జరగదు. సంవత్సరాల తరబడి న్యాయం కోసం వడిగాపులు కాయాల్సిందే. నేరస్తులు హాయిగా విచ్చలవిడిగా బెయిలు మీద వచ్చి, మరలా ఫిర్యాదు చేసిన వారిమీదనే అత్యాచారం చేస్తారు. అత్యధిక శాతం రుజువులు కరువై, లేదా రుజువులు తారుమారై తప్పించుకొని సమాజంలోకి వచ్చి మరలా మరో నేరానికి పాల్పడతారు. నిర్భయ కేసులో చూశాం. ఉన్నావ్ కేసులో చూశాం. ఇలాంటి సవాలక్ష కేసుల్లో నేరస్తులకు శిక్ష పడడం లేదు. న్యాయ వ్యవస్థ వైఫల్యమే ఇలాంటి ఎన్‌కౌంటర్‌లకు నాంది. సత్వర న్యాయమే నిజమైన పరిష్కారం. ఇలాంటి న్యాయంతో ఇకముందు మహిళలపై అత్యాచారం చేసేవాడు భయపడాలి. నేరం చెయ్యడానికి వణుకు పుట్టాలి. మానభంగాలు అంతమవుతాయి. నేరస్తుడిని ఇలా ఎన్‌కౌంటర్ చేసేస్తే, భవిష్యత్తులో అమ్మాయిలు హాయిగా ఊపిరి పీల్చుకో గలుగుతారు. అమ్మాయిల మీద అత్యాచారాలు అంతమవుతాయి. మరి కొందరయితే, హైదరాబాదు ఉదాహరణను నిర్భయ కేసులోను వర్తింప జెయ్యాలని వాదించారు. ఎన్‌కౌంటర్ అవసరం అనేవారి వాదన ఇదే.

ఎన్‌కౌంటర్ కిరాతకం

పోలీసులు ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం నేరస్తులుగా గుర్తించగలిగే వారిని అరెస్టు చెయ్యడం, కోర్టు ముందు హాజరుపరచడం వరకే వారి పని. ఇతర ప్రభుత్వ అధికారుల లాగానే వీరు కూడా ప్రభుత్వ నియమాల్ని పాటించే ఉద్యోగులు మాత్రమే, ఎంత గొప్ప, ఎంత పెద్ద ఆఫీసరు అయినా ఇప్పుడున్న చట్టాల ప్రకారం నడచుకోవలసిందే. దీనికి అతీతం ఎవరూ కాదు. ఎలాంటి నేరస్తుడయినా, ఎంత పెద్ద నేరం చేసినా నేరస్తుడిని తుపాకితో పేల్చి చంపడం చట్ట విరుద్ధం అయినప్పుడు, దిశ కేసులో తుపాకితో పేల్చి చంపడం కూడా చట్ట విరుద్ధమే. ఇప్పుడున్న చట్టాల ప్రకారం కోర్టు ఆదేశించే పని మాత్రమే పోలీసు ఆఫీసరు నిర్వర్తించాలి. న్యాయస్థానం పనిని పోలీసులు తీసుకోవడం చట్ట విరుద్ధం. అప్రజా స్వామికం. కాబట్టి నేరస్తుడు ఎవరైనా, ఎంత పెద్ద నేరం చేసినా అందుకు న్యాయస్థానం పాత్రని పక్కకి తోసేసి పోలీసులు ఎన్‌కౌంటర్ చెయ్యడం సరి కాదు. ఇది మానవ హక్కుల ఉల్లంఘన తప్ప మరేమీ కాదు. ఈ రకమైన ఉదాహరణలు సమాజాన్ని ఆటవిక న్యాయం వైపుగా తీసుకుపోయి న్యాయం చెయ్యాల్సింది పోయి మరింత అరాచకత్వానికి నాంది పలుకుతాయి. అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్యాలలో ఇది ఆహ్వానించదగ్గది కాదు. కీర్తించదగ్గది అంతకన్నా కాదు అనేది వీరి వాదన.

మారిన మానవ స్పందనలు

అయితే, నిర్భయ కేసుకీ, కతువ కేసుకీ లేని కొత్త మానవ స్పందనలు దిశా కేసు విషయంలో కనిపించాయి. మొదటి రెండు కేసుల్లో ప్రజలు న్యాయ వ్యవస్థను నమ్ముకున్నట్టు కనిపించింది. కానీ, దిశ కేసు విషయంలో ప్రజలు సినీ న్యాయాన్ని హర్షించారు. ఎన్‌కౌంటర్‌ని సమర్థించారు. ఎన్‌కౌంటర్ చేసిన పోలీసు ఆఫీసర్ని సోషల్ మీడియాలో భజనలతో, పూలమాలలతో నింపారు. ఇలాంటి ఆఫీసర్లు దేశానికి అవసరం అని

సందేశాలు ఇచ్చారు. ప్రతి లైంగిక అత్యాచారానికి ఇదే సరయిన పరిష్కారం అని అన్నారు. కొంతమంది మేధావి వర్గం విడిచి పెడితే, అత్యధిక జనాలు ఇలా పోలీసు న్యాయాన్ని బాహాటంగా సమర్థించారు. ఎవరి వాదనలు ఎలా ఉన్నా మహిళలకు సంబంధించి వాస్తవ పరిస్థితులు దయనీయంగా ఉన్నాయి. అందులోనూ, స్త్రీల పట్ల అత్యాచారాలు మునుపెన్నడూ లేనంత దారుణంగా పెరుగుతున్నాయి.

స్త్రీల పట్ల పెరుగుతున్న నేరాలు

గత కొన్ని సంవత్సరాలుగా స్త్రీల పట్ల నేరాలు, లైంగిక దాడులు విపరీతంగా పెరుగుతున్నాయి. జాతీయ నేర విచారణ విభాగం ప్రకారం, 2017లో మహిళలపై 3 లక్షల 59 వేల 849 నేరాలు నమోదయ్యాయి. 2015లో 3 లక్షల 34 వేల నేరాలు నమోదయ్యాయి. రాయటర్స్ సంస్థ 2018లో నిర్వహించిన సర్వే ప్రకారం, ప్రపంచంలో మహిళలకు భద్రత లేని దేశాల్లో భారతదేశం మొదటి స్థానంలో ఉంది. లక్షల సంఘటనల్లో కొన్ని సంఘటనలు ముందుకొస్తున్నాయి. కొన్ని మీడియాను ఆక్రమిస్తున్నాయి. కొన్ని ఉద్యమాలకు దారి తీస్తున్నాయి. 2012లో నిర్భయ కేసు ఢిల్లీ రాజధానిని, భారతదేశాన్ని కుదిపివేసింది. తర్వాత కథువ సంఘటన మరలా ప్రజల్ని ఉద్యమంలోకి నెట్టింది. విపరీతమైన ఆగ్రహావేశంతో నింపింది. ఆ తర్వాత నేటి దిశా కేసు మరలా హైదరాబాదు నగరాన్నీ, మొత్తం దేశాన్నీ కుదిపి వేసింది. చివరికి ఎన్‌కౌంటర్ వరకు నడిచింది. దిశా సంఘటన సమయంలోనే అదే వారం మరికొన్ని అత్యాచారాలు వెలికి వచ్చాయి. అయితే, వాటికి, కావలసినంత మీడియా కవరేజు దొరకలేదు. వేల కేసులు అజ్ఞాతంలో ఉన్నట్టే ఇవి కూడా అలాంటి నేపథ్యంలో అజ్ఞాతంలో ఉండిపోయాయి.

లైంగిక నేరాలకు కారణమైన సమాజం

లైంగిక నేరాలను సమాజం నుండి విడదీసి ఎన్‌కౌంటర్ పరిష్కారాలని ఇచ్చే ముందు లైంగిక నేరాలను మొదట సమాజంతో ముడిపెట్టి చూడాలి. నేటి సమాజం అనారోగ్యకరమైన సమాజం. శ్రమ దోపిడీతో, అదనపు విలువలను హరించడంతో ఏర్పడ్డ సమాజం. ఒక శాతం వర్గానికి విలాసాన్ని, 99 శాతం వర్గానికి అస్థిరతని, నిరుద్యోగాన్ని, అశాంతిని, మూక హత్యల అభద్రతని అందించింది. సామాజిక వ్యవస్థ నుండి ఒక ప్రత్యేక యువక సమాజాన్ని తమకంటూ స్థానం లేని సమాజంగా విసిరివేశాం. తలపై మానవ మల మూత్రాన్ని మోసుకెళ్లే విచిత్రాన్ని ఇంకా మనం అలానే పదిలంగా ఉంచాం. స్వచ్ఛ భారత్ అని 2014 నుండి అంటూనే ఉన్నాం. నేరం చెయ్యడమే తప్పయితే, నేరాన్ని సీరియల్లుగా మార్చి టెలివిజన్‌లో సంవత్సరాల తరబడి చూపిస్తున్నారు. టిఆర్‌పి లాభాలను కొల్లేట్టేస్తున్నారు. జియో రాకతో ఉచిత అంతర్జాలం పుణ్యమా అని యువతరం అవసరం లేని, రాని, అభిలషణీయం కాని అశ్లీల వీడియోలకు బలవుతున్నారు. దిశా అత్యాచారం సంబంధించి సంబంధిత వీడియోలను సెర్చి ఇంజైన్‌లో కొన్ని లక్షల మంది వెదుకుతున్నారంటే, దిశకు న్యాయం కావాలనే యువత పోరాటం నేపథ్యంలో, వ్యవస్థ ఎంతమంది ఉన్మాదులని తయారు చేస్తుందో, వీరంతా ఆరోగ్యకరమైన సమాజానికి ఎంతెంత ప్రమాదకరమో అర్థం అవుతుంది.

అర్థం చేసుకోగలం. మరోవైపు, సినిమాల్లో నేరాల్ని గ్లోరిఫై చేసి చూపించే సన్నివేశాలు, అమ్మాయిల్ని టీజింగ్ చేసే నెగెటివ్ క్యారెక్టర్ ఉన్న నాయకుల్ని పాజిటివ్‌గా చూపించే సన్నివేశాలు యువత మెదళ్లమీద ప్రభావం కలిగించ కుండా ఉంటాయా? నేరాలకు ముఖ్య కారకాలుగా ఉన్న వీటిని మనం ఏనాడైనా ప్రశ్నించామా? టీవీలలో ఇప్పుడొస్తున్న అసంఖ్యాకమైన వాణిజ్య ప్రకటనల్లో స్త్రీ ఒక వినోద వస్తువు. ముడి సరుకు. ఒక డియోడరెంట్ వేసుకోగానే స్త్రీ వచ్చి వాలిపోతుంది. ఒక బ్రాండు షేవింగ్ క్రీం వాడగానే స్త్రీ వచ్చి వాలిపోతుంది. పలానా కంపెనీ స్కూటర్ ఒక స్త్రీ లా కనిపిస్తుంది. ఇవి స్త్రీ పై యువకుల్లో ఎలాంటి భావనను కలిగిస్తాయి? వీటిని ఏనాడైనా ప్రశ్నించామా? స్త్రీ గురించి మాట్లాడేటప్పుడు 'ఆమె' అనే సర్వనామం కంటే 'అది' అనే సర్వనామం వాడే పురుషులు ఎంతమందో? చివరికి ఇలా సంబోధించే బాలురు విద్యాలయాల్లో ఎన్ని వేలమందో? మహిళల మీద సరయిన సదవగాహనని ఏర్పరచలేని పెద్దవాళ్లు, సమాజం, తోటి బాలబాలికలు సమానమే అని బోధించలేని సమాజం, అమ్మాయిల్ని చవకబారుగా చిత్రీకరించే సినిమాలు దీనికి కారణం కాదంటామా? గత కొన్ని తరాల ఫ్యూడల్ భావజాలం ఇళ్లల్లోనూ, సమాజంలోనూ ప్రతిఫలించడం, ప్రభావితం చెయ్యడం మనం చూస్తున్నాం. మహిళల గురించి మార్పు కావాలనుకొని ఉద్యమం చెయ్యాలనుకొనే యువతరం మహిళలపట్ల, పురుషుల ఆలోచనలు, సమాజం ఆలోచనలు మార్చాల్సిన అవసరం ఉంది. ఇది ఎన్‌కౌంటర్ ఫిలాసఫీతో పరిష్కారం కాదు. పోలీసు ఆఫీసర్లను ఆకాశానికి ఎత్తెయ్యడం ద్వారా పరిష్కారం కాదు. వీరి పఠాలకు పూలమాలలు వెయ్యడం ద్వారా పరిష్కారం కాదు. వీరిని ఆరాధ్య దైవాలుగా ప్రణాళికా బద్ధంగా సోషల్ మీడియాలో మార్చెయ్యడం ద్వారా పరిష్కారం కాదు.

వాస్తవ పరిస్థితులకు దూరంగా

సామాజిక సమస్యలకు తోడు, ఆర్థిక పరిస్థితులూ, దేశం నేడు ఎదుర్కొంటున్న ఆర్థిక మాంద్యం కూడా సామాజిక అస్థిరతకు, రుగ్మతలకు కారణమవుతోంది. దిశా సంఘటన విడి సంఘటన కాదు. అస్థిర వ్యవస్థ నుండి పుట్టుకొచ్చిన సంఘటన. మొత్తం సమాజం, యువతరం దృష్టి దిశా నేరస్తుల మీదనే కేంద్రీకరించి ఉంది. వారి అంతంతో ఆత్మ సంతృప్తి పొందారు. కానీ, ఈ నేరాలకు కారణమైన నేరస్తులని పుట్టించే వ్యవస్థ అసలు నేరస్తురాలు. నేరం అన్నప్పుడు లైంగిక నేరాలే కాదు. ఆర్థిక నేరాలూ, శ్రమ దోపిడీ వ్యవస్థ పుట్టిస్తోన్న అన్ని రకాల నేరాలు కూడా పక్కనే పొంచి ఉన్నాయి. అనారోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థలో విజయ్ మాల్యాలు, నీరవ్ మోదీలు వేల కోట్ల రూపాయల్ని అత్యంత చాకచక్యంగా పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల నుండి సఫా చేసేశారు. గోరు చుట్టుమీద రోకటి పోటులా బ్యాంకుల మొండి బాకీలు విపరీతంగా పెరిగాయి. ముద్రా రుణాల్లో మంజూరు చేసిన 17 వేల 251.52 కోట్ల రూపాయలు ఎన్‌పిఎలుగా మారాయని స్వయంగా రాజ్యసభకు అందిన సమాధానం ద్వారా తెలుస్తోంది. పర్యవసానంగా, బ్యాంకుల్ని విలీనం చేసి ఉద్యోగుల్ని అస్థిరతలో ఉంచాల్సి వస్తోంది. ప్రపంచీకరణ, స్వేచ్ఛా వాణిజ్యం దేశాన్ని అందలం ఎక్కిస్తుందని తొంభైల నుండి భ్రమ కలిగించారు. వృద్ధి రేటు పెరుగుతుందని అన్నారు. తప్పుడు ఆర్థిక విధానాల ద్వారా దేశంలో

ఒక్కో రంగం దివాలా తీస్తోంది. మాన్యు ఫాక్చరింగ్ రంగం నేడు అత్యంత షాక్‌లకు గురయింది. ఆటో మొబైల్ రంగం స్తంభించింది. దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత క్లిష్ట పరిస్థితిలో ఉంది. ఉల్లి ధరలు ఆకాశాన్ని అంటి మరో గ్రహం దగ్గరకు చేరుకుంటున్నాయి. జెఎన్‌యు ఉద్యమం కేంద్ర ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. విద్యలో సబ్సిడీల నుండి ప్రభుత్వం మెల్లమెల్లగా వైదొలగే ప్రయత్నాలు చాప కింద నీరులా ఆరంభ మవుతున్నాయి. జెఎన్‌యు హాస్టల్ ఫీజులో పెంపు ఇందులో భాగమే. ఈ నేపథ్యంలో, ఎన్‌కౌంటర్‌లతో కొంత మంది పోలీసు ఆఫీసర్లు తాత్కాలికంగా సినీ హీరోలవుతారు. వీరివల్ల సమాజానికి జరిగే న్యాయం శూన్యం. స్త్రీలకు న్యాయం శూన్యం. పైగా ఇలాంటి ఎన్‌కౌంటర్‌లను ప్రోత్సహించే సమాజం తనకు తెలీకుండానే ఒక ఫాసిస్టు రాజ్యానికి బీజం వేస్తుంది. వంత పాడే కమర్షియల్ మీడియా కూడా ప్రజాస్వామ్యం విలువల్ని కాపాడాల్సింది పోయి ఇలాంటి ఫాసిస్టు రాజ్యం స్థాపనకు సహకరిస్తుంది. న్యాయవ్యవస్థలో లోపాలు లేకపోలేదు. న్యాయం నేడు ధనికుల పరమయింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో న్యాయం కూడా సగటు మనిషికి గగన కుసుమమే. సంవత్సరాల తరబడి నడిచే కేసులు, అయ్యే ఖర్చు, కలిగే అశాంతి విపరీతంగా మానసిక క్షోభకు గురిచేస్తాయి. న్యాయ వ్యవస్థలో మార్పులు చాలా అవసరం. పేదలకు, అమ్మాయిలకు, అత్యాచారానికి గురయిన స్త్రీలకు న్యాయం సునాయాసంగా దొరికేలా ప్రభుత్వాలు ప్రయత్నాలు చెయ్యాలి అంతేగాని, సత్వర న్యాయం కోసం ఎన్‌కౌంటర్‌లను ప్రోత్సహించకూడదు. సత్వర న్యాయం బాధితులకు అందాలి అనే రాజకీయ నాయకులు కోర్టుల్లో ఉద్యోగాల్లో ఖాళీలు భర్తీ చేసేబాధ్యతను నిర్వర్తించగలగాలి. సుప్రీం కోర్టు, హై కోర్టుల్లోని న్యాయవాదుల 213 నియామకాలకు ప్రభుత్వం నుండి ఇంకా గ్రీన్ సిగ్నల్ లభించలేదు. డిసెంబర్ 1 నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని హై కోర్టులో అనుమతించిన 37 పోస్టులలో 22 ఖాళీలు ఉన్నాయి. అలానే, రాజస్తాన్ లోని 50 పోస్టులలో 29 ఖాళీలు ఉన్నాయి. పాట్నాలోని 53 పోస్టులలో 26 ఖాళీలు ఉన్నాయి. ఒడిశాలోని 27 పోస్టులలో 13 ఖాళీలు ఉన్నాయి. గుజరాత్‌లోని 52 పోస్టులలో 24 ఖాళీలు ఉన్నాయి. ఈ లెక్కలో హైకోర్టులలో సగం మంది మాత్రమే న్యాయాధీశులు పనిచేస్తున్నారు. కేసులు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయి. (11 డిసెంబర్, 2019, హిందూ పత్రిక ప్రకారం). ఇలాంటి పరిస్థితిలో న్యాయం వేగంగా ఎలా లభిస్తుంది? దొరకని న్యాయంతో విసిగిపోయి ప్రజలు తక్షణ న్యాయాన్ని కోరుకుంటున్నారు, సినీ పరిష్కారాలు వీరికి నచ్చుతున్నాయి. ముఖ్యంగా యువత సరదాపడుతున్నారు. సంబరాలు చేసుకుంటున్నారు. పర్యవసానాల గురించి వీరికి ఆలోచన లేదు. ప్రపంచీకరణ క్షణిక ఆనందాల మధ్య, పతన విలువల నేపథ్యంలో పెరుగుతోన్న యువతలో ఇలాంటి లక్షణాలు కనిపించడం పాలక వర్గాలకు ప్రయోజనం. మానవ నాగరికతకు ముప్పు.

ఆరాధ్య దైవాలుగా మారిన పోలీసు ఆఫీసర్లు

అందుకే, నిందితులను ఆత్మరక్షణ కోసమని చంపేసిన పోలీసు ఆఫీసర్లు క్షణాల్లో ఆరాధ్య దైవాలుగా మారిపోయారు. అంతకు ముందు ఫిర్యాదుల్ని స్వీకరించి బాధితురాలి కుటుంబానికి క్షణాల్లో న్యాయం చెయ్యాల్సిన ఆఫీసర్లు ఇది తమ పరిధిలోకి రాదని నిర్లక్ష్యంగా నిరాకరించిన పోలీసు ఆఫీసర్లు, నేరం జరగకముందే అరికట్టాల్సిన ఆఫీసర్లు, ప్రజల నిరసనకు గురయిన పోలీసులు ఎన్‌కౌంటర్ చేసెయ్యడంతో ప్రజల దృష్టిలో న్యాయమూర్తులయిపోయారు. నేరస్తుడు ఒకడయితే తప్పుడుకేసుల్లో ఇరుక్కున్న అమాయకులు ఎన్ని వేలమందో? పథకం ప్రకారం ఎవరో కొందరు తప్పుకోవడానికి అమాయకుల్ని ఇరికించేసిన కేసులు లేవని అనగలమా? మరి కోర్టులే లేకపోతే, న్యాయ వ్యవస్థ అనేది లేకపోతే, ముద్దాయికి తన తరుపున మాట్లాడే హక్కునే కోర్టు ద్వారా ఇవ్వకపోతే, అసలు నేరస్తుడు ఎవరో, నేరంలో ఇరికించిన అమాయకుడు ఎవరో తెలుసుకోగలగడం ఎలా? ఎన్‌కౌంటర్ నిజమైన పరిష్కారం అయితే, పోలీసులు ప్రతి కేసులోను పట్టి తెచ్చిన నేరస్తులు నిజంగానే నేరస్తులని క్షణాల్లో రుజువు చెయ్యగలమా? పోలీసులు రాజకీయ ఒత్తిడికి, ప్రజల ఒత్తిడికి గురై మరో అమాయకుడ్ని నేరస్తుడిగా డ్రామా చేసి ఎన్‌కౌంటర్ చేసేస్తేనో? చనిపోయిన తర్వాత దండలు వేయించుకున్న తర్వాత, ప్రజలు నేరం జరిగిన మరో ప్రాంతం దగ్గర పండుగ చేసిన తర్వాత అసలు నేరస్తుడు బయటపడితేనో? చనిపోయిన నేరస్తులు అసలు నేరస్తులు కారని తెలిస్తేనో? అసలు నేరస్తులను ఇలానే అరెస్టు చేస్తారు. మరి ఎన్‌కౌంటర్‌కి గురై ప్రాణాలు కోల్పోయిన అమాయకుల ప్రాణాలను తెచ్చి వారిని కన్న తల్లికి పోలీసులు ఇవ్వగలరా?

పోలీసులు నిజంగా న్యాయమే చేశారని అనుకుందాం. మరి ఒకే నేరం చేసిన ఉన్నత వర్గాల కోసం ఒక న్యాయం, బాబాలకు ఒక న్యాయం, పేదలకు ఒక న్యాయం ఎందుకు? వేలకోట్లు పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల నుండి ఖాళీచేసేసి బ్యాంకుల్ని దివాలా తీయించి తద్వారా భారతీయ ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చేసిన మాల్యాలు, నీరవ్ మోదీలు ఏ జైలులో మనకు కన్పిస్తున్నారు? ఏ కోర్టులో హాజరుపరచారు? పిల్లల మానభంగం కేసులో ఇరుక్కున్న బాబాలు బయటి దేశాలలో ఎలా తిరగగలుగుతున్నారు? పోలీసుల కథనం దేశం మొత్తం మీద సరిగానే ఉందని మనం ఒక్క క్షణం అనుకున్నా, మరి ఎన్నో కేసుల్లో పోలీసుల కథల్ని, కథనాన్ని, కట్టుకథల్ని ఆయా రాష్ట్రాల కోర్టుల న్యాయాధీశులు ప్రశ్నిస్తున్నారెందుకని? సందేహం వ్యక్తం చేస్తున్నారెందుకు? ఇలా ఆలోచించుకుంటూపోతే వేలకు వేల ప్రశ్నలు మనముందు ప్రత్యక్షమవుతాయి. సమాధానాలు దొరకవు.

ఎన్‌కౌంటర్లు ఈ రోజు కొత్త విషయమేమీ కాదు. సందర్భం కొత్తది కావొచ్చు. ప్రజలు సంబంధిత అఫీసర్లని సోషల్ మీడియాలో కీర్తించడం కొత్తది కావొచ్చు. రాజ్యం తన పోలీసు బలగాలతో దమనకాండని కొనసాగించడం విభిన్న రాష్ట్రాల్లో చూశాం. ఇది కొత్త కాదు. ఈ ప్రక్రియతో ఎన్‌కౌంటర్ స్పెషలిస్టులు పోలీసు వ్యవస్థలో పుట్టుకొచ్చారు. ఎన్‌కౌంటర్‌లు చెయ్యడం, తప్పించుకొని పారిపోయారని ప్రతి సంఘటన లోనూ కట్టు కథల్ని అల్లడంలోనూ, మీడియాకి ఆ కథల్ని అందించడం లోనూ, నమ్మించడంలోనూ వీరు ఆరితేరిన వారు, ఏది ఏమయినా, ఎన్‌కౌంటర్లు ఫాసిస్టు రాజ్యానికి నిదర్శనాలు. ఓడిపోయిన రాజ్యం వికృత చేష్టలు. 'ఎన్‌కౌంటర్లు హత్యలే' అని ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల కమిటీ ఎన్నో రిపోర్టులలో పేర్కొంది. కాబట్టి, పోలీసుల కిరాతక చర్యను ఎట్టి పరిస్థితులలోను సమర్థించే దశ నుండి బయటికి రావాలి.

దిశ నిందితుల ఎన్‌కౌంటర్

హత్యాచారాలపై కోపోద్రేకం సహజమే, కాని నిందితుల ఎన్‌కౌంటర్ సమంజసమేనా అని ప్రశ్నిస్తూ పోలీసులే శిక్షలు అమలు చేస్తే దేశంలో అరాచకం నెలకొంటుందని అంటున్నారు **లక్ష్మణ్ గడ్డం**

మానవ జీవన గమనంలో లైంగిక దాడి అత్యంత హేయమైన చర్య. అది సామూహికమైతే మరింత కోపాగ్నిని రగిలిస్తుంది. తర్వాత హత్య చేస్తే అంతులేని ఆగ్రహాన్ని కలిగిస్తుంది. శవాన్ని కర్కషంగా కాల్చివేస్తే కట్టలు తెంచుకున్న క్రోధం ఉపద్రవంలా ఉప్పొంగుతుంది. న్యాయాన్యాయాల విచక్షణలేని ప్రతీకారాన్ని ప్రదర్శిస్తుంది.

దిశ ధారుణమైన హత్యాచార ఘటన సమాజాన్ని ఒక్కసారిగా గజగజ వణికించింది. నిందితులను ఏం చేసినా సంతృప్తి చెందని భావోద్వేగానికి గురైంది. ప్రతి ఒక్కరూ తమ ఇంటి కూతురికి జరిగిన అన్యాయంగా భావించారు. ఇదొక సామూహిక పీడకల అయితే ఎంత బాగుండనే ఉద్విగ్నతకు గురయ్యారు. నిందితులను ఉరి తీయాలని, ఎన్‌కౌంటర్ చేయాలనే ఆకస్మిక ఆదేశానికి లోనయ్యారు. కోర్టు, న్యాయస్థానాలు, చట్టాలు, రాజ్యాంగం, పద్ధతులు, ప్రక్రియ ఒక్క క్షణం పక్కకు పెట్టారు. తీవ్ర ఉద్రిక్తతకు లోనయ్యారు. చంపినోళ్లను తక్షణమే చంపేయడమే సరైన న్యాయమన్నారు. అనుకున్నట్టుగానే పోలీసులు నిందితుల్ని చంపేశారు. స్వీట్లు పంచుకున్నారు. పూల జల్లులతో ఉబ్బి తబ్బిబ్బయ్యారు.

నాగర్‌కర్నూలు జిల్లా కోడేరు మండలం నర్సాయిపల్లికి చెందిన పోతుల శ్రీధర్‌రెడ్డి, కొల్లాపూర్ జూనియర్ కాలేజీలో సీనియర్ అసిస్టెంటుగా పని చేస్తున్నారు. ప్రియాంక, భవ్య తల్లితో పాటు శంషాబాదులోని నక్షత్ర అపార్టుమెంటులో ఉంటున్నారు. వారానికోసారి శ్రీధర్‌రెడ్డి పిల్లలకు దగ్గరి వచ్చి పోతుంటాడు. ప్రియాంక నవాబ్‌పేట మండలం కొల్లాపూర్‌లో వెటర్‌నరి డాక్టరుగా పని చేస్తుంది. భవ్య ఎయిర్‌పోర్టులో ఇంజనీర్‌గా పనిచేస్తుంది.

2019 నవంబరు 27న డ్యూటి నుండి తిరిగి వచ్చిన ప్రియాంక గచ్చిబౌలిలోని ఒలివా క్లినిక్‌లో లేజర్ చికిత్స కోసం వెళ్లాలని సాయంత్రం 5:30 గంటలకు ఇంట్లో నుండి బెంగుళూరు వైపు రోడ్డులో బయలుదేరింది. హైదరాబాదులోని ట్రాఫిక్ ఇబ్బంది తప్పుకోవడానికి అందరు అవుటర్ రింగురోడ్డు మార్గం ద్వారా గచ్చిబౌలి వైపు వెళతారు.

బెంగుళూరు హైవే వైపు తొండుపల్లి గ్రామంలోని టోల్‌ప్లాజా వద్ద తన స్కూటిని పార్కు చేసింది. అయితే అక్కడి సిబ్బంది అభ్యంతరం తెలపడంతో కొంచెం దూరంలో యూటర్న్ తీసుకుని తిరిగి వచ్చి మళ్లీ టోల్ ప్లాజాకు దగ్గరలో ఎడమవైపు రోడ్డు పక్కన పార్కు చేసింది. అయితే ఈ ప్రదేశం ప్రాణాంతకమని తనకు అప్పటికి తెలియదు. తనకు తెలియకుండానే ప్రహారీగోడ పక్కన స్కూటీని పార్కు చేసింది. ఈ గోడ లోపల నిర్మానుష్యమైన వెయ్యి గజాల ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో చివరి భాగాన వాచ్‌మెన్ రూం ఉంది. ఆ రోజు వాచ్‌మెన్ తొమ్మిది గంటలకే రూంకు తాళం వేసి వెళ్లిపోయాడు. ఆ ఖాళీ స్థలం గుబురైన పొదలు చెట్లతో నిండి నిర్మానుష్యంగా ఉంది. మరోవైపు స్కూటీ పార్కు చేసిన వెనుక భాగం రోడ్డులో అక్కడే విచిత్రంగా తగినంత లోపలికి

దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరం

రాజ్యాన్ని పోలీసు రాజ్యంగా, ఫాసిస్టు రాజ్యంగా మారకుండా, మానవ హక్కుల్ని హరించకుండా చూసుకోవలసిన అవసరం పౌరులందరి మీదా ఉంది. మధ్యయుగాల న్యాయవ్యవస్థలోకి రాజ్యం తిరుగు ప్రయాణం చెందకుండా, కాళ్లు చేతుల్ని కట్టేసి ప్రజల్ని బానిసలుగా మార్చేసే అనాగరిక సమాజంలోకి రాజ్యం మారకుండా చూసుకోవలసిన బాధ్యత సభ్య సమాజానికి ఉంది. ఎన్‌కౌంటర్ స్పెషలిస్టులకు దండలు వేసి, కీర్తి కిరీటాలను అందించే వికృత చేష్టలు భవిష్యత్తులో మరింత ప్రమాదం. ఎన్‌కౌంటర్‌లను జనామోదంగా మార్చేస్తున్న ప్రభుత్వాలు, అలా ప్రజల మెదళ్లని ట్యూన్ చేసే ప్రభుత్వాలు భవిష్యత్తులో మరింత ప్రమాదకరం. మానవ హక్కుల ఉల్లంఘనలో ఇవి మరింత ముందుకు వెళతాయి. నిర్ధాక్షిణ్యంగా ప్రవర్తిస్తాయి. జనామోదాన్ని పొందుతాయి. నేరస్తుడికి శిక్ష ఎలానూ వెయ్యాలి. కానీ, అది నిర్ణయించాల్సింది పోలీసులు కాదు. న్యాయస్థానం. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి. రాజ్యం తన తప్పుల్ని కప్పి పుచ్చుకోవడానికి ఇలా షార్ట్‌కట్ మార్గాలకు స్వస్తిచెప్పాలి. నేరాలు పుట్టుకొస్తున్న సమాజం వైపు ప్రయత్నాలు జరగాలి. మహిళల రక్షణ కోసం జస్టిస్ వర్మ కమిషన్ సిఫారసులను అమలుపరచాలి. మహిళలకు న్యాయం న్యాయస్థానం పరిధిలోనే ప్రజాస్వామ్యబద్ధంగా, అత్యంత వేగంగా అందే విధానం బలపరచాలి. కోర్టుల్లో కూడా అన్ని కేసుల్లోను సరయిన న్యాయం దొరకని కేసులు ఉన్నాయి, అయితే, ఇప్పటికి మరో ఉన్నతమైన మార్గం లేదు. రేపిస్టుల్ని సామూహికంగా చంపెయ్యాలనే పార్లమెంట్ పెద్దలు మహిళా రక్షణకోసం సాటి మహిళలుగా దీర్ఘకాలిక ప్రణాళికల విషయంలో తమ నిబద్ధతను చూపించాలి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు అని వాగ్దానాలు చెయ్యకుండా, కోర్టుల్లో ఖాళీలు ఎమర్జెన్సీగా భావించి యుద్ధ ప్రాతిపదికన భర్తీచేయాలి. మధ్య యుగాల న్యాయానికి తెరపడాలి. ఫైజాన్ ముస్తఫా అన్నట్టు, పోలీసులు జడ్జిల్లాగా, ఎలక్ట్రానిక్ మీడియా కోర్టుల్లాగ వ్యవహరించే విధానం ఆగాలి. నేరాలకు పురికొల్పే సామాజిక పరిస్థితులు మారాలి. ఉద్యమించే యువత కోపంతో కాకుండా, పగతో కాకుండా దీర్ఘకాలిక ప్రణాళికల మీద దృష్టి కేంద్రీకరించాలి.

(రచయిత అధ్యాపకులు) వీ

జరిగి ఉండడంతో భారీ లారీలన్నీ అక్కడే పార్కింగ్ చేస్తారు. లారీలు అక్కడ పార్కింగుకు మరో కారణం రాత్రి పదిగంటలు దాటితే గాని సిటిలోకి ప్రవేశం లేదు. అక్కడ హైవేకు ఇరువైపుల తొండుపల్లి గ్రామం కనుక హోటళ్లు, వైను షాపులు, దుకాణాలు, పాన్ డబ్బాలతో జన సందోహంతో కిటకిట లాడుతుంటుంది. టోల్ ప్లాజా వాహనాల సందడి ఇబ్బడి ముబ్బడిగా ఉంటుంది. ప్రియాంక ఈ లారీల ముందు తన స్కూటీని పార్కింగ్ చేయడం యాధృచ్ఛికం. అప్పుడు సమయం సాయంత్రం ఆరు గంటలు. అక్కడే పార్క్ చేసి ఉన్న లారీ క్యాబిన్‌లో ఉన్న నల్గురి డ్రైవర్, క్లీనర్ల కంట్లో పడింది. ఇది గమనించని ప్రియాంక షేర్డు క్యాబ్‌లో గచ్చిబౌలికి వెళ్లిపోయింది.

రాజేంద్రనగర్‌కు చెందిన శ్రీనివాస్ రెడ్డి లారీలో పనిచేస్తున్న ఆ నల్గురు కర్నాటక నుండి ఇటుక లోడ్‌తో హైదరాబాద్‌కు వస్తూ నవంబర్ 27 తెల్లవారు జాము నుండి అక్కడే పార్క చేసి రోజంతా క్యాబిన్‌లోనే జల్సాలు చేసుకుంటున్నారు. సాయంత్రం మద్యం సేవిస్తూ ఉండగా ప్రియాంక వారికంట్లో పడింది. వీరిలో జొల్లు నవీన్, జొల్లు శివ, చింతకుంట చెన్నకేశవులు నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గడిగండ్ల గ్రామానికి చెందిన బోయకులస్థులు. వీరికి మైనార్టీ కూడ తీరలేదు. నాలుగో వ్యక్తి డ్రైవర్ మహ్మద్ పాషా (26), అదే మండలం జక్లేర్ గ్రామానికి చెందిన దూదేకుల కులస్థుడు. పని ఉన్నపుడు అప్పుడప్పుడు మహమ్మద్ వీరిని కూడా తీసుకెళతాడు. లారీ పని ఉందని ఆరోజు వీరిని మహ్మద్ వెంట తీసుకెళ్లాడు. వీరి కుటుంబాలన్నీ వ్యవసాయ కూలిపని చేసి బ్రతికే వారె.

మద్యం సేవిస్తూ స్కూటీ పార్కు చేస్తుండగా ప్రియాంకను చూసిన ఆ నల్గురికి మతి చెడింది. అమ్మాయి అందంగా ఉంది, అనుభవించాలనే దుర్మార్గపు పురుగు మెదడును తొలిచింది. తిరిగి వచ్చే లోపల పథకం పన్ని స్కూటీ వెనక టైరు గాలి తీసేశారు. అప్పటికప్పుడు పన్నిన పన్నాగమైనా పక్కాగానే ప్రయోగించారు. పది గంటలు దాటాక లారీని సిటీలోకి తీసుకెళ్లాలన్న పనిని పక్కకు పెట్టి ప్రియాంక కోసం ఎదురుచూడడం మొదలు పెట్టారు. అనుకున్నట్లుగానే ప్రియాంక రాత్రి 9:00 గంటలకు తిరిగి స్కూటీ దగ్గరకు వచ్చింది. ఆ నల్గురిలో ఒకడు వచ్చి మేడం మీ స్కూటీ పంక్చర్ అయిందని చెప్తుండగానే డ్రైవర్ లారీని తీసుకువచ్చి దగ్గరగా రోడ్డు మీద ఆపాడు. ఇపుడు నిర్మానుష్య ఖాళీ స్థలం ప్రహరీ గోడకు ఈ లారీకి మధ్యలో ప్రియాంక స్కూటీతో చిక్కుకు పోయింది. డ్రైవర్ మహమ్మద్ పంక్చర్ చేయించుకు రమ్మని శివను పురమాయించి పంపించేశాడు. ప్రియాంక అమాయకంగా నమ్మింది. కనుక ప్లాన్ ఇక్కడి వరకు ఫలించింది. లేకపోతే పంక్చరైన వాహనాన్ని ప్రియాంక స్టార్ట్ చేసి తీసుకుని పోతే అరకిలో మీటరు వరకు సులువుగా ప్రయాణం చేస్తుంది. జనాల్లో కలిసి పోతుంది. ఆ అవకాశం ఇవ్వకుండా స్కూటీని తమ చేతిలోకి తీసుకున్నారు. కొంచెం ముందుకు కదిలి రోడ్డు మీద నిల్చుంటే హైమాస్టు లైటు వెలుతురులో అందరు నన్నే చూస్తారని బిడియపడిన ప్రియాంక కాంపౌండు గోడ దగ్గరే మసక చీకటినే రక్షణగా భావించి అక్కడే నిలబడింది. ఈ లోగ స్కూటీతో తిరిగొచ్చిన శివ పంక్చర్ షాపులు మూసేశారని చెప్పాడు. పథకంలో భాగంగా ఈలోగానే ప్రియాంకను గోడవతలికి ఎత్తిపడేసుంటారని శివ భావించి తిరిగొచ్చాడు.

కాని అప్పుడు అనువైన సమయం దొరక్కపోవడంతో ఈ ముగ్గురూ ఆపని చేయలేదు. స్కూటీ కోసం ఆతురతతో ఎదురుచూస్తున్నపుడు మాటలతో నమ్మించి ప్రియాంకను గోడవతలకి ఎత్తి వేయాలనేది ప్లాన్ కనుక ఏయ్! మేడం కోసం ఈ చిన్న సాయం చేయలేవా? ఎక్కడికైనా, ఎంత దూరమైనా వెళ్లి పంక్చర్ చేయించుకునే తిరిగి రమ్మని మహ్మద్ ఈసారి గట్టిగా గదిమి మళ్లి పంపించాడు. ఈ నక్క జిత్తులను నిజమని నమ్మింది ప్రియాంక. అయినప్పటికి ఆ ప్రాంతం, ఆ లారీలు, ఈ మనుషులు మనసులో ఎక్కడో తెలియని భయం గొల్పింది. అయినా నా స్కూటీ వస్తది ఇంటికి వెళ్లి పోతాననుకుంది. ఆ భయంతోనే చెల్లి భవ్యకు రాత్రి 9:22 గంటలకు ఫోను చేసి అరున్నర నిమిషాలు మాట్లాడింది. నాకు భయమేస్తుందని తెలిపింది, ఏడ్చింది. కాని అక్కడి నుండి లైట్ల వెలుతురు జిగేలులోకి కదిలితే మగమృగాలు నిలువెల్లా చూపులతో దహించి వేస్తారనుకుంది. ఆ విషయం చెల్లికి చెప్పింది. చూస్తే చూడనీ ఏంటంటా! అంది చెల్లెలు. ఇది చిన్నది, దీనికి ఏమి తెలియదని సమాధాన పడింది ప్రియాంక. ప్రియాంక ఈ నిర్ణయం కిరాతకులకు కలిసొచ్చిన రెండవ అంశం. ఫోను సంభాషణ ముగిసిన వెంటనే దుర్మార్గులకు సమయం కలిసొచ్చింది. ఇటువైపు ఎవరూ చూడడం లేదు, ఇక ఆలస్యం చేయకూడదని మహ్మద్ చురుకుగా కదిలి ప్రియాంక ఫోను లాక్కుని రెండు చేతులు బిగ్గరగా పట్టుకోగా, నవీన్ కాళ్లు ఎత్తి పట్టి గోడవతలకు పడేశారు. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు. ఈలోగ స్కూటీ గాలి కొట్టించుకుని శివ చేరుకున్నాడు. సాయం కోసం బిగ్గరగా అరుస్తున్న ప్రియాంక నోట్లో శివ మద్యం బాటిల్ పెట్టి ముక్కు మూశాడు. ఘాటైన మద్యం కడుపులో కెళ్లగానే ప్రియాంక అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. నాలుగు మృగాలు వరుసగా మీదపడి లైంగిక దాడి చేశారు.

ఆ స్థితిలోనే వదిలేసి వెళ్లాల్సింది. కాని రాత్రంతా అనుభవించాలను కున్నారు. తమ వెంట తెచ్చుకున్న రగ్గులో చుట్టేసి లారీ క్యాబిన్‌లో ఎక్కించేసి యూటర్న్ తీసుకుని రాత్రి 10:10 గంటలకు షాద్‌నగర్ వైపు వెళ్లిపోయారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను లారీ క్యాబిన్‌లోనే మళ్లి లైంగిక దాడి చేశారు. జొల్లు శివ, నవీన్ స్కూటీపై అనుసరించి పని అయిపోయాక స్కూటిని వదిలేశారు. ఆమె కళ్లు తెరిచి నోరు విప్పితే గుట్టు రట్టవుతుందని భావించి కాల్చి బూడిద చేసి సాక్ష్యాలు చెరిపేద్దామనుకున్నారు. అందుకు గాను రాత్రి ఒంటిగంటకు బాటిల్‌లో పెట్రోలు కొనుగోలు చేశారు. షాద్‌నగర్ బైపాస్ వద్ద మళ్లీ యూటర్న్ తీసుకుని హైదరాబాద్ వైపు పయనిస్తూ దగ్గరలోని చటాన్‌పల్లి అండర్‌పాస్‌లో ప్రియాంకను నవంబరు 28 తెల్లవారుజామున పెట్రోలు పోసి సజీవ దహనం చేశారు.

నైట్ డ్యూటీలో ఉన్న భవ్య రాత్రి 9:40 గంటలకు అక్కకు ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ రావడంతో కంగారుపడి వెంటనే తన కొలీగ్స్‌ను తీసుకుని జీపులో టోల్‌ప్లాజా చేరుకుంది. అక్కడ ఏమి కనబడకపోవడంతో తల్లిని కూడా తీసుకుని శంషాబాద్ కొత్త పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. మా పరిధిలోకి రాదు కనుక పాత పోలీస్ స్టేషన్‌కు వెళ్లమన్నారు. అక్కడకెళితే మళ్లీ కొత్త పోలీస్ స్టేషన్‌కు వెళ్లమన్నారు. ఈ లోగా నాన్నకు ఫోన్ చేశారు. తను రాత్రి 1:30 గంటలకు చేరుకున్నాడు. చివరికి ఫిర్యాదు తీసుకున్న పోలీసులు టోల్‌ప్లాజాలో సిసి కెమెరాలను పరిశీలించారు. ప్రియాంక

అక్కడికి చేరుకున్న దృష్యాలు రికార్డు అయినాయి కాని తిరిగి వచ్చిన దృష్యాలు రికార్డు కాలేదని తేల్చి మీ అమ్మాయి తిరిగి రాలేదని చెప్పారు. పైగా మీ అమ్మాయి ఎవరితోనో లేచిపోయిందని చెప్పారు. క్లినిక్‌కు వెళ్లిందో లేదో కనుక్కోవాలని ఉచిత సలహా ఇచ్చారు. తన బిడ్డకు ఏదో ప్రాణాపాయం జరిగి ఉంటుందని తల్లి మనసు శంకిస్తుండగా పోలీస్ స్టేషన్‌లో కంటికి పుట్టెడు ఏడ్చింది. దీంతో విసుక్కున్న పోలీసులు బయటకెళ్లి ఏడవమని గదమాయించారు. ఈలోగా చేరుకున్న తండ్రి మీరు నాతో రండి వెతుకుదామని ప్రాధేయపడితే ఇద్దరు కానిస్టేబుల్స్‌ను ఇచ్చి వెతికారు. ఎక్కడా ఏమి కనపడక పోవడంతో వెనుదిరిగారు.

డిసెంబర్ 28 ఉదయం పాల రైతు ద్వారా ప్రియాంక చటాన్‌పల్లి అండర్ పాస్‌లో కాలి పడివున్న విషయం తెలుసుకున్న పోలీసులు తల్లిదండ్రులను పిలిపించి అక్కడే పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత శవాన్ని అప్పగించారు. తల్లిదండ్రులు హైదరాబాద్ పురానాపూల్ స్మశాన వాటికలో అంత్యక్రియలు అదే రోజు నిర్వహించారు. మరోవైపు నిందితులు అదేరోజు వారి వారి ఇళ్లకు చేరుకున్నారు.

డిసెంబర్ 29 తెల్లవారు జాము నుండే నల్గురు నిందితులను వారి వారి ఇళ్ల నుండి అరెస్టు చేసి షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారు. స్టేషన్‌లో విచారిస్తున్న విషయం తెలుసుకున్న ప్రజలు డిశంబర్ 30న నిందితులను మాకు అప్పజెప్పాలని, తగిన శాస్తి చేస్తామని ఆందోళనకు దిగారు. పోలీసులు అతికష్టం మీద నిందితులను చర్లపల్లి జైలుకు తరలించారు.

పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే ప్రియాంక కనీసం ప్రాణాలతోనైనా దొరికేది. ఘటన జరిగిన స్థలం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో హైవే పైన ఉంది. పోలీసుల నిర్లక్ష్యం, అసమర్థత కొట్టొచ్చినట్లు కనబడుతుంది. నిత్యం అన్ని లారీలు అక్కడ పోలీసుల జేబులు నిండకుండా నిలబడతాయా? ప్రియాంక ప్రాణాలు పోవడానికి పరోక్షంగా పోలీసులు కారణం కాదా?

డిసెంబర్ 4న చర్లపల్లి జైలు నుండి నిందితులను తమ కస్టడీలోకి తీసుకుని తమ పద్ధతిలో విచారించారు. నిందితులెవరికి నేర చరిత్ర లేదు. ఆరితేరిన నేరగాళ్లు కాదు. టీనేజీలో ఉన్న యువకులు మద్యం మత్తులో దారుణమైన హత్యాచారానికి ఒడిగట్టారు. అరెస్టు కాగానే చేష్టలుడిగి చప్పబడిపోయారు. పోలీసుల ధాటికి ఒక్క రోజులోనే విషయాన్ని పూసగుచ్చినట్టు కక్కేశారు. నిందితులు వీరేనని పోలీసులకు రూఢీగా నిర్ధారణ అయింది. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కూడా చేసేశారు. ఇక చంపేయాలన్న నిర్ణయానికొచ్చారు. ప్రభుత్వాధినేతల అనుమతి పొందారు. డిసెంబర్ 6 తెల్లవారు జామున ప్రియాంకను దుండగలు ఎక్కడైతే కాల్చి చంపారో అక్కడే తుపాకులతో కాల్చి చంపి ఎన్‌కౌంటర్ అని ప్రకటించారు. ఇక్కడే పోలీసులు నిజాన్ని వెల్లడించరు. చనిపోయిన వారిమీదే కేసులు పెడుతారు.

ఆ నల్గురు ప్రియాంకను చంపి నేరస్థులైనట్లుగానే ఆ నల్గురిని చంపిన పోలీసులు నేరస్థులయ్యారని, వారిని మేం విచారిస్తామని, జాతీయ మానవ హక్కుల కమిషన్ డిసెంబర్ 7న రంగంలోకి దిగింది. మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రిలో ఉంచిన శవాలను పరిశీలించింది. బాధిత కుటుంబాలను కలిసింది. ప్రియాంక దగ్ధమైన స్థలం, ఎన్‌కౌంటర్ ప్రదేశాన్ని చీకటిపడినా టార్చ్ లైట్ల వెలుగులో పరిశీలించింది. ఘటనపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పౌరహక్కుల సంఘం ఎన్‌కౌంటర్‌పై స్వయం ప్రతిపత్తిగల సంస్థచే న్యాయవిచారణ జరిపించాలని మానవ హక్కుల కమిషన్‌కు వినతి పత్రం అందజేసింది.

మరోవైపు ఎన్‌కౌంటర్ జరిగిన రోజు మహిళా సంఘాలు న్యాయవిచారణ జరిపించాలని హైకోర్టును ఆశ్రయించాయి. పౌరహక్కుల సంఘం రీపోస్టుమార్టం చేయించాలని డిసెంబర్ 10న హైకోర్టులో పిటిషన్ వేసింది. శవాలను భద్రపరచాలని ఉత్తర్వులను జారీ చేసింది.

ఇంకోవైపు కొంతమంది లాయర్లు సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. విచారించిన సుప్రీం కోర్టు డిసెంబర్ 12న చైర్మన్‌గా సుప్రీం రిటైర్డు జడ్జి జస్టిస్ విఎస్ సిర్పూర్కర్, బాంబే హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ రేఖ, సిబిఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్‌లను సభ్యులుగా త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసింది. ఆరు నెలల్లోగా రిపోర్టు సమర్పించాలని ఆదేశించింది. దీంతో పోలీసులకు ఉచ్చు బిగుసుకుంది. సకాలంలో స్పందించనపుడు పెల్లుబికిన ప్రజాగ్రహాన్ని నిందితులను ఎన్‌కౌంటర్ చేసి చాకచక్యంగా ప్రజా ఆగ్రహాన్ని హర్షాతిరేకంగా మార్చుకోవడంలో కృతకృత్యులయ్యారు. కాని జాతీయ మానవ హక్కుల కమిషన్, సుప్రీం ఎన్‌క్వైరీ కమిషన్ విసిరిన వలయం నుండి ఎలా తప్పించుకుంటారో వేచి చూడాలి. ఇలాంటి అన్ని ఘటనలలో ఇలాంటి పరిష్కారం చూపుతారా అని బాధిత కుటుంబాలు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రతీకార చర్యలు న్యాయ సహజ స్వభావాన్ని ఛిద్రం చేస్తాయని స్వయానా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి వెల్లడించారు. ఎన్‌కౌంటర్ అంటేనే బూటకమని పౌరహక్కుల సంఘం గత 45 సంవత్సరాలుగా ఘోషిస్తున్నది. ఇప్పుడు ప్రజలంతా ఒప్పుకున్నారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని టేకు లక్ష్మి హత్యాచారం, మానస హత్యాచారం, హాజీపూర్ వరుస హత్యాచారాలు, ఇంకా అనేక చోట్ల జరుగుతున్న హత్యాచారాల్లో ఇదే ప్రతీకార న్యాయం చెప్పగలరా అని ప్రశ్నిస్తున్నారు. న్యాయ ప్రక్రియను అపహాస్యం చేస్తూ పోలీసులు శిక్షలు అమలు పరిస్తే దేశంలో అరాచకం నెలకొంటుంది.

విచారణ కమిషన్ పోలీసులను సమగ్రంగా విచారిస్తుందా? వారిని నింధితులుగా భావిస్తుందా? వారి సస్పెన్షన్‌కు ముందు ఆదేశాలిస్తుందా? సెల్ ఫోన్లు జప్తు చేసుకుని కాల్ డేటా బయటికి తీసి ఎవరు ఆదేశాలిచ్చారో బయట పెట్టగలరా? సజ్జనార్‌ను హీరో అని ప్రజలు పైకెత్తుకుని ఊరేగిస్తుంటె నేను నిజంగా వారిని కావాలని ఉద్దేశపూర్వకంగా కాల్చలేదు, ఆత్మ రక్షణలో భాగంగా కాల్చానని వారికి ఎందుకు చెప్పలేదని నిలదీస్తారా? నింధితులు, కర్రలు, రాళ్లతో దాడి చేశారంటే అలాంటి వరి పొలాల్లో ఉండవు కదా అని ప్రశ్నిస్తారా? నిందితులకు బేడీలు ఎందుకు వేయలేదు. తూటాలు తగిలినా తుపాకి చేతిలోనే ఉంటుందా? థర్డ్ డిగ్రీ టార్చర్‌లో జీవచ్ఛవాలైన నిందితులు పోలీసులపై ఎదురు తిరగ్గలరా? అర్థరాత్రి నేర ప్రాంతాన్ని పరిశీలించొచ్చా? అయితే వీడియో తీయాలి కదా? తుపాకులు లాక్కున్నవారికి వాటిని పేల్చడం వచ్చా? తుపాకులు లాక్కుని మొదట ఎక్కు పెట్టిన వాళ్లు కాల్చకుండా ఎలా ఉంటారు? దానికి స్పందనగా తుపాకులెతితన పోలీసులు మాత్రమే ఎలా కాల్చగలిగారు. తూటాలు శరీరాలలోకి దూసుకు పోవాలంటే ఎంత దూరం నుంచి కాల్చాలి? ఇలాంటి ఎన్నో ప్రశ్నల సమాధానం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

(రచయిత అధ్యక్షులు, పౌరహక్కుల సంఘం) వీ

తెలంగాణ ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు జేజేలు!

తెలంగాణ ఆర్‌టిసి కార్మికుల 55 రోజుల సుదీర్ఘ సమ్మె పోరాట ఫలితమే కార్మికుల డిమాండ్లను నెరవేర్చడానికి ప్రభుత్వం ఒప్పుకుందని, ఈ ఉద్యమ విజయంలో పాల్గొన్న కార్మికులకు జేజేలు పలుకుతున్నారు **ఎన్.వి. నరసింహారావు**

తెలంగాణ ఆర్‌టిసి కార్మికులు 55 రోజులు (2019 సెప్టెంబర్ 5 నుండి 2019 అక్టోబర్ 28 వరకు) చారిత్రాత్మక సమ్మెను నిర్వహించారు. ఈ సమ్మె ప్రధానంగా ఆర్‌టిసి కార్మికులు తమ ప్రయోజనాలకన్నా ప్రజా రవాణా వ్యవస్థ, ప్రైవేట్ కబంధ హస్తాల్లోకి జారిపోకుండా, తమ తమ ఉద్యోగాలను కూడా ఫణంగా పెట్టి పోరాడారు. సమ్మె సందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్ విలీనం లేదు కదా, ఆర్‌టిసి ప్రైవేట్ పరం చేస్తానంటూ, కార్మికులను విధులలో చేరాలంటూ మూడు రోజులు డెడ్‌లైన్ ప్రకటించి, ఆ తర్వాత వస్తే విధులలో చేర్చుకునేది లేదని బెదిరించాడు. అయినా ఆర్‌టిసి కార్మికులు బెదిరిపోకుండా జెఎసి నిర్ణయం మేరకు మొక్కవోని ధైర్యంతో 55 రోజులు సమ్మె కొనసాగించి, కార్మిక ఉద్యమాల చరిత్రలో మరొక చార్మిత్రాత్మకమైన పాత్రను నిర్వహించారు.

ముఖ్యంమత్రి కెసిఆర్ ఈ సందర్భంగా హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కార్మికులను చర్చలకు పలిచేది లేదని చెప్పాడు. తద్వారా తన మూర్ఖత్వాన్ని ఆయన ప్రదర్శించుకున్నారు. సమ్మెను 55 రోజుల పాటు వీరోచితంగా నిర్వహించిన పిదప సమ్మె పరిణామాలను జెఎసి కూలంకశంగా చర్చించి, సమ్మెను 2019 అక్టోబర్ 28న విరమించుకొని విధులలో చేరాలని నిర్ణయించి, ఆ మేరకు కార్మికులకు ఆదేశం ఇచ్చింది. జెఎసి ఇచ్చిన ఆదేశాలను సమ్మె కాలంలో తుచ తప్పకుండా పాటించిన కార్మికులు అదే విధంగా సమ్మె విరమణ నిర్ణయాన్ని అంగీకరించి, విధులలో చేరడానికి సిద్ధపడిన సమయంలో రెండు రోజులు (2019 అక్టోబర్ 28, 29) వారిని విధులలో చేర్చుకోవడానికి ఇబ్బంది పెట్టిన యాజమాన్యం 2019 అక్టోబర్ 30న వారంతట వారే కార్మికులను విధులలో చేరాలంటూ ఆహ్వానించారు. సమ్మె కాలంలో 'జర్మనీ నియంత హిట్లర్' నియంతృత్వాన్ని మరిపించే నియంతలాగా వ్యవహరించిన కెసిఆర్‌కు అకస్మాత్తుగా ఇంతటి జ్ఞానోదయం ఎలా కలిగింది? ఈ జ్ఞానోదయం అంతటితో ఆగకుండా సమ్మె సందర్భంలో ప్రతిపాదించిన డిమాండ్ల పరిధిని దాటి, ఈ కింద పేర్కొన్న తక్షణ ప్రయోజనాలను కార్మికులకు కలిగించేవరకు వెళ్లింది. (1) ఏ పరిస్థితుల్లోనూ నష్టాల్లో ఉన్న ఆర్‌టిసి నడపలేం, ఆర్‌టిసికి సంబంధించిన 5100 కోట్లను ....ప్రైవేట్ పరం చేసితీరుతాం అన్న కెసిఆర్ ఇప్పుడు ఒక్క రూటు కూడా ప్రైవేట్ పరం చేసేది లేదని అన్నాడు. (2) పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వరకు పెంచాడు. (3) సెప్టెంబర్ నెల జీతం డిసెంబర్ 2నే చెల్లిస్తామని చెప్పాడు. (4) ఆర్‌టిసి ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పాడు. (5) 55 రోజుల సమ్మె కాలపు జీతాన్ని పూర్తిగా చెల్లిస్తామని చెప్పాడు. (6) తాత్కాలిక ఉద్యోగుల సర్వీసును క్రమబద్దీకరిస్తామని పేర్కొన్నాడు. (7) ఆర్‌టిసి ఉద్యోగులకు గృహ వసతి కల్పించే పథకం. (8) సమ్మె కాలంలో చనిపోయిన ఉద్యోగి కుటుంబంలో ఒకరికి 8 రోజుల లోపు ఉద్యోగం కల్పిస్తామని దానితో పాటు రు. రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామన్నారు.

వచ్చిన ఈ తక్షణ ప్రయోజనాలు కెసిఆర్ దయా దాక్షిణ్యాల వల్ల వచ్చినవి కావు. కెసిఆర్‌కు వచ్చిన ఈ జ్ఞానోదయం ఆర్‌టిసి కార్మికుల వీరోచిత సమ్మె ఫలితమే తప్ప వేరు కాదు.

సమ్మె కాలంలో గాని, సమ్మె విరమణ తర్వాత గానీ, కెసిఆర్ సమ్మె పట్ల వ్యవహరించిన తీరు అప్రజాస్వామికం! రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (సి) ప్రకారం సంఘాలను పెట్టుకునే సంస్థలను స్థాపించుటకు హక్కు కల్పించబడింది. దీనికి భిన్నంగా కెసిఆర్ 'ఆర్‌టిసిలో సంఘాలకు ఎన్నికలను రెండు సంవత్సరాల వరకు రద్దు చేస్తాను' అని బెదిరించాడు. ఇది రాజ్యాంగ వ్యతిరేకం.

'సంఘ నిర్మాణం రాజ్యాంగంపు హక్కు – సమ్మె కార్మికుల హక్కు'.

1983లో ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రిగా ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాల నుండి 55 సంవత్సరాలకు తగ్గించిన సందర్భంలో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పడిన జెఎసి నిర్వహించిన సమ్మెను బలపరుస్తూ,

"సమ్మె నీ జన్మ హక్కు రన్నా
దాన్ని ఆపే మొనగాడెవ్వరన్నా
సమ్మె సుత్తితోటి
వాడి దిమ్మెదల గొట్టాలి రన్నా"

అని గద్దర్ రాష్ట్రమంతా పర్యటించి నినదించాడు.

తెలంగాణ ఆర్‌టిసి కార్మికుల సమ్మె కెసిఆర్ దిమ్మెదలగొట్టింది. సమ్మె సందర్భంగా కెసిఆర్ వ్యవహరించిన నియంతృత్వ ప్రజా వ్యతిరేక ధోరణి ఉద్యోగులలో, కార్మికులలో, ప్రజలలో కెసిఆర్ పట్ల తీవ్ర వ్యతిరేకతను పెంచింది. ఈ వ్యతిరేకత రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన పునాదులు కదిలిపోతాయనే భయం, అయనకు పైన పేర్కొన్న జ్ఞానోదయాన్ని కలిగించింది. కార్మికవర్గం తన హక్కుల సాధనలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ, అంతిమంగా విజయం సాధిస్తుందనేది చరిత్ర చాటి చెప్పిన సత్యం! ఈనాడు ఉద్యోగులు, కార్మికులు అనుభవిస్తున్న 8 గంటల పనిదినం, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న హక్కే!

1971లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకత్వాన జెఎసి ఆఫ్ వంటీ?? ఇటుగా ఏర్పడి దాని ఆధ్వర్యాన 56 రోజుల సుదీర్ఘ సమ్మె నిర్వహించడం జరిగింది. ఆ సమ్మెలో కా. కుటుంబరావు (ఎన్‌ఇసి), కాం. బదరీనారాయణ (టిటిడి. టిపి) గార్లు పోలీస్ కాల్పుల్లో అమరులైనారు. అంతటి త్యాగాలతో నిర్వహించిన సమ్మె చివరకు ఏ డిమాండు సాధించలేక బేషరతుగా విరమించుకోవలసి వచ్చింది.

1974లో రైల్వే కార్మికుల సమ్మె కార్మిక సమాఖ్య అధ్యక్షుడు జార్జి ఫెర్నాండెజ్ నాయత్వాన దేశ వ్యాప్తంగా నిర్వహించబడింది. అయినా ఆనాటి దేశ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ నియంతృత్వ, అప్రజాస్వామిక విధానం వల్ల సమ్మెను బేషరతుగా విరమించుకోవడం జరిగింది. అయితే

బంగారు తెలంగాణ - బస్సు కార్మికుల సమ్మె

***కోరుకున్న తెలంగాణకు, నడుస్తున్న తెలంగాణకు మధ్య అగాధాన్ని ప్రజలకు గుర్తు చేయడమే ఆర్‌టిసి సమ్మె విజయమని అంటున్నారు* బి.ఎస్.రాజు**

2014లో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం, దేశంలో ఏ ఇతర రాష్ట్రాల కన్నా భిన్నమైనది. అది, యావత్ తెలంగాణ సమాజపు సుధీర్ఘ పోరాటాల నుండి, త్యాగాలనుండి, బలిదానాల నుండి, ఆకాంక్షల నుండి ఉదయించిన నూతన రాష్ట్రం. తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రతి బిడ్డ మనసారా కోరుకున్న, పోరాడి సాధించుకున్న రాష్ట్రం. సకల జనుల సమ్మెకు, సకల జనుల ఉద్యమ భాగస్వామ్యానికి ఓ మచ్చు తునక, ఓ ఆదర్శనీయ ప్రజా ఉద్యమరూపం. అప్పటి ఆంధ్రా పాలకులను, కేంద్ర ప్రభుత్వాన్ని ఎదిరించి, వంచి, దించి మొనగానిగా మొగ్గ తొడిగిన రాష్ట్రం. ఈ రాష్ట్రం ఎన్నో ఆశలను, ప్రజాస్వామ్య ఆశయాలను కలలుగని, వాటిని పొదుముకుని ఏర్పడ్డది.

ఉద్యమ ఫలంగా ఏర్పడ్డ తెలంగాణలో అధికారం చేజిక్కించుకున్న టిఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు ఊహల బంగారు తెలంగాణను వజ్రాల పళ్లెంలో ప్రదర్శనకు పెట్టింది. బంగారు తెలంగాణ మాటెట్లున్నా భౌగోళిక తెలంగాణ ఏర్పడి ఆంధ్ర పాలకుల చక్రబంధం నుండి, సాంస్కృతిక అణచివేత నుండి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించింది. ఎంతో మేలు జరిగింది. సంబురాలను తెచ్చింది. ఇంతవరకు బాగానే ఉంది. అయితే విషాదమేమంటే ప్రజాస్వామిక ఆకాంక్షల ప్రజా ఉద్యమం, భూస్వామ్య అహంకారపూరిత ఏలిక పాలనలో మునిగిపోయింది. తెలంగాణ సామాన్య జనజీవన స్రవంతిలో అంతర్భాగమైన ప్రజా రవాణా వ్యవస్థలో పనిచేసే యావత్ కార్మికులు ఐక్యమై సమ్మెకు దిగినప్పుడు ఏలిక వారితో ప్రవర్తించిన తీరు, సమ్మె అణచివేతకు, సంస్థ రద్దుకు ప్రకటించిన విధానాలు, ధిక్కార ధోరణి నగ్నంగా బయటపడి తెలంగాణ సమాజాన్ని, తోటి తెలుగు సమాజాన్ని, దేశ ప్రజలను, కార్మిక శ్రేణులను, న్యాయ వ్యవస్థను అత్యంత దిగ్భ్రాంతికి గురిచేసింది. మనం నివసించేది ఓ ప్రజాస్వామిక వ్యవస్థా? లేక కరుడుగట్టిన రాచరికపు వ్యవస్థా? తెలంగాణ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని తృణీకరిస్తోందా? అనే సందేహం తెలంగాణ సమాజాన్నేకాక, దేశంలోని ఇతర ఆలోచనాపరులను, కార్మిక సంఘాల నాయకత్వాన్ని కలవరపెట్టింది. బంగారు తెలంగాణ, ప్రజాస్వామిక తెలంగాణ ఊహలపల్లికి నుండి తుళ్లిపడి తిరిగి తనని తాను ప్రశ్నించుకునే, తను ఎక్కడుందో, ఏ భ్రమల్లో చిక్కుకుని విహరిస్తున్నదో తెలుసుకునే స్థితికి తెలంగాణ సమాజం ఇపుడు చేరుకుంది. తొలి విడతగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలు, కల్పించిన ఆశలు చాల మట్టుకు భ్రమలుగానే మిగిలినా, మలి విడత కూడా ప్రజలు అదే ప్రభుత్వానికి, నిజం చెప్పాలంటే అదే ఏలికకు పట్టంగట్టారు. అయితే మలివిడత ఏలిక నడతలో కన్పించిన మార్పు, పాలనలో నిరంకుశ ధోరణి, ప్రజల హక్కులపట్ల, రాజ్యాంగ విధి విధానాలపట్ల ధిక్కార ధోరణి; ఆర్‌టిసి కార్మికులపట్ల, మరీ ముఖ్యంగా మహిళా కార్మికుల పట్ల ఏలిక ప్రదర్శించిన కర్కశ దమనకాండ, అధికార దుర్వినియోగం, తాము కోరుకున్న తెలంగాణకు, నడుస్తున్న తెలంగాణకు మధ్య ఏర్పడ్డ అగాధపు లోతు చాలాపెద్దదే అనే స్పృహ తెలంగాణ సమాజానికి కలిగించిందని చెప్పాలి.

ఈ దేశంలో, ఏదైనా ఓ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రిని పాలకుడనో, ఏలికనో పిలవడం సబబేనా? ఎవరైనా అలా పిలుస్తున్నారంటే లేక అలా రాస్తున్నారంటే ఆ పిలుపుల, రాతల వెనుక ఏదైనా సారముందా? లేక కేవలం ఓ వ్యతిరేక ప్రచారమేనా? అనే ప్రశ్నలు కూడా ఉంటాయి. ఆ ప్రశ్నలకు జవాబులు చెప్పాల్సి ఉంటుంది. సౌదీ అరేబియా, దుబాయ్, అబుదాబీ వగైరా గల్ఫ్ దేశాల్లో, లేదా ఎమిరేట్స్‌లో ఉన్న రాచరిక వ్యవస్థల ప్రభుత్వాధీశులను ఆంగ్లంలో పిలిచేటప్పుడు లేక రాసేటప్పుడు 'ద రూలర్ ఆఫ్ సౌదీ అరేబియా, 'ద రూలర్ ఆఫ్ దుబాయ్', 'ద రూలర్ ఆఫ్ అబుదాబీ' అని సంభోదిస్తారు, అలా సంభోదించాలి కూడా! మరి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమని పిలువబడే భారతదేశంలో అంతర్భాగమైన రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఏలికలని, పాలకులని రాచరికపు భాషలో సంభోదించాల్సి వస్తోందంటే ఆలా సంభోదించేవారి తప్పు ఎంతమాత్రమూ కాదు. ఆయా, ముఖ్యమంత్రుల రాచరిక విధానాలు, ప్రవర్తన, ప్రజలపట్ల వారు ప్రదర్శించే తృణీకార భావము, వీటివలనే సమ్మె ఫలితంగా ఉద్యోగులు, కార్మికులు ఎన్నో దీర్ఘకాలికపు ప్రయోజనాలను పొందారు. అయితే ఈ ఫలితాల నేపథ్యంలో ఆర్‌టిసి కార్మికుల సమ్మెను పరిశీలించినట్లయితే, సమ్మెను బేషరతుగా విరమించినప్పటికీ, సమ్మె ఫలితంగా ఆర్‌టిసి కార్మికులు తక్షణ ప్రయోజనాలుగా పైన పేర్కొన్న ప్రయోజనాలను పొందారు. అందుకు ఆర్‌టిసి కార్మికులు, వారి జెఎసి నాయకులు అభినందనీయులు.

ఈ సందర్భంగా మనం సంఘాలను, సంఘాల నాయకత్వాలను బలహీనపరిచి, తన దయా దాక్షిణ్యాల వల్లనే ప్రయోజనాలు కలుగుతాయనే భ్రమలు మనలో కలగజేయడానికి ప్రయత్నిస్తున్న కెసిఆర్ లాంటి వారి దుర్మార్గపూరితమైన ఆలోచనను గ్రహించి, కార్మికుల ప్రయోజనాలు, పటిష్టమైన సంఘాల నిర్మాణం, ఐక్య పోరాటాలు, సంఘటిత స్వార్థం లేని బలమైన నాయకత్వాల వల్ల మాత్రమే కాపాడ బడతాయనే నమ్మకం ఈ సమ్మె ద్వారా మనం గ్రహించవలసిన ఆవశ్యకతతో ముందుకు పోవలసి ఉంది.

ఈ అనుభవాల నేపథ్యంలో తెలంగాణ ఆర్‌టిసి కార్మికులు చారిత్రక సమ్మె, కార్మికవర్గ శక్తిని, వారి నాయకత్వ పటుత్వాన్ని మరోమారు నిరూపించింది. అందుకు వారికి మరోమారు జేజేలే!

(రచయిత చైర్మన్, ఎంప్లాయిస్ కో-ఆర్డినేషన్ కమిటీ)

వీ

మూడు రాజధానుల ఆంధ్రప్రదేశ్

రాష్ట్ర రాజధాని సమస్యను సామరస్యంగా, ప్రజల మధ్య చర్చతో పరిష్కరించాలని సూచిస్తున్నారు **చిమ్మె జాన్ బర్నబాస్**

2019 డిసెంబర్ 17న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి శాసన సభ – శీతాకాల సమావేశాల ముగింపు సందర్భంగా ఒక సంచలన ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని 'అమరావతి' ఉంటుందా, ఉండదా అనే విషయమై స్పష్టతనిస్తూ ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మూడు రాజధానులు అవసరమయ్యే పరిస్థితి ఉందని స్పష్టపరిచారు. అయినప్పటికీ 'నిపుణుల కమిటీ' నివేదిక వచ్చాకే దానిని సంపూర్ణమైన విధానంగా ప్రకటిస్తామని చెపుతూ, 1) అమరావతి శాసన సభా వ్యవహారాల కోసం 'లెజిస్లేటివ్' రాజధానిగా ఉంటుందనీ, 2) విశాఖ పట్టణం 'ఎగ్జిక్యూటివ్' రాజధానిగా సెక్రెటేరియట్ (సచివాలయం' ఉంటుందనీ, 3) కర్నూలులో జ్యుడిషియల్ క్యాపిటల్‌గా హైకోర్టు రావచ్చునేమో నంటూ ప్రకటించారు. దీనిపై నిపుణుల కమిటీ నివేదిక రాకముందే ప్రకటించడం చూస్తే, నిపుణుల కమిటీ కూడా కొంచెం అటూ ఇటూ మార్పులతో ఇదే విధంగా ఉండొచ్చన్న వాదన వినిపిస్తున్నది.

ఇది రాష్ట్ర ప్రజలలో గందరగోళం సృష్టించడానికి ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేశారా? లేదా ప్రతిపక్ష నాయకుడు, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు నిర్మించ తలపెట్టిన 'అమరావతి'ని నిర్మించకూడదనీ, దానిని కొనసాగించడం ఇష్టంలేక ఈ ప్రకటన చేశారో అర్థంకావడం లేదు. అయితే అధికారంలో ఉన్న వైఎస్‌ఆర్‌సిపికి మాత్రం స్పష్టమైన వైఖరి ఉన్నట్లు కనబడుతున్నది. ఎందుకనగా పార్టీ అధినాయకత్వంతో చర్చించకుండానే ఇలాంటి ప్రకటన చేసుంటారనేది ఊహించలేం. విధాన ప్రకటన కాబట్టి దాని లోతుపాతులు చర్చించే ఉంటారు.

వారిని సమాజం సహజంగా ఆలా పేరుపెట్టి పిలవాల్సి వస్తుంది. ఆలా పిలవడం తప్పుకాదు. అలా పిలవకపోవడమే తప్పవుతుంది.

తెలంగాణ ఆర్టీసీ కార్మికులు గౌరవ ప్రధమైన పౌరులా, కాదా? వారు అత్యంత బాధ్యతాయుత సామాజిక కార్యక్రమాలు, విధులు, పనులు నిర్వహిస్తున్నారా లేదా? బస్ డ్రైవర్లు, కండక్టర్లు బస్సుల్లో ప్రయాణించే ప్రజలను సురక్షితంగా ఒకచోటునుండి మరోచోటుకు చేరవేయడంలో ఎంత బాధ్యత వహిస్తున్నారు? ఎంత శ్రమపడుతున్నారు? ఎంత మానవీయంగా ఉంటున్నారు? సమాజానికి వారు అందించే సేవలకు విలువేలేదా? హైదరాబాద్ వంటి నగరాల్లో అసలు బస్సు నడపడమన్నా, ఎక్కుతూ దిగుతూ ఉండే ప్రయాణీకుల నుండి విధిగా టికెట్ కొట్టి, సొమ్ము వసూలు చేసి, డిపోకు జమకట్టాలన్న ఎంతటి ప్రయాస ఉంటుంది? వీరికి సమ్మె చేసే హక్కే లేదా? వీరికి భారత రాజ్యాంగం సమ్మెచేసే హక్కు కల్పించ లేదా? వారు డిమాండ్లు పెడితే అసలు పిలిచి మాట్లాడడానికే ససేమిరా అని, సెల్ఫ్ డిస్మిస్ అనే అధికారం ఓ రాష్ట్ర ముఖ్యమంత్రికి ఉందా? ఉందనుకుంటే అటువంటి అధికారం ఎక్కడనుండి ఊడిపడింది? ఇదేమి ప్రజాస్వామ్యం? ఇదేమి సంక్షేమ రాజ్యం? ఇదేమి బంగారు తెలంగాణ? బంగారు తెలంగాణ అంటే పాలకులకు, ఏలికలకు ధనరాశులు, కార్మికులకు, మహిళలకు పిడిగుద్దులు, నడివీధిలో ఈడ్చి ఈడ్చి తన్నులా? లాఠీ దెబ్బలు, తలలు పగుల గొట్టడాలా? కార్మికుల ఆత్మగౌరవాన్ని ఖూనీచేసి, వారిని హీనపరిచి, పైశాచిక ఆనందం పొంది, కాళ్లబేరానికి దిగజార్చి, ఆఖరిలో బువ్వపెడతాను రమ్మని, జబ్బలు చరుచుకోవడం ఘనకార్యమా? గౌరవనీయమా? ఇదేనా బంగారు తెలంగాణ నీతి? ఇదేనా సర్వేజనా సుఖినోభవంతు సుదర్శనయాగాల తాత్వికత?

కార్మికులకు యూనియన్లు ఎవరి దయాదాక్షిణ్యామో కాదుకదా! కార్మికోద్యమాల త్యాగ ఫలమే కదా! యూనియన్లను లేకుండా చేసి, కార్మిక సంక్షేమ భజన ముఠాలను ఏర్పాటు చేసినంత మాత్రాన కార్మికోద్ధరణ జరిగిపోతుందా? ఏలిక కార్మికోద్ధారకుడైపోవునా? పెట్టుబడిదారీ వ్యవస్థల్లో కూడా కార్మికులతో సంప్రదింపులు, బేరసారాలు, రాజీలు ఉంటాయి. వాటికో పద్ధతి ఉంటుంది. బూర్జువా ఉదారవాద ప్రజాస్వామ్యం సమస్యల పరిష్కారానికి రాచరికపు పనిముట్లను తెలివిగా, తనకనుగుణంగా మల్చుకుంటుంది గాని, బండ పద్ధతులు అవలంభించదు. ఆకాశ హర్మ్యాల నవతెలంగాణ, బంగారు తెలంగాణ నిర్మించాలనుకునేవారు అవలంభించాల్సిన ఈ కనీస సూత్రం మర్చిపోతే ఎలా?

ఇక తెలంగాణ బస్సు కార్మికులైనా, ఏ ఇతర కార్మికులైనా; సంఘటిత, అసంఘటిత రంగాల ఉద్యోగులైనా, రంగనాయకమ్మ గారు ఈ సమ్మె సందర్భంగా ఆంధ్రజ్యోతి దిన పత్రికలో రాసినట్లు తమ శ్రమదోపిడీతోనే యాజమాన్యాలు, పాలకులు బ్రతుకుతున్నారని, తమపైనే పెత్తనం, అధికారం చలాయిస్తున్నారని ఖచ్చితంగా గుర్తించాల్సింది. అంతేగాని పాలకులు పోజులుకొడుతూ చెబుతున్నట్టు వారి దయాదాక్షిణ్యాలపై కార్మికులు ఆధారపడిలేరు.. కార్మికులు దయగలవారు, వ్యవస్థను పూర్తిగా పట్టించుకోని సాచివేత ధోరణి గలవారు కాబట్టి రాజ్యం అధికారం శ్రామికులది కాకుండా పోయి, యజమానులది, వారి ప్రభుత్వాలది ఐవుంది. ఇది ఉల్టా పల్టా కానంత వరకు కార్మికులకు మోసాలు, కష్టాలు, కన్నీళ్లు తప్పవు; బ్రతికి పనిచేయడానికి ఏదో తాత్కాలిక ఉపశమనాలు తప్ప.

(రచయిత శ్రామికనేస్తం సంపాదకులు) వీ

అయితే గత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'అమరావతి' నిర్మాణం కోసం అక్కడి 29 గ్రామాల రైతాంగంతో మాట్లాడి, ఒప్పించి 38 వేల ఎకరాలను 'భూ సమీకరణ' పేరుమీద తీసుకొని అందులో రైతులందరికీ భాగస్వామ్యం ఉంటుందనీ, కొంత పాట్ల రూపంలోనూ, ప్రతినెలా కొంత మొత్తం అందుతుందనే ఆశ చూపెట్టి వారి నుంచి విలువైన, సారవంతమైన, మూడు కార్ల పంటపండే భూములను తీసుకున్నారు. ఆ భూ పరిధినంతటినీ 'సిఆర్‌డిఏ' (క్యాపిటల్ రెజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పేరుమీద రిజిస్ట్రేషన్ చేసుకొని ఒక చట్టాన్ని రూపకల్పన చేసి, సింగపూర్, మలేసియా, లండన్, జపాన్ లాంటి నిర్మాణాలు ఇక్కడ వస్తాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానీకానికి 'పెద్ద ప్రకటన' చేసి ప్రజలను ఆకాశానికి ఎత్తి, ఆ పేరుమీద మళ్లీ 'రాజకీయాధికారం' సంపాదించుకోవచ్చని భావించారు. కానీ మళ్లీ అధికారంలోకి రాలేరు కాబట్టి ప్రస్తుత ముఖ్యమంత్రి తన పద్ధతిలో తాను రాష్ట్ర రాజధానిని నిర్మిస్తానని ఒకేసారి 'మూడు' రాజధానులంటూ అసలు తన మనస్సులో మాటను బయటపెట్టాడు. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం 2013 ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిని సంపూర్ణంగా కేంద్ర ప్రభుత్వమే తన నిధులతో నిర్మించాలి. ఇప్పటికే అమరావతి నిర్మాణానికి 6 వేల కోట్లు ఖర్చు పెట్టినట్లు, ఇంకా ఇవ్వనున్నట్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నాయకత్వం చెబుతున్నప్పటికీ, ఇప్పటికి ఖర్చుపెట్టిన వాటికి 'జమా – బందీ' చూపనందున రావాల్సిన నిధులను ఆపేసినట్లు బిజెపి నాయకత్వం చెబుతున్నది. ఈ కారణం చేతనే 2019 ఎన్నికలలో టిడిపి – బిజెపి కలిసి పోటీ చేయలేదు. అప్పటికి ఒక సంవత్సరం నుంచీ రెండు పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు.

నిజంగా 2014 –19 మధ్య చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నిధులను దుర్వినియోగ పరిచినా, లేదా అమరావతి పేరుమీద అక్రమంగా భూములు కొన్నా, అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకున్నా, 2019 జూన్ నుంచీ అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు 'విచారణ' జరుపలేదు? కేసులెందుకు నమోదు చేయలేదు? లేదా కనీసం ఒక హైకోర్టు జడ్జి చేత విచారణకు ఆదేశించలేదు? వారి దగ్గర ఆధారాలుంటే వాటిపై ఏ విధమైన చర్యలు తీసుకున్నారో కనీసం ప్రకటన కూడా చేయలేదు. అనగా వారికి ఒక స్పష్టత లేకుండా ఉండాలి. లేదా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చట్టబద్ధంగా అన్నీ చేసి ఉండాలి. ఈ రెండింటిలో ఏదో ఒక్కటే వాస్తవమై ఉంటుంది. 'ఎన్‌ఫైడ్ ట్రేడింగ్' అంటూ అమరావతిలో రైతుల దగ్గర తీసుకున్న భూములతో వ్యాపారం చేశారని చెబుతున్న వైకాపా నాయకులు రాజధాని ప్రకటన వెలువడిన తర్వాత తాము తమ దగ్గరున్న డబ్బుతో పొలాలను కొనుగోలు చేశామని చెబుతున్న టిడిపి నాయకుల మాటలకు వివరణ ఇవ్వలేకపోతున్నారు.

వాస్తవానికి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మూడు రాజధానుల ప్రకటన రాష్ట్ర ప్రజానీకాన్నీ ఒక గందరగోళానికి నెట్టింది. అంతేకాకుండా మూడు ప్రాంతాల వారిని ఏదో ఒక విధంగా సంతృప్తి పరిచాననే ముఖ్యమంత్రి భావనలకు విరుద్ధంగా ప్రజాభిప్రాయం నెలకొనింది. ఎందుకనగా ఇప్పటికే కొద్దో గొప్పో నిర్మితమై ఉన్న 'అమరావతి' రాజధానిలో రాష్ట్ర సచివాలయ, అసెంబ్లీ, హైకోర్టు పనిచేస్తున్నాయి. ప్రజలు కూడా ఈ 4 సంవత్సరాలు ఎన్ని సమస్యలున్నప్పటికీ అలవాటుపడుతున్నారు. ఇలాంటి సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటన మూడు ప్రాంతాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం 3 ప్రాంతాలు తిరగరావాల్సి వస్తుందనే భయం నెలకొన్నది. అంతేకాకుండా ఒకవేళ కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తే ఏదైనా పిటిషన్‌కు జవాబు చెప్పడానికి అధికారులు విశాఖపట్టణం నుండి (రోడ్డుపై 18 గంటల సమయం) రావలసి ఉంటుంది. ఆ పేరుమీద వారు తమ విధులను నిర్వహించకుండా ఎగ్గొట్టే అవకాశాలు ఎక్కువ. ప్రజలు కూడా కర్నూలుకు రావడానికి, విశాఖపట్టణం పోవడానికి కూడా దూర భారం అవుతుంది. పెద్ద ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఆర్థిక భారం తలకు మించిన దవుతుంది. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుప్పకూలి అప్పులపాలైంది.

స్వయానా భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ శంకుస్థాపన చేసిన 'అమరావతి' నిర్మాణం – రాష్ట్ర రాజధాని, ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మించి ఇస్తామని నాడు సభలో అమరావతి శంకుస్థాపన సందర్భంగా ప్రధానమంత్రి పలికిన మాటలు ప్రజల మెదళ్లలో ఇంకా కదలాడుతూనే ఉన్నాయి. దీనికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం బాధ్యత వహించాలి. ఎందుకనగా దాదాపు 4 సంవత్సరాలు (2014–18) వరకూ అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ కలిసే ప్రభుత్వంలో పాలుపంచుకున్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల విషయంలో కూడా భారత ప్రధానమంత్రి స్పష్టమైన వైఖరి ప్రకటించవలసి ఉంది. ఎందుకనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం 2013 ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర రాజధానిని నిర్మించడానికి సంపూర్ణంగా నిధులు ఇవ్వవలసి ఉంటుంది. మరి 3 రాజధానులన్నప్పుడు అన్నీ కేంద్ర ప్రభుత్వం 'అనుమతి'తోనే నిర్మిస్తారా? లేదా? ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు ప్రధానమంత్రి కార్యాలయం కూడా వివరణ ఇవ్వవలసి ఉంటుంది. ఎందుకనగా భారతదేశ ఆర్థిక వ్యవస్థను కూడా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ప్రజల మధ్య ఇంత గందరగోళ పరిస్థితి తీసుకొని రావలసిన అవసరం ఈ ముఖ్యమంత్రికి ఏమొచ్చింది? 'అమరావతి' నగరాన్ని నిర్మిస్తూనే ఉత్తరాంధ్రను, రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయవచ్చు. అసలు ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కువ కాలం ముఖ్యమంత్రులు రాయలసీమ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహించినప్పటికీ ఈ ప్రాంతం ఇంత వెనుకబడి ఉండడానికి కారణం ఈ పాలకుల ద్వంద్వ వైఖరులు కాదా? అసలు అటు చంద్రబాబు నాయుడు, ఇటు జగన్‌మోహన్‌రెడ్డి ఇరువురు కూడా రాయలసీమ వాసులే కదా! వాస్తవానికి గత 5 సంవత్సరాలు చంద్రబాబు నాయుడు అనవసర విషయాలకు ప్రాధాన్యతనిచ్చి 'అమరావతి' విషయంలో కొంత ఆలస్యం చేసిన మాట వాస్తవం. ఎందుకనగా మొదటి సంవత్సరం హైదరాబాద్ నుంచి పాలన సాగింది. రెండవ సంవత్సరం అమరావతికి తరలించడానికి సరిపోయింది. 3–4 సంవత్సరాలు ఇక్కడి నుంచి పాలన సాగించినప్పకీ 'స్థిరత్వం' లేకుండా పోయింది.

చివరి సంవత్సరం కేంద్ర ప్రభుత్వంతో విబేధాల కారణంగా 'ధర్మ పోరాట దీక్ష'ల పేరుమీద రాష్ట్ర వ్యాప్తంగా అటు ఢిల్లీలోనూ, కేంద్ర ప్రభుత్వంతో నిధుల కోసం పోరాడడానికి కాలం వెలుబుచ్చింది. ఈ విధంగా చంద్రబాబు నాయుడు కూడా తాత్కాలిక రాజధాని, తాత్కాలిక

హైకోర్టు, తాత్కాలిక సచివాలం అంటూ నిర్మించాడు. కొన్ని విద్యా సంస్థలు (విఐటి, ఎఐఐఎంఎస్ లాంటివి) నెలకొల్పడానికి భూమి, కొంత సహకారం ఇచ్చాడు కానీ, జరుగబోయే పరిస్థితిని ఊహించలేక పోయాడు. ఈ విధంగా ఇప్పుడు నెలకొన్న ప్రజాందోళనకు చంద్రబాబు నాయుడూ కారకుడే. అప్పుడే శాశ్వత నిర్మాణాల ప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టి ఉంటే నేడు ఈ ముఖ్యమంత్రికి ఈ వ్యాఖ్యలు చేసే అవసరం ఉండేది కాదేమో! ఆ అవకాశం ఇచ్చిన పరిస్థితి చంద్రబాబు నాయుడే కల్పించినట్లయింది.

ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇదంతా 'అభివృద్ధి వికేంద్రీకరణ' అంటున్నది. వాస్తవానికి 'పరిపాలన వికేంద్రీకరణ' జరగాలి. ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో పాలన ఎక్కడి నుండి చేశామన్నది ముఖ్యం కాదు, ఏ విధంగా చేశామన్నది? ఎలా చేశామన్నది ముఖ్యం! ప్రజలకు తమ పరిపాలనా సౌలభ్యం ఫలితాలనిస్తున్నదా? ఎంతవరకు ప్రజలు ఈ ప్రభుత్వ అన్ని పథకాలను, సౌకర్యాలను పొందుతున్నరన్నదే అసలు సమస్యకు పరిష్కారం

గత ముఖ్యమంత్రి 'సింగపూర్'ను ఆదర్శంగా తీసుకుంటూ మాట్లాడేవాడు. ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి 'దక్షిణాఫ్రికా'లో ఉన్న 3 రాజధానులను ఆదర్శంగా తీసుకుంటున్నట్లు స్వయానా ఆయనే అసెంబ్లీలో ఉదహరించారు. నిజంగానే దక్షిణాఫ్రికా దేశంలో 3 రాజధానులున్నాయి. ప్రిటోరియాలో సచివాలయాన్ని, బయోయా ఫోంటెన్‌లో న్యాయపరిపాలన, కేప్‌టౌన్‌లలో శాసన నిర్మాణ (లెజిస్లేటివ్) రాజధానిని ఏర్పాటు చేసుకున్నారు. దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా కూడా ఇదంతా 'ఆర్థిక భారం' అని, అనవసరమని దానిని వ్యతిరేకించాడు కూడా. ప్రస్తుత అధ్యక్షుడు జాకబ్ జుమా కూడా మూడు రాజధానులు భారమవుతుందని, రెండింటికి కుదించాలని బహిరంగంగానే ప్రకటించి, ఆ దిశగా 2016 నుంచి చర్యలు తీసుకుంటున్నారు. దక్షిణాఫ్రికా దేశానికి 3 రాజధానులు ఉండడం పరిస్థితి అటుంచి, ఆర్థిక లోటుతో సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నూతన రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో 3 రాజధానులు అవసరమా? ఇది తలకు మించిన భారం కాదా అన్నది పాలకులు ఆలోచించాలి. విభజన వలన ఇప్పటికే తీవ్రమైన నష్టాలను చవిచూసి, ఇప్పుడిప్పుడే కొంత మెరుగు పడుతున్నది. పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు ఏర్పాటు కాలేదు. గత ప్రభుత్వం నిర్మించిన ఆకాశ హార్మ్యాలను ఇంతవరకూ ఈ ప్రభుత్వం ప్రారంభించలేదు. ఐఎఎస్, ఐపిఎస్‌ల క్వార్టర్స్, జడ్జీల క్వార్టర్స్, సచివాలయ ఉద్యోగుల క్వార్టర్స్ ప్రారంభించబడలేదు. 10 – 20 శాతం పనులు చేస్తే ప్రారంభించబడే పరిస్థితి ఉన్న నిర్మాణాలను ఆపివేయడం ఈ రాష్ట్ర ప్రభుత్వం చేసిన దుర్మార్గపు చర్య. అవి ప్రజల సొమ్ముతో నిర్మించబడిన కట్టడాలు. వాటిని ఏదో ఒక విధంగా ఉపయోగంలోకి తీసుకోవాలి తప్ప దానిని నిరుపయోగంగా పడివేయడం విచారకరం, దుర్మార్గం. గత ప్రభుత్వం చేసిన ఏ పనిని కూడా కొనసాగించడానికి ఇష్టం లేనట్లుగా ఈ ముఖ్యమంత్రి వవ్యవహరిస్తున్నారు. అందులో భాగంగానే 3 రాజధానుల ప్రకటన సారాంశం.

ఆంధ్ర ప్రాంతానికి 1953 వరకు మద్రాసు (చెన్నై) రాజధానిగా ఉండడంతో రాయలసీమ, నెల్లూరు జిల్లా వాసులు చాలా మంది ఆ రోజుల్లో అక్కడ స్థిరపడిపోయారు. ఆ తర్వాత 1953 నుంచి 1956 వరకు కర్నూలు రాజధానిగా ఉంది. తెలంగాణ ప్రాంతం విలీనం కావడం చేత హైదరాబాద్ రాజధానిగా 1956 చివర్లో హైదరాబాద్ రాజధానిగా నూతన ఆంధ్రప్రదేశ్ (నవంబర్ 1న) ఏర్పడి శ్రీభాగ్ ఒడంబడిక ప్రకారం – కోస్తా ప్రాంతంలో రాజధాని ఏర్పాటు చేస్తే హైకోర్టు రాయలసీమకు, రాయలసీమలో రాజధాని ఏర్పాటు చేస్తే హైకోర్టు కోస్తా ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నది నియమం. ఆ విధంగానైనా ఎలాగూ కోస్తా ప్రాంతమైన గుంటూరు జిల్లా పరిధిలోకి వచ్చే 'అమరావతి' ప్రాంతంలో రాజధాని ఏర్పాటుందుంది కాబట్టి కర్నూలుకు హైకోర్టు ఇస్తే సరిపోతుంది. అంతే కాకుండా విశాఖపట్టణం ఇప్పటికే పారిశ్రామిక ప్రాంతంగా, 'ఉక్కు' నగరంగా ప్రసిద్ధి చెందింది కాబట్టి అక్కడ హైకోర్టు బెంచి ఇస్తే సరిపోతుంది. ఇప్పుడున్న హైకోర్టు భవనం కొనసాగుతుంది. చీఫ్ జస్టిస్, హైకోర్టు ప్రధాన కార్యాలయం కర్నూలుకు తరలించ బడతాయి.

మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్ అయినప్పటికీ అక్కడ హైకోర్టు లేదు. జబల్‌పూర్‌లో హైకోర్టు ప్రధాన కార్యాలయం ఉంది. గ్వాలియర్, ఇండోర్‌లలో హైకోర్టు బెంచిలు ఉన్నాయి. అదే విధంగా ఇక్కడ కూడా విశాఖపట్టణం, అమరావతిలో హైకోర్టు బెంచ్‌లు కొనసాగుతాయి. కర్నూలులో హైకోర్టు ప్రధాన కార్యాలయం ఉంటుంది. అదే విధంగా మహారాష్ట్రలో కూడా ముంబయిలో హైకోర్టు ప్రధాన కార్యాలయం ఉంది. ఔరంగాబాద్, నాగపూర్‌లలో హైకోర్టు బెంచ్‌లు ఉన్నాయి. మొత్తం రాష్ట్రంలోని 13 జిల్లాల అభివృద్ధికి ప్రణాళికలు వేసుకొని అభివృద్ధి చేయాలి తప్ప, ప్రాంతాలను విడదీసి, ప్రజలను గందరగోళ పరిచి, వారిని ఆందోళనల బాట పట్టించడం ఇప్పుడున్న ముఖ్యమంత్రికి తగదు. 'అధికార వికేంద్రీకరణ' వలన ప్రజలు కొత్త సమస్యలు ఎదుర్కొన కూడదు. అసలు 33 వేల ఎకరాలు ఇచ్చిన ప్రజలు 'అమరావతి' నిర్మాణం ఆగిపోతే ఆ 29 గ్రామాల ప్రజలు అటు వారి పంట భూములు తిరిగి సాగుకు నోచుకోక, అటు అభివృద్ధీ జరగక ఒక విచారకరమైన పరిస్థితి నెలకొంటుంది.

ఇప్పుడున్న పరిస్థితులలో నిర్మాణాలు జరుగని భూమిని తిరిగి రైతులకు అందివ్వలేని పరిస్థితి. ఎందుకనగా భూములన్నీ పెద్ద, పెద్ద యంత్రాలతో తవ్వివేయబడినాయి. ఒక గ్రామానికి, మరొక గ్రామానికి సంబంధాలు తెగిపోయాయి. ఇలాంటి పరిస్థితులు వస్తాయని అనుకుంటే ఆ రైతులు తమ భూములను ఇచ్చేవారు కాదు కదా! కాబట్టి ఇది జీవన్మరణ సమస్య కాకుండా రాష్ట్ర ప్రభుత్వం అమరావతి రాజధానిని కొనసాగిస్తేనే బాగుంటుందనేది చాలా మంది ప్రజల అభిప్రాయం. మిగతా ప్రాంతాలను వివిధ రకాల పరిశ్రమలతో అభివృద్ధి చేయవచ్చు.

ప్రజలను సమస్యలలోకి నెట్టివేసి, ఆ తర్వాత ఆందోళనలు జరిగినప్పుడు దాన్ని శాంతి భద్రతల సమస్యగా చిత్రీకరించి, పోలీసులకు అప్పజెప్పే పరిస్థితి రాకూడదు. ప్రజాస్వామ్య వ్యవస్థ అత్యున్నత రూపనం 'సంక్షేమ రాజ్యం'. ఆ దిశగా అడుగులు పడకుండా పరిస్థితి చేయిదాటితే రాష్ట్ర ప్రభుత్వ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. దీనికి కేంద్ర ప్రభుత్వం కూడా బాధ్యత వహించాలి.

(రచయిత అడ్వకేట్, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు) వీ

బడుల మూసివేత ప్రమాణాల పెంపుకోసమా?

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేరని, కొత్తవారు చేరడం లేదని, అలాంటి పాఠశాలలు నడపడం కష్టమని చెప్పడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తుందని అంటున్నారు **బి. రామకృష్ణ**

కనీస స్థాయిలో విద్యార్థులు లేని బడులను మూసివేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. కిలోమీటర్ పరిధిలో ప్రాథమిక, 3 కిలోమీర్ల పరిధిలో ప్రాథమికోన్నత, 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాల అందుబాటులో ఉండాలని ప్రస్థుత నియమాలు ఉన్నాయి. దీన్ని సవరించి ఏ పాటశాల అయినసరే 5 కిలోమీటర్ల పరిధిలో ఒక పాఠశాల అనే నిబంధనను అమలు చేయాలని, అందుకోసం ఒక కమిటీని విద్యా శాఖ 2019 నవంబర్‌లో నియమించింది. ఈ కమిటీ ఇంకా పని మొదలు పెట్టినట్లు లేదు. ఇదంతా ఆపేసినట్లుగా కూడా తెలుస్తున్నంది.

బడుల మూసివేతకు సంబంధించి 2014లో టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటయినప్పటి నుండి కూడా దఫ దఫాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నది. అధికారికంగా ఈ ప్రక్రియను నేటివరకైతే చేపట్టలేదు కానీ అనధికారంగా, విద్యాధికారుల నోటి మాటతో దగ్గరి దగ్గరి బడులను ఒకటిగా కలిపేయడం, పిల్లలు లేని బడుల్లో టీచర్లను సర్దుబాటు చేయడం జరుగుతూనే ఉన్నది. ఒక రకంగా బడుల మూసివేత నిరంతరంగా, గప్‌చిప్‌గా జరుగుతున్నట్లే. ఒకప్పుడు దాదాపుగా అందరూ ప్రభుత్వ బడుల్లో చదువుకునేవారు. నేడు సగానికిపై ప్రైవేట్ బడుల్లో చదువుతున్నారు. ప్రభుత్వ బడుల్లో పిల్లల సంఖ్య పడిపోతూ వస్తున్నది.

మానవ వనరుల మంత్రిత్వ శాఖ 2017 పాఠశాలల రేషనలైజేషన్‌కు సంబంధించి మార్గదర్శకాలను రూపొందించింది. వీటిని ఇది 2016 మార్చ్‌లో ప్రధానమంత్రి సమీక్షలో భాగంగా అలాగే నీతి ఆయోగ్ సూచనల మేరకు రూపొందించారు. ఫీడ్‌బ్యాక్ కోసం అన్ని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు వీటిని మానవ వనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి కె.జె. సింగ్ 2017 జూలైలో పంపించారు. దేశ వ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో చిన్న, మిగులు పాఠశాలలను రేషనలైజేషన్ పేరుతో విలీనం చేశారని, ఆ క్రమంలోనే మిగులు పాఠశాలలను కలిపి ఒకే పాఠశాలగా రూపొందించడానికి మార్గదర్శకాలను విడుదల చేశారు.

2017 – 18, 2018 – 19, 2019 – 20లకు సంబంధించి 2017లో నీతి ఆయోగ్ విడుదల చేసిన మూడు సంవత్సరాల కార్యాచరణ ఎజెండాలో తక్కువ మంది పిల్లలున్న పాఠశాలలను కలిపి పెద్ద పాఠశాలగా చేయాలనీ ప్రతిపాదించారు. విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని, అందులో సూచించిన మౌలిక సౌకర్యాల, వసతులను కల్పించడం కంటే కూడా అభ్యసన ఫలితాల పైసే దృష్టి పెట్టాలనే ప్రతిపాదన చేసింది నీతి ఆయోగ్ విధానం. జాతీయ విద్యా విధానం – 2019లో కూడా తక్కువ విద్యార్థులున్న చిన్న బడులను స్కూల్ కాంప్లెక్స్‌గా రూపొందించాలని చెప్పారు. మొత్తంగా పేర్లేవి చెప్పినా కూడా చివరకు బడులను మూసివేయడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉన్నది.

అసలు బడులెందుకు మూసేయాలనుకుంటున్నారు? చిన్నవని, మిగులు బడులని ఎందుకంటున్నారు? అన్నదానికి ప్రభుత్వాలు చెబుతున్నదొక్కటే. పిల్లలు లేరని లేదా చాలా తక్కువ మంది ఉంటున్నారని. అటువంటి పిల్లలు లేని బడులను నడపడం ఆర్థికంగా, విద్యా పరంగా సాధ్యం కాదని, అది కష్ట నష్టాలతో కూడుకున్నదని, అనవసర భారమని చెబుతుంటారు. అటువంటి బడుల నుంచి ప్రమాణాలను, గుణాత్మకతను ఆశించలేమని అంటారు. ఇటువంటి వాటిలో తరగతికో గది, తరగతికో టీచరు తదితర అన్ని ముఖ్యమైన వసతులను కల్పించడం అసాధ్యమయ్యే పనికాదని అంటారు.

ఇవి వింటుంటే అవును నిజమే కదా! ప్రభుత్వాలకు భారమే కదా, ప్రజల సొమ్ము వృథా అవుతున్నది కదా అనిపిస్తుంది. ప్రభుత్వాలు, పాఠకులు నిజాయితీగా చెబుతున్నట్లుగా కూడా అనిపిస్తుంది. కానీ వాస్తవాలు వేరుగా ఉన్నాయి.

ఒక్కొక్క ప్రభుత్వ బడి చరిత్రకు సంబంధించి, మౌలిక వసతులు కనీసం తరగతికో టీచర్, అలాగే ఆటలు, సాంస్కృతిక, కళా, పని, సృజనాత్మకత జీవన నైపుణ్యాలు వంటి వాటికి సరిపోను శిక్షకుల ఏర్పాటు వంటి వాటిపై సమగ్ర అధ్యయనం చేస్తే అసలు లోపాలు బయటకొస్తాయి. ప్రభుత్వ బడుల పక్కనే ఎన్నేసి ప్రైవేట్ బడులు ఎప్పుడెప్పు ఎందుకు, ఎలా వెలిశాయో తెలుసుకోగలిగితే ప్రభుత్వ బడుల మూసివేత ఎంత అన్యాయమో తెలిసిరాదు. స్లోపాయిజన్‌లా ఈ స్థితిలోకి ప్రభుత్వ బడులను నెట్టివేయడం వెనుక ఉన్న రాజకీయ ఆర్థిక విధానాలను విశ్లేషించుకోగలిగితేనే అసలు దోషి బయటపడతాడు. విద్యను అందించే బాధ్యత నుండి తప్పుకుని ప్రైవేట్ బడులను ప్రోత్సహించిందెవరు? అందరికీ సమాన విద్య కాకుండా కొందరికే సౌకర్యాల విద్య, మరెందరికో వసతులు లేని నాసిరకం విద్యను రూపొందించినది ఎవరు? గతంలో ఏకోపాధ్యాయ బడులని, ఆపరేషన్ బ్లాక్ బోర్డ్ (ఒబిబి) లని చెబుతూ ఒకే గదిలో ఒకే టీచర్‌తో మహా అయితే ఇద్దరితోనే ఐదు తరగతులకూ చదువులు చెప్పించిన నేరమెవరిది? ఇప్పటికీ ఇలానే మెజారిటీ ప్రాథమిక పాఠశాలలో చెప్పిస్తున్నదెవరు?

పాఠశాలల పర్యవేక్షణా వ్యవస్థలను భ్రష్టు పట్టించిందేవరు? దశాబ్దాలుగా పాఠశాల విద్యా వ్యవస్థలో అన్ని రకాల నియామకాలను చేపట్టకుండా చేస్తున్నదెవరు? ప్రభుత్వ పాఠశాలల పక్కనే చట్టాలను ఉల్లంఘిస్తూ ప్రైవేట్ వాటికి అనుమతులు ఇచ్చిందెవరు? బళ్లల్లో కనీస

వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, ఆటస్థలం లేకుండా చేసిన పాపం ఎవరిది? సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వమే ప్రైవేట్ బడుల్లో కనీసం తరగతికో గది, తరగతికో టీచర్, ప్రధానోపాధ్యాయుడు, కె.జి. క్లాసులు ఉంటాయని చెపింది కదా! మరి తానెందుకు తమ ప్రభుత్వ బడుల్లో వాటిని కల్పించలేకున్నది.

బడుల మూసివేత కోసం చొరవ చూపుతున్నవారు, అందుకోసం చట్టాలనే మార్చివేయాలని ఆరాటపడుతున్నవారు, అందుకోసం అధ్యయన కమిటీలు వేస్తున్నవారు ప్రభుత్వ బడులలో ప్రమాణాలు పెంచి, వాటిని నిలబెట్టుకోవడానికి అధ్యయనం చేయడం లేదు ఎందుకని? నాణ్యమైన విద్యను అందించడానికి క్షేత్రస్థాయిలో బడుల నిర్మాణం చేయడానికి ప్రయత్నించారా? ప్రభుత్వ బడులను ఆకర్షణీయంగా, ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దడానికి చేతులు రావడం లేదు ఎందుకని. అక్కడక్కడ పేపర్ల మీద గాని, నోటి మాటలుగా గాని నిరంతర సమగ్ర విద్య గురించి మాట్లాడుతుంటారు. కాని దాన్ని అందించడానికి ప్రతి బడి వాతావరణాన్ని ఎందుకు కల్పించడం లేదు. ప్రభుత్వ, ప్రభుత్వేతర అనేక విద్యా సర్వేలలో అన్ని రకాల పాఠశాలల్లో కనీస విద్యా సామర్థ్యాలు కొరవడుతున్నాయని తెలుతున్నాయి. వాటిని సవరించే ప్రయత్నాలేవి. ఢిల్లీలో కొంతమేరకు ప్రభుత్వ బడుల తీరుతెన్నులను మార్చే ప్రయత్నం జరుగుతున్నది. అలాంటి ప్రయత్నాలు తెలంగాణ ప్రభుత్వం ఎందుకు చేయదు. ఢిల్లీ ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు 29 శాతం వరకు నిధులు కేటాయించింది. తెలంగాణ ప్రభుత్వం గడిచిన ఆరేళ్లుగా ఎన్నడూ కూడా బడ్జెట్‌లో 9 శాతానికి మెంచలేదు. ఈ సంవత్సరం అయితే 6.7 శాతం మాత్రమే కేటాయించింది. ఢిల్లీ ప్రభుత్వం లాగా ప్రయత్నం చేయని తెలంగాణ ప్రభుత్వం బడుల మూసివేతకు మాత్రం ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తూనే ఉంటున్నది ఎందుకు?

చదువుల తల్లిని అంగడి వస్తువుగా చేస్తున్నదెవరు? చదువనేది వ్యక్తిగత వ్యవహారంగా చూస్తూ ఎవరికి వారే తమ స్వంత డబ్బులతో బజారులో కొనుక్కునేలా విధానాలను రూపొందిస్తున్నదెవరు? బడి చదువులను ప్రమాణాలతో అందరికీ వివక్షతలు లేకుండా సమాన విద్యను అందించడానికి కదా అధ్యయనాలు జరగాలి. మూసివేడానికా కమిటీలు వేసేది? ఇదేమి వైపరీత్యం? ఇదేమి పైత్యం? ఎవరి శ్రమతో దేశ సంపదల సృష్టి జరుగుతున్నదో అటువంటి అట్టడుగు వర్గాల, శ్రామికుల పిల్లల చదువులపట్ల ఇంతటి నిర్లిప్తత? ఇంత వివక్షతనా? ఇది దేన్ని సూచిస్తున్నది? వర్గ ప్రయోజనాల కోసమే రాజకీయార్థిక విధానాలు నిర్ణయించబడుతున్నాయనడం సరైంది కాదా? ఆంగ్లేయులతో స్వాతంత్ర సంగ్రామంలో అసువులు బాసిన ఎందరెందరో త్యాగధనుల అభిలాషలు రాజ్యాంగంలో చేర్చబడిన విలువలను కాలరాయడం కాదా ఇది. చదువులను బజారు సరుకుగా చేసి కొనుక్కోగలిగేవాడు కొనుక్కునేలా చేసి ఎంతోమందికి దూరం చేయడం లేదా నాసిరకం అందించడం అనేది మరో రూపంలో బ్రాహ్మణీయ మనువాదాన్ని ముందుకు తేవడమే అవుతుంది.

ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు, పెట్టుబడిదారీ కార్పొరేట్ శక్తులకు, సమాజంలోని ఆధిపత్య పెత్తందారీ వర్గాలకు అనుకూలంగా నడుచుకుంటున్న ప్రభుత్వాలు చదువులను మార్కెట్ వస్తువుగా చేయడం అనేది రాజ్యాంగాన్ని అవమానపరచడమే.

ప్రభుత్వ బడులలో పిల్లలు లేరని, తక్కువగా ఉంటున్నారని అనేవారు అసలు పిల్లలెందుకు తగ్గిపోతున్నారని ఆలోచించారా? దీనిని నివారించడానికి తీసుకోవల్సిన చర్యల గురించి యోచన చేశారా? మనసుంటే మార్గముంటుంది. మేధావులతో, విద్యావేత్తలతో, ఉపాధ్యాయ సంఘాలతో, పరిశోధక విద్యార్థులతో ప్రభుత్వ బడుల్లో పిల్లలను పెంచడం కోసం అధ్యయనం చేయవచ్చు. పరిష్కారాలు దొరక్కపోవు. ఏనాడైనా రాష్ట్ర ముఖ్యమంత్రి గాని, విద్యా శాఖ మంత్రి గాని, ఇతర బాధ్యతాయుత మంత్రులు గాని, ప్రజా ప్రతినిధులు గాని ఈ విషయమై ప్రస్తావించారా? అనేక స్థాయిల్లోని ప్రజా ప్రతినిధులు వార్డ్ మెంబర్/కౌన్సిలర్ నుండి మొదలుకుని శాసన సభ్యుల, మంత్రుల దాకా ప్రభుత్వ బడులను ప్రమాణాలతో, ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం కోసం మనస్సు పెట్టి పనిచేశారా? ప్రైవేట్ విద్యా వ్యవస్థ అనేది లాభ నష్టాలతో కూడుకున్నదై విద్యను వ్యాపారమయం చేస్తుందని, ఇది సమాజంలో వివక్షతలకు దారితీస్తుందని వీరెవరైనా అనుకుంటున్నారా? ప్రైవేట్ బడులు ఉంటే గింటే లాభాపేక్ష లేకుండా, ధాతృత్వ స్వభావంతోనే నడవాలని వీరెవరైనా డిమండ్ చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారా? అలా చేయని వీరినేమనాలి?

ఒక ప్రాంతంలోని ప్రభుత్వ బడిలో పిల్లలు లేరని అంటున్నప్పుడు ఆ ప్రాంతంలో నిజంగానే బడి ఈడు పిల్లలు లేరా? లేక వారేమైనా ప్రైవేట్ బడికి వెళుతున్నారా? అలా అయితే ఆ బడులను నియంత్రించాలి కదా. అలా నియంత్రించడానికి సిద్ధపడే ప్రభుత్వమేది? పొమ్మనలేక పొగబెట్టి ప్రజలే అటువైపుగా వెళుతున్నారుగా కదా అని చేతులు దులిపేసుకుని బడుల మూసివేతకు పాల్పడుతున్నారు. ప్రైవేట్ బడుల్లో చేరడం ప్రభుత్వ బడుల్లో సౌకర్యాల లేమివలన ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు తగ్గిపోతూ చివరకు అవి మూసివేతకు గురవుతున్నాయి. ఏ ప్రభుత్వమైనా ప్రైవేట్ బడులు ఉండవద్దని ఏ ఒక్క విధాన ప్రకటన అయినా చేసిందా? ఓ వైపు ప్రభుత్వ బడులను అధ్వాన్న స్థితిలోకి నెట్టివేస్తూ, ప్రైవేట్ వాటిని ప్రోత్సహిస్తూ మరోవైపు ప్రభుత్వ బడుల్లో పిల్లలు లేరని చెప్పడం దేన్ని సూచిస్తుంది? ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నక్క వినయమా? మొసలి కన్నీరా? పిల్లల సంఖ్యను పెంచడమేలా అని ఆలోచించకుండా తక్కువ మంది విద్యార్థులు ఉన్నారని ప్రభుత్వ బడులను మూసివేస్తామనడం అనేది విజ్ఞులనేవారు ఎవరూ అనేమాట కాదు.

ప్రజలకు విద్యను అందించడానికి ఉద్దేశించబడిన ప్రభుత్వం తన బాధ్యతను కావాలనే విస్మరిస్తూ ప్రైవేట్ వైపుకు చదువులు కొనుక్కోవడానికి నెట్టివేయడం అనేది ప్రజాస్వామ్య సమానత్వ స్ఫూర్తి పతనానికి సూచిక కాదా?

ప్రైవేట్ విద్యా వ్యవస్థను నియంత్రిస్తూ క్రమేపి రద్దు చేసే దిశలో ప్రభుత్వాలు పనిచేయాల్సి ఉన్నది. మరోవైపు విద్య కోసం బడ్జెట్ పెంచి పూర్తిస్థాయి మౌలిక వసతులు, ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20గా ఉండేలా సరిపోను టీచర్లను నియమించి సమగ్ర విద్య కోసం పాటు పడాల్సి ఉన్నది. అలా చేయడం ద్వారానే ప్రభుత్వ బడులు రక్షించబడతాయి. ప్రజలందరికీ రాజ్యాంగ విలువలతో కూడిన సమాన విద్యను అందించే అవకాశం ఏర్పడుతుంది.

(రచయిత ఉపాధ్యాయుడు) వీ

రక్షక భటుల కట్టు కథలు బట్టబయలు

సర్కెగూడ ఎన్‌కౌంటర్‌లో 17 మంది నక్సలైట్లను చంపామని భద్రతా దళాలు చెప్పింది పచ్చి అబద్ధమని, వారంతా నిరాయుధులైన ఆదిబాసులని జస్టిస్ వి.కె. అగర్వాల్ ఏకసభ్య కమిషన్ విచారణలో తేలిందని అంటున్నారు **రాజేంద్రబాబు ఆర్విణి**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సర్కెగూడ గ్రామం, సుకుమా జిల్లా జగర్‌గుండ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిల్గేర్. చిమిలి పెంట గ్రామాల సరిహద్దుల్లో 2012 సంవత్సరం జూన్ నెల 28, 29 తేదీల నాటి మధ్య రాత్రి నరమేధం జరిగింది. 17 మంది గిరిజన గ్రామీణులు ఊచకోత కొయ్యబడ్డారు. 11 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. 6 మంది పోలీసులు స్వల్పంగా గాయపడ్డారు.

సర్కెగూడ, కొత్తగూడ, రాజపెంట గ్రామాల ప్రజలు "బీజ పాండమ్" పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవడానికి చేయవలసిన ఏర్పాట్లను గురించి చర్చించడానికి జూన్ 28 నాటి రాత్రి ఆ మూడు గ్రామాలకు ఆనుకునివున్న అడవి మధ్యన ఊరు ఆరు బయలు ప్రదేశంలో కూర్చొని ఉంటే అకస్మాత్తుగా సాయుధ పోలీసులు ఆ గుంపును చుట్టుముట్టి విచక్షణా రహితంగా కాల్పులు జరుపగా, అక్కడికక్కడే 15 మంది గిరిజనులు అసువులు కోల్పోయారని, 11 మంది తీవ్రంగా గాయపడ్డారని, ఆ మరునాటి ఉదయం పోలీసులు ఇల్లిల్లూ తిరిగి మరి ఇద్దరిని పట్టుకొని కాల్చి చంపారని, ఆ రకంగా 28, 29 తేదీల నాటి మారణహోమంలో మొత్తం 17 మంది సాధారణ గిరిజనులను ఊచకోత కోసారని బాధిత కుటుంబాల, ప్రజల ఆరోపణ.

ఆ గ్రామాలలో నక్సలైట్ల సంచారం ఎక్కువగా ఉందని, ముఖ్యమయిన సీనియర్ నక్సలైట్ నాయకులు కొంతమంది అక్కడి ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నారని, ఆ ప్రాంతాల్లో గాలిస్తే పోలీసులకు పెద్దఎత్తున నక్సలైట్ల కార్యకలాపాలు అరికట్టే పనిలో విజయం లభిస్తుందని రహస్య వేగులు ఇచ్చిన సమాచారం మేరకు రాష్ట్ర పోలీసులకు తోడుగా కేంద్ర రిజర్వు పోలీసు దళాలు గాలింపు చర్యలు చేపట్టాయని, అందులో భాగంగా ఆనాటి రాత్రి ఆ అడవుల్లో సంచరిస్తుండగా, చీకట్లను చీల్చుకుంటు నక్సలైట్లు మాపై కాల్పులు జరిపారని, ఆ కాల్పుల్లో మా జవాన్లు 6 మంది గాయపడ్డారని, ఆత్మరక్షణకోసం మేము తిరిగి కాల్పులు జరపగా ఆ కాల్పుల్లో 17 మంది నక్సలైట్లు మరణించారని పోలీసుల కథనం. అక్కడ 40 మంది నక్సలైట్లు, 200 మంది గిరిజన గ్రామీణులు సమావేశమయ్యారని, ఆ సమావేశ ఉద్దేశ్యం ఇటీవల కేంద్ర రిజర్వు పోలీసు దళంలో చేరిన గిరిజన యువకుల భూములు ఆక్రమించుకునేందుకు పథక రచన చెయ్యడమేనని పోలీసుల వైపు సాక్ష్యం పలకడానికి కొంత మంది ముందుకొచ్చారు. వారంతా ప్రభుత్వానికి లొంగిపోయిన మాజీ నక్సలైట్లు. బహుళ సంఖ్యలో గిరిజనులు బాధితులవైపు నిలబడి తాము చూసిన విషయాలను ప్రపంచానికి వెల్లడించడానికి సిద్ధమయ్యారు.

ఈ సమస్యపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం జస్టిస్ వి.కె. అగర్వాల్ సభ్యులుగా ఏక సభ్య విచారణ సంఘాన్ని నియమించింది. జస్టిస్ అగర్వాల్ ఏడు సంవత్సరాల తర్వాత తన నివేదికను 2019 సెప్టెంబర్ 30న ప్రభుత్వానికి సమర్పిస్తూ పోలీసులవన్నీ కట్టుకథలేనని తేల్చారు. బాధితుల వైపు వాదించిన లాయర్ల బృందంలో ప్రస్తుతం పూణెలోని ఎరవాడ జైలులో నిర్బంధించిన సుధా భరద్వాజ్ కూడా ఉండడం గమనార్హం.

తనకు ప్రభుత్వం వారు నిర్దేశించిన అంశాలకు మాత్రమే జస్టిస్ అగర్వాల్ పరిమితమయ్యారు. రక్షణ బలగాలకు, నక్సలైట్లకు మధ్య అసలు ఘర్షణ జరిగిందా అన్న ప్రశ్నకు సమాధానంగా ఏక సభ్య కమిషన్, జూన్ 28,29 నాటి మధ్య రాత్రి మూడు గ్రామాల మధ్య ఉన్న ఆరు బయట ప్రదేశంలో ఒక ఘర్షణాత్మకమైన సంఘటన జరగడం వాస్తవమేనని తాను గమనించిన సాక్ష్యాధారాలను బట్టి నిర్ధారిస్తున్నానని నివేదికలో పేర్కొన్నారు. (తాము అడవిలో నక్సలైట్ల కోసం గాలింపు జరుపుతుండగా చీకట్లోంచి మాపై కాల్పులు జరిపారన్న పోలీసుల వాదనను ఈ రకంగా కమిషన్ తిరస్కరించింది). అయితే, ఆ ఘర్షణలో నక్సలైట్ సంస్థలకు చెందిన వారు పాల్గొన్నారని గాని, అసలు అక్కడ వారున్నారని, సాయుధ రక్షక దళాలతో జరిగిన ఘర్షణలో వారున్నారని గాని చెప్పడానికి సంతృప్తికరమైన ఆధారాలేమీ లేవని స్పష్టం చేశారు. (ఆ గుంపులో 40 మంది దాకా నక్సలైట్లు సాయుధులయి ఉన్నారని, రక్షక దళాలలో చేరిన గిరిజన యువకుల భూమిని ఆక్రమించుకోవాలన్న డిమాండ్‌తో గిరిజనులను సమీకరిస్తున్నారన్న పోలీసుల అభియోగాన్ని అగర్వాల్ విచారణ తోసిపుచ్చింది).

ఈ మొత్తం ప్రక్రియ రక్షక దళాలకు చెందిన అధికారి ఎస్. ఇలాంగో నేతృత్వంలో జరిగింది. ఆయన విచారణ సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో సిల్గురి గ్రామంలో పై స్థాయికి చెందిన నక్సలైట్ నాయకులు ఉన్నారని తెలిసి ఆ గ్రామానికి వెళుతుండగా, సర్కెగూడ, కొత్తగూడ, రాజ్ పెంట గ్రామాల మధ్య దట్టమయిన అడవిలో ఈ ఎదురుకాల్పులు జరిగాయని పేర్కొన్నాడు. పోలీసు దళం అడవిలో వెలుతుండగా మొదట కుడివైపు నుండి తర్వాత ఎడవవైపు నుండి తమపై కాల్పులు మొదలయ్యాయని, వెంటనే తమ జవాన్లు పొజిషన్స్ తీసుకుని ఎదురుకాల్పులు ప్రారంభించారని ఆయన విచారణ క్రమంలో తెలియపర్చాడు. ఈ విషయం నమ్మడానికి తగిన ఆధారాలు తనకు లభించలేదని కమిషన్ పేర్కొంది. తాము ఆత్మరక్షణ కోసం ఎదురు కాల్పులు జరిపినట్టుగా ఆ అధికారి చెప్పిన విషయం నమ్మశక్యంగా లేదని జస్టిస్ అగర్వాల్ పేర్కొన్నారు. నిజానికి, ఆ సాయుధ రక్షక దళానికి

వెంటిలెటర్‌పై భారత ఆర్థిక వ్యవస్థ

ప్రస్తుత సంక్షోభానికీ, ప్రజల మధ్య అసమానతలు పెరగడానికీ ప్రధాన కారణం ప్రభుత్వరంగాన్ని విస్మరించి అన్నింట్లో ప్రయివేటు పెట్టుబడులకు అనుమతించడమేనని అంటున్నారు ఎ. నర్సింహారెడ్డి

మోడీ పాలనలో ఆర్థిక వ్యవస్థ ఎన్నడులేని విధంగా అధః పాతాళానికి దిగజారిపోతోంది. అచ్చేదిన్ వాగ్దానాలు నీటి మూటలే అయ్యాయి. 2025 నాటికి భారత ఆర్థిక వ్యవస్థను ఐదు ట్రిలియన్ (దాదాపు రు. 360 లక్షల కోట్లు) డాలర్లకు పెంచుతామని గత బడ్జెట్ సమయంలో మోడీ ప్రభుత్వం గొప్పలకు పోయింది. కానీ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం అటుంచి రోజు రోజుకు బక్కచిక్కిపోతోంది. ద్రవ్యోల్బణం నిరాటంకంగా కొనసాగటంతో ప్రజల పరిస్థితి దుర్భరంగా మారింది. ఈ ఏడాది ఆగస్టులో కేంద్ర గణాంకాల కార్యాలయం (సిఎస్‌ఓ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2019-20 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో భారత ఆర్థిక వ్యవస్థ కేవలం 5 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. ఇది ఆరు సంవత్సరాల కనిష్ట స్థాయి. 2013-14 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం తర్వాత ఇంత కనిష్ఠ స్థాయికి వృద్ధిరేటు దిగజారడం ఇదే ప్రథమం. రెండవ త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో మన వృద్ధిరేటు మరింత దిగజారి 4.5 శాతానికి పడిపోయింది. వృద్ధిరేటు ఇంతగా దిగజారడానికి కారణ ఏమిటి? ఇందుకు దారితీసిన జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు ఏమిటి అనే సందేహం మనందరిలో కలుగడం సహజం.

ప్రధానంగా తయారీ, ఆటోమొబైల్, వేగంగా చేరవేసే వినియోగ వస్తువులు (ఎఫ్‌ఎంసిజి), బ్యాంకింగ్, టెలికాం, నిర్మాణ రంగాల పరిస్థితి ఏ మాత్రం మెరుగ్గా లేదు. ప్రస్తుతం దేశ ఆర్థిక యవనికలో 'వినియోగిత' బాగా క్షీణించింది. మార్కెట్లో వినియోగ వస్తువులకు డిమాండ్ లేకపోవడం, 'శ్రమ ఖర్చు తగ్గడం, వేతనాలు వేగంగా క్షీణించడం, నిరుద్యోగం పెరుగుదల, వ్యవసాయవృద్ధి క్షీణించడం, పరిశ్రమల్లో ఉత్పాదకత అడుగంటడం వంటి పలు అంశాలు దేశ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో కూరుకుపోవడానికి దోహదం చేశాయి. ఇవన్నీ పాలకుల విచక్షణారహిత నిర్ణయాల కారణంగా కుదేలయ్యాయి. ఈ నేపథ్యంలో దేశ లేదా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు నేడు ఎదుర్కొంటున్న తీవ్ర సంకట పరిస్థితులను 'ఉత్పత్తి' కోణంలో చూడాల్నా? 'వినియోగ' కోణంలో చూడాల్నా అనే విషయంపై ఆర్థిక వేత్తలు తర్జనభర్జన పడుతున్నారు. నిజానికి ఇది ఉత్పత్తి (సరఫరా) సమస్యకాదు, డిమాండు (కొనుగోలు) సమస్యే.

ఆర్థిక మాంద్యాన్ని పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి చర్యలు తీసుకోకుండా సరఫరా దిశగా చర్యలకు పూనుకుంది. పలు ఉద్దీపన పథకాలు పారిశ్రామిక వేత్తలకు ప్రకటించింది. పన్ను మినహాయింపులు, ఇతర ప్రయోజనాలను కల్పించడం ద్వారా కార్పొరేట్లకు రు. 2.15 లక్షల కోట్లు రాయితీలు ప్రకటించింది. సమస్య కొనుగోలులో ఉంటే ప్రభుత్వం పరిష్కారం సరఫరాలో చూస్తోంది దీని ద్వారా సమస్య మరింత జఠిలమవుతోంది. ప్రజల కొనుగోలు శక్తి పెంచి

నాయకత్వం వహిస్తున్న కమాండర్ గాని, డిప్యూటి కమాండర్ గాని ఒక్క తూటా కూడా పేల్చలేదంటే ఇది విస్మయం కలిగించే విషయమనీ, నమ్మశక్యంగా లేదని కమిషన్ తేల్చి చెప్పింది. (అంటే కాల్పులు, ఎదురుకాల్పులు లేవు, పోలీసుల వైపు నుండి కాల్పులే తప్ప అనే కదా అర్థం). కాల్పులు ఆగిపోయిన తర్వాత పారాబాంబులను పేల్చి ఆ ప్రాంతం కాంతివంతం అయ్యేట్టుగా చేశామని, అప్పుడు ఈ 17 మంది గిరిజనుల శవాలు దొరికాయని చెప్పుకొచ్చారు పోలీసులు. అదే నిజమయితే, ఈ పారాబాంబులు ముందే పేల్చి అక్కడ గుమికూడిన సమూహాన్ని చెదరగొట్టివుంటే ఇన్ని అమాయక గిరిజన ప్రాణాలు దక్కిఉండేవని కదా అని కమిషన్ అభిప్రాయపడింది.

కాల్పులలో గాయపడ్డామని చెప్పుకున్న జవాన్ల విషయంలో కూడా కమిషన్ తన అనుమానాలు వ్యక్తం చేసింది. ఒక జవాను ఎడమకాలి బొటనవేలుకు గాయం అయ్యిందని అఫిడవిట్‌లో రాస్తే, డాక్టర్ తన రిపోర్ట్‌లో కుడికాలి బొటన వేలు అని పేర్కొన్నాడు. జవాన్లు బోర్లా పడుకొని కాల్పులు జరిపిన సందర్భంలో వెనుక భాగాన ఉన్న కాలి బొటనవేలుకు ఎలా గాయం అవుతుందని తన సందేహం వ్యక్తపరిచింది కమిషన్. మరొక జవాను కుడి దవడలోకి బుల్లెట్ చొచ్చుకుపోయిందని డాక్టర్ తన నివేదికలో పేర్కొంటే విచారణలో ఆ జావాన్ మరొక చోట ఎక్కడో గాయం అయిందని తడబడుతూ చెప్పాడు. ఇలాంటి అవకతవకలు కమిషన్ దృష్టికి వచ్చాయి. వీటి వల్ల, విచక్షణా రహితంగా, అడ్డదిడ్డంగా జరిపిన కాల్పుల్లో పోలీసులకు కూడా గాయాలయి ఉండవచ్చునని కమిషన్ పేర్కొంది. రక్షక భటులు, పోలీసులు వాకీటాకీలు లేకుండా, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు లేకుండా పనిచేస్తున్నారని వారి శాఖను ఆధునీకరించాలని కూడా తన నివేదికలో ఏక సభ్య కమిషన్ ప్రభుత్వానికి సలహా ఇచ్చింది.

ఏది ఏమైనా, బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్కెగూడ నరమేధం పోలీసుల ఏకపక్ష కాల్పుల మూలంగా జరిగిందన్న ప్రజా సంఘాల వాదనను ఎట్టకేలకు ప్రభుత్వమే ఏర్పాటు చేసిన విచారణ సంఘం కూడా బలపరిచింది.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

డిమాండు పెరగడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పర్యావసానంగా సంక్షోభం మరింత పెరుగుతుందే తప్ప కుదుటపడడం లేదు. కీలక రంగాల్లో పెట్టుబడులు, డిమాండ్, వృద్ధిరేటు మందగించడంతో 2019-20లో భారత జిడిపి వృద్ధిరేటు ఐదు శాతానికి మించకపోవచ్చని ఎస్‌బిఐ ఆర్థిక పరిశోధనా విభాగానికి చెందిన ఎకో ర్యాప్ తన తాజా నివేదికలో తెలిపింది. ఇది 2019-20 ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన 6.1 శాతానికంటే తక్కువ. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, ప్రపంచ బ్యాంకులతో పాటు ప్రఖ్యాత రేటింగ్ సంస్థలు మూడీస్, క్రిసిల్‌లు కూడా ఇటీవల కాలంలో భారత్ వృద్ధి అంచనాలకు కోత పెట్టడమే ఆర్థిక సంక్షోభం ముంచు కొస్తోందనడానికి నిదర్శనం.

పెట్టుబడిదారీ విధానంలో అనివార్యంగా ఏర్పడే 'శ్రమ విభజన' 'సంపద పంపిణీ'ల మధ్య ఏర్పడిన అంతరం కారణంగా ఉత్పత్తి, వినియోగం ప్రక్రియలో సహజంగానే సంక్షోభాలు తలెత్తుతాయి. ప్రపంచ పెట్టుబడిదారీ విధానం పారిశ్రామిక పెట్టుబడి నుంచి ద్రవ్య పెట్టుబడిగా మారిన దశలో ద్రవ్య విధానాలే ప్రధాన పాత్ర వహిస్తోన్నాయి. గతంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో అంతర్భాగంగా ఉన్న నిర్దిష్ట సేవలు, ఈనాటి ద్రవ్య పెట్టుబడిదారీ విధానంలో సేవల రంగంగా ఆవిర్భవించింది. సరుకుల తయారీ ద్వారా ద్రవ్యాన్ని ఆర్జించే పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం స్థానంలో పారిశ్రామిక, వ్యవసాయక, సేవా రంగాలన్నిటినీ ద్రవ్యమే అజేయ శక్తిగా శాసించే ద్రవ్య పెట్టుబడిదారీ విధానం 20వ శతాబ్దారంభం నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రబల శక్తిగా వేళ్లూనుకుంది. సరకుల మారకంలో మధ్యవర్తిత్వ పాత్ర నిర్వహించిన ద్రవ్యం 1990 నుంచి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల అమలుతో ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను శాసించే నిర్ణయాత్మక శక్తిగా రూపాంతరం చెందింది.

భారత ప్రభుత్వ రాజకీయార్థిక విధానాలు

1947 ఆగస్టులో అధికార మార్పిడి జరిగిన తర్వాత భారత ప్రభుత్వం అమలులోకి తెచ్చిన మిశ్రమ ఆర్థిక విధానం దేశీయ దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల ఎదుగుదలకు తోడ్పడింది తప్ప ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి తోడ్పడలేదన్నది ఏడు దశాబ్దాల అనుభవం రుజువు చేస్తోంది. మన పాలకులు స్వావలంబన, స్వయం పోషకత్వాన్ని వదిలి సామ్రాజ్యవాద బహుళ జాతి కంపెనీల మార్కెట్ అవసరాల కనుగుణంగా విధానాలను రూపొందిస్తూ తమ దళారి స్వభావాన్ని నిరూపించుకుంటూ వచ్చారు. మనదేశ దళారీ పెట్టుబడిదారులు దేశ ప్రయోజనాలను కాలరాసి తమ లాభాలు, ప్రయోజనాలు పొందుతున్నారు. సామ్రాజ్యవాదులకు జూనియర్ భాగస్వాములుగా మారారు. ఫలితంగా ఆదాయాల్లో సంపన్నులకు, పేదలకు మధ్య అంతరాలు తీవ్రంగా పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా మూడు దశాబ్దాలుగా మన ప్రభుత్వాలు అనుసరిస్తూ వస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలతోపాటు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సాగిస్తున్న దాడి నేడు దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి కారణమయ్యాయి. ఉపాధి రహిత వృద్ధి నుండి ఆవిరామంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం వరకు, కార్పొరేట్ రంగం దేశ వనరులను పెద్ద ఎత్తున లూటీ చేయడం నుండి ఆర్థిక అస్థిరత సంక్షోభం వరకు, భారత ప్రజలు ఈనాడు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలన్నీ సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలనుండే ఉత్పన్నమవుతున్నాయి.

పాలకులు పెట్టుబడిదారులకు, భూస్వామ్య పెత్తందారి శక్తులకు బడ్జెట్‌లో నుంచి రాయితీల రూపంలో దోచిపెట్టడం కొత్తకాకపోయినా ఇప్పుడు స్పష్టంగా తమ అసలు ముఖాన్ని బయట పెట్టుకుంటున్నారు. విదేశీ, స్వదేశీ అప్పులు చేయడం, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రభుత్వ వాటాల్ని ఆశ్రితులకు తెగనమ్మడం చేస్తున్నారు. ప్రభుత్వరంగంలో వాటాల్ని అమ్మడం అంటే నేరుగా ప్రభుత్వ పరిశ్రమల్ని బడా పెట్టుబడిదారులకు కారుచౌకగా కట్టబెట్టడమే చివరికి రిజర్వుబ్యాంకు మిగులు నిధుల్ని తరలించుకెళ్లి మరీ వారికి కట్టబెడుతున్నారు. బ్యాంకుల్ని విలీనం పేరుతో ప్రైవేటీకరణ వైపు నెట్టేశారు. రూపాయి విలువ 2014 సెప్టెంబర్‌లో ఒక డాలర్‌కి 59.44 రూపాయలుగా ఉంటే, 2019 నవంబర్‌లో 72 రూపాయలకు చేరింది. పరోక్షంగా ప్రజలపైన ఈ రూపాయి భారం పెరుగుతూనే ఉంది. అయినా పాలకులు ప్రతి బడ్జెట్లో వడ్డించే పరోక్ష పన్నులు ఏమాత్రం తగ్గడం లేదు.

భారత పాలకులు 1947 నుంచి వ్యవసాయ పారిశ్రామిక రంగాల్లోకి సామ్రాజ్యవాద పెట్టుబడిని, సాంకేతికతను ఆహ్వానిస్తున్నారు. సస్యవిప్లవం (గ్రీన్ రీవల్యూషన్) తీరుతెన్నులు, బడ్జెట్‌ను కొల్లగొట్టే పద్ధతులు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల దోపిడీ వంటివన్నీ కలిసి ఆర్థిక సంక్షోభానికి కారణమయ్యాయి. ఫలితంగా పెరుగుతున్న నిరుద్యోగం, పనిదినాల్లో కోత, వేతనాల్లో కోత, ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీలో కోతతో రైతాంగం దివాలాతీయడం, కార్మికుల చట్టాల సరళీకరణతో కార్మికుల జీవితాలు నిరంతరం అభద్రతలోకి వెళుతున్నాయి. తమ రెక్కల కష్టాన్ని, మేధో శ్రమను అమ్ముకోవడానికి నిత్యం ఎదురుచూసే శ్రామికులను, ఉద్యోగులను ఎంతటి వెట్టిచాకిరికైనా సిద్ధపడేట్టు చేస్తూ, తద్వారా పెట్టుబడిదారులకు మరిన్ని లాభాలు చేకూర్చే మానవ వనరుగా మన పాలకులు మారుస్తున్నారు.

తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభం

ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో ఉన్నప్పటికీ 2025 నాటికి 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్య సాధన దిశగా నడక బాగానే సాగుతున్నదని పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలి రోజున ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం విస్మయం కలిగిస్తోంది. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటున్నట్టుగా కల్పిత కథనాలను ఇస్తున్నప్పటికీ వాస్తవం అందుకు భిన్నంగా వుంది. ఇప్పుడున్న వృద్ధి రేటు ప్రకారం చూస్తే భారత్ వృద్ధి రేటు క్రమంగా క్షీణిస్తోంది. దేశ వృద్ధి రేటు ప్రస్తుతం 5 శాతం లోపలే (4.9 శాతం) ఉందని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకానమిక్ రిసెర్చ్ (ఎన్‌సిఎఇఆర్) తెలిపింది. అలాగే అమెరికాకు చెందిన అధ్యయన సంస్థ 'సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్' అంచనాలను నివేదిస్తూ భారత్‌లో వృద్ధి సానుకూల దిశలో లేనేలేదని పిటిఐ వార్తా సంస్థ ఒక కథనాన్ని వెలువరించింది. ఇతర ప్రధాన రేటింగ్ సంస్థలు కూడా మనదేశ వృద్ధి రేటును 5 శాతం లోపుగానే చెప్పాయి. ఐసిఆర్ఎ

4.7 శాతంగాను, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 4.2 శాతంగాను పేర్కొన్నాయి. వృద్ధి రేటు క్షీణత ప్రజల సంక్షేమం మీద తీవ్ర ప్రభావం చూపుతోంది. నిరుద్యోగాన్ని పేదరికాన్ని పెంచుతోంది.

వృద్ధిరేటు తగ్గడానికి ప్రధాన కారణం గిరాకీ తగ్గడం. అది గత రెండు సంవత్సరాలుగా క్రమేపీ తగ్గుతోంది. ప్రభుత్వ వ్యయం పెరిగినా వినియోగం తగ్గడంతో వృద్ధి రేటు పతనావస్థలోనే ఉంది. ప్రైవేటు పెట్టుబడులు స్తంభించిపోయాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో స్థూల మూలధన సమీకరణ మొదటి త్రైమాసికంలో 4 శాతం పెరిగితే రెండవ త్రైమాసికంలో 1 శాతం మాత్రమే పెరిగింది. కార్పొరేట్ సంస్థలు రుణాలు చెల్లించకపోవడం, బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వెనుకాడడం వల్ల, బ్యాంకింగేతర రంగంలో సంక్షోభం కారణంగా పెట్టుబడుల లభ్యత తగ్గింది. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఎటూ ఉంది. సుదీర్ఘ కాలం పాటు గిరాకీ తగ్గితే దీర్ఘకాలంలో ఉత్పత్తి సామర్థ్యాన్ని వినియోగించుకోవడం కూడా తగ్గుతుంది. పెట్టుబడులు పెట్టడంలో జాప్యం జరుగుతుంది. దీర్ఘకాలికంగా అభివృద్ధి కుంటుపడుతుంది.

గత ఆరు త్రైమాసికాలలో భారత దేశ స్థూల ఉత్పత్తి (జిడిపి) పెరుగుదల వరుసగా 8, 7, 6.6, 5.8, 5.5, 4.5 శాతంగా ఉంది. వృద్ధి రేటు పడిపోతుందని ఈ అంకెలు స్పష్టం చేస్తున్నాయి. ఇక వరుసగా గత నాలుగు ఆర్థిక సంవత్సరాలలో 2016-17, 2017-18, 2018-19, 2019-20 (ఆరు మాసాలు). వివిధ రంగాలలో పురోగతి ఇలా ఉన్నది. ఆయా సంవత్సరాలలో వివిధ రంగాలలో సాధించిన వృద్ధి శాతం వ్యవసాయం 6.3, 5.0, 2.9, 2.1, పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 4.6, 4.4, 3.9, 2.4, కీలక రంగాలు 4.8, 4.3, 4.4, 0.2, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పరపతి సదుపాయం 0.9, 0.4, 2.3, 2.7, తయారీ రంగం1.2, 1.7, 1.4, 0.7, నిరుద్యోగం 9.65, 4.03, 5.14, 7.05 శాతంగా ఉంది. ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో ఉందని తెలిసినా మోడీ ప్రభుత్వం స్పందించడం లేదు. అందుకే 'వ్యవస్థాగత' సమస్యలను పరిష్కరించవలసిన అవసరాన్ని నిరాకరిస్తోంది. ఆ సమస్యలు 'చక్రీయ' సమస్యలని, ప్రతి ఆర్థిక వ్యవస్థకు అవి సహజమని, అనివార్యమైనవని ప్రభుత్వం అంటోంది.

ఆర్థిక మాంద్యం కారణంగా అవ్యవస్థీకృత రంగం కూడా కుదేలైనా దీనికి సంబంధించిన ప్రభుత్వ గణాంకాలు అందుబాటులో లేవు. ఆర్థిక మాంద్యం లేబర్ మార్కెట్‌ను కూడా దెబ్బ తీసింది. భారత ఆర్థిక వ్యవస్థ పర్యవేక్షక కేంద్రం (సిఎంఐఇ) అంచనా ప్రకారం నిరుద్యోగం గత మూడేళ్లలో ఎన్నడూ లేనంతగా అక్టోబర్‌లో 8.45 శాతానికి పెరిగింది. నిరుద్యోగం సెప్టెంబర్‌లో 7.16 శాతం, ఆగస్టులో 8.19 శాతంగా నమోదయ్యాయి. సిఎంఐఇ నిర్వహించిన కన్స్యూమర్ పిరమిడ్స్ హౌజ్ హోల్డ్ సర్వే (సిపిహెచ్ఎస్) ప్రకారం కార్మికుల భాగస్వామ్యం 77 పాయింట్లు తగ్గి 2019 నవంబర్‌లో 42.3 శాతానికి చేరింది. ఇంత తక్కువ భాగస్వామ్యం నమోదు కావడం 2016 తరువాత ఇదే మొదటిసారి. 2016లోనే సిఎంఐఇ ఈ గణాంకాలు సేకరించడం ప్రారంభించింది. 25 రాష్ట్రాలకు సంబంధించిన సిపిహెచ్ఎస్ గణాంకాలు సేకరిస్తే అందులో 15 రాష్ట్రాలలో అక్టోబర్‌లో కన్నా నవంబర్‌లో కార్మిక భాగస్వామ్యం తగ్గినట్టు తేలింది. ఉపాధి కోల్పోవడం పెరిగి ప్రజల ఆదాయాలు తగ్గడం వల్ల గిరాకీ తగ్గింది.

మొదటి త్రైమాసికంలో వృద్ధిరేటు తగ్గినప్పటికీ ప్రభుత్వం గిరాకీ పెంచే చర్యలు తీసుకోలేదు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన సవ్యంగా అమలు కాలేదు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద బకాయిలూ చెల్లించలేదు. ఈ మొత్తమే రు. 25,000 కోట్లు దాటింది. గిరాకీ పెరగాలంటే ఉపాధి అవకాశాలు పెంచాలి. అయితే ఇది త్వరలో జరుగుతుందన్న ఆశలేదు. దేశంలో ఆర్థిక సరఫరాలో లోపాలు లేకుండా ఉంటేనే గిరాకీ పెరుగుతుంది. దీనికి విస్తృతమైన ద్రవ్య విధానం కావాలి. కార్పొరేట్లకు ఆర్థిక సహాయం వల్ల ఫలితం ఏమీ కనిపించడం లేదు. ఊహించినట్టుగా డిసెంబర్ 5న రిజర్వు బ్యాంకు వడ్డీ రేటు తగ్గించలేదు. రెపో రేట్లూ మారలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిడిపి వృద్ధి రేటు 6.1 శాతం ఉంటుందని ముందు వేసిన అంచనాలను 5 శాతానికి కుదించక తప్పలేదు.

2019-20 ఆర్థిక సంవత్సరం రెండవ అర్థభాగంలో చిల్లర ద్రవ్యోల్బణం 3.5 నుంచి 3.7 శాతం మధ్యన ఉంటుందని అంచనా వేస్తే అది ఇప్పుడే 5.6 శాతం ఉంది. మరోవైపు అక్టోబర్ నాటికే ద్రవ్యలోటు లక్ష్యానికన్నా వంద శాతం పెరిగింది. ఈ పరిస్థితిలో ద్రవ్యలోటును 3.3 శాతానికి పరిమితం చేయాలన్న ప్రభుత్వ నియమాన్ని సడలించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ వ్యయం తగ్గిస్తే అభివృద్ధి రేటు మరింత కుంగుతుంది. పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి -1 శాతానికి పడిపోయింది. వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాల్లో జిపిఎ వృద్ధి 2.92 శాతానికి పతనమైంది. ప్రైవేటు వినియోగం, మదుపు, ఎగుమతులు మందగించాయి. మరోవైపున, ప్రభుత్వ ఆదాయం తగ్గుదల కారణంగా, ద్రవ్యలోటు పూర్తి సంవత్సరానికి బడ్జెట్‌లో అంచనా వేసుకున్న రు.7.04 లక్షల కోట్లకు మించి రు.7.20 లక్షల కోట్లకు తొలి 6 మాసాల్లోనే చేరింది. అయినా ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగం పుంజుకోవాలంటే ద్రవ్యలోటుపై ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని మించక తప్పదు.

2019 మార్చి నాటికి 10.6 శాతం ఉన్న వినియోగం జూన్ 2019 నాటికి 3.1 శాతానికి పడిపోయి గడచిన 18 త్రైమాసికాల్లో కనిష్ఠ స్థాయికి దిగజారినట్లు ఆగష్టులో ఎకనామిక్స్ టైమ్స్ రాసింది. దేశంలో వస్తు వినియోగం తగ్గిపోవడం వల్లనే అన్ని పారిశ్రామిక రంగాలూ దిగాలు పడ్డాయి. ప్రజల వినియోగ శక్తిని పెంచితేగానీ ఈ దుర్గతి నుంచి అవి బయటపడవు. కేంద్ర ప్రభుత్వం ఆ వైపుగా తీసుకుంటున్న చర్యలు స్వల్పం. కార్పొరేట్లకు పన్ను మినహాయింపులు ఇస్తూ పోవడం వల్ల ప్రయోజనం శూన్యమేనని తెలిసి కూడా కేంద్రం అదేవైపుగా పదే పదే ఉద్దీపనలు ప్రకటిస్తోంది. కానీ, ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి తీసుకోవాల్సిన బహుముఖ చర్యలవైపు కొంచెమైనా ఆలోచించడం లేదు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితేనే ఆర్థిక కార్యకలాపాలు పుంజుకుని ప్రజల చేతికి డబ్బు వస్తుంది, ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. అందువల్ల మోడీ ప్రభుత్వానికి వచ్చే ఆరు మాసాలు పరీక్షా సమయం.

ఆదాయాలలో పెరుగుతున్న వ్యత్యాసాలు

1991లో ప్రారంభమైన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల (ఎల్‌పిజి)తో అభివృద్ధి పేరిట సాధించిన సంపద 99 శాతం పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లింది. 1శాతం జనాభా వద్ద 73 శాతం సంపద పోగుపడింది. 'జనాభాలో అతి తక్కువ శాతంగా ఉండే శత

కోటీశ్వరుల' ఆదాయాలు విపరీతంగా పెరుగుతూ పోతున్నాయి. అదే సమయంలో దిగువ, మధ్య స్థాయిలలోని అత్యధిక మెజారిటీ ప్రజల ఆదాయాలు పెరగకుండా స్తంభించిపోవడమో లేక తగ్గిపోవడమో జరుగుతోంది. మరోవైపు గ్రామ, పట్టణ ప్రాంతాల మధ్య ఆర్థిక అభివృద్ధిలో వ్యత్యాసాలు అధికంగా ఉన్నాయి. పట్టణ కార్మికుని వేతనం సగటు కార్మికుడి రాబడి కంటే ఎనిమిది రెట్లు ఎక్కువగా ఉందని నీతి ఆయోగ్ నివేదిక చెబుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య పెరుగుతున్న అంతరం వారి వినియోగం, జీవన నాణ్యత, భౌతిక, సామాజిక మౌలిక సదుపాయాల లభ్యతలో అసమానతలకు కారణమవుతోంది. జనాభాలో దాదాపు 45 శాతం వ్యవసాయరంగంపై ఆధారపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో వేరే ఉపాధి అవకాశాలు లేక బతుకుతెరువు కోసం అవసరానికి మించి వ్యవసాయంపై ఆధారపడినట్లు దీన్ని బట్టి బోధపడుతోంది.

ప్రజల ఆదాయాలు పెరగనప్పుడు సరుకుల అమ్మకాలు పుంజుకోవడానికి 2008 సంక్షోభానికి మునుపు అరువు పద్ధతిని అనుసరించారు. క్రెడిట్ కార్డులు, రుణాల ద్వారా వినియోగదారులకు సరుకులను కొనే వీలు కల్పించారు. కొంత కాలానికి ఈ అప్పులను తీర్చకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. ఆ రిస్కును రకరకాల పద్ధతుల ద్వారా (ఇన్సూరెన్స్, హెడ్జ్ ఫండ్స్ వగైరా) ఆర్థిక సంస్థలకు బదలాయించారు. అయితే ఇది ఎక్కువ కాలం కొనసాగలేదు. అంతిమంగా 2008లో మహా మాంద్యం నెలకొనడానికి దారి తీసింది. మళ్లీ ఇప్పుడు డిమాండ్‌ను (కొనుగోలు శక్తిని) పెంచవలసిన అవసరం ఏర్పడింది. అయితే కార్మికుల వేతనాలను పెంచకుండా, కొత్త ఉద్యోగాలు కల్పించకుండా కొనుగోలు శక్తిని పెంచేదెలా? వేతనాలను పెంచాలన్నా, కొత్త ఉద్యోగాలు కల్పించాలన్నా పెట్టుబడిదారుల లాభాలు తగ్గిపోతాయి. దానికి ఆ వర్గం సుతరామూ అంగీకరించదు. కొనుగోలు శక్తి పెంచేందుకు వేరే మార్గం ప్రభుత్వం వద్ద లేదు. అందుకే మరో మహామాంద్యం తలెత్తనుందన్న భయాలు పెరుగుతున్నాయి.

ప్రతి సంవత్సరం 50 లక్షల మంది యువతీ యువకులు ఉద్యోగార్థులుగా శ్రామిక మార్కెట్లో చేరుతున్నారు. అయినప్పటికీ ఆర్థిక వ్యవస్థలో కార్మికుల భాగస్వామ్యం 43 శాతం (2004-2005) నుంచి (2017-2018)లో 36.9 శాతానికి పడిపోయింది. ఈ కాలంలో మహిళా కార్మికుల వాటా 29.4 నుంచి 17.5 శాతానికి క్షీణించింది. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల కల్పనతో అచ్చేదిన్ (మంచి రోజులు) తీసుకొస్తానన్నది మోడీ వాగ్దానం. అయితే జరిగింది వేరు. నూతన ఉద్యోగాల కల్పన జరుగకపోగా మోడీ ప్రభుత్వ అనుచిత విధానాల వల్ల కోటి మంది ఉపాధి కోల్పోయారు. 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్కులైన నిరుద్యోగ యువత 2004-05లో ఏడు కోట్లు వుంటే, 2017-18 నాటికి వారి సంఖ్య 11.56 కోట్లకు పెరిగింది. ఇవాళ 12 కోట్లు ఉన్నట్లు అంచనా.

పాలకుల బుకాయింపు దబాయింపులు

ఆర్థిక వ్యవస్థలో మాంద్యం ఏదీ లేదని కొంతకాలంగా చెబుతూ వచ్చిన మోడీ ప్రభుత్వం కూడా ఒక మెట్టు దిగివచ్చి కొంత మందగమనం చోటు చేసుకున్న మాట వాస్తవమని అంగీకరించక తప్పలేదు. ఆర్థిక వ్యవస్థను మాంద్యం నుంచి వెలుపలికి తెచ్చేందుకు ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విదేశీ పెట్టుబడుల నిబంధనల సరళీకరణ, కార్పొరేట్ పన్ను తగ్గింపు, బ్యాంకులు కన్సాలిడేషన్, జిఎస్‌టి పన్నుల్లో మార్పులతో పాటు ఆర్‌బిఐ కొద్ది కాలంగా కీలక రేపోరేటును తగ్గించడం వంటి చర్యలు చేపడుతూనే దేశంలో 2019 నుంచి ద్రవ్యోల్బణం రేటు పెరుగలేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గత సెప్టెంబర్ చివరలో ప్రకటించింది. అయితే నవంబర్ మాసానికి రిటైల్ ద్రవ్యోల్బణం 5.6 శాతానికి పెరిగింది. అందులో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 10 శాతానికి మించి వినియోగదారుల్ని హడలెత్తిస్తోంది.

దేశాన్ని చుట్టుముడుతున్న ఆర్థిక సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం బుకాయిస్తున్న తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. రాజ్యసభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ 'దేశంలో ఆర్థిక మాంద్యం లేదు. రాబోదు'! ద్రవ్యరంగ స్థితిగతులపై రాజ్యసభా ముఖంగా కేంద్ర ఆర్థిక మంత్రి స్పందన అది. పోనుపోను ముంచుకొస్తున్న సంక్షోభం ఉనికినే ఆర్థికమంత్రి గుర్తించ నిరాకరించడం ఎందరినో విస్మయపరచింది. అలాగే నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజేంద్రకుమార్ మాత్రం పరిస్థితి అంత దారుణంగా ఏమీ లేదని, ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో వృద్ధిరేటు 7 శాతానికి పుంజుకుని ఏడాది మొత్తానికి కూడా మెరుగైన వృద్ధికి దోహదకారి అవుతుందన్న నమ్మకంతో ఉన్నారు. కానీ పరిస్తితులు అలా కనిపించడం లేదు.

ఆర్థిక వ్యవస్థ మాంద్యానికి సంబంధించిన సంకేతాలు కొత్తవేం కావు. కొంత కాలంగా ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లతో పాటు వివిధ రేటింగ్ సంస్థలు ఈ విషయాన్నే స్పష్టం చేశాయి. దేశంలో అంతర్గతంగా చోటు చేసుకుంటున్న వివిధ పరిణామాలు కూడా ఇదే విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. అయినా, ఇవేమీ పట్టనట్టు, అసలు సమస్యే లేదన్నట్లు చిత్రీకరించడానికి ప్రభుత్వం ప్రయత్నించడం బాధ్యతారాహిత్యం. పార్లమెంటు శీతకాల సమావేశాలు ప్రారంభమైన తొలి రోజే ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి దిశలో భారత్ పరుగులు తీస్తోందని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ జి-20 దేశాల్లోనే అత్యధిక వృద్ధి సాధిస్తున్నామంటూ ఇచ్చిన రాతపూర్వక సమాధానికి కొనసాగింపుగా సభ్యులు అడిగిన అనుబంధ ప్రశ్నలకు ఆర్థికశాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ భారత్ 6.1 శాతం వృద్ధి సాధిస్తుందంటూ ఐఎంఎఫ్ కూడా చెప్పింది చూడండంటూ దబాయింపొకటి! కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ లెక్కల ప్రామాణికంగానే ఐఎంఎఫ్ అంచనాలు రూపొందాయన్న వాస్తవాన్ని మంత్రి ఉద్దేశ్యపూర్వకంగానే దాచి పెట్టారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత్ 7 శాతం వృద్ధి సాధిస్తుందని ఐఎంఎఫ్ జూలై నెలలో అంచనా వేసింది. అక్టోబర్ నాటికి ఈ అంచనాల్లో కోత పెట్టి 6.1 శాతానికి పరిమితం చేసింది. ఈ తగ్గింపు విషయాన్ని దాచిపెట్టి అర్థసత్యాన్నే చెప్పడం ద్వారా సభను తప్పుదోవ పట్టించడానికి మంత్రి ప్రయత్నించడం దారుణం.

ఆర్థిక వ్యవస్థలో మందగమనం నిజం కాకపోతే కార్పొరేట్ రంగానికి హడావిడిగా భారీ రాయితీలు ఎందుకు ప్రకటించినట్టు? దేశమంతా విమర్శలు వ్యక్తమవుతున్నా కార్పొరేట్ టాక్స్ రేటును కేంద్ర ప్రభుత్వం ఎందుకు తగ్గించింది. వడ్డీ రేట్లను 135 బేసిస్ పాయింట్లకు తగ్గించేలా

రిజర్వు బ్యాంకుపై ఒత్తిడి తీసుకువచ్చింది ఎవరి కోసం? రూపాయలు 1.76 లక్షల కోట్లు రిజర్వు బ్యాంకు మిగులు నిధులను హడావిడిగా దారి మళ్లించింది ఎవరి ప్రయోజనాల కోసం? ఎన్నికల్లో తమకు దన్నుగా నిలిచిన కార్పొరేట్లకు లబ్ధి చేయడానికి గదా! కార్పొరేట్లకు చేస్తున్న ఈ మేళ్లను దాచి పెడుతున్న ప్రభుత్వ పెద్దలు అదే సమయంలో మాంద్యం గురించి మాట్లాడిన వారిపై విరుచుకు పడుతున్నారు. రైళ్లలో నిలబడటానికి కూడా స్థలం లేదు. బస్సుల్లో ఎక్కడమే సాధ్యం కావడంలేదు. ప్రజలు పెళ్లిళ్లు చేసుకుంటూనే ఉన్నారు. పిల్లలను కంటూనే ఉన్నారు. మాంద్యం ఎక్కడుంది? అని ప్రశ్నించడ మంటే, ప్రజలంటే లెక్కలేని తనానికి నిదర్శనం.

నాలుగు దశాబ్దాల్లోనే అత్యధికంగా నమోదైన నిరుద్యోగ గణాంకాలను బయట పెట్టడానికి మోడీ ప్రభుత్వం ససేమిరా అనడానికి కారణమేంటి? ఈ కాలంలోనే సామాన్యుల కొనుగోలు శక్తి గణనీయంగా క్షీణించిందనడానికి సాక్ష్యంగా నిలిచే జాతీయ గణాంకాల సంస్థ నిర్ధారణలకు మోకాలడ్డు పెట్టిందీ కేంద్రమే కదా! వీటిని ప్రజల ముందుకు తీసుకురావడానికి పాత్రికేయులు ఎందుకు శ్రమించాల్సి వచ్చింది? ఇవన్నీ దాచేస్తే దాగని సత్యాలు! కొందరు ఆర్థిక రంగ నిపుణులు దేశం ఇప్పటికే సంక్షోభ చక్రబంధంలో చిక్కుకుందని చెబుతున్నారు. మృగ్యమవుతున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, కుదించుకుపోతున్న ప్రజల జీవన ప్రమాణాలు, మూతపడుతున్న పరిశ్రమలు, కునారిల్లుతున్న వ్యవసాయం, పెరుగుతున్న రైతుల, నిరుద్యోగుల ఆత్మహత్యలు, ఛిన్నాభిన్నమైన వ్యవసాయ కూలీల జీవితాలను వారు ఉదాహరణలుగా చూపుతున్నారు. అయినా ఈ జీవన విధ్వంస దృశ్యాలను కప్పిపుచ్చడానికి ఉద్దేశ్యపూర్వకంగా కేంద్రం ప్రయత్నిస్తోంది.

వృద్ధిరేటు క్షీణతకు కారణాలు

భారత వృద్ధిరేటు ఇంత దారుణమైన స్థితికి దిగజారడానికి ఏదో ఒక్క కారణం చెప్పడం ఏమాత్రం సాధ్యం కాదు. ఇందుకు దేశీ, విదేశీ అంశాలు ఎన్నో దోహదపడ్డాయి. ప్రధానంగా 2016 సంవత్సరంలో మోడీ-1 ప్రభుత్వం ప్రకటించిన డీమానిటైజేషన్ ప్రభావం నుంచి ఆర్థిక వ్యవస్థ ఇంకా పూర్తిగా బయటపడలేదన్నది నిర్వివాదమైన అంశం. అలాగే 2017 జూలై ఒకటో తేదీ నుంచి ప్రవేశపెట్టిన వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) విధానం కూడా ఇంకా పూర్తి స్థాయిలో నిలదొక్కుకోలేదు. గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాల ప్రభావం వల్ల నిరుద్యోగిత రేటు పెరిగిపోయింది. గ్రామీణ ఆర్థిక రంగంలో కూడా వేగం గణనీయంగా తగ్గింది. ఫలితంగా డిమాండు గణనీయంగా క్షీణించడం కూడా వృద్ధిరేటుపై ప్రభావం చూపింది. దేశీయ అంశాలతోపాటు వృద్ధిరేటు క్షీణతకు కారణమైన విదేశీ అంశాలు కూడా ఎన్నో ఉన్నాయి. మనది ఎగుమతుల ఆధారిత ఆర్థిక వ్యవస్థ. ప్రపంచ దేశాల్లో అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, బ్రెగ్జిట్ అనిశ్చితి, యూరోపియన్ దేశాల్లో కల్లోలం, చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థల్లో ప్రతికూల పరిస్థితుల ప్రభావం వల్ల విదేశాల్లో వస్తుసేవల డిమాండు గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఎగుమతులు గణనీయంగా క్షీణించడం భారత్ వృద్ధిరేటును ప్రభావితం చేశాయి. వృద్ధిరేటు క్షీణతకు కారణాలు విడివిడిగా చూద్దాం.

డీమానిటైజేషన్

నల్లధనాన్ని అదుపులోకి తెచ్చి ఆర్థిక కార్యకలాపాలన్నింటినీ వ్యవస్థీకరించే లక్ష్యంతో ప్రభుత్వం 2016 నవంబరులో డీమానిటైజేషన్ ప్రకటించింది. ఇందులో భాగంగా నవంబర్ 8వ తేదీ అర్ధరాత్రి నుంచి దేశంలో అప్పటికి చలామణిలో ఉన్న 500,1000 రూపాయల నోట్లు రద్దయిపోయాయి. ఫలితంగా 86 శాతం నగదు చలామణికి పనికిరానిదిగా మారిపోయింది. ప్రభుత్వం ఆకస్మికంగా పెద్దనోట్లు రద్దు చేయడం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు కొంత సమయం పట్టడం, డిజిటల్ లావాదేవీలకు ప్రజలు అలవాటు పడేందుకు పట్టిన జాప్యం వంటివి ఆర్థిక వ్యవస్థను కుంగదీశాయి. ప్రజల చేతిలో డబ్బు ఆడని పరిస్థితి ఏర్పడింది. డీమానిటైజేషన్ ఆర్థిక వ్యవస్థపై అత్యంత సానుకూల ప్రభావం చూపుతుందని ప్రభుత్వం అప్పట్లో గట్టి విశ్వాసం ప్రకటించినా అది అమలులోకి వచ్చిన మూడున్నర సంవత్సరాల తర్వాత కూడా ఆ చర్యపై మిశ్రమ అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఇటీవల నిర్వహించిన ఒక సర్వే ప్రకారం డీమానిటైజేషన్ వల్ల అవ్యవస్థీకృత రంగంలోని కార్మికులు భారీగా ఆదాయాన్ని నష్టపోయారని తేలింది. అలాగే వ్యవసాయ కార్మికులు, రోజువారీ కూలీలు, అల్పాదాయ వర్గాలు డీమానిటైజేషన్ ప్రభావానికి అధికంగా లోనయ్యారని పలు సర్వేలు తేల్చాయి. వారందరికీ తిరిగి యథాపూర్వంగా ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకునేందుకు ఏడాదికి పైగా గడువు పట్టింది.

వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) ప్రభావం

మోడీ-1 ప్రభుత్వం చేపట్టిన జిఎస్‌టి, 2017 జూలై ఒకటో తేదీ నుంచి దేశంలో అమలులోకి తెచ్చింది. ఫలితంగా దేశంలో అప్పటికీ కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అమలులో ఉన్న 17 రకాల పన్నులు రద్దయిపోయి దేశం అంతటా ఒకే పన్ను వ్యవస్థ అమలులోకి వచ్చింది. వస్తుసేవల రవాణాలో గతంలో ఉన్న రాష్ట్రాల హద్దులు కూడా చెరిగిపోయి దేశం అంతా ఒకే మార్కెట్‌గా మారింది. ఒక దేశం-ఒకే పన్ను దీని మూలసూత్రం. అయితే భారతదేశ ఫెడరల్ స్వభావం కారణంగా జిఎస్‌టి వ్యవస్థకు అందరి ఆమోదం పొందడంలో ప్రభుత్వం ఎన్నో విమర్శలు ఎదుర్కొంది. జిఎస్‌టి ద్వారా నెలకు లక్ష కోట్ల రూపాయల పన్ను రాబడి ఆర్జించాలన్న లక్ష్యం సాధించడానికి ప్రభుత్వానికి కొన్ని నెలలు పట్టింది. ఇప్పటికీ జిఎస్‌టి వసూళ్లు అప్పుడప్పుడూ లక్ష కోట్ల రూపాయల కన్నా దిగజారుతూ ఉంటాయి. జిఎస్‌టి అమలు కోసం వ్యాపార, వాణిజ్య సంస్థలన్నీ కొత్త సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఇది కూడా చిన్న, మధ్య తరహా వ్యాపార, పారిశ్రామిక సంస్థలకు భారం అయింది. అలాగే కొత్త పన్ను వ్యవస్థలో గతంలో తక్కువ పన్నురేటు ఉన్న కొన్ని వస్తువులు ఎక్కువ శ్లాబ్‌లోకి వచ్చాయి. సగటు మనిషి విరివిగా ఉపయోగించే కొన్ని వస్తువులపై పన్ను పెరిగింది. ఇవన్నీ భారత వృద్ధిరేటుపై పరోక్ష ప్రభావం చూపాయి.

డిమాండులో క్షీణత

విప్లవాత్మక సంస్కరణలుగా చెబుతున్న డీమానిటైజేషన్, జిఎస్‌టి ప్రభావం వల్ల ఆర్థిక వ్యవస్థలో వినియోగం గణనీయంగా క్షీణించి పోయింది. 130 కోట్ల జనాభా గల భారత ఆర్థిక వ్యవస్థకు జిడిపిలో

55 నుంచి 58 శాతం వాటా దేశీయ వినియోగానిదే. ప్రజల చేతిలో ఖర్చు చేయడానికి అవసరమైనంత నగదు చలామణిలో లేకపోవడంవల్ల వారు వ్యయాలను కుదించుకోవాల్సి వచ్చింది. ఫలితంగా దేశంలో వస్తుసేవల డిమాండు తగ్గిపోయి వినియోగం క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. దీనికితోడు బ్యాంకింగ్ వ్యవస్థలో పేరుకుపోయిన మొండి బకాయిల ప్రభావం వల్ల అవి రుణవితరణ తగ్గించేశాయి. ఒక దశలో బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలు లేదా నిరర్థక ఆస్తుల (వీటినే ఎన్‌పిఏలుగా వ్యవహరిస్తారు) పరిమాణం 11 శాతం దాటిపోయింది. అంటే బ్యాంకులు ఇచ్చిన మొత్తం రుణాల్లో వసూలుకు సాధ్యం కాని లేదా వసూళ్లు సంక్లిష్టంగా మారిపోయిన రుణాల వాస్తవ పరిమాణం సుమారు రు. 10 లక్షల కోట్లను దాటిపోయింది.

(బ్యాంకుల్ని నిండా ముంచే 525 మంది మొండి బకాయిదారులకు ఐదేళ్లలో రైట్ ఆఫ్ అయినా మొత్తం విలువ రు. 5.17 లక్షల కోట్లు ఉందని ఆర్.బి.ఐ. గణాంకాలు చెబుతున్నాయి.) ప్రభుత్వం తీసుకున్న రుణాల రద్దు చర్యల కారణంగా ఎన్‌పిఏలు తగ్గుముఖం పట్టి ప్రస్తుతం రు. 7.9 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నాయి. నిరర్థక ఆస్తుల రద్దు 2014 ముందుతో పోలిస్తే 8 రెట్లు పెరిగింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఐఎల్ అండ్ ఎఫ్ఎస్) మూసివేసినప్పటి నుంచి బ్యాంకింగేతర ద్రవ్య సంస్థలు అనేకం సంక్షోభంలో పడ్డాయి. దాంతో వ్యాపార, పారిశ్రామిక సంస్థలు, వాటి ఉత్పత్తులు, వాటికి రుణాలు అందించే ద్రవ్య సంస్థలు అతలాకుతలం అవుతున్నాయి. గృహోపకరణాలు, ఆటోమొబైల్, రియల్ ఎస్టేట్ వంటి విభాగాలకు బ్యాంకుల రుణవితరణే కీలకం. బ్యాంకులు ఎన్‌పిఏలకు భయపడిపోయి రుణవితరణ తగ్గించడం వల్ల వాయిదాల పద్ధతిలో వస్తువులు కొనుగోలు చేసే వారి సంఖ్య కూడా తగ్గింది. గత కొన్ని నెలలుగా అయితే పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారిపోయింది. ఈ ఏడాది జనవరి–మార్చి త్రైమాసికంలో 7.2 శాతం ఉన్న ప్రైవేటు తుది వినియోగ వ్యయం ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో 3.1 శాతానికి పడిపోవడమే ఇందుకు ప్రబల నిదర్శనం.

ప్రభుత్వ రంగ ఆస్తుల విక్రయం

ఎన్‌పిఏ రద్దు ద్వారా అస్మదీయ కార్పొరేట్ల కొమ్ము కాస్తున్న బిజెపి ప్రభుత్వం ఇప్పుడు ఆశ్రిత పెట్టుబడిదార్లకు లాభించేలా పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ మొదలెట్టింది. పన్ను వసూళ్లలో తగ్గుదల ఒకవైపు ఉండగా మరోవైపు ఎన్‌పిఏల ద్వారా ఆర్థిక వ్యవస్థ లూటీ కారణంగా మున్నెన్నడూ లేని విధంగా బ్యాంకింగ్ రంగం సంక్షోభంలో పడిపోయింది. ఈ లోటు భర్తీ చేసుకోవడం కోసం రు. 1.76 లక్షల కోట్లను ఆర్‌బిఐ నుండి మిగులు నిధులను మోడీ ప్రభుత్వం లాగేసుకుంది. అంతేగాక ప్రభుత్వ రంగ బ్యాంకుల బెయిలవుట్ల కోసం, ప్రభుత్వ ఆదాయం కొరతను తీర్చుకోవడం కోసం ఎల్‌ఐసి వంటి ప్రభుత్వ రంగ సంస్థల దగ్గర ఉన్న ప్రజల సొమ్మును, ప్రజల జీవిత కాల పొదుపు నిధులను దారి మళ్లించాలని ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

అప్పుల్లో మునిగిపోయిన ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడిబిఐ) కు బెయిలవుట్ కోసం రు. 21,000 కోట్ల పెట్టుబడి పెట్టమని ఎల్‌ఐసిని నిర్బంధించింది. లక్షలాది మంది ఉద్యోగుల ప్రావిడెండ్ ఫండ్, పింఛన్‌ను, ఇన్సూరెన్స్ పథకాల నిధులను వాడుకునే ప్రయత్నం చేస్తున్నది. ఇపిఎఫ్ దగ్గర సుమారు రు. 10 లక్షల కోట్ల కార్పస్ నిధి ఉంది. ప్రభుత్వం ఈ డబ్బును కూడా వాడుకోవడం మొదలెడితే దేశంలో కోట్లాది మంది ఉద్యోగుల భద్రతకు మునుపెన్నడూ లేనంత ముప్పు వాటిల్లుతుంది. రైల్వే, ఎయిర్ ఇండియా ఎంటిఎస్ఎల్, బిఎస్ఎన్ఎల్, బిపిసిఎల్ వంటి ప్రధాన ప్రభుత్వ సంస్థలతో సహా ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరించ పూనుకుంది. దీనివల్ల ఉద్యోగాల నుంచి తొలగింపు భారీగా సాగుతుంది. నిరుద్యోగం దారుణంగా పెరుగుతుంది. అంతకంటే ముఖ్యంగా ఈ తతంగం భారత ఆర్థిక సార్వభౌమత్వానికి వెన్నెముక లాంటి ప్రభుత్వ రంగాన్ని బలహీన పరుస్తుంది. అది దేశానికి, దేశ ప్రజల సంక్షేమానికి కూడా నష్టదాయకం.

పెట్టుబడుల క్షీణత

దేశంలో ప్రస్తుతం నెలకొన్న మాంద్యం పరిస్థితుల నేపథ్యంలో ప్రైవేటు పారిశ్రామిక వేత్తలు కొత్త పెట్టుబడులు తగ్గించేశారు. వస్తు సేవలకు డిమాండ్ ఉన్నప్పుడే ఆ డిమాండ్‌ను తట్టుకునేందుకు పరిశ్రమలు ఉత్పత్తిని పెంచుతాయి. డిమాండ్ తగ్గిపోతుంటే అదే స్థాయిలో ఉత్పత్తులు కూడా తగ్గించేస్తాయి. ఉత్పత్తి తగ్గితే కార్మికుల సంఖ్య తగ్గించేందుకు కూడా అవి వెనుకాడవు. ఇదంతా ఒక చక్ర భ్రమణం. ఇవన్నీ కూడా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అంశాలే. కార్మిక శక్తి తగ్గించే క్రమంలో కొత్తగా ఉద్యోగాల కల్పన లేకపోవడం, పని చేస్తున్న వారిని కూడా రిట్రెంట్ చేయడం వంటి చర్యల వల్ల దేశంలో నిరుద్యోగిత పెరిగిపోతుంది. డిమాండులో క్షీణత కారణంగా ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో ప్రైవేటు రంగంలో కొత్త ప్రాజెక్టుల విలువ 79.5 శాతం క్షీణించిందని గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రైవేటు కంపెనీలు ప్రకటించిన కొత్త ప్రాజెక్టుల విలువ కేవలం రు. 71,337 కోట్లుంది. 2004 సెప్టెంబర్ తర్వాత ప్రైవేటు పెట్టుబడులు ఇంత కనిష్ట స్థాయిలో ఉండడం ఇదే ప్రథమం.

2017–2018లో కొత్త పెట్టుబడి 10.15 శాతం క్షీణించి రు. 1.65 లక్షల కోట్లకు దిగజారాయని ఆర్‌బిఐ తెలిపింది. ఇలా ప్రైవేటు కార్పొరేట్ పెట్టుబడిలో క్షీణత ఏర్పడడం ఇది వరుసగా ఏడో సంవత్సరం. ఫలితంగా పారిశ్రామికోత్పత్తి, పరిశ్రమల సామర్థ్య వినియోగాలు కూడా గణనీయంగా పడిపోయాయి. తయారీ రంగానికి సంబంధించిన పారిశ్రామికోత్పత్తి సూచీలో సగటు వృద్ధిరేటు 2011–12 నుంచి 2018–19 సంవత్సరాల మధ్య కాలంలో 2.8 నుంచి 4.8 శాతం మధ్యకే పరిమితం అయిపోయింది. అంతకు ముందు 2004–05 నుంచి 2011–12 మధ్య కాలంలో ఈ వృద్ధిరేటు సగటున 10 శాతం ఉంది. పరిశ్రమలకు బ్యాంకుల రుణవితరణ 2010 సంవత్సరంలో 24.4 శాతం ఉండగా 2019 నాటికి 6.9 శాతానికి తగ్గిందని కూడా ఆ నివేదిక తెలిపింది. పారిశ్రామిక రంగంలో కొత్త పెట్టుబడుల నిరాసక్తత ఎంత తీవ్రంగా ఉన్నదో ఈ గణాంకాలు దర్పణం పడుతున్నాయి.

ఫలితంగా దేశంలో గత రెండేళ్లలో ఉపాధిలో వృద్ధి మందగించింది. ఉపాధి కల్పనలో వృద్ధిరేటు 2017–18లో 3.9 శాతానికి, 2018–19లో 2.8 శాతానికి పరిమితం అయింది. సాధారణంగా అయితే ఉపాధి కల్పన విభాగంలో వృద్ధిరేటు జిడిపితో అనుసంధానమై ఉండాలి. కానీ

మనదేశంలో అది జరగడంలేదు. జిడిపి వృద్ధిరేటుకు, ఉపాధి వృద్ధిరేటుకు మధ్యన దీర్ఘకాలంగా పొంతనలేదు. ఇందుకు కారణం ఉపాధి రహిత వృద్ధి (పెట్టుబడి కేంద్రీకృత ఉత్పత్తి విధానం) విధానం అమలు చేయడమే. మరోవైపు కేంద్ర ప్రభుత్వం రెవెన్యూ, కాపిటల్ వ్యయాలు కూడా 2010-11 నుంచి తగ్గుతూ వస్తున్నాయి. 2010-11లో జిడిపిలో 15.4 శాతం ఉన్న ప్రభుత్వ స్థూల పెట్టుబడులు 2018-19 నాటికి 12.2 శాతానికి తగ్గిపోయాయి. ఇందులో కాపిటల్ వ్యయాలు 2010-11లో జిడిపిలో 2 శాతం ఉండగా 2018-19 నాటికి 1.6 శాతానికి పడిపోయాయి. ఇదే కాలంలో రెవెన్యూ వ్యయాలు 13.4 శాతం నుంచి 10.6 శాతానికి క్షీణించాయి. వార్షిక బడ్జెట్‌లో ద్రవ్యలోటును జిడిపిలో 4.8 శాతం (2010-11) నుంచి 2018-19 నాటికి 3.4 శాతానికి తగ్గించాలన్న ప్రభుత్వ లక్ష్యం ప్రభుత్వ పెట్టుబడులకు పగ్గాలు వేసింది. కొత్త పెట్టుబడులు 2018-19 డిసెంబర్ త్రైమాసికం నాటికి 14 సంవత్సరాల కనిష్ట స్థాయి రు. 50,604 కోట్లకు దిగజారినట్టు సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ సంస్థ నివేదిక తెలిపింది. 2004 సంవత్సరం తర్వాత పెట్టుబడులు ఇంత కనిష్ట స్థాయికి పడిపోవడం ఇదే ప్రథమం. అలాగే ప్రభుత్వ ఆదాయాలు తగ్గడం కూడా కొత్త పెట్టుబడులకు కళ్లెం వేసే మరో కారణమవుతోంది.

ప్రభుత్వ ఆదాయాలు 2010-11లో జిడిపిలో 10.1 శాతం నుంచి 2018-19 నాటికి 8.2 శాతానికి క్షీణించినట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. ఆదాయంలో ప్రధాన భాగం అయిన పన్ను వసూళ్లు అదే సమయంలో 7.3 శాతం నుంచి 6.9 శాతానికి, పన్నేతర ఆదాయాలు 2.8 శాతం నుంచి 1.3 శాతానికి క్షీణించాయి. ఈ ఏడాది ముగిసే సమయానికి 12 శాతం వృద్ధితో రు. 16.5 లక్షల కోట్ల ఆదాయం సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. కానీ వాస్తవం ఇందుకు భిన్నంగా ఉంది. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో పన్నుల ద్వారా ఆదాయం రు. 2,51,411 కోట్లు ఉన్నట్టు కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ గణాంకాలు తెలుపుతున్నాయి. 2018-19 మొదటి త్రైమాసికంలో వసూలైన రు. 3,29,250 కోట్ల కన్నా చాలా తక్కువ. ఈ పరిస్థితిలో ప్రభుత్వం నిర్దేశిత ఆదాయ లక్ష్యం ఎలా సాధించగలదన్నది వేచి చూడాలి. ఏది ఏమైనా ప్రభుత్వ ఆదాయాలు కూడా పెట్టుబడుల పునరుజ్జీవానికి ఎంత వరకు మద్దతు ఇస్తాయన్నది కూడా సందిగ్ధమే.

వ్యవసాయ సంక్షోభం

దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం వ్యవసాయం. మనదేశ జనాభాలో 67 శాతం మందికి పైగా గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. వారందరికీ వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలే ఆలంబనగా ఉన్నాయి. వ్యవసాయ రంగం భారత జిడిపికి 14 శాతం వాటా అందిస్తోంది. గ్రామీణ జనాభాలో 60 శాతం మందికి ఉపాధి కల్పిస్తోంది. దేశ ఆహార భద్రతకు కూడా ఈ రంగం అత్యంత కీలకమైనది. వ్యవసాయ రంగం ఏటా నాలుగు శాతం వృద్ధిని సాధిస్తే తప్ప దేశ ప్రజలకు ఆహార భద్రత సాధ్యం కాదని ఎందరో నిపుణులు తేల్చి చెబుతున్నారు. కాని భారత్‌లో అధిక శాతం వర్షాధారిత వ్యవసాయం కావడం వల్ల అధిక వర్షపాతం ఏర్పడినా, తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా వ్యవసాయ రంగం దెబ్బతినడం పరిపాటి. మనదేశంలో వ్యవసాయ రంగం దీర్ఘకాలిక వృద్ధి రెండు శాతానికి మించకపోవడానికి ఇదే కారణం. వ్యవసాయం దెబ్బతింటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కల్లోలితం అవుతుంది. వ్యవసాయ రంగం కార్యకలాపాలు కుంచించుకు పోవడంతో ఆ రంగంలో ఉపాధి కూడా తగ్గుతుంది.

విదేశీ పరిస్థితుల ప్రభావం

సంపన్న, పారిశ్రామిక దేశాల్లో వృద్ధిరేటు క్షీణించడం కూడా భారత్ సహా పలు వర్ధమాన దేశాల వృద్ధి రేటుపై ప్రభావం చూపింది. ప్రపంచ వృద్ధిరేటు వరుసగా మూడు త్రైమాసికాలుగా దిగజారుతూనే ఉంది. అక్టోబర్ 15వ తేదీన అంతర్జాతీయ ద్రవ్యనిధి విడుదల చేసిన ప్రపంచ వృద్ధి అంచనాల నివేదిక ప్రకారం 2019లో ప్రపంచ దేశాల వృద్ధిరేటు 1.7 శాతానికి దిగజారే ఆస్కారం ఉంది. సంపన్న దేశాలైన జపాన్, జర్మన్ ఆర్థిక వ్యవస్థలు కూడా పారిశ్రామిక కార్యకలాపాల క్షీణత కారణంగా రెండో త్రైమాసికంలో తిరోగమన పథంలో ప్రవేశించింది. ప్రధానంగా రెండు సంవత్సరాలకు పైగా సాగుతున్న అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం ప్రపంచంలో వ్యాపార సెంటిమెంట్‌ను గణనీయంగా దెబ్బ తీసింది. పలు దేశాలపైన అమెరికా, పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించడం కూడా వృద్ధి తగ్గడానికి కారణమవుతోంది.

ఎగుమతుల క్షీణత

ఇక భారత జిడిపికి ప్రధాన దోహదకారులుగా ఉండే విభాగాల్లో కీలకమైనది ఎగుమతుల రంగం. ప్రపంచ వృద్ధిరేటులో క్షీణత, వస్తుసేవల డిమాండు తగ్గుదల ప్రభావం వల్ల ఎగుమతులు గణనీయంగా క్షీణించాయి. ఈ మధ్య కాలంలో డాలర్ మారకం విలువలో భారత ఎగుమతుల రంగం వృద్ధిరేటు ఒక అంకెను (1-9 శాతం మధ్యన) దాటలేదన్నది వాస్తవం. వస్తుసేవల విభాగాలు రెండింటిదీ ఇదే తీరుగా ఉంది. 2010-11, 2011-12 ఆర్థిక సంవత్సరాలు మినహా భారత ఎగుమతుల రంగం నిరాశావహంగానే కదలాడుతోంది. ఎగుమతులకు అధిక విలువైన వస్తువులు కీలకం కావడంతో పాటు అధిక ఉపాధికి ఆలంబనగా ఉండే ఇంజనీరింగ్ వస్తువులు, వజ్రాభరణాలు, రెడీమేడ్ దుస్తులు, టెక్స్‌టైల్ విభాగాలు కూడా విదేశీ డిమాండు తగ్గిపోవడంతో అల్లాడుతున్నాయి. 2014కు ముందు ఎగుమతుల వృద్ధి రేటు 18.4 శాతం నుండి ప్రస్తుతం 0.89 శాతానికి పడిపోయింది. 2018-19 మధ్య కాలంలో రెడీమేడ్ వస్త్రాల ఎగుమతులు మైనస్ 9.18 శాతానికి, రసాయనాలు మైనస్ 8.17 శాతానికి, ఇంజనీరింగ్ సేవలు మైనస్ 2.65 శాతానికి తగ్గిపోయాయి.

పరిష్కార మార్గం

ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తే ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలోకి కూరుకుపోతోంది. వినియోగ ఖర్చు తగ్గితే ఉత్పాదన క్షీణించి ఉపాధి కల్పన ఘోరంగా దెబ్బతింటుంది. దాంతో విశాల ప్రజానీకం వినియోగం క్షీణించి ఆర్థిక వ్యవస్థ మరింత స్తబ్ధతకు గురవుతుంది. ధరలు అస్థిరతకు గురికావడంతో ఉత్పత్తి రాబట్టలేక పరిశ్రమలు అతలాకుతలమవుతాయి. లేఅవుట్ బాట పడతాయి. పునరుత్పత్తి ప్రక్రియ దెబ్బతినడంతో ప్రజల ఆదాయాలు మరింతగా దెబ్బతింటాయి. దాంతో మరిన్ని పరిశ్రమలు మూతపడడం ఇలా కొనసాగుతూ దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి

జారుకుంటుంది. ఇలాంటి స్థితిలో నేడు దేశ ఆర్థిక వ్యవస్థ కొట్టుమిట్టాడుతోంది. కొద్ది మాసాలుగా సాగుతున్న ఈ విషవలయం ఫలితంగా కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల అమ్మకాలు విపరీతంగా తగ్గిపోవడంతో, ఆ రంగంలో మూడు లక్షల ఉద్యోగాలు, దాని అనుబంధ రంగాల్లో మరో పది లక్షల ఉద్యోగాలు ఆవిరైపోయాయి. 12 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న దాదాపు 6.5 కోట్ల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో ఈ మధ్యకాలంలో 6 లక్షలు మాత పడ్డాయి. పారిశ్రామిక ఉత్పత్తి క్షీణించింది, వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోవడంతో పెద్ద ఎత్తున నిరుద్యోగం రెక్కవిప్పింది. దేశంలో ఇప్పటికే 12 కోట్ల నిరుద్యోగ యువత మోడీ హామీలనే ఎండమావుల్లో ఉపాధి కోసం ఉదాసీనంగా ఎదురుచూస్తోంది.

అత్యధిక ప్రజానీకం కొనుగోలు శక్తి ఘోరంగా పడిపోవడం వల్ల ఈ ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. కనుక ఆర్థిక వ్యవస్థ పుంజుకోవాలంటే ప్రజల కొనుగోలు శక్తి పెంచాలి. దేశీయ గిరాకీ పెరిగితే మూతపడిన పరిశ్రమలు కోలుకుంటాయి. ఉత్పత్తిలో కార్మికుల వేతనాల వాటా పెంచాలి. ఆర్థిక అసమానతలు తగ్గించే పన్నుల విధానం ఉండాలి. ధనికుల మీద, కార్పొరేట్ కంపెనీల మీద అధిక పన్ను, సామాన్య ప్రజలపై నామమాత్రపు పన్ను ఉండాలి. కార్పొరేట్ కంపెనీలకు ఇస్తున్న పన్ను రాయితీలు ఉపసంహరించాలి. ప్రభుత్వం విద్య, వైద్యంపై అధికంగా ఖర్చు పెట్టాలి. ఉచిత విద్య, వైద్య సౌకర్యాలు పెంచాలి. రోడ్లు, రైలు, ఇంధనం తదితర మౌలిక సౌకర్యాలపై ప్రభుత్వం అధిక పెట్టుబడులు పెట్టాలి. రైతుకు గిట్టుబాటు ధరలు ఇవ్వడం ద్వారా ఆహార ఉత్పత్తులను పెంచాలి. ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసి వాటి వద్ద ఉన్న నగదు నిల్వలతో ఉత్పత్తి కార్యకలాపాలను విస్తృతం చేసి ఉపాధి అవకాశాలు పెంచాలి. ఉపాధి కల్పనకు పెద్ద పీట వేయాలి. భూ సంస్కరణలు అమలు చేయాలి. ప్రజలకు కనీస సామాజిక పెన్షన్ సౌకర్యాలు కల్పించాలి. ఈ ప్రత్యామ్నాయ విధానాలను పాలక వర్గాలు అమలు చేయకుండా ఆర్థిక సంక్షోభం నుండి బయటపడలేదు.

పెట్టుబడిదారులకు ఉద్దీపనలు ఇచ్చే బదులుగా, రు. 2.15 లక్షల కోట్లను అత్యవసమైన మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు, సామాజిక ఆర్థిక వృద్ధికి ఉపయోగించితే దారిద్ర్యంలో ఉన్న యువతకు లక్షలాది కొత్త ఉద్యోగాలను కల్పించవచ్చు. వారు తమ ఆదాయాన్ని ఖర్చు చేయడం మొదలెడితే దేశీయ గిరాకీ పెరిగి ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవం ఊపందుకునే వీలుంటుంది. కాని జరిగిందేమంటే ఉపాధి హామీ పథకం కింద పనుల కోసం దరఖాస్తు చేసుకున్న 13 కోట్ల మందిలో 2 కోట్ల మందిని ప్రభుత్వం అత్యంత నిర్దయగా వెనక్కి పంపింది. ఏమైనప్పటికీ మోడీ ప్రభుత్వం దేశ విదేశీ కార్పొరేట్ల లాభాలను గరిష్టంగా పెంచేందుకుగాను, రాయితీల ద్వారా అద్భుతమైన అవకాశాలను కల్పించే పనిలో ఉంది. తద్వారా బహుళజాతి సంస్థలకు రెడ్ కార్పెట్ పరుస్తోంది. అత్యధిక శాతం ప్రజలను కష్టాల పాల్జేస్తున్నది.

ముగింపు

వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టే విదేశీ కంపెనీల కన్నా లక్షల పెట్టుబడులతో నడిచే స్వదేశీ కంపెనీలను ప్రోత్సహించడం ద్వారా దేశంలో ఉపాధి కల్పన పెరుగుతుంది. సృజనాత్మక వృద్ధి చెందుతుంది. అన్నింటికీ మించి లాభాలు విదేశాలకు పోకుండా మనదేశంలోనే మనీ సర్క్యులేషన్ ద్వారా జిడిపి పెరుగుతుంది. మానవ వనరులు విదేశాలకు వెళ్లిపోవడంచే స్వదేశీ పరిశోధనలు, వ్యవసాయ పారిశ్రామిక రంగాలు కుదేలవుతున్నాయి. విద్యావంతులకు, వృత్తి నైపుణ్యదారులకు ప్రోత్సాహాలను ఇస్తే దేశం ఆర్థిక స్వావలంబన సాధించడానికి వీలవుతుంది. కార్పొరేట్ కంపెనీలు రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలను తక్షణమే ఆపాలి. తద్వారా కార్పొరేట్ కంపెనీల దోపిడీ విధానాలకు అడ్డుకట్టవేయవచ్చును. ఆశ్రిత పెట్టుబడులు తగ్గుతాయి. ప్రజలను భాగస్వాములను చేసే సహకార సంఘాలను, ముఖ్యంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ప్రోత్సహించాలి. తద్వారా గ్రామ స్వరాజ్యం వైపునకు పయనమయ్యే అవకాశముంటుంది.

దేశంలో గిరాకీ సంక్షోభం ఉంటే సరఫరా సంక్షోభమన్నట్లు కేంద్రం నమ్మించే ప్రయత్నం చేస్తోంది. పన్నులు, రాయితీలు, డబ్బు రూపంలో కార్పొరేట్లకు మూడున్నర లక్షల కోట్ల రూపాయలను అందించింది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం తప్ప ఆర్థిక వ్యవస్థకు చేకూరే లాభం లేదనడానికి ప్రస్తుత గణాంకాలే నిదర్శనం. ప్రజల్లో కొనుగోలు శక్తి పెంచితేనే కొంతవరకైనా సమస్య పరిష్కారమవుతుంది. అయినా మోడీ సర్కారు పట్టించుకోవడంలేదు. వినియోగం పెరిగితేనే అందుకు అనుగుణంగా ఉత్పాదక రంగాలు బలపడ్తాయన్నది సహజ ఆర్థిక సూత్రం. ప్రస్తుత సంక్షోభానికీ, ప్రజల మధ్య అసమానతలు పెరగడానికీ ప్రధాన కారణం ప్రభుత్వ రంగాన్ని విస్మరించి అన్నింట్లో ప్రైవేటు పెట్టుబడులకు అనుమతించడమేనన్నది అనుభవం చెపుతున్న సత్యం. కొనుగోలు శక్తి పెంచకుండా ఎన్ని చర్యలు తీసుకున్నా బూడిదలో పోసిన పన్నీరే. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారుల అవసరాలను బట్టిగాక, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వ్యూహాలు, ప్రణాళికలు తయారు చేసుకుంటేనే ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుంది. కానీ ఆ రీతిన మోడీ ప్రభుత్వం ఆ పని చేస్తుందనుకోవడం అత్యాశే!!

భారతదేశ అర్ధ ఫ్యూడల్, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్లు ప్రజలపైన దోపిడీ, పీడనల్ని కొనసాగిస్తూ సామ్రాజ్యవాదానికి సేవచేస్తున్న తీరును బుద్ధి జీవులు మొదట అర్థం చేసుకోవాలి. పెట్టుబడిదారీ వ్యవస్థే తన స్వీయ సంక్షోభానికి, ఆర్థిక మాంద్యానికి కారణమన్న నిజాన్ని మనం ప్రజలకు అర్థం చేయించాలి. కోట్లాది మంది ఆధారపడే వ్యవసాయ రంగాన్ని, భూముల్ని, సహజ వనరుల్ని సర్వనాశనం చేసి దోపిడీ శక్తుల ఆస్తుల పెరుగుదలకు పాలకులు సహకరిస్తున్నారు. ప్రభుత్వ రంగంలో శ్రామికులు విస్తరింపజేసిన ప్రజల ఆస్తిని, పరిశ్రమల్ని క్రమంగా ధ్వంసం చేస్తూ ప్రైవేటు ఆస్తులుగా మార్చుకుంటున్నారు. బూర్జువా, భూస్వామ్య శక్తులే పాలకులుగా విధాన నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల్ని వంచించడం అన్న కళలో ఆరితేరడం ద్వారానే ఇది సాధ్యమయింది. ప్రజలకు అసలు నిజాలు తెలియజెప్పి చైతన్యవంతం చేయడంతోపాటు ప్రభుత్వం తన దిశను మార్చుకోవడం తప్ప గత్యంతరం లేని స్థితిలోకి నెట్టేంత శక్తివంతంగా ఉద్యమాలు సాగించాల్సి ఉంది. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాల కొరకు సంఘటితంగా పోరాడాలి.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

సవాళ్లనే మిగిల్చిన బ్రిటన్ ఎన్నికలు

***అంతవరకూ పరిశీలకులు వేసిన అంచనాలకు భిన్నంగా వెలువడిన బ్రిటన్ ఎన్నికల ఫలితాలు వాస్తవ రాజకీయ అనిశ్చితిని మార్చలేవంటున్నారు* బైరెడ్డి సతీష్**

బ్రిటన్‌లో డిసెంబర్‌లో జరిగిన ముందస్తు సాధారణ ఎన్నికల్లో కన్సర్వేటివ్ పార్టీ ప్రధాని బోరిస్ జాన్సన్ నాయకత్వంలో 650 సీట్లు కలిగిన సాధారణ సభలో 364 సీట్లను గెలుచుకున్నది. గత మూడు దశాబ్దాల కాలంలో 'టోరీ'లకు అతిపెద్ద మెజార్టీ ఇదే. జర్మీ కార్బిన్ నాయకత్వంలోని లేబర్ పార్టీ 203 సీట్లు మాత్రమే గెలుచుకో గలిగింది. 1935 నుండి ఇప్పటి వరకు పార్టీ గెలుచుకున్న అత్యల్ప సీట్ల సంఖ్య కూడా ఇదే. లిబరల్ డెమోక్రాట్స్ కూడా కేవలం 11 సీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. బ్రిటన్‌లో భాగమైన స్కాట్లాండ్‌లో 59 సీట్లకు గాను నికోలస్ స్టర్జన్ నాయకత్వంలోని స్కాట్లాండ్ నేషనలిస్ట్ పార్టీ 48 సీట్లు గెలుచుకున్నది. ఉత్తర ఐర్లాండ్లో కూడా ఆ ప్రాంత ప్రత్యేక ఆకాంక్షలు కలిగిన పార్టీలే మెజారిటీ సీట్లు గెలుచుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో జాతీయవాద పార్టీలుగా ముద్రపడ్డ ప్రధానంగా అమెరికా, బ్రెజిల్ దేశాలలోని పార్టీలు అధికారంలోకి వచ్చిన కోవలోనే బ్రిటన్ ఎన్నికలు కూడా కొనసాగినవి. బ్రెగ్జిట్ నేపథ్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో ఆ అంశమే ప్రధానంగా పని చేసి ఓటరు తీర్పును ప్రభావితం చేసింది.

యూరోపియన్ యూనియన్ ప్రధాన సభ్య దేశంగా ఉన్న బ్రిటన్ ఆ కూటమి నుండి బయటికి రావడం కోసం నిర్వహించిన 2016 రెఫరెండంతో బ్రెగ్జిట్ వైపే ప్రజలు నిలవడం, ఆ తదుపరి ఒప్పందం తోను, ఒప్పందం లేకుండానో యూరోపియన్ యూనియన్ నుంచి నిష్క్రమించడం అనే మల్లగుల్లాల తోనే మూడున్నర సంవత్సరాల కాలం గడిచిపోయింది. బ్రెక్సిట్ ప్రధాన నాయకుడు నేటి ప్రధానిగా ఉండడం 'బ్రెగ్జిట్‌ను పూర్తి చేద్దాం' అనే ఏకైక నినాదంతో ముందుకు రావడంతో బ్రిటన్ ప్రజలు ఆయన నాయకత్వంలోని కన్సర్వేటివ్ పార్టీకే పట్టం కట్టారు.

ఉదారవాద విధానాలతో ప్రపంచీకరణలో ప్రధాన పాత్ర పోషించిన, పోషిస్తున్న బ్రిటన్ యూరోపియన్ యూనియన్‌లోను కీలకంగా ఉన్న సందర్భంలోనే దేశీయ కారణాల వల్ల యూరోపియన్ యూనియన్ నుండి బయటకు రావాల్సి వచ్చింది. జెర్మీ కార్బిన్ నాయకత్వంలోని లేబర్ పార్టీ బ్రెక్సిట్ జోరులో నెగ్గుకు రాలేకపోయింది. నిజానికి మేనిఫెస్టో పరంగా హెల్త్ స్కీమ్, పొదుపు చర్యల తొలగింపు, సంపన్నులపై మరిన్ని పన్నులు, ప్రజా సంక్షేమం అభివృద్ధిపై మరింత ఖర్చు వంటి ప్రజాను కూలమైన అంశాలు ఉన్నప్పటికీ అవి ఏవి బ్రెక్సిట్ ముందు నిలవలేదు. నిజానికి బోరిస్ జాన్సన్‌కు బ్రెగ్జిట్ నినాదం తప్ప మరొక బలమైన ఎజెండా అంటూ ఏమీ లేదు. ముందస్తు ఎన్నికలు అనివార్యం అయింది కూడా బ్రెగ్జిట్ కావడంతో, దాని పరిపూర్తి కోసమే ఎన్నికలు అనే ప్రచారం జరగడం వల్ల ప్రజలు ఆయన వైపు మొగ్గు చూపారు. ఈ మొగ్గు చూపడం ఎంతగా జరిగింది అంటే ఇప్పటివరకు లేబర్ పార్టీకి పట్టున్న ప్రాంతాలుగా చెప్పబడ్డ ప్రాంతాలలో కూడా కన్జర్వేటివ్ హవా కొనసాగింది.

కరడు గట్టిన సోషలిస్టుగా పేరుగాంచిన కార్బిన్‌కి వ్యతిరేకంగా మీడియా బాగానే పని చేసింది. ప్రజాభిప్రాయాన్ని కన్జర్వేటివ్‌లకు అనుకూలంగా మలచడంలోను, కార్బిన్ బలంగా ప్రతిపాదించిన ప్రజా అంశాల కంటే మనోభావాల అంశంగా మారిన బ్రెక్సిట్ పైననే మీడియా కేంద్రీకరించింది. సోషలిస్టు ఎజెండాను బ్రిటన్ ప్రజలు ఆహ్వానించే పరిస్థితుల్లో లేరని ముందస్తుగానే ప్రధాన స్రవంతి మీడియా, రంగం సిద్ధం చేసి పెట్టింది. అలా అని లేబర్ పార్టీ, కార్బిన్ తప్పిదాలు లేవని కాదు! బ్రెగ్జిట్‌పైన అస్పష్ట, అస్థిరమైన వైఖరే వారి కొంప ముంచింది. ఒక అంశం దేశాన్ని కుదిపేస్తుంటే, ఆ అంశమే తమ జీవితాలను భవిష్యత్తును బలంగా ప్రభావితం చేస్తుందని బ్రిటన్ ప్రజలు విశ్వసిస్తుంటే, లేబర్ ఆదర్శ ఎజెండా ను ఆహ్వానించ లేకపోయారేమో! బ్రెగ్జిట్ అంశమే దేశభక్తి యుత, బ్రిటన్ జాతీయ అస్తిత్వ అంశంగా మారడం, అది తప్ప మరో అంశమే లేదన్నట్టు కన్జర్వేటివ్ పార్టీ మార్చి వేయడంతో లేబర్ అనుకూల ఓటర్లు కూడా ఆ పార్టీ వైపు మళ్లారు.

ఆర్థిక అస్థిరత్వం ముంచేసే ప్రతి సందర్భంలో అన్ని దేశాల్లోని రైటిస్టు రాజకీయాలు జాతీయవాద సెంటిమెంటును రాజేసి రాజకీయ ప్రయోజనం పొందినట్టే కన్జర్వేటివ్ పార్టీ కూడా వ్యవహరించింది. ప్రభుత్వపరంగా అలాంటి ఎజెండానే తూచా తప్పకుండా అమలు చేసి భౌతిక పరిస్థితులు అయితే ఏమాత్రం కనిపించడం లేదు. 2020 జనవరి 31 వరకు బ్రిటన్ యూరోపియన్ యూనియన్ నుండి బయటికి రావడం మరింత సులువయింది. 2020 డిసెంబర్ 31 నాటికి ఇదే యూరోపియన్ యూనియన్‌తో పాటు అమెరికాతో కూడా ఏదో ఒక వ్యాపార ఒప్పందం కుదుర్చుకోవాల్సిన అనివార్య పరిస్థితి కూడా ఉన్నది. అది అంత సునాయాసంగా జరగడం కుదరదని మిగతా పార్టీలు గెలుచుకున్న సీట్ల కూర్పును బట్టి అర్థం అవుతున్నది.

బ్రిటన్ నుండి స్వాతంత్రం కోరుతున్న స్కాటిష్ నేషనల్ పార్టీ యూరోపియన్ యూనియన్‌లోనే కొనసాగాలని బలంగా కోరుకుంటున్నది. స్కాట్లాండ్ మరోసారి రెఫరెండం కూడా తీవ్రంగా డిమాండ్ చేస్తున్నది. ఈ డిమాండ్‌ను బోరిస్ జాన్సన్ ఇప్పటికే తోసిపుచ్చడం జరిగింది. బ్రిటన్ లో బ్రెక్సిట్ పై ప్రజల్లో ఎంత భావోద్వేగ స్పందనలు ఉన్నాయో, స్కాట్లాండ్ ప్రజల్లో కూడా అదే పరిస్థితి నెలకొని

ఉన్నది. ఉత్తర ఐర్లాండ్లో కూడా ఇంత కంటే భిన్నమైన పరిస్థితి లేదు. యూరోపియన్ యూనియన్లో ఉండాలి అనుకుంటూనే బ్రిటన్ నుండి విడిపోవాలనుకుంటున్నాయి. అదే జరిగిన పరిస్థితుల్లో యునైటెడ్ కింగ్‌డమ్‌లో మిగిలేది ఇంగ్లాండ్, వేల్స్ మాత్రమే!

జాన్సన్ ప్రభుత్వం తనకున్న భారీ మెజారిటీతో బ్రెక్సిట్ ను సులభంగా ముగించగలదేమో గాని ఆ తదుపరి రాజకీయంగా, ప్రాదేశికంగా ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడం అంత సులభమైనది కాదు. బ్రిటన్ యూరోపియన్ యూనియన్ నుండి వైదొలగడం ఎలాంటి మనోభావాల, జాతీయవాద అస్తిత్వ అంశమో స్కాట్లాండు ఐర్లాండ్‌లలో కూడా బ్రిటన్ నుండి వైదొలగడం కూడా అలాంటి అంశమే.

బ్రెగ్జిట్‌ను కోరుకొని స్కాట్లాండ్, ఉత్తర ఐర్లాండ్ ఆకాంక్షలను నిర్లక్ష్య పెట్టలేదు. అయితే గియితే ఈ గెలుపు బ్రెక్సిట్ లాంటి జటిలమైన సమస్యలను మెజార్టీ ఉన్నది కాబట్టి కన్సర్వేటివ్ పార్టీ తక్షణమే తను అనుకున్న రీతిలో పరిష్కరించగలదేమోగానీ స్కాట్లాండు, ఐర్లాండ్ లతో పాటు దేశంలో ముసురుకుంటున్న ఆర్థిక అస్థిరత అంశాలను అంత సునాయాసంగా పరిష్కరించ లేదన్నది సుస్పష్టం.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలను ప్రపంచీకరణ ఊబిలోకి దించేసిన ప్రధాన దేశాలే ఇవాళ రక్షణాత్మక చర్యల పేరుతో దేశీయ ప్రయోజనాలు, ఉపాధి, ఉద్యోగాల పేరుతో వాళ్లకు లాభించే విధానాల వైపే వేగంగా పరిగెడుతున్నాయి. నాలుగేళ్ల క్రితం అమెరికాలో డోనాల్డ్ ట్రంప్, మొన్న బ్రెజిల్‌లో బోల్సోనారో, నేడు బోరిస్ జాన్సన్ ఎప్పటికా వైఖరీ అన్నట్టు వ్యవహరిస్తున్నారు.

అమెరికా ఎన్నికల్లో ట్రంప్ అక్కడి భారతీయ సంఘ్ పరివార్ అనుకూల శక్తులు ఏర్పాటుచేసిన మతపరమైన ఉత్సవంలో పాల్గొని ఓట్లు అడిగినట్టే, బ్రిటన్లో కూడా ఈ పరివార్ వర్గాలు జాన్సన్ ను వెనకేసుకుని వచ్చి భారతీయుల ఓట్లను కన్జర్వేటివ్ పార్టీకి అందించాయి. బిజెపి ప్రభుత్వం కాశ్మీర్, సిఏఏ, ఎన్ఆర్‌సి వంటి కీలకమైన అంశాల పైన బ్రిటన్ లేబర్ పార్టీ స్పష్టమైన వైఖరిని తీసుకున్నది. అంతర్జాతీయ సమాజ పరిశీలనకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేయడమే కాకుండా, రాజ్యాంగ సూత్రాలకు కట్టుబడి ఉండాలని కోరడం ఈ సంఘ శక్తులకు కంటగింపయ్యింది. అదే బోరిస్ జాన్సన్ మయన్మార్‌లో రోహింగ్యాలపై జరిగిన మిలిటరీ దురాగతాలను తీవ్రంగా ఖండిస్తూ వ్యక్తిగతంగా అక్కడ పర్యటించాడు కూడా. మరి భారతదేశంలో బిజెపి ప్రభుత్వం సిఏఏ తేవడం ద్వారా ముస్లింలను దాంట్లో భాగంగానే రోహింగ్యాలను టార్గెట్ చేయడంపై ఎలా స్పందిస్తాడో చూడాల్సి ఉన్నది.

అమెరికా, బ్రిటన్, బ్రెజిల్, ఇండియా లాంటి దేశాల్లోని రైటిస్టు రాజకీయ శక్తులన్నీ అంతర్జాతీయ అంశాలకు వచ్చేసరికి సూత్రబద్ధ వైఖరిని ప్రదర్శిస్తూ దేశీయంగా రాజకీయ ప్రయోజనాల కోసం పచ్చి అవకాశవాద, అహేతుకమైన వైఖరిని అవలంభిస్తున్నాయి. ఈ పార్టీలన్నీ వారి వారి దేశాల్లో అక్కడి మైనారిటీలపై తీవ్రమైన వివక్షను పాటిస్తున్నయే! మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని మెజారిటీ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మెజారిటీ ఓట్లను కొల్లగొట్టడం రివాజుగా మారిపోయింది. ఈ పార్టీలన్నీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కంటే జాతీయ భద్రతా పేరుతో ప్రజల్లో అభద్రతను నెలకొల్పి, వారి విధానాల సమర్థింపును దేశభక్తి అంశంగా మార్చి రాజకీయ లబ్ది పొందుతున్నారు.

బోరిస్ జాన్సన్ ప్రచార క్రమంలో కార్బిన్ దేశభక్తుడు కాదనేల ప్రచారం నిర్వహించడం లాంటిదే ఇండియాలో కూడా కాశ్మీర్, సిఏఏ, ఎన్ఆర్‌సిలను రాజ్యాంగ కోణంలోనో, ప్రజాస్వామిక దృక్పథం తోనో విమర్శించే, విశ్లేషించే వారిని, నిరసన తెలిపి వారిని దేశద్రోహులుగా ముద్రవేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మొత్తంగా బ్రిటన్ ఎన్నికలు ఆ దేశ ప్రజాతంత్ర శక్తులకే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక ప్రజా పోరాట శక్తులకు 'మనోభావాల' రాజకీయాలతో వ్యవహరించాల్సిన రాజకీయ పాఠాలను అనేకం నేర్పుతున్నవి.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

బకాయి ఎగవేతదారుల జాబితా

రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన ఉద్దేశపూర్వక బకాయి ఎగవేతదారుల జాబితా దేశ ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలకు అద్దం పడుతున్నదని విశ్లేషిస్తున్నారు డా. ఎ. పున్నయ్య

బ్యాంక్ అనేది ప్రభుత్వంచే గుర్తింపు పొందిన అత్యున్నత ఆర్థిక సంస్థ. ఇది దేశ వ్యాప్తంగా ఆర్థిక సేవలందించే సంస్థల సమూహంగా వ్యాపించింది. ప్రజల దగ్గర నుండి ధనాన్ని రుణాలుగా పొంది అవసరమున్న వారికి రుణాలివ్వడం బ్యాంకుల ప్రాథమిక లక్ష్యం. దేశ సాంఘిక, సాంస్కృతిక పురోగతికి ఆర్థిక సమాజాన్ని శక్తివంతంగా బ్యాంకులు ముందుకు తీసుకుపోవాలి. నిరుపేదలకు, వ్యావసాయ దారులకు, వ్యాపార వాణిజ్య వర్గాలకు, పారిశ్రామిక వేత్తలకు నిబంధనలకు లోబడి రుణాలిస్తూ ఆర్థిక విపణులు, పెట్టుబడి నిధులను సృష్టిస్తూ దేశ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా బ్యాంకింగ్ వ్యవస్థ పనిచేయాలి. వర్తమాన కాలంలో దీనికి భిన్నంగా ప్రభుత్వ చట్టాల్లోని లొసుగుల వల్ల బడా కార్పొరేట్లకు రుణాల మంజూరిలో బ్యాంక్ అధికారులు ఉదాసీనంగా ఉంటున్నారు. దీనికితోడు చట్టాలలోని సవరింపులు అక్రమార్కులకు చుట్టాలుగా మారి దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టినాయి. ఈ నేపథ్యంలో విశాల లక్ష్యంతో ఏర్పడ్డ బ్యాంకుల మనుగడే నేడు ప్రశ్నార్థకంగా మారింది.

నేడు బ్యాంకింగ్ రంగంలో లాభాలను హరిస్తున్న మొండి బకాయిలతో పాటు మైసగాళ్లతో చేతులు కలిపి ఈ సంస్థ ప్రతిష్టనే దిగజారుస్తున్న బ్యాంకింగ్ సిబ్బంది ఒకవైపు. మరోవైపు మోసగాళ్లను పెంచే సరళీకృత ప్రభుత్వ బ్యాంకింగ్ విధానాల వలన సగటు ఖాతాదారుల విశ్వాసాలు బ్యాంకులపై సన్నగిల్లినాయి. ఫలితంగా మూలధన కొరతతో బ్యాంకింగ్ రంగం సంక్షోభంలోకి జారింది.

దశాబ్ద కాలంలో బ్యాంకుల్లో భారీగా పెరిగిన మోసాలు

దశాబ్ద కాలంగా దేశం నలుమూలల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల్ని బురిడీ కొట్టించి కోట్లకు కోట్లు బడాబాబులు దోచేస్తున్నారు. ఈ మోసాలకు సంబంధించి దాదాపు యాభై మూడు వేలకు పైగా కేసులు నమోదైనాయి. రెండేళ్ల క్రితం సుమారు నలభై ఒక వేల కోట్ల రూపాయలు ఎగవేసిన 5,961 మందిపై కేసులు నమోదైనాయి. ఈ ఉద్దేశపూర్వక ఎగవేతలు వృద్ధి చెందుతూ ఈ దశాబ్దంలో నిరుడు గరిష్టంగా డెభై ఒక వేల కోట్లు ఎగవేసినందుకు 6,800 మందిపై బ్యాంకు అధికారులు కేసులు నమోదు చేసినారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు మాసాలలోనే ఆశ్చర్యంగా మరో 5,743 మందిపై కేసులు నమోదు చేసినారు. ఈ ఆరు మాసాల్లో 96 వేల కోట్లు బ్యాంకులకు చెల్లించాల్సిన మొత్తాలను ఎగవేతదారులు చెల్లించకుండా తప్పించుకున్నారు. బ్యాంకుల్లో మోసాలు జరిగినప్పుడల్లా పునరావృతం కాకుండా నివారించే ప్రధాన లక్ష్యంతో కేంద్ర నిఘా సంఘం విశ్లేషణ చేస్తున్నట్లు ప్రకటించింది. కాని ప్రభావం ఆచరణలో కన్పించకపోవడం మూలానా జరిగిన మోసాలు మళ్లీ మళ్లీ జరుగుతున్నాయి. వ్యవస్థాగత లోటుపాట్లు, అంతర్గత నియంత్రణలు లేకపోవడం వలన బ్యాంకుల్లో మోసాల ఖాతా విస్తరించడం విచారకరం.

ఉద్దేశపూర్వక ఎగవేతదారులను ప్రకటించాలని జరిగిన పోరాటం

దేశ బ్యాంకింగ్ వ్యవస్థల్ని కొల్లగొట్టి, ఆర్థిక వ్యవస్థకు తీవ్ర విఘాతం కలిగించిన వ్యక్తుల, సంస్థల వివరాలను ప్రజలకు వెల్లడించాలని గత దశాబ్ద కాలంగా సుదీర్ఘ పోరాటం జరిగింది. దేశ వ్యాప్తంగా సమాచార హక్కు కార్యకర్తలు సమాచారాన్ని వెల్లడించాలని పలుమార్లు రిజర్వు బ్యాంకును సంప్రదించారు. ఎగవేతదారుల జాబితా ప్రకటిస్తే బ్యాంకులు తమ విశ్వసనీయ సంబంధాలు కోల్పోతాయని, వ్యక్తిగత గోప్యత హక్కు దేశ ఆర్థిక ప్రయోజనాలకు ఇది విఘాతమని ఎగవేతదారుల పేర్లను బయట పెట్టలేమని రిజర్వు బ్యాంకు తోసిపుచ్చింది.

ఈ నేపథ్యంలో 2019 మేలో 'దివైర్' ఆంగ్ల డిజిటల్ మీడియా సమాచార హక్కు ద్వారా రిజర్వు బ్యాంకుకు దరఖాస్తు చేస్తుంది. ఈ క్రమంలో సమాచార హక్కు దరఖాస్తును సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని ఉద్దేశ పూర్వక ఎగవేత దారుల జాబితాను ప్రకటించాలని ఆదేశించింది. ఈ క్రమంలో నవంబర్ 21న సిఆర్ఐఎల్‌సి కేంద్రీకృత బ్యాంకింగ్ వ్యవస్థ సమాచారానిగా వ్యవహరించే (ది సెంట్రల్ రిజిటరీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఆన్‌లార్జ్ క్రెడిట్స్) నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా రిజర్వు బ్యాంకు 30 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదారుల జాబితాను విడుదల చేసింది. సిఆర్ఐఎల్‌సిలో రు. 5 కోట్లు అంతకు మించి అప్పులు తీసుకున్న రుణగ్రహీతల సమాచారమంతా ఉంటుంది. ఈ విధంగా దేశంలో ఉద్దేశ పూర్వక బ్యాంకు రుణాలు ఎగ్గొట్టిన వారి జాబితాను రిజర్వు బ్యాంకు విడుదల చేసింది.

సుప్రీంకోర్టు జోక్యంతో ఎగవేతదారుల జాబితా విడుదల

రిజర్వు బ్యాంకు విడుదల చేసి 30 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదారుల్లో అధిక మంది వజ్ర వ్యాపారులున్నారు. అత్యధికంగా బకాయిపడ్డ వారిలో గీతాంజలి జెమ్స్ యజమాని మోహల్‌చోక్సీ మొదటి స్థానంలో నిలిచాడు. ఇతని గీతాంజలి జెమ్స్ లిమిటెడ్ రు. 5,044 కోట్లు, గిలి ఇండియా లిమిటెడ్ రు. 1,447 కోట్లు, నక్షత్రా బ్రాండ్ లిమిటెడ్ రు. 1,148 కోట్లు మొత్తం రు. 7,639 కోట్ల అప్పులను

రిజర్వు బ్యాంకు విడుదల చేసిన 30 మంది ఎగవేతదారుల జాబితా (రు. కోట్లలో)

	కంపెనీ	బకాయిలు
1	గీతాంజలి లిమిటెడ్	5,044
2	రీ అగ్రో లిమిటెడ్	4,197
3	విన్సమ్ డైమాండ్స్ అండ్ జూయలరీ లిమిటెడ్	3,386
4	రుచి సోయా ఇండస్ట్రీస్ లిమిటెడ్	3,225
5	రోటోమాల్ గ్లోబల్ ప్రై. లిమిటెడ్	2,844
6	కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ లిమిటెడ్	2,488
7	కుడోస్ కెమీ	2,326
8	జూమ్ డెవలపర్స్ ప్రై లిమిటెడ్	2,024
9	డెక్కన్ క్రానికల్ హోల్డింగ్ లిమిటెడ్	1,951
10	ఏజీబీ షిప్‌యార్డ్ లిమిటెడ్	1,875
11	సరెవర్ ప్రిషస్ జ్యూయలర్స్ లిమిటెడ్	1,718
12	సూర్య వినాయక ఇండస్ట్రీస్ లిమిటెడ్	1,628
13	ఎస్ కుమార్ నేషనల్ వైడ్	1,581
14	గిలీ ఇండియా లిమిటెడ్	1,447
15	సిద్ధి వినాయక లాజిస్టిక్ లిమిటెడ్	1,349
16	విఎంసి సిస్టమ్స్ లిమిటెడ్	1,314
17	గుప్తాకోల్ ఇండియా లిమిటెడ్	1,235
18	నక్షత్ర బ్రాండ్స్	1,148
19	ఇండియన్ టెక్నోమాల్ లిమిటెడ్	1,091
20	శ్రీ గణేశ్ జ్యూయలరీ లిమిటెడ్	1,085
21	జైన్ ఇన్‌ఫ్రా లిమిటెడ్	1,076
22	సూర్య ఫార్మా లిమిటెడ్	1,065
23	నకోడా లిమిటెడ్	1,028
24	కెఎస్ ఆయిల్స్ లిమిటెడ్	1,026
25	కోస్టల్ ప్రాజెక్ట్ లిమిటెడ్	984
26	హనుంగ్ టాయ్స్	949
27	ఫస్ట్ లీజింగ్ కంపెనీ	929
28	కాన్‌కస్ట్ అండ్ పవర్ లిమిటెడ్	888
29	యాక్షన్ ఇస్పాల్ లిమిటెడ్	888
30	డైమెండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్	869

ఎగ్గొట్టాడు. ఈ 30 కంపెనీలు ఎగ్గొట్టిన మొత్తం సుమారు 50 వేల కోట్లు. అయితే ట్రాన్స్ యూనియన్ సిబిల్ డేటా ప్రకారం గత ఏడాది డిసెంబర్ వరకు 11 వేల కంపెనీలు బ్యాంకులకు ఎగ్గొట్టిన బాకీల విలువ రు. 1.61 కోట్లకు చేరింది. స్థోమత ఉండి అప్పును చెల్లించకున్నా, ఒక అవసరం కోసం అప్పు తీసుకొని మరో అవసరం కోసం ఆ రుణాన్ని మళ్లించి తిరిగి చెల్లించనట్లయితే ఉద్దేశపూర్వక ఎగవేత దారుగా పరిగనించాలని రిజర్వు బ్యాంకు నిర్ణయించింది.

పై కంపెనీల డైరెక్టర్లపై సిబిఐ, ఈడీ లాంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ ఎదుర్కొంటున్నారు. వీరిలో కొందరి పేర్లు రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ప్రధాని కార్యాలయానికి పంపడం గమనార్హం. వారిపై విచారణ చర్యలు తీసుకోవాలని సిబిఐ, ఈడీ లాంటి సంస్థలు ముందడుగు వేసినప్పటికీ రాజకీయ అండదండలతో నేటికి విచారణ జరగకపోవడం విచారించాల్సిందే.

ప్రభుత్వ రంగ బ్యాంకుల పాలన ప్రమాణాలు మెరుగుపరచడానికి సంస్కరణలు

రిజర్వు బ్యాంకు గవర్నర్ శక్తి కాంతదాస్ నూతన సారధిగా అధికార పగ్గాలు చేపట్టిన అనంతరం బ్యాంకుల ఆస్తుల్లో మొండి బాకీల నిష్పత్తి తగ్గడానికి మరిన్ని సంస్కరణల అవసరాన్ని గుర్తించాడు. కొద్ది మంది బ్యాంకు అధికారులు అక్రమార్కులతో అంటకాగి విద్రోహాలకు పాల్పడుతున్నారని, దానిని సరిచేసుకోవాలని సూచించాడు. ఉద్దేశ పూర్వకంగా ఎగవేతదారుల పోటోల్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు బహిరంగంగానే ప్రచురించాలన్నారు. రు. 50 కోట్లకుపై రుణాలు పొందిన సంస్థల డైరెక్టర్ల పాస్‌పోర్ట్ కాపీ తప్పని సరిగా బ్యాంకులు తీసుకోవాలన్న నిబంధనలు పాటించాలన్నారు. కోటాను కోట్ల రూపాయలు బ్యాంకులకు ఎగ్గొట్టి విదేశాల్లో విందులతో చిందులు వేయడం బ్యాంకు ఖాతా దారులందరిని విస్మయానికి గురిచేస్తుందన్నారు. అందువల్ల అలాంటి సంఘటనలు పునరావృతం జరగకుండా నిబంధనలు అమలు జరగాలన్నారు. లేనట్లయితే మోహల్ చోక్సీ లాంటివారు కరేబీయాన్ దీవుల్లో తలదాచుకున్నట్లు మరికొందరు ప్రయత్నిస్తారు.

బ్యాంకింగ్ పునరుజ్జీవనానికి కేంద్ర నిఘా సంఘం హెచ్చరిక

ప్రజా విశ్వాసమే పునాదిగా ప్రజా ధనానికి రక్షణ వహిస్తూ జాతి ప్రయోజనానికి ప్రగతి కాముకంగా బ్యాంకులు పనిచేయాల్సిన అవసరం ఉంది. ఈ రంగంలో కీలక స్థానాల్లో అధికారులు ఏళ్ల తరబడి ఒకే చోట పాతుకుపోవడం అనర్థాలు తెచ్చిపెట్టిందన్నారు. వారిని నిర్దిష్ట సమయంలోనే బదిలి చేయాలి. ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు కాకముందే అనుమానితులపై లుకౌట్ నోటీసులు జారీనికోరే అవకాశాన్ని బ్యాంకు ఉన్నతాధికారులున్నప్పటికీ ఈ దిశగా చర్యలు జరగడం లేదని, జరగాలని నిఘా సంఘం హెచ్చరించింది.

బ్యాంకులకు రుణాలను ఎగ్గొట్టడం బల నిరుపణంగా మారిందని అవమాన పరిచిన సంఘటనలుండాలన్నారు. ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు లోపాయికారీ తోడ్పాటు అందిస్తున్న బ్యాంకు అంతర్గత అధికారులను గుర్తించి శిక్షించాలన్నారు. ఈ కనీస చర్యలు లేనందున సగటున ప్రతి నాలుగు గంటలకు ఒక కుంభకోణం వెలుగులోకి వస్తుందని నిఘా సంఘం హెచ్చరించినప్పటికీ, బ్యాంక్ అధికారులు అప్రమత్తంగా ఉండకపోవడం, కనీస చర్యలకు వెనకడుగు వేయడం మూలానా బ్యాంకింగ్ రంగం కునారిల్లడానికి కారణాలుగా నిఘా సంఘం నిగ్గుతేల్చింది.

మోసాల రూపేణ బ్యాంకులు నష్టపోతున్న వేల కోట్ల రూపాయల్లో ప్రతి పైసా ప్రజా ధనమే. బ్యాంకులు అధికారికంగా ఆర్‌బిఐకి తెలిపిన దాదాపు మూడు లక్షల కోట్ల రూపాయలు బ్యాంకుల్లో నిష్పాక్షికంగా అడిటింగ్ నిర్వహించి తక్షణ చర్యలు చేపట్టగల స్వతంత్ర వ్యవస్థనొక దానిని నెలకొల్పి పార్లమెంట్‌కు జవాబుదారీ చేయాలి. ఇలాంటి చర్యలకు

పూనుకోకపోతే అమెరికాలోని లేమాన్ బ్రదర్స్ లాంటి పరిస్థితి భారత్‌కు కూడా రానుంది. ఆర్థిక వ్యవస్థ క్రమంగా తిరోగమన స్థితిలోకి జారుతుందని నిఘా విభాగాలు హెచ్చరిస్తున్నాయి. దీనికితోడు ప్రభుత్వాల మతిలేని విధానాలు తప్పుడు నిర్ణయాల వల్ల ఈ స్థితికి చేరింది. ప్రభుత్వాలు సమీక్షించుకొని మరిన్ని గుణాత్మక చర్యలు చేపట్టాలి.

లోపభూయిష్టమైన రిజర్వు బ్యాంకు నిల్వల విధానం

రిజర్వు బ్యాంకు తన లాభాలలో ఎంత భాగాన్ని నిల్వ చేసుకోవాలి, ప్రభుత్వానికి ఎంత డెవిడెంట్ ఇవ్వాలి అనే విషయమై స్వయం నిర్ణయాధికారముంటుంది. రిజర్వు బ్యాంకు ఏకైక వాటాదారు ప్రభుత్వమే. రిజర్వు బ్యాంకు సముపార్జించే అధనపు లాభాలను భవిష్యత్ అవసరాలకు నిల్వచేస్తారు. ఈ నిల్వ నిధులనే ప్రభుత్వానికి డివిడెంట్‌గా చెల్లిస్తారు. ఇలా సమకూరిన నిధులను ప్రభుత్వ సిబ్బంది జీత భత్యాలకు లేదా హైవేల నిర్మాణానికి ఉపయోగిస్తుంది. అయితే ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడినప్పుడు పరిస్థితులు తలకిందులవుతాయి. అప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు రిజర్వు బ్యాంకు తన నిల్వలను ఉపయోగిస్తుంది. ఇటువంటి ఆపద కాలంలో వినియోగించేందుకు రిజర్వు బ్యాంకు తన లాభాలలో కొంత భాగాన్ని ఏటా ప్రత్యేకంగా నిల్వ చేయడం అనవాయితీ.

ఈ మేరకు 2012లో రు. 27,000 కోట్లు, 2013లో రు. 28,000 కోట్లు నిల్వ చేసింది. 2014 నుంచి తన లాభాలను ఇలా నిల్వ చేయడాన్ని రిజర్వు బ్యాంకు నిలిపివేసింది. 2018-19లో రిజర్వు బ్యాంకు రు. 1.76 కోట్ల లాభాలను ఆర్జించింది. ఈ అపార ఆదాయంలో పైసా కూడా నిల్వ చేయకుండా మొత్తం నిధులను ప్రభుత్వానికి బదలాయించింది. అంతేగాక రిజర్వు బ్యాంకు నిధులు ఏ స్థాయిలో నిర్వహించడం సముచితమో సిఫారసు చేయాలని మాజీ రిజర్వు బ్యాంకు గవర్నర్ బిమల్ జలాన్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ సమీక్షించి రిజర్వు బ్యాంకు మొత్తం లాభాలలో 24.5 శాతం నుండి 20.0 శాతం మధ్య నిల్వ చేయడం సబబుగా ఉంటుందని సిఫారసు చేసింది.

2019 జూన్‌లో రిజర్వు బ్యాంకు నిల్వలు బ్యాంకు మొత్తం సంపదలో 23.3 శాతంగా ఉన్నాయి. అయినప్పటికీ ఆ నిల్వల పరిమితిని 20 శాతానికి తగ్గించాలని రిజర్వు బ్యాంకు నిర్ణయించింది. ఈ మేరకు రిజర్వు బ్యాంకు తన నిల్వలలో రు. 52,000 కోట్లను ప్రభుత్వానికి బదిలీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో రిజర్వు బ్యాంకు నిల్వలు అధిక స్థాయిలో ఉండవలసిన అవసరముంది. దురదృష్టవశాత్తు రిజర్వు బ్యాంకు బ్యాంకింగ్ వ్యవస్థ బావి అవసరాల కోసం నిల్వ చేసిన నిధులను భారీ స్థాయిలో ప్రభుత్వానికి బదిలీ చేసింది. ఈ సంఘటనలతో బ్యాంకులల్లో ఉండే ధనం ప్రభుత్వానికి బదిలీ చేయుట ఒకవైపు జరుగుతుండగా, ఉద్దేశపూర్వక ఎగవేతదారుల దాటికి బ్యాంకులు లూటీ అవుతున్న క్రమంలో బ్యాంకుల పట్ల ప్రజలు విశ్వాసం కోల్పోతున్నారు.

ఎగవేతల కారణంగా రుణ లభ్యతకు తీవ్ర విఘాతం

బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేసేందుకు సర్కారు అనేక చర్యలు తీసుకొంటుందని, ఫలితంగా నిరర్థక అస్తులు తగ్గి విత్త సంస్థలు వృద్ధి పథంలోకి చేరుతున్నాయంటూ సర్కారు చేస్తున్న ప్రకటనల్లో పసలేదని తేలింది. గణాంకాలను విశ్లేషించి చూస్తే తీసుకున్న చర్యలు క్షేత్ర స్థాయిలో ఫలితాలివ్వడం లేదు.

గణించిన ఆరు నెలల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సుమారు రు. 95,000 కోట్లు మోసపోగా, 5,743 కేసులు నమోదు అయినాయి. ఈ రుణాల ఎగవేత కారణంగా వ్యవస్థలో రుణ లభ్యతకు తీవ్ర విఘాతం కలుగుతుంది. మరో రు. 1,000 కోట్లకు పైబడిన మోసాలు నాలుగేండ్ల తర్వాత వెలుగులోకి వచ్చినాయని రిజర్వు బ్యాంకు లెక్కలను ప్రభుత్వం ప్రకటించింది. దీనివలన ప్రభుత్వం చేపట్టే చర్యల వలన బ్యాంక్ మోసాలు ఏమాత్రం తగ్గుముఖం పట్టడం లేదని నిరూపణ జరిగింది.

ఈ నేపథ్యంలో బ్యాంకులు ఆర్థికంగా మరింత బలహీన పడిపోతున్నాయి. అంతకంతకు పెరిగిపోతున్న మోసాలు, నిరర్థక ఆస్తుల కారణంగా విత్త సంస్థల వద్ద రుణ వితరణకు గాను నగదు అందుబాటులో లేకుండా పోయింది. రుణ మంజూరికి అవసరమైన నగదు నిల్వ లేకపోవడం వలన బ్యాంకులు రుణాలు అందించలేక పోతున్నాయి. ఎన్‌పిఎల భయంతో బ్యాంకులు మంచి కంపెనీలకు కూడా రుణాలిచ్చేందుకు వెనకాడుతున్నాయి. దీంతో ఆర్థిక వ్యవస్థలో అప్పు పుట్టడం లేదు. ఉన్న కొద్ది మొత్తాలను బ్యాంకులు రిస్క్ తక్కువగా ఉండే రిటైల్ రుణాల వైపుకు మళ్లిస్తున్నాయి. దీంతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణం లభించడం కష్టంగా మారింది.

బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు పెరిగిపోతున్నాయన్న వార్తలతో ప్రజలు డబ్బును పొదుపు చేసుకునేందుకు బ్యాంకులకు రావడం తగ్గించారు. దీంతో పాటు కరెంటు డిపాజిట్లు తగ్గినాయి. ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మందగమనాన్ని పారదోలేందుకు ప్రభుత్వ బ్యాంకులో రుణ వితరణ వృద్ధి కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం) వీ

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు. – సం.*

డిసెంబరిస్ట్ సైనిక తిరుగుబాటు పరిణామాలు - 3

***జారిజం మీద 1825 డిసెంబర్‌లో జరిగిన తిరుగుబాటు రెండు వందల సంవత్సరాల తర్వాత కూడా ప్రభావం చూపుతున్నదంటున్నారు* ఎన్.వి.యస్. నాగభూషణ్**

(...గత సంచిక తరువాయి భాగం)

రాకుమారి యెకతెరీనా త్రుబెత్స్కయా డిసెంబరిస్ట్, ఉత్తరాది సొసైటీ నాయకుడు అయిన రాకుమారుడు సెర్గీ త్రుబెత్స్కోయ్‌ని ప్రేమించి పెళ్లాడింది. సెర్గీని ఆమె పారిస్ నగరంలో కలిసినప్పుడు అతణ్ని ప్రేమించింది. రాకుమారి యెకతెరినా ఫ్రెంచి రాయబార కార్యాలయంలో ఉన్నతాధికారి కుమార్తె. తల్లి అమిత ధనికురాలైన, సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలో సాయంకాల సమావేశాలు నిర్వహించే ప్రసిద్ధ విదుషీమణి. తన భర్తకు సైబీరియా కఠిన శిక్షను విధించడంతో ఖైదీలు సైబీరియాకు బయలుదేరి వెళ్లిన మరుసటి రోజే, అతడి వెనుకే సైబీరియాకు తరలి వెళ్లిన ధీరవనిత. అయితే ఆమె ప్రయాణించిన స్లెడ్జిబండి, ఆ వేలాది మైళ్ల సుదీర్ఘ మంచు దారుల్లో మధ్యలోనే విరిగిపోయింది. బండిని నడిపే అతను జబ్బుపడ్డాడు. అయినా ఆమె ధైర్యం వీడక గుండె చిక్కబట్టుకొని, ఆ సైబీరియన్ మంచు భూముల్లో పడి పిచ్చిదానిలా తిరిగింది. ఇర్కుత్స్క్ గవర్నర్ ఆమెను ఎంతో భయపెట్టాడు. వెనక్కి తిరిగి పోవలసిందిగా నయానా భయానా హెచ్చరించాడు. రాజధాని నగరం నుంచి వచ్చిన ఆజ్ఞలతో ఆమె భర్త ఉండే జైలు జాడలు చెప్పకుండా, నెలల తరబడి వేధించాడు. అయినా ఆమె పట్టువీడక వెతుకులాడుతూనే ఉంది. చివరికి ఆమెకు షరతుల కాగితంపై సంతకం పెట్టించుకుని అప్పుడు ఆమెకు ఆమె భర్త ఎక్కడున్నదీ తెలిపాడు. ఆ సరికి యెకతెరీనా వచ్చిన నాలుగు నెలలకి, రాకుమారి మరీయా వోల్కోన్స్కీ ఇర్కుత్స్క్‌కు చేరింది.

ఇరువురూ కలిసే తమ భర్తల్ని చూసేందుకు దూరంగా ఉన్న గనుల ప్రాంతపు జైలుకు వెళ్లారు. ఈ ఇరువురు కలిసే, ఆ తర్వాత క్రమంగా అక్కడకు చేరిన ఖైదీల భార్యల్నీ, ఇతర బంధువుల్నీ ఐక్యంగా ఉంచుతూ, ఒక కాలనీలా తమ నివాస ప్రాంతాలైన గుడిసెలుండే ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, తమతమ బంధుమిత్రుల నుండి విరాళాలు పోగుచేసే కృషిచేసి, ఖైదీల సంక్షేమంతో పాటు, ఆ చుట్టుపక్కల ప్రాంత ప్రజల సంక్షేమానికీ కృషి చేశారు. ఆ విధంగా ఈ ఇరువురు మహిళలూ తమ ధీరోచిత ప్రవర్తనతో, త్యాగంతో అనంతర కాలంలో పలువురు కవులకూ, రచయితలకూ, కళాకారులకూ ఆదర్శంగా నిలుస్తూ, పలు కళా ప్రక్రియల ఆవిర్భావానికి కారణభూతులయ్యారు.

సైబీరియా ప్రాంత ప్రజలు ఈ మహిళామూర్తుల పట్ల, ఆ డిసెంబరిస్ట్ ఖైదీల పట్ల ఎంతో గౌరవ భావంతో చూసేవారు. రాకుమారి మరియా వోల్కోన్స్కయా నైతే వారంతా 'సైబీరియా రాకుమారి' అంటూ ఎంతో గౌరవ భావంతో పిలిచేవారు. ఇక అక్కడి వ్యాపారులూ, ప్రభుత్వాధికారులూ, రైతులూ ఆ మహిళల త్యాగాలకూ, సేవాభావానికీ ముగ్ధులై, వారికి ఎంతో సహాయం చేసేవారు. ముఖ్యంగా ఉత్తర ప్రత్యుత్తరాలూ, డబ్బు చేరివేతలో వ్యాపారుల సహాయం ఎంతో ఉపయోగపడింది.

ఇక ఇప్పుడు డిసెంబరిస్టు తిరుగుబాటుకి దారితీసిన రష్యన్ రాజకీయ చరిత్ర నేపథ్యం గురించీ, అలాగే ఆనాటి ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ పరిస్థితుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

డిసెంబరిస్టు తిరుగుబాటుకి దారితీసేందుకు ఉపకరించిన పరిస్థితులు

(1) ఆర్థిక సమస్య : ఎప్పుడైతే అలెగ్జాండర్1 రష్యన్ జార్‌గా అధికారాన్ని స్వీకరించాడో 1801 మార్చ్ 12 నాటికతడు అసాధారణంగా పలు రకాల క్లిష్ట సమస్యల్ని వారసత్వంగా స్వీకరించాల్సి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు తలకుమించిన భారంగా పరిణమించాయి. చెప్పుకోదగిన రీతిగా జాతీయ బడ్జెట్ లోటులోకి వెళ్లింది. భర్తీ చేయలేని విధంగా జాతీయ రుణం 200 మిలియన్ రూబుల్స్‌కి చేరింది. దాంతో పాటు సంక్లిష్టమైన ఉద్యోగ వ్యవస్థ పాలనను కుంటుపరిచేదిగా మారింది.

రష్యాలోని పరిశ్రమలు, 18వ శతాబ్దం మొదటి నుంచీ, ఇతర పడమటి యూరప్ పరిశ్రమలలోని అవేరకం పరిశ్రమలకన్నా విభిన్న మార్గంలో నాసిదేలి ఉన్నాయి. అందుకు కారణాన్ని లోతుగా పరిశీలిస్తే, రష్యన్ రైతాంగం ఇతర దేశాలలోకన్నా అధికంగా భూ సంబంధ బంధంలో చిక్కుకుని ఉంది. పడమటి దేశాలలోని పరిశ్రమలలోకి అవసరమైన కార్మికులు, ఎలాంటి భూములూ లేని వారు చవకగా లభిస్తుండడమే గాక, తగినంత మంది లభిస్తున్నారు. కానీ, రష్యాలోని పరిశ్రమలకు అవసరమైన కార్మికులు భానిస కార్మికులు. వారంతా భూస్వాములకు అనుబంధింపబడి ఉన్నారు. లేదా చట్ట పరంగా తిరస్కరించబడినవారు, అనగా సామాజిక జీవనానికి దూరంగా ఉన్నవారు. అలాంటి చోట్ల నుంచీ కార్మికుల్ని తీసుకోవడం వల్ల, వారిని తగిన నైపుణ్యంగల కార్మికులుగా అభివృద్ధి చేయడానికి ఏ పరిశ్రమకైనా తీవ్ర శ్రమదాయకంగా ఉంది. ఇలాంటి భేదాల వల్ల రష్యన్ పరిశ్రమలకూ, పడమటి దేశాల పరిశ్రమలకూ పోలికే లేకుండా పోయింది.

రష్యన్ పరిశ్రమలు ఇతర పడమటి దేశాలలోవలే పెట్టుబడిదారీ మార్గంలో పయనించేబదులు, పనికిరాని మధ్యయుగాల నాటి స్థితికే సర్దుకుపోతూ, పాత పద్ధతుల్లోనే కొనసాగుతున్నాయి. అంచేత సేద్యం నుండి భానిస రైతాంగాన్ని బదిలీచేసి, పరిశ్రమల వైపు మళ్లించడం పరిశ్రమలకు ఎంతైనా అవసరంగా మారింది. దాంతో రష్యన్ పరిశ్రమలు అర్ధ భూస్వామ్య స్వభావాన్ని కలిగి, నాణ్యతలేనివిగా, ఆధునిక రాజ్యం అవసరాలు తీర్చడానికి పనికిరానివిగా మారాయి. దీని ఫలితంగా రష్యన్

కార్మిక వర్గం, తమకు పారిశ్రామిక భానిసలుగా పిలవబడేవారు, వ్యవసాయ భానిసల నుండి వేరైన గుర్తింపు పొందినవారు ఏర్పడ్డారు. ఇలాంటి వర్గం పడమటి యూరప్ దేశాలలో లేనేలేదు.

పై కారణాల వల్ల ఆధునిక పారిశ్రామిక సమాజం ఒక కొత్త సామాజిక సంబంధాలను డిమాండ్ చేసింది. పెద్ద స్థాయిలో స్వేచ్ఛా కార్మికులు కావాలని, స్వేచ్ఛాయుతమైన, ఆర్థికంగా ఎదిగిన రైతాంగాన్ని పారిశ్రామిక ఉత్పత్తుల్ని కొనుగోలు చేయగల స్తోమత కలిగిన వారిని, చివరికి రాజకీయపరమైన సర్దుబాట్లతో సహా కావాలని! డిసెంబర్రిస్టులందరిలోకీ ఈ విషయంలో గల సత్యాన్ని పావెల్ పెస్తెల్ మాత్రమే పూర్తి అవగాహన కలిగి ఉన్నాడు. ఇతర సభ్యులందరికన్నా ఎక్కువగా కేవలం ఒక నీకొలస్ తుర్గేనెవ్ మినహాగా! అయినప్పటికీ, 19వ శతాబ్దపు మొదటి పావు భాగంలో, రాజకీయ పరిణామాలు ఆర్థికపరమైన అవసరాలు తీర్చడానికి ముందడుగు వేయడంలో విఫలమయ్యారు.

(2) భానిసత్వం : భానిస అనే పదానికి రష్యన్ సామ్రాజ్యంలో అర్థం 'స్వేచ్ఛలేని రైతు' అని. ఇది రష్యన్ పదబంధమైన క్రెపోస్లనై క్రిస్లియనిన్ అనేదానికి సరైన అనువాదం. ఈ భానిసత్వ వ్యవస్థకు రష్యాలో మూలాలేర్పడింది కీవ్ సంబంధమైన 'రూస్'లో కివన్‌రూస్ 11వ శతాబ్దంలో. ఈ భానిసత్వం అనేది రైతాంగానికీ, ప్రభు వంశాలవారికీ మధ్యగల సంబంధాలలో 17వ శతాబ్దంలో కీలక స్థానాన్ని ఆక్రమించింది. అలెగ్జాండర్1 సింహాసనాన్ని ఎక్కే సమయానికి అతడి వయస్సు కేవలం 23 సంవత్సరాలు మాత్రమే. పునరుజ్జీవనోద్యమ భావాలలో ఎదిగిన అతడు, తానొక ఉదారవాదినన్నట్లు సంకేతాలివ్వడమే గాక, తనమీద ఆశలు పెట్టుకున్న ఉదారవాదుల ఆశల్ని మరింత పెంచేలా కనిపించాడు. ఈ కొత్త చక్రవర్తి రష్యాను ఆధునికంగా తీర్చిదిద్దడానికి నిర్ణయించు కున్నాడు – తన నలుగురు మిత్రులైన యువకులూ, ఉన్నత విద్యావంతులూ, ఉదారవాదులైన వారి సహాయంతో వీరినే 'అనాధికార కమిటీ'గా పిలిచేవారు. ఈ కమిటీ సభ్యులు: 1) నీకొలస్ నొవాసిల్త్సేవ్, కింట్ పాల్‌స్ట్రొగనోవ్, కింట్ విక్టర్ కొచుబే, పోలీష్ దేశభక్తుడైన రాకుమారుడు ఆదమ్ జరతోర్యస్కీ. వీరంతా ఆ కాలంలో పునరుజ్జీవ నోద్యమ భావాలను ప్రతిఫలించేవారు. అంతేగాక ఇంగ్లాండు రాజకీయాల చేత, అలాగే జాకోబిన్ విప్లవ భావాల చేత ప్రభావితులైనవారు.

అలెగ్జాండర్ 1 అధికారాన్ని చేపట్టిన మొదటి రోజుల్లోనే, భానిసత్వ సమస్యతోటే అతడి మెదడంతా నిండిపోయింది. ఈ విషయంలో స్ట్రొగనోవ్ రాసిన నోట్సును ప్రతి అనధికార కమిటీ సమావేశంలోనూ చేపట్టబడి, అలెగ్జాండర్ 1కు – భానిసత్వాన్ని రద్దు చేయాలని సిఫారసు చేసేవి. యువ చక్రవర్తికి సామ్రాజ్యం పునర్వ్యవస్థీకరించబడడం అవసరం అనే విషయంలో అవగాహన ఉంది. అయితే చక్రవర్తికి గల ఆధునిక భావాలకు రాజ్యం కౌన్సిల్‌లోనూ, భూస్వాములలోనూ వ్యతిరేకత వ్యక్తం అయ్యేది. ప్రభు వర్గం భయం ఏమంటే, భానిసత్వ వ్యవస్థలో సంస్కరణ తీసుకొచ్చినట్లయితే సాంఘికంగా అల్లర్లు రేగుతాయనీ, పెద్ద ఎత్తున రైతాంగం తిరుగుబాటు జరపవచ్చనీ! ఆ చర్య (తిరుగుబాటు) అతి త్వరలోనే కనపడవచ్చుననీ, పాలనా పరమైన సంస్కరణ వల్ల ప్రజల సామూహిక ప్రవర్తన చాలా క్లిష్టంగా మారవచ్చుననీ కూడా ఆ వర్గం భయపడింది. ఈ కఠిన వాస్తవాలతో అలెగ్జాండర్1 అనధికార కమిటీతో జరిపే సమావేశాల తరచుదనాలను కొద్ది కొద్దిగా తగ్గిస్తూ వచ్చాడు.

ప్రాచీన భావాలూ, విలువలూ కలిగి ఉండే రాజ్య మండలి (స్టేట్ కౌన్సిల్) సమావేశాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో, భానిసత్వాన్ని రద్దు చేయాలన్న అలెగ్జాండర్ ఆలోచన త్వరగానే మసకబారిపోయింది. కానీ ఈ ఆశాభావంపై కొత్తరకమైన ఒక వెలుగు కిరణం ప్రసరించింది. ఈసారి ఆ ఆలోచనపై ప్రభావితుడైన ఒక ప్రభు వంశానికి చెందిన వ్యక్తి, పాశ్చాత్య ఉదారవాద సంస్కృతి నుండి వచ్చిన కీంట్ నికొలాయ్ రుమ్యాన్‌స్త్సేవ్ అనే అతడు 1802 నవంబర్‌లో అలెగ్జాండర్ 1కి ఒక రాతపూర్వకమైన ఆలోచనా పత్రాన్ని సమర్పించాడు. అందులో అతడు భానిసత్వాన్ని ఒక్క సారిగాక, క్రమక్రమంగా రద్దు చేయాలని ప్రతిపాదించాడు. ఆ పత్రం తర్వాత అందులో సూచించిన 'క్రమక్రమంగా రద్దు' ప్రతిపాదనకు సంబంధించి జాగ్రత్తగా రూపొందించిన కార్యక్రమ వివరాలను ఒక ప్రణాళిక రూపంలో కూడా పొందుపరిచి ఇచ్చాడు. రుమ్యాన్‌స్త్సేవ్ ఈ ప్రణాళికే ఆ తర్వాత 'న్యాయ నిబంధన 1803 ఫిబ్రవరి 20'కి ప్రాతిపదిక అయింది. దీని ద్వారా రైతాంగంలో ఒక కొత్త వర్గం రూపొందించబడాలనే ప్రయత్నం ఆలోచనల్లోకి వచ్చింది. అదే 'స్వేచ్ఛా రైతులు' (ఫ్రీ ఫార్మర్స్) పేర.

డిసెంబరిస్టు సొసైటీ భానిసత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ సమస్య పట్ల వారికిగల శ్రద్ధకు కారణం అదేదో విద్యా విషయకరమైనందు వల్లనో, లేక భావోద్వేగాలకు సంబంధించినందువల్లనో కాదు. డిసెంబరిస్టులలో అత్యధికులు పెద్ద పెట్టున భూములు కలిగిన ప్రభు వంశాలకు చెందినవారే అయినందువల్ల, వారికి భూములతో అనుబంధం ఉండి, రైతాంగంతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్నవారవడంచేత, వ్యవసాయంలో గల కష్ట నష్టాలు వారు గ్రహించారు.

రష్యన్ ఆర్థిక జీవితంలో వ్యవసాయ రంగమే అమిత ప్రభావం చూపగల రంగంగా ఉన్నది. ఈ మొత్తం రంగంలో 'భూమి', 'భానిసత్వం' అనేవి ఒకదాని కొకటి సంబంధం లేని భాగాలుగా ఉన్నాయి. నిజానికి ఈ రెండూ ఒకదానికొకటి సంబంధం కలిగి ఉంటేనే, అనగా భూమి, దాన్ని సాగుచేసే రైతు పరస్పర అవినాభావ సంబంధాన్ని కలిగి ఉంటే, అనగా ఆ సాగు భూమికి సాగుదారులైన రైతు హక్కుదారై ఉంటేనే అతడు వ్యవసాయంపై మరింత ప్రణాళికా బద్ధంగా పెట్టుబడులు పెడుతూ తద్వారా మంచి ఫలితాలు తాను స్వయంగా పొందుతాడు. అలాగే దేశం కూడా ఆర్థికంగా బలోపేతం అవుతుంది. డిసెంబరిస్టు అయిన నీకొలస్ తుర్గేనెవ్ ఈ విషయంలో సమగ్రమైన అవగాహనకు రాగలిగాడు. భానిసత్వం అనేది రష్యాలో ఒక కాలం చెల్లిన అంశం అనీ, అంచేత తప్పనిసరిగా భానిసత్వాన్ని రద్దు చేయాలనీ, తద్వారానే ఈ సమాజం ఒక స్వేచ్ఛా సమాజంగా మారుతుందనీ గ్రహించాడు.

మొదట డిసెంబరిస్టులు రైతాంగానికి స్వేచ్ఛనివ్వడం అనేదాన్ని శాంతియుత పద్ధతుల ద్వారానే, భానిసల యజమానుల్ని ఒప్పించడం ద్వారానే జరగాలని ఆశించారనడానికి స్పష్టమైన ఆధారం ఉంది. ఈ ఆశాభావం ప్రకారం భానిసలకు స్వేచ్ఛనివ్వడం అనేది పై నుంచి, అనగా రాజ్య పాలకుడు జారీచేసే ఆజ్ఞవల్ల, అంతేగాని కింది స్థాయి నుంచి కాదు. అయితే ఆ సమయం మించిపోయింది. (అలెగ్జాండర్1 క్రమంగా ఉదారవాదం నుండి మరలి, నియంత అయ్యాడు) కనుక చట్ట ప్రకారం భానిసలకు స్వేచ్ఛ లభించదని తేలిపోయింది. పెస్తెల్ చెప్పినట్లు 'రాజ్యాంగం ఆలోచన', లేదా ఇతర మాటలూ, విప్లవ పథకాలూ

డిసెంబరిస్టుల ఆలోచనలోకి వచ్చాయి. భూనిసత్వం రద్దు చేయడంపై సాచివేత ధోరణులూ, అసలుకీ ఆలోచనల్ని నిలిపివేత వగైరాల ద్వారా – జరగబోయేదేమిటో డిసెంబరిస్టులు గ్రహించారు. దాంతో వారు గ్రామీణ రష్యా కాస్తా పారిశ్రామిక రష్యా కావాలన్న ఆలోచనలు చేయడం మొదలెట్టారు. తద్వారా వారు తాము మధ్యతరగతికి ప్రతినిధులుగా వాదించారు. పారిశ్రామిక రష్యా ఏర్పడినప్పుడు సమాజం ఆధునిక పెట్టుబడిదారీ సమాజంగా మారుతుందనీ, దానికి భూనిసత్వ నిర్మూలన అనేది ఒక మూలస్తంభం అవుతుందనీ వాదించారు.

1860ల నాటి ప్రసిద్ధ చింతనాపరుడూ, విప్లవకర ప్రజాస్వామిక భౌతిక వాదీ, లెనిన్ ఆలోచనలపై బలమైన ముద్రవేసినవాడూ అయిన నికొలాయ్ చెర్నిషేవ్‌స్కీ, భూనిసత్వ నిర్మూలన కోసం డిసెబరిస్టుల ఆలోచనలకూ, కృషికీ గొప్ప విలువనిచ్చాడు. అతడిలా అంటాడు: 'భూనిసత్వ సమస్యకు పరిష్కారం వెతికేప్పుడు, సమాజంలోని అన్ని తరగతుల ప్రజలకూ స్వతంత్ర్యం అవసరమైంది. పై నుంచి కింది దాకా – 'చట్టబద్ధ భూనిసల' దగ్గర్నుంచీ, భూనిసలకు స్వేచ్ఛ లభించే దాకా అది జరగాలి. కానీ అది జరగడం లేదు. ఈ విషయాన్ని మరో విధంగా చెప్పాలంటే నిరంకుశత్వం రద్దవ్వాలి. డిసెంబరిస్టుల కృషి కేవలం రైతాంగానికి స్వేచ్ఛనివ్వడం వరకే ముగిసిపోలేదు. డిసెంబరిస్టులు, ప్రాచీన రష్యా (సెయింట్ పీటర్ బోధనానుసారంగా నడిచే రష్యాను పెట్రిన్ రష్యా) కు చెందిన సామాజిక నిర్మాణాన్ని మొత్తాన్నీ కూల్చివేయడం వైపుగా మార్గాన్ని నిర్మించారు'.

(3) ఉదారవాద భావాలు : అలెగ్జాండర్1 అధికార సీకరణ సమయంలో దేశం పాత తరంతో నిండి ఉంది. యువతరంలో పరిస్థితి పట్ల అసంతృప్తి నెలకొన్నది. పిత్రు భూస్వామి పట్ల ఈ యువతరానికి స్వంత అభిప్రాయాలున్నాయి. దేశభక్తికి ప్రపంచంలో గల నిజమైన అర్థంలో, యువకులకు సాధారణంగా ఉండే అంకిత భావంతో, సిద్ధాంత పరంగా, నిస్వార్థంగా, యువత క్రమంగా తమ వ్యతిరేక స్వరాన్ని హెచ్చిస్తూ, తమదేశం ఎడల తమ ప్రణాళికల్ని అమలు చేయడం కోసం కృషి మొదలు పెట్టారు. 18వ శతాబ్దపు చివరి పావు భాగంలో, ఎక్కువ మంది ప్రజలచేత ఆమోదింపబడేట్టుగా ఉన్న మేధోపరమైన ఉద్యమం, సాంఘికపరంగా అందరికీ సరిపోయే లాగా, ఉన్నతమైన సంసిద్ధతతో ఉండే ప్రతిపక్షంతో సహా రూపొంద సాగింది.

ఉదారవాదానికి సంబంధించిన ఒకరూపం, సంప్రదాయికమైన వారసత్వంతో కూడినది, 18వ శతాబ్దం నుండీ వచ్చే రూపంలాంటిదీ, ఒకప్పుడు బాగా ప్రాచుర్యంలోనే ఉన్నదీ 'మాసోనిక్ లాడ్జిలు'! ఈ మాసోనిక్ లాడ్జిలు బాగా మొదటి సారిగా మగవారికి, ఎవరికైతే సంస్కరణల్లో ఆసక్తి ఉందో వారికి ఒక అవకాశాన్ని కలిగించాయి – ఒకే భావాలు గలవారంతా జతకూడి, ప్రజల కోసం పనిచేయడానికి వీలుగా. అవి క్రమంగా సాంఘికంగా జనాలను ఐక్యపరిచే సంఘాలుగా, అభివృద్ధి పరిచే వైపుగా నడిపేవిగా ఉండేందుకు తోడ్పడ్డాయి. మాసన్‌లకు సంబంధించిన ఉదారవాద విధానం 19వ శతాబ్దం మొదట్లో 1810–20 ల మధ్య భవిష్యత్తు డిసెంబరిస్టులు పలువురిని ఆకర్షించారు. సాధారణ మాసన్లు – మతపరంగానే నెలకొన్న అసూయ, వర్గపరమైన, జాతిపరమైన వివక్షతలను నిర్మూలించడానికీ, అలాగే అంతర్జాతీయ సహకారాన్ని నెలకొల్పడానికీ కృషి చేశారు. ఊహాత్మక రీతిలో గాక, ఉదారవాద మాసన్లకు తక్షణ, సమూల సంస్కరణలలో నమ్మకం లేదు. క్రమంగా సంస్కరణలు – ఆ సమాజంలోని వ్యక్తులు దీర్ఘకాలంపాటు తగిన విద్యను క్రమం తప్పకుండా పొందడం ద్వారానే వస్తాయని మాసన్‌లు నమ్ముతారు.

చాలా మంది డిసెంబరిస్టులు, పెస్టెల్, అలెగ్జాండార్ మురావియేవ్ లాంటివారు మాసోనిక్ లాడ్జ్‌లో సభ్యులే. ఆ లాడ్జిలలో ఆ డిసెంబరిస్టులు సమకూర్చుకున్న అనుభవం వారికి ఆ తర్వాత తమస్వంత రహస్య సొసైటీల్ని నిర్వహించుకోవడంలో ఉపయోగపడింది. మాసోనిక్ లాడ్జిలు కూడా ఇలాంటి రహస్య సంఘటనలతోనే కూడి ఉంటుంది. ఈ విషయాన్ని వేరే మాటల్లో చెప్పాలంటే మాసోనిక్ లాడ్జిలు నెలకొల్పిన రహస్య రాజకీయ సొసైటీ పద్ధతుల్నే తర్వాత డిసెంబరిస్టులు కాపీకొట్టి, రష్యన్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు నడిపే సంస్థల్ని నడపడంలో ఉపయోగించారని చెప్పాల్సి ఉంటుంది.

18వ శతాబ్దపు మలి అర్ధభాగంలో యూరపియన్ ఆలోచనలు మధ్య యుగాలనాటి సామాజిక పొందికలతో కూడిన రష్యన్ సమాజంలోకి చొచ్చుకురావడం ప్రారంభమై, పునరుజ్జీవనోద్యమం ఆలోచనల్ని రష్యన్ మేధావులు స్వాగతించడం మొదలెట్టారు. రష్యన్ ప్రభువర్గం, మేధావులు యూరప్ రాజధానీ నగరాల్ని సందర్శిస్తూ, ఉదారవాద భావాలతో, రచనలతో సరాసరి సంబంధాల్ని ఏర్పరచుకోసాగారు. పీటర్1 చేత పడమటి దేశాలకు పంపించబడిన యువజనులు (మగవారు మాత్రమే) సాంకేతికపరమైన శిక్షణ కోసం, ఉన్నత విద్య కోసం పంపబడి, రష్యాకు తిరిగివచ్చినప్పుడు తమతోపాటు తీసుకువచ్చింది కేవలం నౌకా నిర్మాణం, సైనిక సంబంధమైన విజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలు, వగైరాలు మాత్రమే కాదు, సరికొత్త రకపు రాజకీయపరమైన, సామాజికపరమైన ఆలోచనల్ని కూడా!

డిసెంబరిస్టులలో అత్యధికులు విశ్వవిజ్ఞానాన్ని ఆర్జించే విద్యార్థులుగా కూడా అయ్యారు. వారంతా ఫ్రాన్స్‌లోనూ, ఇతర దేశాలలోనూ గల విప్లవోద్యమాల చేత లోతైన ప్రభావాలను కలిగి ఉన్నారు. దాదాపు అందరు డిసెంబరిస్టులూ కూడా ఉదారవాద రాజకీయ సంస్థలకు సంబంధించిన తమతమ ఆలోచనల్నీ, తమ విజ్ఞానాన్నీ – విదేశీ సాహిత్యం ద్వారా పడమటి దేశాలలో జరిగిన, జరుగుతున్న విప్లవోద్యమాల ద్వారా కూడా పొందారు. 19వ శతాబ్దపు తొలి సంవత్సరాలు గడిచేకొద్దీ, పశ్చిమ యూరప్‌తో తగిన సంపర్కం లేకపోవడం వల్ల రష్యా రాజకీయ ఒంటరితనం పెరిగిపోసాగింది. దాంతో విదేశాలకు వెళ్లడం, అక్కడ చదువుకోవడం అనేది ప్రభు వర్గానికి చక్కనైన, ఒక సాధారణమైన విషయంగా మారిపోయింది. 1812–14ల మధ్య జరిగిన పరిణామాలు రష్యన్ సామ్రాజ్యాన్ని పాతతరం రష్యా నుంచి వేర్పరచి ఒక కొత్తతరం రష్యాగా పాశ్చాత్య దేశాల కుటుంబంలో చేర్చడాన్ని వేగిరపరిచింది. అంతేగాక రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరమైన రంగాల్లో పశ్చిమ దేశాలతో పోలిస్తే రష్యా వెనుకబాటుతనం చాలా స్పష్టంగా కనబడసాగింది.

(ఇంకా ఉంది)

(రచయిత రష్యన్ విప్లవాల, లెనిన్ జీవిత చరిత్ర పరిశోధకుడు, సాహిత్యకారుడు, విమర్శకుడు)

వీ

డేవిడ్ హార్వే: పెట్టుబడి - 7 ప్రధాన వైరుధ్యాలు

***పెట్టుబడిదారీ వ్యవస్థ తనలోని పదిహేడు అంతర్ వైరుధ్యాల వల్ల పతనం దిశగా పయనిస్తుందని డేవిడ్ హార్వే చేసిన విశ్లేషణలోని ఏడు ప్రాథమిక వైరుధ్యాలను వివరిస్తున్నారు* రమేష్ పట్నాయక్**

(...గత సంచిక తరువాయి భాగం)

డేవిడ్ హార్వే ఇదే సందర్భంలో ప్రస్తావించిన మరొక విషయాన్ని పరిశీలించేముందు కొన్ని ఆర్థిక భావనలను గుర్తుకు తెచ్చుకుందాం. కార్మికుని, కార్మిక కుటుంబం, కనీస జీవితావసరాల మొత్తం విలువయే కార్మిక శ్రమ శక్తి విలువకు సమానమని మనకు తెలుసు. మార్కెట్‌లో కార్మిక వేతనాలు సరాసరిగా చూసుకుంటే కార్మికుని శ్రమ శక్తి విలువకు సమానంగా ఉంటాయని మనకు తెలుసు. ఈ విషయాన్ని నిరంతరంగా గుర్తుపెట్టుకోవాలి. ఇక, కార్మికుల జీవితావసరాలు తగ్గితే, కార్మికుల శ్రమ శక్తి విలువ కూడా తగ్గుతుంది. అంటే కార్మికుల వేతనాల విలువ తగ్గుతుంది. నాటి ధరలలో కార్మికుల వేతనాలు తగ్గుతాయి. అందుకే పెట్టుబడిదారులు కార్మికుల జీవితావసరాలు తగ్గాలని కోరుకుంటారు. ఐర్లాండ్‌లో కౌలుదారులు ఎక్కువ కౌలు చెల్లించాలంటే వారి జీవితావసరాలు తక్కువగా ఉండాలి. తక్కువ శ్రమతో ఉత్పత్తి అయ్యే బంగాళాదుంపల పంట అందుబాటులోనికి రావడంతో వారి జీవితావసరాల విలువ తగ్గిపోయింది. వారు తక్కువ శ్రమతో ఉత్పత్తి అయ్యే బంగాళాదుంపలను ప్రధాన ఆహారంగా తిని ఎక్కువ శ్రమను లేదా దాని ఉత్పత్తులను (గొడ్డు మాంసం) భూస్వాములకు అప్పజెప్పారు. (బంగాళా దుంపల పంటకు తెగులు వచ్చేసరికి ఐర్లాండు రైతులకు ఆహారమే లేకుండా పోయింది. ఈ కారణంగా 1847లో ఐర్లాండులో పది లక్షలమంది చనిపోయారు.) ఇదంతా ఎందుకు చెప్పుకుంటున్నామంటే పనివారి జీవితావసరాల విలువను ఎంత వీలయితే అంత తగ్గించడానికి పాలక వర్గాలు ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాయి.

మనకు దగ్గరగా ఉన్న ఉదాహరణను పరిశీలిద్దాం. కార్మిక కుటుంబంలో స్త్రీలు ఎండు చిదుగులు ఏరుకుని వంట చేస్తే కిరోసిన్ లేదా గ్యాస్ ఖర్చు ఉండదు. ఈ పని ఒక కుటుంబం లేదా కొన్ని కుటుంబాలు మాత్రమే చేస్తే అది ఆయా కుటుంబాల వారికి పొదుపుగా ఉంటుంది. అలా కాకుండా ఒక చిన్న పట్టణంలో కార్మిక కుటుంబాలన్నీ ఇదే పని చేయగలిగితే, చేస్తే ఆ పట్టణంలో సరాసరిన కార్మిక కుటుంబం కనీస జీవితావసరాల విలువ తగ్గినట్లే. కార్మిక శ్రమ శక్తి పునరుత్పత్తి ఖర్చులు తగ్గినట్లే. అలా అయినప్పుడు వేతనాలు కూడా తగ్గించవచ్చు. ఇక్కడ కార్మికుడు తన జీవితావసరాలలో కొంత భాగాన్ని వేతనం ద్వారా మరి కొంత భాగాన్ని కుటుంబ శ్రమ ద్వారా పొందుతున్నాడు. పెట్టుబడిదారుడు ఏమి కోరుకుంటాడు? కార్మికులు తమ జీవితావసరాలను వీలయినంత ఎక్కువ తమ కుటుంబ శ్రమ ద్వారా సాధించుకోవాలని వేతనాల ద్వారా కొనుగోలు చేయవలసిన భాగం తగ్గాలని కోరుకుంటాడు. అప్పుడు వేతనాల పెంపుదల కొరకు కార్మికుల పోరాటాలు తగ్గుముఖం పడతాయని పెట్టుబడిదారుడు సరిగానే అంచనావేసుకుంటాడు. డేవిడ్ హార్వే ఈ విషయాన్నే క్లుప్తంగా 'కార్మికులు తమ పునరుత్పత్తి ఖర్చులను తమ కుటుంబ పనిద్వారా వీలయినంత అధికంగా వారికి వారే భరించేటట్లు చేయాలని.... పెట్టుబడిదారులు కోరుకుంటారు' అంటాడు. డేవిడ్ హార్వే అభిప్రాయాన్ని మనం అంగీకరించవచ్చు. అయితే, ఈ విధంగా ఎక్కడ ఎప్పుడు జరుగుతుంది లేదా ఎక్కడ ఎప్పుడు జరగదు అనే విషయాలను పెట్టుబడి చరిత్రగతిలో పరిశీలించాలి. ఇంకా ప్రధానంగా ఈ ప్రాతిపదికపై డేవిడ్ చేసిన ఇతర సూత్రీకరణలు మరింత చర్చనీయాంశమైనవి.

జనావాసాలు ప్రకృతిలో భాగంగా ఉన్నప్పుడు (పట్టణాల పరిమాణం ఇంకా తక్కువగా ఉన్నప్పుడు) ప్రజల మధ్య పరస్పర సహకారం విస్తృతంగా ఉన్నప్పుడు కార్మిక కుటుంబ జీవితావసరాలు తక్కువగా ఉంటాయి. వెనుక బడిన, అభివృద్ధిచెందుతూ ఉన్న దేశాలలో ఇది కొంతవరకు సాధ్యం. ఆ దేశాలలో కార్మికుల పంట చెరుకు, తాగునీరు, వారు చాలా తక్కువగా వాడగలిగే పాలు, గుడ్లు, కోడి మాంసం వంటి వాటిని మార్కెట్‌కు దూరంగా కుటుంబ శ్రమ ద్వారా సంపాదించుకుంటారు. ఇంటి అద్దెలు లేకుండా గ్రామాలలో జీవిస్తారు. ఫలితంగా ఈ దేశాలలో తక్కువ వేతనాలకు పనిచేస్తారు. 'అవసర శ్రమ' వాటా తగ్గుతుంది, 'అదనపు శ్రమ' వాటా పెరుగుతుంది. అంటే అదనపు విలువను ఎక్కువగా సృష్టిస్తారు. పెట్టుబడిదారులు తయారయిన సరుకులను కార్మికులకు, కార్మికులు కాని వారికి అమ్ముకుని లాభాలు చేసుకుంటారు. అంటే ఈ దశలో (పారిశ్రామిక పట్టణాలు కొత్తగా ప్రారంభం అయినా అవి ఇంకా చిన్నగా ఉన్న దశలో) చెక్ పోస్టు ఒకటి వద్ద, రెండు వద్ద కూడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటుంది. అందుకే అభివృద్ధిచెందిన దేశాల పెట్టుబడిదారులు వెనుకబడిన దేశాలలో పెట్టుబడులు పెట్టడానికి ఇష్టపడతారు. ఇక అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల విషయాలను పరిశీలిస్తే అక్కడ కార్మికులు తమకు అవసరమైన జీవితావసరాలను కుటుంబ శ్రమ ద్వారా పొందే అవకాశం చాలా తక్కువ. సుమారు లేదనే చెప్పాలి. పెట్టుబడి ఎంతగా విస్తరిస్తూ ఉంటే పట్టణీకరణ ఎంతగా జరుగుతూ ఉంటే అంతగా జనావాసాలు ప్రకృతికి దూరమవుతున్నాయి. పెట్టుబడి ఎంతగా విస్తరిస్తూ ఉంటే అంతగా ప్రజల మధ్య సహకారం తగ్గుతూ ఉంది. అదలా ఉండగా పెట్టబడి స్వయానా తన రెండవ చెక్ పోస్టు సమస్యలను పరిష్కరించుకోవడానికి మనిషి అవసరాలు పెంచుతూ ఉంది. మనిషిని ఇటు ప్రకృతికి అటు సమాజానికి దూరం చేస్తూ ఉంది. మరొక రకంగా చెప్పాలంటే మనిషిని ఇటు సహజత్వానికి అటు సహకారానికి దూరం చేస్తూ ఉంది. పెట్టుబడికి విచిత్రమైన కోరికలు

ఉంటాయి. కార్మికులు మాత్రం తమ జీవితావసరాలను ప్రకృతి ద్వారా, సహకారం ద్వారా తీర్చుకోవాలని, తక్కువ వేతనాలతో సరిపెట్టుకోవాలని, మిగిలిన జనాభా మాత్రం తమ జీవితావసరాలకు తాను చేసే ఉత్పత్తులపైనే అధారపడాలని పెట్టుబడిదారీ వర్గం కోరుకుంటుంది. ఈ కోరిక భారత దేశం వంటి మధ్యంతర దశలో ఉన్న పెట్టుబడిదారీ దేశాలలో కొంతవరకు తీరుతుంది. ఎందుకంటే ఇక్కడ అనేక అవసరాలు కుటుంబ శ్రమ ద్వారా తీర్చుకుని, గ్రామాలలో జీవించి దగ్గరలో ఉన్న పట్టణాలకు రోజూ వెళ్లి పనిచేసే కార్మికులుంటారు. అదే సందర్భంలో ప్రతిదానికి మార్కెట్‌పై ఆధారపడే పట్టణ మధ్యతరగతి వారు ఉంటారు. కాని అటువంటి అవకాశం లేని అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలకు ఇది ఎలా వర్తిస్తుంది? డేవిడ్ హార్వే రాస్తున్నది అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల ప్రస్తుత పరిస్థితి గురించి మాత్రమే అయితే, ప్రస్తుత అమెరికా, ఐరోపా దేశాల గురించి అయితే, ఆ దేశాలలో కార్మికులు అక్కడ కల్పించబడిన పరిస్థితుల వలన ఇప్పటికే పూర్తిగా సహజత్వానికి, సహకారానికి దూరం అయ్యారు. వారు తమ కుటుంబాల శ్రమ ద్వారా జీవితావసరాలను తీర్చుకోవడం సాధ్యమయ్యే విషయం కాదు. తమ జీవితావసరాల కొరకు వారు పూర్తిగా వేతనాలపైననే అధారపడవలసిన పరిస్థితి ఉంది. వెనుకబడిన లేదా అభివృద్ధి చెందుతూ ఉన్న దేశాలకు వర్తించే ఈ చర్చ అభివృద్ధిచెందిన దేశాలకు ఇప్పుడు ఎంత మాత్రం వర్తించదు. డేవిడ్ హార్వే దేశాల అభివృద్ధి దశలను స్థల కాలాలలో పట్టించుకోడు. అంటే ఇంగ్లండు ఒకప్పటి పరిస్థితికి నేటి పరిస్థితికి తేడా ఉంది. అలాగే ప్రస్తుత కాలంలో ఇంగ్లండు పరిస్థితికి, భారతదేశ పరిస్థితికి తేడా ఉంది.

డేవిడ్ హార్వే ఇదే సందర్భంలో మరొక అభిప్రాయం వ్యక్తం చేస్తాడు. డేవిడ్ హార్వే 'వైపరీత్యమేమంటే కార్మికులు ఎంతగా తమ పునరుత్పత్తిని (జీవితావసరాలైన తిండి తీర్థాలను) తమ కుటుంబం పనిద్వారా సంపాదించుకుంటారో అంతగా వారు పెట్టుబడివద్దకు పనికి వెళ్లడానికి ప్రేరణ కోల్పోతారు.' అంటాడు. ఈ విషయాన్ని పరిశీలిద్దాం. కుటుంబ శ్రమ ద్వారా జీవితావసరాలు తీర్చుకోవడం అనేది అభివృద్ధిచెందిన దేశాలకు వర్తించదని డేవిడ్ హార్వే చెప్పలేదు. మనం అయితే ఆ విషయాన్ని వివరంగా చెప్పుకున్నాం. కాబట్టి డేవిడ్ హార్వే ప్రతిపాదనను భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ దేశాలలో పరిశీలిద్దాం. గ్రామాలలో ఉంటూ, దగ్గర పట్టణాలలో పనిచేసే కార్మికుల ఆర్థిక జీవితాన్ని పరిశీలిద్దాం. వీరు తమ జీవితావసరాలను 30 శాతం కుటుంబ శ్రమ ద్వారా తీర్చుకుంటున్నారు అనుకుందాం. అయినా వారు మిగిలిన 70శాతం జీవితావసరాల కొరకు పెట్టుబడి వద్దకు పనికి వెళ్లక తప్పదు కదా! జీవితావసరాలు 30 శాతం మాత్రమే కాదు, 40 శాతం లేదా 50 శాతం కుటుంబ శ్రమ ద్వారా సంపాదించుకున్నా మిగిలిన జీవితావసరాల కొరకు పెట్టుబడివద్దకు పనికి వెళ్లక తప్పదు. ఎందుకంటే జీవితావసరాలు అనేవి నిర్వచన రీత్యానే కనీస అవసరాలు. వాటిని పొందకుండా బ్రతికి బట్టకట్టడం సాధ్యం కాదు. ఆ కారణాన జీవితావసరాలను స్వంతగా ఎంత ఎక్కువగా సమకూర్చుకున్నా మిగిలిన భాగం కూడా వారికి తప్పనిసరి అవసరం. అందుకొరకు వారు పెట్టుబడి దగ్గరకు పనికి వెళ్లక తప్పదు. ప్రేరణ తగ్గడం అనే సమస్య ఏవిధంగానూ తలెత్తదు.

అత్యధిక కార్మికులు స్వంత వ్యవసాయం లేదా స్వంత వృత్తులుగల వారైతే వారు సమ్మెలో ఎక్కువ కాలం నిలబడతారు. అయితే డేవిడ్ హార్వే ప్రస్తావించిన విషయం ఇది కాదు. మనం కూడా ఆ చర్చలోనికి వెళ్లవద్దు. ఎటువంటి ఉత్పత్తి సాధనాలు లేని శ్రమ శక్తి అమ్ముకుని జీవించవలసిన వారి గురించే డేవిడ్ హార్వే మాట్లాడుతున్నాడు. వారి విషయానికి పరిమితమైతే వారు కుటుంబ పనిద్వారా ఎంత శాతం జీవనాధారాలు సంపాదించుకున్నా మిగిలిన భాగం కూడా తప్పనిసరి అవసరం కావున పెట్టుబడిదగ్గరకు పనికి వెళ్లక తప్పదు. సహజంగానే 'ప్రేరణ' కొనసాగుతుంది. డేవిడ్ హార్వే చెప్పినట్లు ప్రేరణ కోల్పోవడం ఉండదు.

డేవిడ్ హార్వే ఇక్కడ మరొక్క విషయాన్ని పరిశీలిస్తున్నాడు. విషయాలను స్పష్టంగా చూడడానికి ఆయన ప్రతిపాదనలను బిందు రూపంలో రాద్దాం. డేవిడ్ హార్వే: 1) 'అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలలో పెట్టుబడి 1945 నుండి 70ల మధ్య భాగం వరకు మార్క్స్ పెట్టుబడి రెండవ సంచికలో చేసిన సూచనల ప్రకారం డిమాండ్ మానేజ్‌మెంట్ ప్రాధాన్యతా వైఖరి – సరుకులకు డిమాండ్ సృష్టించుకుని అమ్ముకుని అందులో ఉన్న విలువను వాస్తవీకరించుకోవడం (డబ్బు రూపంలో పొందడం) ప్రధానంగా గల వైఖరి – అనుసరించింది. ఫలితంగా ,..'ముందుకు వచ్చిన' .. బలమైన కార్మిక వర్గ ఉద్యమం కారణంగా అదనపు విలువ ఉత్పత్తి చేయడంలో చాలా సమస్యలను ఎదుర్కొంది. 2) '1970 ల మధ్య భాగం తరువాత (కార్మిక వర్గంతో బలమైన యుద్ధం తరువాత, కార్మిక వర్గం అణచివేయబడిన తరువాత) మార్క్స్ పెట్టుబడి మొదటి సంచికలో చేసిన సూచన ప్రకారం సప్లై రంగ ప్రాధాన్యతా వైఖరి – వేతనాల కోత ద్వారా, కార్మిక వర్గ ఉద్యమాన్ని అణచివేయడం ద్వారా, అదనపు విలువ సృష్టిపై ప్రధానంగా దృష్టి పెట్టే వైఖని అనుసరించింది.... నయా సరళీకరణ ప్రతీఘాత విప్లవంగా పిలుస్తున్న సదరు 70ల మధ్య కాలం నాటికి ప్రబలంగా ఉన్న 'అదనపు విలువలను ఉత్పత్తిచేయలేని' సమస్యను పరిష్కరించింది. అయితే ఆ క్రమంలో అది మార్కెట్‌లో సరుకులు అమ్ముకోలేకపోవడం, అంటే లాభాన్ని వాస్తవీకరించుకోలేకపోవడం అనే సమస్యను సృష్టించుకుంది ...' అంటాడు.

పైన ఉటంకించిన పంక్తులతో డేవిడ్ హార్వే అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల స్థితి గతుల గురించి, ఆ దేశాలలో పరిశ్రమలలో అదనపు విలువ సృష్టి గురించి పరిశీలిస్తున్నాడు. విశ్లేషణ అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలకు పరిమితం చేసాడు. ఈ దేశాలలో పెట్టుబడిదారులు పరస్పరం ఒకరి నుంచి ఒకరు చేసే కొనుగోళ్లు (క్యాపిటల్ గూడ్స్, లగ్జరీ గూడ్స్) పరిమితంగానే ఉంటాయి. అలాగే ప్రభుత్వం దాని ఉద్యోగులు చేసే కొనుగోళ్లు కూడా పరిమితంగానే ఉంటాయి. విదేశాలకు సరుకుల ఎగుమతిచేసే అవకాశాలు లేనప్పుడు స్వంత దేశంలో కార్మికుల కొనుగోలు శక్తి ఒక ప్రధానమైన మార్కెట్‌గా ఉంటుంది. మొదటి చెక్ పాయింట్ వద్ద, రెండవ చెక్ పాయింట్ వద్ద కార్మికులు మాత్రమే ఉంటారు. కాబట్టి పైన ఉటంకించిన పంక్తులలో డేవిడ్ హార్వే చెప్పిన దానితో మనం ఏకీభవించవచ్చు. కార్మికులకు వేతనాలలో కోత పెడితే వారు మార్కెట్‌లో సరుకులు కొనుగోలు చేయలేరు. అలాగే వారు మార్కెట్‌లో సరుకులు కొనుగోలు చేసేటట్లు చేయాలంటే 1945–70 కాలంలో చేసినట్లు వేతనాలు పెంచాలి. అయితే, వేతనాలు పెంచితే లాభాలు రావు. వేతనాలలో కోత విధిస్తే సరుకులు అమ్ముడుపోవు. పెట్టుబడికి

ముందుకు వెళితే గొయ్యి, వెనక్కి వెళితే నుయ్యి పరిస్థితి. ఇప్పుడు పెట్టుబడి కార్మికులను దోపిడీ చేయలేని సంక్షోభంలో పడిపోయింది. పెట్టబడి వేతనాలు పెంచడానికి ఇష్టపడదు, అందుకే సరుకులు అమ్ముకోవడానికి ఒక కొత్త పద్ధతిని ముందుకు తీసుకువచ్చింది. సరుకులు కొనుగోలు చేయడానికి కార్మికులకు (వ్యక్తులకు) ఋణాలిచ్చింది, ఈ పద్ధతి అమెరికాలో, ఇటలీలో,, ఐర్లాండులో సబ్-ప్రైమ్ సంక్షోభంగా ఘనీభవించడం ఇంతకుముందు గమనించి ఉన్నాం.

డేవిడ్ హార్వే తన ప్రతిపాదనల పరిమితులను స్పష్టంగా పేర్కొనక పోయినా, మనం ముందుగానే గమనించినట్లు తను అమెరికా లేదా అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలకు చెందిన ఈ మధ్యకాలపు, అంటే రెండవ ప్రపంచ యుద్ధానంతర ఆర్థిక చరిత్రను ఇక్కడ క్రోడీకరిస్తున్నాడు. డేవిడ్ హార్వే: '... ఆర్థిక విధానం, సిద్ధాంతాల మధ్య సమాంతరమైన మార్పులు జరుగుతూ వచ్చాయి. .... మార్క్స్ పెట్టుబడి వాల్యూం రెండులో సుమారు ఒడంబడికలో ఉన్న కీన్స్ డిమాండు మానేజ్‌మెంట్ అనే ఆర్థిక శాస్త్ర ఆలోచనలు 1960లలో ఆధిపత్యంలో ఉండగా 1980ల తరువాత మార్క్స్ వాల్యూం ఒకటిలో పేర్కొన్న విషయాలతో సుమారు ఒడంబడికతో ఉన్న ద్రవ్య నియంత్రణ వాదుల, సప్లై సైడ్ మానేజ్‌మెంట్ సిద్ధాంతాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పెట్టుబడిదారీ దేశాలలో ఆలోచనలలోనూ, ప్రభుత్వ విధానాలలోనూ సంభవించిన ఈ మార్పుల చరిత్ర మార్క్స్ పెట్టుబడి మొదటి, రెండవ వాల్యూంలలో విశ్లేషించబడిన ఉత్పత్తికి, విలువ వాస్తవీకరణకు మధ్య ఉన్న వైరుధ్యపూరితమైన ఐక్యతకు ఒక సంబంధాన్ని చూడడం ప్రధానమైన విషయమని నేను భావిస్తాను....' అంటాడు. అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల ప్రస్తుత వైరుధ్యాలకు సంబంధించినంత వరకు డేవిడ్ హార్వే చెప్పిన ప్రతి విషయం, ప్రధానంగా సరుకుల ఎగుమతికి అవకాశం లేని దేశాలకు పూర్తిగా వాస్తవమైనదే.

తరువాత డేవిడ్ హార్వే ఋణ సౌకర్యం గురించి మాట్లాడుతున్నాడు. ఈ విషయంలో కొన్ని అంశాలను ముందుగా మనం చర్చించుకున్నాం. డేవిడ్ హార్వే పరిశీలనలను ఇక్కడ గమనిద్దాం. డేవిడ్ హార్వే: 'కష్టకాలంలో పెట్టుబడి ఎదుగుదలకు ఋణవ్యవస్థ 'కొనుగోలు దారులకు ఋణాలు ఇవ్వడం' నిర్మాణాత్మక పాత్ర పోషించింది. అయితే ఋణ వ్యవస్థ వలన అదనపు విలువ ఉత్పత్తికి, దానిని లాభంగా వాస్తవీకరించుకోవడానికి మధ్య వైరుధ్యం సరుకులలో ఉన్న విలువకు, డబ్బురూపంలో దాని వ్యక్తీకరణకు మధ్య వైరుధ్యంగా మారిపోయింది. ఈ ఋణ వ్యవస్థ ఒక వైపు .... పెట్టుబడి నిరంతరాయ ప్రవాహానికి ఆటంకం కలిగించే ఎన్నో సమస్యలకు ఉపశమనం కలిగించగా అదే సందర్భంలో సరకుల ధరల అధివూహాగానాల (స్పెక్యులేషన్)కు దారితీసింది..... గృహ సౌకర్య ధరల బుడగ ఇందుకు ఉదాహరణ. ... రుణ సౌకర్యంపై నియంత్రణలు అదనపు విలువను ఉత్పత్తి చేయడం, దానిని వాస్తవీకరించు కోవడం అనే సమస్యను తీవ్రతరం చేస్తుంది. కాగా ఋణ సౌకర్య వితరణకు ఉన్న నిబంధనలను తొలగిస్తే, నియంత్రణలను ఉపసంహరిస్తే అది అడ్డూ అదుపూ లేని అధివూహాగానాలకు ప్రధానంగా ఆస్తుల విషయంలో అధివూహాగానాలకు వరద గేట్లను తెరుస్తుంది. 'పెట్టుబడి ఎన్ని కుప్పిగంతులు వేసినా' ఎప్పటికీ మౌలిక సమస్య అయిన ఉపయోగపు, మారకపు విలువల మధ్య ఉన్న వైరుధ్యం, సామాజిక శ్రమకు, డబ్బురూపంలో వ్యక్తమయ్యే దాని విలువకు మధ్య ఉన్న వైరుధ్యం మాత్రం రద్దుకాజాలవు. ఈ వివిధ వైరుధ్యాల మధ్య అంతఃసంబంధాలు పదే పదే ద్రవ్య, వాణిజ్య సంక్షోభాలకు దారి తీస్తాయి' అంటాడు. డేవిడ్ హార్వే: 'అదనపు విలువ ఉత్పత్తి, లాభాల వాస్తవీకరణ అనే వైరుధ్యానికి అనేక ద్వితీయ వైరుధ్యాలు అంటిపెట్టుకుని ఉన్నాయి. .... అదనపు విలువ ఉత్పత్తి అయ్యేది పని స్థలం అంటే పరిశ్రమ వద్ద .... కాగా అది వాస్తవీకరణ పొందేది అంటే ధన రూపంలో లాభంగా మారేది మార్కెట్‌లో అన్న విషయం తెలిసిందే. .... అయితే ఈ లాభంలో బ్యాంకువాడు, భూయజమాని, సరుకులు అమ్మిపెట్టే వ్యాపారి, పన్ను రూపంలో ప్రభుత్వం వాటాలు అడుగుతారు. కొన్ని సందార్భాలలో ఆ వాటాలే ఎక్కువై పారిశ్రామిక పెట్టుబడి దారుడికి మిగిలేది స్వల్పం అవుతుంది. ప్రధానంగా 'ద్రవ్య రంగంలోనూ, వ్యాపార రంగంలోనూ మోనోపలి ఏర్పడినప్పుడు' బ్యాంకులు అధిక వడ్డీని వ్యాపారులు అధిక రిబేటును గుంజుతారు ...చైనాలో వ్యాపార రంగంలో ప్రవేశించిన వాల్ మార్ట్ అక్కడ పరిశ్రమలలో ఉత్పత్తి అయిన లాభాలన్నింటిని గుంజుతుంది....' అంటాడు. అదనపు విలువ సృష్టి పరిశ్రమలలో జరిగినా దాని నుండి లాభం పారిశ్రామిక పెట్టుబడిదారునికి కాక ఇతర పెట్టుబడిదారులకు చెందడం వలన పారిశ్రామిక పెట్టుబడి తగినంతగా పెరగదు అంటాడు డేవిడ్ హార్వే. అది నిజమే. కాని పెట్టుబడి ఎక్కడికీ పోదు. స్థిరాస్తి యజమానుల వద్దకు చేరిన లాభాలతో వారు మోనోపలి కనిష్ట ధరలకు చిన్న ఆస్తిపరులు ఆస్తిని కొనివేస్తారు. స్థిరాస్తిపరుల ఆస్తి పెరుగుతూ ఉంటుంది. తమ ఆస్తులు అమ్ముకున్నవారు వచ్చిన ధనంతో మార్కెట్‌లో వస్తు సేవలు కొనుగోలుచేస్తారు. ఇదికొంత డిమాండును సృష్టిస్తుంది. ఇక లాభాలు పొందిన వ్యాపార సంస్థలు చిన్న చిన్న వ్యాపార సంస్థలను దివాళా తీయిస్తాయి. తమ వ్యాపారాలను తెగనమ్ముకున్న చిన్న చిన్న వ్యాపారులు కూడా ఫకీరులుగా మారిపోయే క్రమంలో వివిధ సరుకులకు కొంత కాలం కొంత డిమాండును కల్పిస్తారు. బ్యాంకులు కూడా ఇదే విధంగా మోనోపలివైపు ప్రయాణిస్తున్న విషయం తెలిసిందే. అంతేకాదు, ఆ పెట్టుబడి వర్గాలలో (వస్తు తయారీ పరిశ్రమ, స్థిరాస్తి, వ్యాపారం) ఎవరికైనా విస్తరణావకాశాలు లేనప్పుడు వారు తమ లాభాలను బ్యాంకులలో వేస్తూంటారు, లేదా లాభాలు వచ్చే రంగాలలో షేర్లు కొనుగోలు చేస్తూంటారు. ఈ పెట్టుబడి విభాగాల మధ్య బ్యాంకింగ్, షేర్ మార్కెట్ వ్యవస్థల ద్వారా ఒక విధమైన సంలీనత ఉంది. కార్ల్ మార్క్స్ చెప్పినట్లు పెట్టుబడి అధిక లాభాల విభాగాల వైపు కదులుతూ లాభాల రేటులో ఒక సరాసరి పరిస్థితిని కల్పిస్తూ ఉంటుంది. స్థిరాస్తి, వ్యాపార రంగాలు లాభాల పంపకంలో అధికాధికంగా బలమైన పోటీదారులుగా పారిశ్రామిక పెట్టుబడిని ఒక గడ్డు సమస్యలోనికి నెట్టివేసాయి. అలాగే స్థిరాస్తిలో భూమి మాత్రమే కాక రైల్వేలు రోడ్లు, ఓడ రేవులు, విమానాశ్రయాలు వంటివి కూడా ఉన్నప్పుడు, అవి కూడా మోనోపలి పెట్టుబడిగా మారినప్పుడు పరిశ్రమలు తమకవసరమైన రవాణాకు మోనోపలి ధరలు చెల్లించాల్సి వస్తుంది. అంటే ఆ మేరకు సరుకులు ఉత్పత్తి చేసే పరిశ్రమల లాభాలలో కోత పడుతుంది . దీనినే డేవిడ్ హార్వే ఇక్కడ నొక్కిచెప్తున్నాడు.

(ఇంకా ఉంది)

(కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ) వీ

చర్చల ప్రతినిధి చంద్రన్న మృతి

ప్రభుత్వానికి నక్సలైట్ పార్టీలకు మధ్య జరిగిన చర్చల్లో జనశక్తి పార్టీ తరఫున ప్రతినిధిగా ఉన్న కార్మిక నాయకుడు చంద్రన్న(75) అనారోగ్యంతో డిసెంబర్ 13న హైదరాబాద్‌లో మృతిచెందారు. ఇప్పటి యాదాద్రి జిల్లా టంగుటూరుకు చెందిన చంద్రన్న విద్యార్థి దశ నుంచే విప్లవ రాజకీయాల్లోకి వచ్చి విద్యార్థి సంఘ ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందారు. అలా మొదలైన ఆయన రాజకీయ ప్రస్థానం. హైదరాబాద్‌లో ఐడిపిఎల్ కార్మికుడిగా తొలుత ఏఐటియుసిలో పనిచేశారు. అప్పటికే రాజుకున్న నక్సల్బరీ పోరాటం విప్లవ రాజకీయాల వైపు నడిపించింది. ఆ ప్రభావంతో ఐఎఫ్‌టియు నాయకుడిగా ఎదిగారు. ఏఐఎఫ్‌టియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాష్ట్రవ్యాప్తంగా కార్మికులను కూడగట్టారు. శ్రామికశక్తి బీడి కార్మికుల సంఘం, సింగరేణి బొగ్గుగని కార్మికుల సంఘాలకు గౌరవాధ్యక్షుడిగా వ్యవహరించారు.

లింగా విజయకుమార్ మృతి

తొలితరం విప్లవకారుడు లింగ విజయకుమార్ (70) ఖమ్మం పట్టణం సారథినగర్‌లోని అనారోగ్యంతో డిసెంబర్ 13న మరణించారు. కమ్యూనిస్టు ఆలోచనలు ఉన్న కుటుంబంలో విజయకుమార్ జన్మించారు. విద్యార్థి దశలోనే విప్లవ రాజకీయాలవైపు మళ్లారు. ఆ క్రమంలో ఆయన నాయకత్వంలో నడిగూడెం బ్యాంకుపై దాడిచేసి వెళుతున్న క్రమంలో పట్టుబడ్డాడు. సికింద్రాబాద్ కుట్రకేసులో నడిగూడెం బ్యాంకు దాడి కేసును చేర్చి అరెస్టు చేసి విజయకుమార్‌ను జైల్లో నిర్బంధించారు. ఎమర్జెన్సీ తరువాత సికిందరాబాద్ కుట్రకేసు నిందితులందరూ బెయిల్‌పై విడుదలయ్యారు. మొదట కొండపల్లి సీతారామయ్యతో కలిసి పనిచేసిన విజయకుమార్ సీతారామయ్య తీసుకున్న 'తాత్కాలికంగా సాయుధ పోరాటం ఆపాలనే నిర్ణయాన్ని' వ్యతిరేకిస్తూ సిపిఐ ఎంఎల్ రీఆర్గనైజింగ్ కమిటీ (ఆర్‌ఓసి)తో కలిసి కొనసాగారు.

'నవోదయ' రామ్మోహనరావు ఇక లేరు

తెలుగునాట ప్రముఖ పబ్లిషర్ 'నవోదయ' రామ్మోహనరావు అనారోగ్యంతో విజయవాడలో డిసెంబర్ 15న మరణించారు. ఆయన 1934లో కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా ఉంగుటూరు గ్రామంలో జన్మించారు. పదో తరగతి పూర్తయ్యాక విశాలాంధ్ర ప్రచురణాలయంలో చేరారు. చిన్న వయసులోనే కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితుడై గుడివాడలో 1957లో 'నవోదయ పబ్లిషర్స్'లో చేరి 1960లో 'నవోదయ'ను రామ్మోహనరావు స్వంతంగా నిర్వహించారు. క్రమంగా ఎందరో లబ్దప్రతిష్టులైన రచయితల పుస్తకాలు ఆయన ముద్రించారు. ఆయన నేషనల్ బుక్ ట్రస్ట్ సలహామండలి సభ్యుడిగా తీసుకున్న చొరవ వల్లనే 1989 అక్టోబర్‌లో విజయవాడలో పుస్తక ప్రదర్శన ఏర్పాటైంది.

యురేనియం సర్వే పై ప్రజాగ్రహం

కర్నూలు జిల్లా రుద్రవరం మండలం ఆర్.కొత్తపల్లె గ్రామం భూమిలోని యురేనియం నిల్వలను గుర్తించే సర్వేకు అధికారులు అనుమతించడంతో గ్రామస్థులు ఈ విషయంపై డిసెంబర్ 15న సమావేశమై నిరసన వ్యక్తం చేశారు. యురేనియం త్వకాల పేరిట తమ ఊరి జోలికొస్తే ఊరుకునేది లేదన్నారు. తమ ఊరు, తమ పొలాలు తమకు ప్రాణంతో సమానమని పలువురు తెలిపారు. 'ప్రాణాలైన అర్పిస్తాం గానీ, గ్రామాన్ని వదిలే ప్రసక్తే లేదు' అని ఊరంతా ఒక్కటై ముక్తకంఠంతో తెలిపారు. వ్యవసాయమే వీరి జీవనాధారం. ఈ గ్రామంలో సుమారు 150 కుటుంబాలు జీవిస్తున్నాయి.

మానవ హక్కుల వేదిక 8వ మహాసభలు

మానవ హక్కుల వేదిక 8వ మహాసభలు డిసెంబర్ 14, 15 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలోని క్షత్రియ కళ్యాణ మండపంలో జరిగాయి. మొదటి రోజు జరిగిన సదస్సులో 'అయోధ్య తీర్పు–హిందుత్వ రాజకీయాలు' అంశంపై ప్రొ. అపూర్వానంద్,, 'ఒక హక్కుగా భిన్న లైంగికత' అంశంపై ప్రొ. మనోహర్, 'మీడియా–కశ్మీర్' అంశంపై ప్రవీణ్ దొంతి, 'వైకల్యం గల వ్యక్తుల హక్కులు' అంశంపై ఎం. పవన్ కుమార్ మాట్లాడారు. ఈ సభలకు రెండు తెలుగు రాష్ట్రాల మానవ హక్కుల వేదిక సభ్యులు, అభిమానులు హాజరయ్యారు.

తెలుగెత్తి జైకొట్టు అంతర్జాతీయ సదస్సు

తమకు అనుకూలమైన రచనలు మాత్రమే చేయాలని పాలకుల నుంచి కవులు, రచయితలు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు ప్రఖ్యాత హిందీ కవి మంగలేశ్ దబ్రాల్ తెలిపారు. మతతత్వాన్ని, మూఢవిశ్వాసాలను బలపరిచే అంశాలను పాఠ్యాంశాలుగా ప్రవేశపెడుతున్నారన్నారు. తెలంగాణ సాహితి సంస్థ ఆధ్వర్యంలో 'తెలుగెత్తి జైకొట్టు' (శతాధిక సాహితీవేత్తల జీవితం–సాహిత్యం) అంతర్జాతీయ సదస్సును డిసెంబర్ 14 నుండి 16 వరకు నిర్వహించారు. ఈ సదస్సుకు మంగలేశ్ దబ్రాల్ ముఖ్య అతిథిగా వచ్చారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన శతాధిక తెలుగు సాహితీవేత్తల జీవితం–సాహిత్యంపై 135 మంది విద్యార్థులు సమర్పించిన పరిశోధనా పత్రాల సమాహారం 'తెలుగెత్తి జైకొట్టు' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు

ముస్లిం మైనారిటీలను అణచివేయడానికి మోదీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం తీసుకొచ్చిందని పలువురు నేతలు ఆరోపించారు. ఇందిరాపార్కు వద్ద జమాతే ఇస్లామి హింద్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన సభ డిసెంబర్ 15న నిర్వహించారు. సౌభ్రాతృత్వం, లౌకికత్వం, రాజ్యాంగ స్ఫూర్తికి ఈ బిల్లు వ్యతిరేకమన్నారు. మోదీ ప్రభుత్వం తక్షణమే ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌ఆర్‌సి, పౌరసత్వ సవరణ చట్టాలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 20న ముస్లిం ప్రజలతో పాటు ప్రతిపక్ష పార్టీలు నిరసనలో పాల్గొన్నాయి.

ప్రజా సంఘాల నేతల అరెస్టు

తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు నాయకులు మెంచు రమేష్, చైతన్య మహిళా సంఘం నాయకురాలు శిల్ప ఇళ్లలో సోదాలు చేసి డిసెంబర్ 17న అరెస్టు చేశారు. డిసెంబర్ 18న చైతన్య మహిళా సంఘం (సిఎంఎస్) కార్యదర్శులు డి. దేవేంద్ర, డి. స్వప్న, తెలంగాణ విద్యార్థి వేదిక ప్రధాన కార్యదర్శి మెంచు సందీప్‌ను హైదరాబాద్‌లో కొత్తగూడెం పోలీసులు అరెస్టు చేశారు. సిఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు గుంట రేణుకను గద్వాల పట్టణంలో గద్వాల కుట్రకేసులో అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ అరెస్టులను ఖండిస్తూ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ రెండు తెలుగు రాష్ట్రాల్లో హక్కుల సంఘాలతో పాటు వివిధ ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు నిరసన వ్యక్తంచేస్తున్నాయి.

ఎపిలో మూడు రాజధానుల ప్రతిపాదనకు నిరసనలు

ఆంధ్రప్రదేశ్‌లో మూడు రాజధానులు ఉండే అవకాశం ఉందని డిసెంబర్ 17న శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. విశాఖలో కార్యనిర్వాహక రాజధాని, అమరావతిలో శాసన నిర్వాహక రాజధాని, కర్నూలులో న్యాయ రాజధాని ఇలా మూడు రాజధానులు రావాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ ప్రకటనను వ్యతిరేకిస్తూ రైతులు, వివిధ పార్టీల నాయకులు వివిధ రూపాల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. అమరావతి అభివృద్ధికి లక్ష కోట్లు పెట్టినా అభివృద్ధి సాధ్యం కాదని అందులో పది శాతం విశాఖలో ఖర్చు పెట్టినా హైదరాబాద్ స్థాయిలో రాజధాని అభివృద్ధి అవుతుందని డిసెంబర్ 27న మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. రాజధాని నిర్మాణం పై ఎపి ప్రభుత్వం జిఎన్ రావు కమిటీని వేసింది. వీ

ఎన్‌కౌంటర్ పేరుతో ఆదివాసుల హత్య

ఛత్తీస్‌గఢ్ బీజాపూర్‌లోని సర్కెగూడలో భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మైనర్లతో పాటు 17 మంది చనిపోయారు. వీళ్లంతా మావోయిస్టులే అంటూ భద్రతా దళాలు ప్రకటించాయి. ఈ ఘటనపై వాస్తవాలను తేల్చేందుకు ప్రభుత్వం జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేసింది. మధ్యప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి వి.కె. అగర్వాల్ నేతృత్వంలో ఏర్పడిన కమిషన్ రూపొందించిన నివేదికలో చనిపోయిన వారంతా మావోయిస్టులు కాదని గ్రామస్తులని తేలింది. 2012 జూన్ 28 రాత్రి సర్కెగూడ గ్రామస్థులు 'బీజ్ పండుమ్' పండుగ గురించి ఓ చోట సమావేశమయ్యారు. ఈ సమావేశంపై భద్రతా బలగాలు కాల్పులు జరిపాయి. గ్రామస్థులు కాల్పులకు పాల్పడితే తాము ఎదురు కాల్పులు జరిపినట్టు తెలిపాయి. కాగా గ్రామస్థులెవరు కాల్పులు జరుపలేదని నివేదికలో వెల్లడైంది. ఆ నివేదిక డిసెంబర్ 1న లీకైంది.

గుజరాత్ అల్లర్ల కేసులో మోడీకి క్లీన్ చిట్

గోద్రా సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలు బోగీల్లో 59 మంది కరసేవకులు సజీవ దహనమైన అనంతరం గుజరాత్‌లో జరిగిన అల్లర్లలో అప్పటి సిఎం నరేంద్ర మోదీకి జస్టిస్ నానావతి కమిషన్ క్లీన్‌చిట్ ఇచ్చింది. నాటి హింసాకాండలో రాష్ట్ర ప్రభుత్వం ప్రమేయం లేదని కుట్రలేనే లేదని స్పష్టంచేసింది. స్థానికంగా విహెచ్‌పి, భజరంగ్‌దళ్ కార్యకర్తలు కొన్ని చోట్ల అల్లర్లకు పాల్పడ్డారని నివేదిక ఇచ్చింది. ఐదేళ్ల క్రితం కమిషన్ ఇచ్చిన నివేదికను రాష్ట్ర హోం శాఖ సహాయ మంత్రి ప్రదీప్‌సింహ్ జడేజా డిసెంబర్ 11న అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.

పౌరసత్వ బిల్లుకు పార్లమెంట్, రాజ్యసభల ఆమోదం

పౌరసత్వ సవరణ బిల్లును హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో డిసెంబర్ 9న ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర చర్చకు దారితీసింది. ముస్లింలను లక్ష్యంగా చేసుకొని ఈ బిల్లు తెస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఈ బిల్లుపై అర్ధరాత్రి ఓటింగ్ జరుపగా బిల్లుకు అనుకూలంగా 311 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 80 ఓట్లు వచ్చాయి. దీంతో పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందింది. పౌరసత్వ సవరణ బిల్లును రాజ్యసభ డిసెంబర్ 11న తీవ్ర చర్చ అనంతరం బిల్లుకు అనుకూలంగా 125 మంది, వ్యతిరేకంగా 99 మంది ఓటువేశారు. దీంతో మేజిక్ మార్కుకు (117) అవసరమైన మెజారిటీ సాధించింది. ఈ బిల్లు ఉభయసభల ఆమోదం పొందడంతో ఇక చట్టరూపు దాల్చనుంది. కాని బిల్లును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. నిరసనకారులపై పోలీసులు కాల్పులు జరపడంతో...మంది మరణించారు.

సిఏఏకు నిరసనగా పద్మశ్రీ అవార్డు వెనక్కిచ్చిన కవులు

పౌరసత్వ సవరణ చట్టంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వారికి సంఘీభావంగా మేధావులు, కవులు, కళాకారులు కేంద్రప్రభుత్వం తమకు ఇచ్చిన అవార్డులను తిరిగి ఇచ్చేస్తున్నారు. ఈ జాబితాలో హైదరాబాద్‌కు చెందిన ఉర్దూ కవి ముజ్తబ హుస్సేన్ కేంద్రం ఇచ్చిన పద్మశ్రీని తిరిగి ఇచ్చేయలనుకుంటున్నారు. ఆయన 'నేను పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్యం ఇప్పుడు దాడికి గురైంది. ప్రభుత్వమే అది చేస్తుంది. అందుకే ఈ ప్రభుత్వంతో అనుసంధానంగా ఉండడం నాకు ఇష్టం లేదు' అని తెలిపారు. ఇప్పటికే సిఏఏను నిరసిస్తూ మహారాష్ట్రకు చెందిన శిరిన్ దల్వి, యుపికి చెందిన యాకూబ్ యవార్ తమకు వచ్చిన అవార్డులను తిరిగి ఇచ్చేస్తున్నట్లు ప్రకటించారు.

దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై త్రిసభ్య కమిషన్

దిశ హత్యాచారం కేసు నిందితుల ఎన్‌కౌంటర్‌కు దారితీసిన ఘటనకు సంబంధించిన అంశాలపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ విఎస్ సిర్పుర్కర్ నేతృత్వంలో త్రిసభ్య కమిషన్‌ను నియమించింది. బాంబే హై కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రేకా ప్రకాశ్ సోందుర్ బల్డోటా, సిబిఐ మాజీ డైరెక్టర్ డిఆర్ కార్తికేయన్ ఈ కమిషన్‌లో సభ్యులుగా ఉంటారని డిసెంబర్ 12న ప్రకటించింది. న్యాయవాదులు జిఎస్. మణి, ప్రదీప్ కుమార్ యాదవ్ వేసిన పిటిషన్‌పై కోర్టు ఈ ఆదేశాలిచ్చింది.

జైపూర్ పేలుళ్ల కేసులో నలుగురికి ఉరి శిక్ష

జైపూర్‌లో 2008 మే 13న వివిధ ప్రాంతాల్లో వరుసగా తొమ్మిది బాంబులు పేలగా 71 మంది మరణించగా 185 మంది గాయపడ్డారు. ఈ కేసులోని ఐదుగురు నిందితుల్లో నలుగురు హత్యాకాండకు పాల్పడ్డట్లు పేర్కొన్న కోర్టు ఐపిసి 302 కింద ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. సాక్ష్యాలు రుజువుకాక పోవడంతో ఒకరిని నిర్దోషిగా విడుదల చేసింది.

పౌరసత్వ సవరణ దేశ ఉనికికే ప్రమాదం - అరుందతీరాయ్

స్వాతంత్ర్య పోరాటం తరువాత పౌరసత్వ సవరణ చట్టం (సిఏఏ) రూపంలో భారతదేశం అత్యంత కఠినమైన సవాల్‌ను ఎదుర్కొంటుందని ప్రముఖ రచయిత్రి అరుందతీరాయ్ డిసెంబర్ 18న పేర్కొన్నారు.ఈ బిల్లుతో ప్రధాని మోదీ దేశ ప్రజలను మరోసారి రోడ్లమీద నిలబెట్టారని విమర్శించారు. సిఏఏకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారికి అండగా నిలబడాలని ఆమె దేశ ప్రజలను కోరారు. రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలో భాగమనీ, మోదీ సర్కార్ మన కాళ్ల కింది నేలను లాక్కోవాలని చూస్తున్నదని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. ఈ చట్టాన్ని అంగీకరిస్తే భారతదేశ ఉనికికే ప్రశ్నార్థకమవు తుందని ఆమె పేర్కొన్నారు. పెద్దనోట్ల రద్దు కారణంగానే దేశంలో నేడు ఆర్థిక మందగమనం తీవ్రతరమవుతున్నదని ఆరోపించారు.

జార్ఖండ్‌లో జెఎంఎం కూటమి గెలుపు

జార్ఖండ్ అసెంబ్లీకి ఐదు దశల్లో జరిగిన ఎన్నికల ఫలితాలు డిసెంబర్ 23న వెల్లడయ్యాయి. జార్ఖండ్ మొత్తం అసెంబ్లీ స్థానాలు 81 కాగా అందులో జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం), కాంగ్రెస్, ఆర్.జె.డి కూటమికి 47 స్థానాలు వచ్చాయి. అధికారంలో ఉన్న బిజెపికి 25 స్థానాల్లో గెలుపొందింది. దీంతో జార్ఖండ్ ముక్తి మోర్చా, కాంగ్రెస్, ఆర్.జె.డి కూటమికి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే మెజారిటీ వచ్చింది.

పౌరసత్వ సవరణ చట్టానికి దేశ వ్యాప్త నిరసన

దేశవ్యాప్తంగా పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఢిల్లీలోని జామియా వర్సిటీలో డిసెంబర్ 17న విద్యార్థులపై పోలీసుల దాడిని వ్యతిరేకిస్తూ విద్యార్థులకు సంఘీభావంగా అనేక చోట్ల ప్రదర్శనలు నిర్వహించారు. అసోం, ఢిల్లీ, కేరళ, బిహార్, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఆందోళన కారులపై పోలీసులు లాఠీచార్జీ చేశారు. భాష్పవాయు గోళాలూ ప్రయోగించారు. ఆగ్రహించిన ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు రువ్వారు. 12 ప్రతిపక్ష పార్టీల నేతలు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసి దేశ వ్యాప్తంగా ప్రజలు వ్యతిరేకిస్తున్న పౌరసత్వ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. డిసెంబర్ 27 నాటికి 28 మంది ఆందోళనకారులు చనిపోగా వేలాది మంది అరెస్టుకు గురయ్యారు. వీ

బ్రిటన్‌లో లెక్చరర్ల ఆందోళన

బ్రిటన్‌లో విశ్వవిద్యాలయాల్లో పనిచేసే లెక్చరర్‌లు సమ్మె చేశారు. వేతనాల పెంపు, మెరుగైన పని పరిస్థితులు, పెన్షన్ వంటి డిమాండ్లతో నవంబర్ 28న దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు అరవైకి పైగా యూనివర్సిటీల ముందు నలభై వేల మందికి పైగా నిరసన ప్రదర్శనలు చేశారు. ఈ సమ్మెలో లెక్చరర్లతో పాటు విద్యార్థులు, అనుబంధ సేవల సిబ్బంది, ట్యూటర్లు, లైబ్రేరియన్‌లు, సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ వార్మింగ్‌ను నియంత్రించాలి

గ్లోబల్ వార్మింగ్‌పై చర్యలు తీసుకోవాలంటూ నవంబర్ 29న ప్రపంచ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. యూరప్, ఆసియా, అమెరికా, కెనడాలలో ప్రజలు వీధుల్లోకి వచ్చి కర్బన్ ఉద్గారాలను తగ్గించి, వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నినదించారు. జర్మనీ రాజధాని బెర్లిన్‌లోని బ్రాండెన్‌బర్గ్ గేట్ వద్ద వేలాది మంది 'ఒకే గ్రహం, ఒకే పోరాటం', 'మన పర్యావరణాన్ని మనమే రక్షించుకుందాం' అనే నినాదాలతో, ప్లకార్డులతో ప్రదర్శనలు నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి వాతావరణ శిఖరాగ్ర సమావేశాలు జరిగే మాడ్రిడ్, హాంబర్గ్, మ్యూనిచ్, పారిస్, ఆమ్‌స్టర్‌డాం వంటి నగరాల్లో, అమెరికా, కెనడా, జపాన్ తదితర దేశాల్లో నిరసనలు జరిగాయి.

ఇజ్రాయిల్‌లో నిరసనలు

ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శలు జరిగాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నెతన్యాహూ అవకతవకలకు పాల్పడ్డారని, ఆయన వెంటనే పదవికి రాజీనామా చేయాలంటూ రాజధాని టెల్ అవీవ్ వీధుల్లో వేలాది మంది ఆందోళన చేశారు. ఈ ఏడాది రెండుసార్లు పార్లమెంట్‌కు ఎన్నికల్లో జరిగినా ఏ పార్టీకి సరైన మెజారిటీ రానందున ఇతర పార్టీలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి నెతన్యాహూ మరోసారి ప్రధాని పదవి చేపట్టడానికి అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని నిరసనకారులు ఆరోపించారు.

ఫ్రాన్స్‌లో సమ్మె

ఫ్రాన్స్‌లో కార్మికులు, ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేశారు. డిసెంబర్ 5న రాజధాని పారిస్‌లో బ్యానర్లు, ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఆందోళన చేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రన్ పెన్షన్ చెల్లింపుల్లో సంస్కరణలు తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నాడనీ, దీని వల్ల కార్మికులూ, ఉద్యోగులూ తీవ్రంగా నష్టపోతారనీ ప్రజలు నినదించారు. నూతన పెన్షన్ విధానం ద్వారా కార్మికుల, ఉద్యోగుల పనిగంటలు పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, వెంటనే ఈ పెన్షన్ సంస్కరణ విధానాలను ఆపివేయాలంటూ నినదించారు. కార్మికులు, ఉద్యోగులు తలపెట్టిన ఈ సమ్మెలో ఉపాధ్యాయులు, లాయర్లు, ఆరోగ్యశాఖ సిబ్బంది, రవాణా రంగం కార్మికులు, ఎయిర్‌పోర్ట్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిరసనకారులను అదుపు చేసేందుకు ప్రభుత్వ బలగాలు బాష్పవాయు గోళాలు ప్రయోగించి దాడి చేశాయి. ఈ దాడుల్లో వందలాది మంది ఆందోళనకారులు గాయపడ్డారు.

ఫిన్‌ల్యాండ్ ప్రధానిగా సనా మారిన్

ఫిన్‌ల్యాండ్ ప్రధానిగా సనా మారిన్ ఎన్నికయ్యారు. ప్రపంచంలోనే అతి చిన్న వయస్సులో ప్రధాని చేపట్టిన తొలి మహిళగా సనా నిలిచారు. మొత్తం మహిళల సారథ్యంలోనే గల ఐదు పార్టీల కూటమికి సనా మారిన్ సారథ్యం వహిస్తారు. పోస్టల్ ఉద్యోగుల జీతాల కోతలపై దేశవ్యాప్తంగా నిరసనలు వెలువెత్తిన నేపథ్యంలో అప్పటి ప్రధాని అంటీ రిన్నే తన పదవికి రాజీనామా చేశారు. దీంతో రవాణ శాఖ మంత్రిగా ఉన్న సనా ప్రధాని బాధ్యతలు చేపట్టారు. సనా మారిన్ ఫిన్‌ల్యాండ్ మూడో మహిళా ప్రధానమంత్రి.

బ్రిటన్‌లో పార్లమెంట్ ఎన్నికలు

బ్రిటన్ పార్లమెంట్‌లో డిసెంబర్ 12న ఎన్నికలు జరిగాయి. మొత్తం 650 దిగువ సభ స్థానాలకు గాను మూడు వేల మందికి పైగా పోటీ చేశారు. యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగే బ్రెగ్జిట్ అంశం ఈ ఎన్నికల్లో తీవ్ర రూపం దాల్చింది. డిసెంబర్ 13న విడుదలైన ఎన్నికల ఫలితాల్లో కన్జర్వేటివ్ పార్టీ అభ్యర్థి, ప్రధాని బోరిస్ జాన్సన్ ఘన విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో బోరిస్ జాన్సన్‌కు 365 సీట్లు వచ్చాయి. ఆయన ప్రత్యర్థి లేబర్ పార్టీ నేత జెరెమీ కార్బిన్‌కు 202 సీట్లు మాత్రమే వచ్చాయి. దీంతో బోరిస్ జాన్సన్ మరోసారి బ్రిటన్ ప్రధానిగా కొనసాగుతారు.

లెబనాన్‌లో ఆందోళనలు

లెబనాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్ర ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రభుత్వ అధికారులు, మంత్రులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ నిరసన తెలిపారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని ఆరోపిస్తూ డిసెంబర్ 15న రాజధాని బీరుట్ వీధుల్లో ఆందోళన చేశారు. నిరసనకారులపై పోలీసులు రబ్బరు బుల్లెట్లు, బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. ఈ దాడిలో నలభై ఆరు మంది గాయపడ్డారు. వందలాది మందిని అరెస్టు చేశారు. అవినీతిని పాలద్రోలాలని, దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్‌లో జరిగిన నిరసన కారణంగా ప్రధాని సాద్ హరీరీ అక్టోబర్ 29న తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ప్రస్తుతం లెబనాన్‌లో ప్రధాని రహిత పాలన కొనసాగుతోంది. నూతన ప్రధాని పేరును త్వరలో ప్రతిపాదించనున్నట్టు లెబనాన్ అధ్యక్షుడు మైఖెల్ ఔన్ తెలిపారు.

ఇరాక్‌లో ఆందోళనలు

రాజకీయ వ్యవస్థ మొత్తాన్ని ప్రక్షాళన చేయాలంటూ డిసెంబర్ 16న ఇరాన్‌లో ఆందోళనలు జరిగాయి. రాజధాని బాగ్దాద్‌లో డిసెంబర్ 16న వేలాది మంది వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేశారు. దేశంలో అవినీతి రాజ్యమేలుతోందనీ, అధికారులు, మంత్రులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఆరోపించారు. ఆందోళనకారులను నియంత్రించడానికి ప్రభుత్వ బలగాలు బలప్రదర్శన చేశాయి. ఇరువర్గాల ఘర్షణల్లో దాదాపు దాదాపు నాలుగు వందల మందికి పైగా మరణించారు. వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆందోళనలు హింసాత్మకంగా మారిన నేపథ్యంలో ప్రధాని అబ్దెల్ అబ్దుల్ మహ్దీ ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మరోకరిని ఎంపిక చేసే పనిలో అధ్యక్షుడు బర్హామ్ సాలిహ్ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే మంత్రులంతా తమ పదవులకు రాజీనామా చేయాలంటూ ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

డోనాల్డ్ ట్రంప్‌పై అభిశంసనకు తీర్మానం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానానికి ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. ప్రతినిధుల సభలో డెమోక్రాటిక్ పార్టీ సభ్యుల మెజారిటీ ఉండడంతో అభిశంసనకు ఆమోదం లభించింది. సెనెట్‌లో రిపబ్లిక్ పార్టీకి సంఖ్యా బలం ఎక్కువగా ఉండడంతో ఈ అభిశంసన తీర్మానానికి ఆమోదం లభించే అవకాశం లేదు. అధ్యక్షుడిగా తనకు ఉన్న అధికారాన్ని దుర్వినియోగం చేశారని, యుఎస్ కాంగ్రెస్‌ను అడ్డుకున్నారంటూ ట్రంప్‌పై ఉన్న రెండు అభియోగాలపై ఓటింగ్ జరిగింది. అమెరికా చరిత్రలో ప్రతినిధుల సభ చేత అభిశంసనకు గురైన మూడవ అధ్యక్షుడిగా ట్రంప్ నిలిచారు. ఇంతకు ముందు ఆండూ జాన్సన్, బిల్ క్లింటన్‌లు అభిశంసనను ఎదుర్కొన్నారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(నవంబర్ 1 నుండి నవంబర్ 30, 2019 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (1071), ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలలో (939) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 2010)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు																	
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	-	2	-	26	24	8	9	6	3	2	2	2	2	2	24	26	-	-	-	4	-
హైదరాబాద్	-	-	-	22	21	4	11	3	4	5	8	9	6	5	26	17	-	-	-	2	-
కరీంనగర్	-	3	1	5	6	2	6	2	2	4	3	2	2	4	17	9	-	-	-	-	4
ఖమ్మం	-	2	-	4	15	5	14	4	1	-	1	2	-	3	24	10	-	-	-	-	-
మహబూబ్‌నగర్	-	-	2	2	2	3	2	1	3	2	3	4	2	8	38	2	-	-	-	-	2
మెదక్	2	20	6	9	7	12	4	3	1	2	4	4	6	29	31	42	-	-	-	2	4
నల్గొండ	-	2	-	3	7	3	6	3	2	3	2	5	2	4	22	11	-	-	-	-	2
నిజామాబాద్	-	-	-	4	10	3	6	-	1	2	2	3	-	2	23	7	-	-	-	-	-
వరంగల్	1	14	4	6	4	7	4	3	1	4	3	4	4	13	19	24	-	-	-	1	1
రంగారెడ్డి	-	3	-	4	7	3	5	4	2	4	4	6	7	9	26	18	-	-	-	-	6
తెలంగాణ	**3**	**46**	**13**	**85**	**103**	**50**	**67**	**29**	**20**	**28**	**32**	**41**	**31**	**79**	**250**	**166**	**-**	**-**	**-**	**9**	**19**
అనంతపురం	-	12	-	9	23	3	2	4	-	3	-	7	7	11	33	-	-	-	-	-	-
చిత్తూరు	-	-	-	7	7	1	3	-	5	1	1	-	-	10	27	4	-	-	-	-	-
కడప	-	9	-	5	8	-	-	-	-	3	-	-	-	3	22	13	-	-	-	-	-
గుంటూరు	-	4	-	7	8	3	8	-	2	4	2	1	-	4	17	8	-	-	-	-	-
కృష్ణా	-	-	-	3	4	2	3	2	2	1	1	1	-	3	14	9	-	-	-	-	-
కర్నూలు	-	2	-	4	7	3	5	3	2	4	1	2	-	2	24	10	-	-	-	-	-
తూర్పు గోదావరి	-	-	-	3	6	3	5	1	-	1	1	3	3	4	20	25	-	-	-	4	-
ప్రకాశం	-	2	-	6	4	3	5	2	3	4	2	3	-	7	26	19	-	-	-	-	2
శ్రీకాకుళం	-	-	-	5	3	2	2	3	-	2	-	1	1	2	15	14	-	-	-	-	-
పశ్చిమ గోదావరి	-	-	-	3	5	3	4	2	1	2	1	2	-	3	13	7	-	-	-	-	-
నెల్లూరు	-	-	-	7	5	3	6	3	3	5	2	4	3	6	27	16	-	-	-	-	1
విజయనగరం	-	-	-	3	5	4	6	3	1	1	1	2	3	2	17	16	-	-	-	-	3
విశాఖపట్నం	-	-	-	5	10	1	2	-	1	4	1	-	3	1	20	16	-	-	-	9	-
ఆంధ్రప్రదేశ్	**-**	**29**	**-**	**67**	**95**	**31**	**51**	**23**	**20**	**35**	**13**	**26**	**20**	**58**	**275**	**173**	**-**	**-**	**-**	**13**	**6**